# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)




## వార్షిక సంచిక - 2022




## రైతాంగ, కార్మిక, పీడిత ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి


రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)
పార్వతీపురం మన్యం జిల్లా


విశాఖ స్టీల్ ప్లాంటను ప్రవేటీకరించే
కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.!
అశేష త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న
విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం.!!
కళాసీ సంఘం,బొబ్బిలి
“విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు” కోసం
చేసిన అమరుల త్యాగాల స్ఫూర్తిగా
పోరాడుతున్న కార్మికులకు సంఘీబావం ప్రకటిస్తున్నాం
పట్టణ కళాసీ సంఘం,బొబ్బిలి


గిరిజన సంఘం
రైతుకూలీ సంఘం (ఆంధ్ర)
(AIKMKS)
గిరిజనుల సాగులో ఉన్నా అన్నిరకాల
భూములకు నష్ట పరిహారం ఇవ్వాలి

# మహా సంకల్పం

మూలం : బెర్టోల్డ్ బ్రెష్ట్ అనువాదం : ఏ.బి.కె. ప్రసాద్

తెలుసు మాకు తెలుసు -
మా దుర్బలత్వం జడత్వం
మీ దారుణ చట్టాలకు పటుత్వం,
ఈ బిక్కతనం బక్కతనం ఉండదు కలకాలం
నేటి మీ శాసనాలే మా లక్ష్యశుద్ధికి రేపటి వరిపిడి రాళ్ళు
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
మా తలలకు పిస్తోళ్ళు ఎక్కుపెట్టి
తరిమి తరిమి చెరబడతారు మీరు,
కాని చిత్రహింసలకు చెదరేదిలేదని, బెదరేదిలేదని
సంకల్పం సమష్టిగా చెప్పుకుంటాం.
బానిసత్వం మిత్తవను మించిన
ముత్తవ, హీనాతి హీనం!

తెలుసు మాకు తెలుసు - మా
ఆర్తి తీర్చకుండా మమ్మ క్షుధార్తులుగానే ఉంచుతారు
ఆపన్నుల బతుకులను సంపన్నులకు
అప్పడాలు నైవేద్యాలుగా మార్చుతారు!
మేట వేసిన మీ గరిసెల గుమ్మాల దరిచేరకుండా
అడ్డగిస్తున్న కంచుకోటల కవాటాలు బద్దలు కొడతాం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
మా చుట్టూ కొంపలెన్నో నిర్జనవాసాలు
అయినా నిరంతరం మేము నిర్వాసితులం
ఈ క్షణం నుండే దారుణాతిక్రమణకు స్వస్తి చెప్పిస్తాం
గోడుమంటున్న మానవునికి గూడు కల్పిస్తాం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
పూట బత్తెం పుల్ల వెలుగై
పూట గడవనిమ్మని సాగిలపడి ఇక
బామాలేది లేదు బతిమాలేది లేదు
కరాల సత్తువకొద్దీ మీ
కర్మాగారాలన్నీ రేపటినుంచే మా సొత్తు
ఇకపై నష్టాలు మీ వంతు, లాభాలు మా వంతు
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు
పాలకుల బాసల యాసలు
కానేరవు పాలితుల బతుకుల బాటలు
స్వేచ్ఛాపథమే సుఖజీవన మార్గం
సుందర భవితవ్యం మా చేతనా సహకార ఫలం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
తుపాకీల 'తూర్య' నాదాలే
మీకర్థం కాగల ఘంటారావాలు
పాఠం గుణపాఠంగా నిరూపిస్తాం
రేపే బందూకులనే మీపై ఎక్కుపెడతాం
ఇదే మా సంకల్పం.

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా కార్మికవర్గ నియంతృత్వాన్ని ఏర్పరచిన ప్యారిస్ కమ్యూన్ (1871 మార్చి) సంఘటనలను చక్కగా చిత్రించిన బ్రెష్ట్ నాటకంలోనిది యీ గేయం. ఈ నాటకం పేరు "కమ్యూన్ రోజులు".

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

# వార్షిక సంచిక - 2022

ప్రతులకు :
మైత్రి బుక్ హౌస్,
28-9-1, జలీల్ వీధి, కారల్ మార్క్సరోడ్,
విజయవాడ-2

వెల : రూ. 50/-




ప్రతులకు :
కామ్రేడ్ యస్.ఝాన్సి, ఎం.ఎస్. నాగరాజు అధ్యక్ష, కార్యదర్శులు
రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)
తరిమెల నాగిరెడ్డి భవన్, న్యూ గిరిపురం, విజయవాడ.
సెల్ : 94403 19977

# విషయసూచిక


| | | |
|---|---|---|
| I | ముందుమాట | 5 |
| II | (a) రైతాంగ, ప్రజావ్యతిరేక మూడు సాగుచట్టాలు | 7 |
| | (b) మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం | 13 |
| | (c) కర్ణాటక రైతాంగ పాదయాత్ర | 17 |
| | (d) ఎస్.కె.ఎం. తీర్మానం | 19 |
| III | (a) వ్యవసాయరంగ సంక్షోభంపై రాష్ట్రసదస్సు | 21 |
| | (b) డా॥ జశ్వంత్ ప్రసంగవ్యాసం | 23 |
| IV | (a) ఏఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో ఆదివాసీ సదస్సు | 29 |
| | (b) ఆదివాసీ సదస్సు తీర్మానం | 32 |
| | (c) అటవీ చట్టానికి సవరణ - అటవీ సంరక్షణ నియమాలు - 2022 | 33 |
| V | (a) పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల వ్యధలూ - ఆందోళనలు | 35 |
| | (b) పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల నిరవధిక ధర్నా | 39 |
| | (c) కొండమొదలు పునరావాస కాలనీ ఏర్పాటు | 42 |
| VI | (a) పాలకుల జలవిధానాలపై దక్షిణ భారతస్థాయి సెమినార్ | 44 |
| | (b) సెమినార్ కీనోట్ | 45 |
| | (c) సెమినార్ తీర్మానాలు | 47 |
| VII | అమరులకు జోహార్లు | 48 |
| VIII | కార్యక్రమాల ఫొటోలు | |
| IX | భూమి - వ్యవసాయ, పారిశ్రామికరంగాలు - ఆంధ్రప్రదేశ్ పాలకులు | |
| | (a) రాజధాని అంశం - వాస్తవిక సమస్యల నుండి మళ్ళింపు | 58 |
| | (b) పేదల భూముల కబ్జా జీవో నెం. 72 | 60 |
| | (c) సాగుమీటర్లకు స్మార్ట్ మీటర్లు | 62 |
| | (d) రైతుబంధు, రైతు భరోసాలు - భూపరాయీకరణే అంతిమ లక్ష్యం | 65 |
| | (e) వ్యవసాయ కూలీలు | 67 |
| | (f) అమూల్‌తో ఒప్పందం - సహకార పాడిపరిశ్రమపై దాడి | 70 |
| | (g) విశాఖ ఉక్కు - ప్రైవేటీకరణ విధానాలు | 73 |

X వ్యవసాయం - కేంద్ర ప్రభుత్వ విధానాలు

(a) రైతుల హక్కులపై పెప్సీ దాడి 78

(b) జన్యుమార్పిడి ఆవాల సాగుకు పాలకుల అనుమతి 80

(c) జన్యుమార్పిడి వరి దిశగా ప్రయోగాలు 82

(d) జీరో బడ్జెట్ వ్యవసాయం - మరో మోసకారీనాటకం 85

XI రాజకీయార్థిక అంశాలు

(a) కరోనా - పాలకుల విధానాలు - వలసకూలీల వెతలు 89

(b) దేశాన్ని మతతత్వ రొంపిలోకి లాగే సిఎఎ, ఎన్ఆర్సి 93

(c) మత మైనారిటీలపై, దళితులపై, మహిళలపై హిందూమతతత్వశక్తుల దాడులు 96

(d) నాలుగు లేబర్‌కోడ్‌లు కార్మికుల హక్కుల అణచివేత 99

(e) ఆజాదీకా అమృత్ మహోత్సవ్ - 75 సం॥ల 'స్వాహా'తంత్ర్యం 103

(f) ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాదులే యుద్ధనేరస్థులు 108

# ముందుమాట

2018 ఆగస్టులో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర జనరల్‌కౌన్సిల్ నుండి 2022 డిసెంబర్ మధ్య కాలానికి సంబంధించిన వార్షిక సంచిక-2022 ఇది.

ఈ గత నాలుగు సంవత్సరాలకు పైగా కాలం, చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత కలిగి వుండటమేగాకుండా, ప్రపంచ ప్రజల జీవితాలను ఒక పెద్ద కుదుపుకు గురిచేసిన కాలం కూడా. కొవిడ్-19 పేరున ప్రపంచ ప్రజల అనుభవంలోకి వచ్చిన కరోనా వైరస్ గత 3 సం॥లుగా మానవ జాతిని వెంటాడుతూనే వుంది. తమ లాభాలవేటలో సామ్రాజ్యవాద దేశాలు ప్రకృతి వనరులతో వికృతంగా వ్యవహరించిన దుష్ఫలితాలకు ప్రపంచ ప్రజానీకం, ముఖ్యంగా శ్రామిక ప్రజానీకం తీవ్రంగా గురయ్యారు; కోట్లాదిమంది బలయ్యారు.

ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగాన్ని అటకెక్కించిన కేంద్ర, రాష్ట్రాల పాలకుల విధానాలు, ప్రజల ప్రాణాలను నిలువునా బలిగొన్నాయి. కోట్లాదిమంది వలసకూలీలు నెత్తిపై బరువుతో, నెత్తురోడుతున్న పాదాలతో నగరాలు, పట్నాలను దాటి వేల కిలోమీటర్లు నడిచి గ్రామాలకు చేరుకున్న చేదు అనుభవం ఈ కాలానిదే. ఆప్తులనో, బంధువులనో, స్నేహితులనో, కుటుంబసభ్యులనో ఈ కాలంలో కోల్పోని వారు లేరంటే అతిశయోక్తి కానంతగా కోవిడ్‌తో కలగలిసిన దోపిడీ పాలకుల విలయతాండవం ప్రజల జీవితాలను కోలుకోలేని దెబ్బతీసింది.

**మన సంస్థకు ఆప్తులైన ఎందరో మార్క్సిస్టు మేధావులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకాన్ని మనమీకాలంలో కోల్పోయాం, వారందరికీ జోహార్లర్పిద్దాం.**

★ ★ ★

సరిగ్గా ఈ కోవిడ్ నేపథ్యాన్నే ఆసరా చేసుకొని, కార్పొరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు దేశవ్యవసాయరంగాన్ని అప్పగించేందుకు కేంద్రప్రభుత్వం హడావుడిగా రైతాంగ, ప్రజావ్యతిరేక మూడు సాగుచట్టాలను ఆర్డినెన్స్‌ల రూపంలో, తర్వాత చట్టాలుగా ముందుకు తెచ్చింది. ఇప్పటికే సమస్యలలో పీకలలోతు కూరుకుపోయివున్న రైతాంగం, చావోరేవో తేల్చుకునేవిధంగా ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల రైతాంగం ఢిల్లీ సరిహద్దులనే నివాసాలుగా చేసుకొని సంవత్సర కాలంపైగా మొక్కవోని దీక్షతో ఆందోళనలు కొనసాగించారు. నాటకీయంగానే అయినా ప్రభుత్వం ఆ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్లుగా ప్రకటించ తప్పలేదు. ఈ ఉద్యమక్రమంలో 700 మందికి పైగా రైతులు, ప్రజానీకం ప్రాణాలు కోల్పోయారు. వారందరికీ జోహార్లర్పిద్దాం.

మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాపితంగా 'రైతాంగ సమన్వయసమితి' ఆధ్వర్యంలోనూ, సంఘంగానూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాం, మూడు నల్లచట్టాల్ని రద్దుచేయాలంటూ కర్నాటక రైతాంగం ఏఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర జరిపి రైతులను సమీకరించారు. అమరులు కా॥కోటయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా వ్యవసాయ రంగ సంక్షోభంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించుకున్నాం. మూడు సాగు చట్టాలు ఈ రూపంలో అప్పటికి (2019 డిసెంబర్) ముందుకు రాకున్నా, శాస్త్రీయంగా భవిష్యద్దర్శనం చేస్తూ, సంక్షోభ మూలకారణాలను వివరిస్తూ ఈ సదస్సులో కా॥జశ్వంత్‌గారు ఆఖరి ఉపన్యాసం చేశారు.

గత కాలంనుండీ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్రపాలకులు ఒక్కటొక్కటిగా రద్దుచేస్తున్నారు. 44 కార్మిక చట్టాల స్థానంలో నిరంకుశమైన 4 లేబర్ కోడ్‌లను రూపొందించి, కార్మికులను మధ్యయుగాల నాటి శ్రమదోపిడీకి గురిచేస్తున్నారు.

రైతాంగ వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ గ్రామీణ పేదలు, రైతాంగం; నిరంకుశ కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ పట్టణ శ్రామికులు, కార్మిక ప్రజానీకం-ఒకరికొకరు సంఘీభావంగా కార్మిక-కర్షక మైత్రిని చాటిచెపుతూ ఆశాజనకమైన ఆందోళనలు ఈ కాలంలో నిర్వహించారు.

అటవీహక్కుల చట్టానికి సవరణ ద్వారా నూతన అటవీ నియమాల పేరిట ఆదివాసులను తల్లి ఒడినుండి గెంటివేసి బడా కాంట్రాక్టర్లకు, కంపెనీలకు అటవీ భూములను కట్టబెట్టే కేంద్రప్రభుత్వ చర్యలను సంఘం ఆధ్వర్యంలో నిరసిస్తూ ఆదివాసులు పోరాడుతున్నారు.

కేంద్రప్రభుత్వానికి 'జోహుకుం' అంటున్న వైసిపి పాలకులు రాష్ట్రానికి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని చెబుతున్న పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుండి నిధులు రాబట్టటంలో చేష్టలుడిగి కూర్చున్నారు. సమగ్ర శాస్త్రీయ పునరావాసం కల్పించకుండానే లక్షలాదిమంది

ఆదివాసులను మభ్యపుచ్చి, బలప్రయోగంతో తమ జీవనాధారాలనుండి వేరు చేస్తున్నారు. రైతుకూలీసంఘం, ఏజన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొండమొదలు ప్రాంత ఆదివాసులు నిర్దిష్ట డిమాండ్స్‌తో, నిలకడగా నిలచిపోరాడారు; మెరుగైన ఫలితాన్ని సాధించుకోగలిగారు. నూతన పునరావాస కాలనీకి చేరుకొని అపరిష్కృత డిమాండ్లపై ఉద్యమబాటన సాగుతున్నారు.

'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో, పలువురి ప్రాణత్యాగాలతో, ఉద్యమాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రప్రభుత్వం బరితెగించి అమ్మటానికి ఈ కాలంలో నిర్ణయం చేసింది. దీనికి వ్యతిరేకంగా పరిశ్రమ కార్మికులు, రైతాంగం, రాష్ట్రప్రజానీకపు అండతో 700 రోజులపైగా ఆందోళనోద్యమం సాగుతోంది.

★ ★ ★

75 సంవత్సరాల 'స్వాతంత్ర్య' దినోత్సవ వేడుకలను 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' పేరిట 2021 నుండి ప్రారంభించి ఏడాదిపాటు నిర్వహించి, అన్నిరంగాల్లోనూ అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నామంటూ పాలకులు తమ జబ్బలు తాము చరుచుకున్నారు. వంచనాత్మక కళలో తమకు వేరెవరూ సాటిరారని నిరూపించుకున్నారు. దేశంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోతోంది. ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు, విద్యుత్, వంటనూనెలు, నిత్యావసరాల ధరలు చుక్కలను దాటుతున్నాయి. అరాకొరాగా వున్న ఉద్యోగాలు కూడా ఊడిపోతున్నాయి; కార్మికులపై, ఉద్యోగులపై పనిభారం పెంచుతున్నారు; వేతనాలలో కోతలు విధిస్తున్నారు. కోవిడ్ దెబ్బకే కకావికలమైన జీవితాలు, పాలకుల నిర్ధాక్షిణ్యమైన దుర్మార్గ విధానాల ఫలితంగా కోలుకోలేని స్థితికి నెట్టబడుతున్నాయి. ప్రజానీకపు జీవితాలు ఇంత దుర్భరమైన ఈ కాలంలోనే ఆదానీ, అంబానీలు ప్రపంచ కుబేరులలో ప్రథమ స్థానానికి ఎగబాకారంటే, కోవిడ్ కాలాన్ని సైతం తమ లాభాల్ని దండిగా పెంచుకునేందుకు వారు ఎలా వినియోగించుకున్నారో, అమృత్ మహోత్సవాలు ఎవరికో తేటతెల్లమౌతూనే వుంది.

అయితే పెరుగుతోన్న ప్రజల అసంతృప్తి సంఘటిత రూపానికి మళ్ళకుండా వుండేందుకు పాలకులు కుల, మత, ప్రాంతీయ, భాషా ద్వేషాలను ప్రజల మధ్యరేపి, ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారు. ముఖ్యంగా 2014 నుండి కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బిజెపి నాయకత్వం హిందూమతోన్మాదాన్ని ప్రేరేపిస్తోంది. సంఘ్‌పరివార్‌శక్తులు అల్పసంఖ్యాక మతస్థులపై ప్రత్యేకించి ముస్లిములపై భావజాల, భౌతిక దాడులను ముమ్మరం చేశాయి. మైనారిటీ ప్రజలపై దళితులపై, మహిళలపై దాడులు తీవ్రమయ్యాయి.

జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయటంతోపాటు, బిజెపి ప్రభుత్వం ఆ రాష్ట్రాన్ని ముక్కలుగా విభజించింది. జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్‌సి) పేరుతో ఈశాన్య రాష్ట్రాలలో ప్రత్యేకించి అస్సాములో తరాలుగా నివాసముంటున్న లక్షలాది ముస్లిములకు ఆధారాలు లేవంటూ వారి పౌరసత్వాన్ని నిరాకరిస్తోంది. మరోప్రక్క పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ)తో కాందిశీకులైన ముస్లిమేతరులందరకూ పౌరసత్వమివ్వటానికి సిద్ధమై, దీనిని దేశవ్యాపితంగా అమలుకు పూనుకొని ముస్లిములలో తీవ్ర అభద్రతాభావాన్ని పెంచుతోంది. వీనికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా లౌకిక, ప్రజాస్వామికవాదులందరూ గొంతెత్తారు; మతాలకతీతంగా పెద్దసంఖ్యలో ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. కరోనా పరిస్థితుల నడుమ, ప్రభుత్వ నిర్బంధాన్ని తట్టుకుంటూ ఢిల్లీ షాహిన్‌బాగ్‌లో దీర్ఘకాల నమూనా ఉద్యమం సాగింది. దేశవ్యాపితంగా సాగిన నిరసనోద్యమం, ప్రభుత్వ దూకుడుకు కొంత కళ్ళెంవేసింది.

★ ★ ★

2001 ఏప్రిల్‌లో గుంటూరులో జరిగిన రాష్ట్రమహాసభల నుండి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) సావనీర్లు, వార్షిక సంచికలను వెలువరిస్తూ వస్తున్నాం.

2001(గుంటూరు), 2005(అనకాపల్లి), 2010(ఒంగోలు), 2016(గుంటూరు) రాష్ట్రమహాసభల సావనీర్లతోపాటుగా 2002, 2003, 2007, 2011-12, 2018 సం॥లలో వార్షిక సంచికలను ప్రచురించాము. ఇది వార్షిక సంచిక 2022. సమకాలీన పాలక రాజకీయ, ఆర్థిక విధానాలను, వీనితో ముడిపడి సాగిన సంస్థాగత కార్యక్రమాల అవగాహనలను విశ్లేషిస్తూ, నూతన ప్రజాస్వామిక విప్లవ దృక్పథంతో సంఘశ్రేణులు విద్యావంతం కావడానికి వీటిని అందిస్తున్నాము.

ఈ సంచికలో వివిధ పత్రికల నుండి అనేకమంది వ్యాసాలు, కవితలు, గేయాలు, కార్టూన్లు, చిత్రపటాలను తీసుకున్నాం; వారందరికీ ధన్యవాదాలు. సంచిక ప్రచురణలో తోడ్పడిన, శ్రమించినవారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**విజయవాడ**
**19-2-23**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**
**రాష్ట్ర కార్యవర్గం**

# రైతాంగ, వ్యవసాయ, ప్రజావ్యతిరేక మూడు చట్టాలు

## 2020 సెప్టెంబర్

**దేశమంతా** లాక్‌డౌన్ విధించి ప్రజలంతా తీవ్ర ఇబ్బందుల నెదుర్కొంటున్న కరోనా కాలంలో – 2020 జూన్ నెలలో – కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి, రైతాంగానికి, మొత్తంగా దేశ ప్రజానీకానికి వ్యతిరేకమైన మూడు ఆర్డినెన్స్‌లను (అత్యవసర ఆదేశాలను) తీసుకువచ్చింది. వర్షాకాల పార్లమెంటు సమావేశాలలో – 2020 సెప్టెంబర్ చివరి వారంలో – వాటిని చట్టాలుగా ముందుకు తెచ్చింది.

రైతాంగానికి, వ్యవసాయానికి వ్యతిరేకమైన ఈ చట్టాలను నిరసిస్తూ, వీటిని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశంలోని వివిధ ప్రాంతాలలో రైతాంగం, వివిధ రైతుసంఘాలు, వివిధ రాజకీయపక్షాలు ఆందోళనలు చేశాయి. కాగా, ఈ చట్టాలతో రైతాంగాన్ని బంధ విముక్తుల్ని చేస్తామని, వ్యవసాయం లాభసాటిగా మారబోతోందని అధికార రాజకీయ నాయకులు, పాలకపక్ష మేధావులు ప్రచారం చేశారు. దళారుల నుండి రైతులను కాపాడేందుకు ఈ చట్టాలు రక్షణ కవచంలా తోడ్పడతాయని ప్రధాని మోడీ ఘంటాపథంగా పేర్కొంటూ, దేశవ్యాపిత నిరసనలను కొట్టిపారేశాడు. రైతుల ఆదాయాన్ని 2022 సంవత్సరంలో గాకుంటే 2024 సంవత్సరానికైనా రెండున్నర రెట్లు పెంచి తీరుతామని ప్రకటిస్తూ, ఈ చట్టాలపై విమర్శలన్నీ ఊహాజనితాలేనన్నాడు. ఈ నేపథ్యంలో ఈ చట్టాలు రైతులకు ఏ మేరకు రక్షణ కల్పిస్తాయో, వాస్తవాలు ఏమిటో ఒకసారి చూద్దాం.

### దేశంలో ఎక్కడైనా పంట అమ్ముకునే 'స్వేచ్ఛ'

రైతులు తాము పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా, మరింత మెరుగైన ధరకు అమ్ముకునే స్వేచ్ఛ కల్పిస్తున్నామంటూ ఒక చట్టం చేశారు. అదే, **'రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య (ప్రోత్సాహకం, సులభతరం) చట్టం'.**

దేశంలోని రైతాంగంలో 86 శాతం సన్న చిన్నకారు రైతులేనని ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి. ఈ బక్క రైతులు, కౌలు రైతులలో అత్యధికులు తమ పంటలను కళ్ళాలలోనే అమ్ముకుంటున్నారనేది మనందరకు తెలుసు.

ఒకవేళ అందుబాటులోనున్న ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులకు రైతులు పంటలను తీసుకెళ్ళి అమ్మబోతే, అక్కడ వ్యాపారులంతా సిండికేట్‌గా మారి రైతులను నిలువునా దోపిడీచేస్తున్న సంగతి అందరికీ అనుభవంలోనిదే! తమ పంటలను ఎక్కడికైనా తీసుకెళ్ళి అమ్ముకునే స్వేచ్ఛ రైతులకు కల్పించటం ద్వారా, ఎక్కువ ధర వచ్చే చోటుకి పంటలను తీసుకెళ్ళి విక్రయించి రైతులు ఎక్కువ ఆదాయం పొందగలుగుతారని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఇదే రైతులకు తాము కల్పించిన పెద్ద ప్రయోజనమని కూడా ప్రచారం చేసుకుంటోంది.

స్థానిక మార్కెట్ యార్డులలోని వ్యాపారులంతా కుమ్మక్కై పంటలకు రేటు దిగకొయ్యకుండా కట్టడి చేయని పాలకులు, సుదూర ప్రాంతాలకు రైతులు పంటలను తీసుకెళ్ళి, అధిక ధరలకు విక్రయించి, అక్కడ ప్రయోజనం పొందగలుగుతారని ఎలా చెబుతున్నారు? 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరినట్లు' స్థానిక మార్కెట్ యార్డులలో అవినీతి, అక్రమాలను అరికట్టకుండా, దేశవ్యాపిత వ్యవసాయ వాణిజ్యసంస్థల, బడా వ్యాపారుల అక్రమాలను నియంత్రిస్తామని పాలకులు చెప్పే మాటలను ఎలా విశ్వసిస్తారు?! కనుక, వాస్తవాచరణలో జరిగేదేమంటే, రైతుల నుండి యథాప్రకారం ప్రైవేటు వ్యాపారులు, బడా కంపెనీలే పంటలను కొనుగోలుచేసి, స్వేచ్ఛామార్కెట్‌లలో విక్రయించి అధిక లాభాలు గడిస్తాయి.

సన్న, చిన్నకారు రైతులు దూరప్రాంతాలలోని మార్కెట్‌లలో తమ పంటలకు అధిక ధర కోసం, ఆ మార్కెట్‌లకు పంటలను తరలించటం ఎంతటి వ్యయ ప్రయాసలతో కూడుకున్నదో ప్రభుత్వాలకు తెలీదా?! అక్కడి మార్కెట్ మాయాజాలానికి రైతులు మరింతగా మోసపోవటమే జరుగుతుంది. అక్కడ కూడా రైతుల పంటలకు అధిక ధర రాకపోగా, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా దక్కకపోతే వారిని ఆదుకునేదెవరు?

2020 రబీ సీజన్‌లో మొక్కజొన్నకు క్వింటాలుకు కనీసం 2000 రూ॥లు లభిస్తుందని రైతులు ఆశించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర 1850 రూ॥ మాత్రమే. కాగా రైతు నుండి ప్రైవేటు వ్యాపారులు 1300 రూ॥కి మించి కొనలేదు. ఈ పరిస్థితుల్లో బాధ్యత గల ప్రభుత్వాలు ఏమి చేయాలి? మార్క్‌ఫెడ్, ఎఫ్‌సిఐ, తదితర ప్రభుత్వరంగ సంస్థలను మార్కెట్‌లోకి దించి ప్రభుత్వమే ప్రకటించిన కనీస మద్దతు ధరకైనా (1850 రూ॥కైనా) మొక్కజొన్న పంటను కొనుగోలు చేయించాలి. లేదా ప్రైవేటు వ్యాపారులు కనీస మద్దతుధరకైనా కొనుగోలుచేసే చర్యలు తీసుకోవాలి. దీనిని ప్రక్కనబెట్టి, తమ పంటలకు ఇక్కడ సరైన ధర రావటంలేదు కనుక, రైతులు తమ పంటలను ఇతర ప్రాంతాల మార్కెట్‌లకు తరలించి అమ్ముకోమని చెప్పడం – వారిని ఉద్ధరించట మౌతుందా?!

ఇంతేగాక, ఇప్పటికే 'ప్రాంతీయ, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య' (ఆర్‌సిఇపి) ఒప్పందంలో భాగంగా మనదేశం 80 శాతం వస్తు

దిగుమతులపై పన్నులను పూర్తిగా రద్దుచేసింది. సామ్రాజ్యవాద సంస్థల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం మొక్కజొన్న దిగుమతిపై నిషేధాన్ని సడలించింది. దిగుమతి సుంకాన్ని 50 శాతం నుండి 15 శాతానికి తగ్గించి, 5 లక్షల టన్నుల మొక్కజొన్న దిగుమతికి అనుమతించింది. ఇక, దేశంలో మొక్కజొన్న పండించిన రైతుల పరిస్థితి ఏమౌతుంది? మొక్కజొన్న నిల్వలు దేశంలో వున్నాయని తెలిసీ సుంకాన్ని తగ్గించి మరీ మొక్కజొన్నను దిగుమతి చేసుకోవటం పంట పండించిన రైతునోట మట్టికొట్టటం కాదా?! అన్ని పంటల విషయంలోనూ ప్రభుత్వాల తీరు ఇలాగే వుంది. పంటలకు కనీస మద్దతుధర ప్రకటించటాన్నే రైతాంగానికి చాలా మేలు చేసే చర్యలా ప్రచారం చేసుకోవటం, రైతాంగాన్ని వంచన చేయటంకాదా?! కనీస మద్దతుధరల ప్రకారం రైతుల నుండి ప్రభుత్వరంగ సంస్థలు కొనే కొద్దిపాటి పంటలకు కూడా వెంటనే డబ్బు చెల్లించకుండా నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారు. ప్రభుత్వాల తీరే ఇలా వుంటే, ప్రైవేటు వ్యాపారులు మాత్రం రైతుల పంటలను కొన్న వెంటనే డబ్బు చెల్లించాలని చట్టాలలో రాసుకున్నంత మాత్రాన రైతులకు ఒరిగేదేముంది?

## మద్దతు ధరలను, మార్కెట్ యార్డులను ఎత్తివేసే కుట్ర

పంటలకు మద్దతు ధరలు ప్రకటించటమేగాకుండా, ఆ ధరలకు తగ్గకుండా ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయాలనే నిబంధనలను ప్రభుత్వాలు విధించటంలేదు. అయినా ఏదో మేరకు రైతాంగానికి ఆసరాగా వున్న ఈ మద్దతు ధరల ప్రకటనను, ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులను ఎత్తివేసి, రైతాంగాన్ని సామ్రాజ్యవాద వ్యవసాయ వాణిజ్య కంపెనీల, బడా వ్యాపారుల దయా దాక్షిణ్యాలకు వదిలివేయటానికే పాలకులు ఈ చట్టాన్ని ముందుకు తెచ్చారు. దీనికి ముందస్తుగా మోదీ ప్రభుత్వం 2016లోనే ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ - నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్)ల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టిన నాటినుండే మార్కెట్ యార్డుల ఎత్తివేతకు రంగం సిద్ధమైంది.

ఈ-నామ్ అమలు ద్వారా దేశీయ, అంతర్జాతీయ బడా కార్పొరేషన్ కంపెనీలకు వ్యవసాయ మార్కెట్ యార్డులను కట్టబెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ముందుకు తెచ్చిన చట్టాలతో వ్యవసాయ మార్కెట్‌ల రద్దు ప్రక్రియను మరింత ముందుకు తీసుకు వెళ్ళింది. మరోవైపున స్థానిక మార్కెట్ యార్డులలో వ్యాపారాలు నిర్వహించే చిన్న వ్యాపారులందరినీ తొలగించటానికి పూనుకున్నారు. మొత్తం ఈ మార్కెటింగ్ వ్యవస్థను స్పెన్సర్, మోర్, ఐటిసి, స్టార్ అగ్రి, వాల్‌మార్ట్, రిలయన్స్ వంటి బడా, బహుళజాతి సంస్థలు ఆక్రమించనున్నాయి. వ్యవసాయ వాణిజ్యంలోకి ఈ సంస్థలు వేగంగా ముందుకు రావటం దీనినే సూచిస్తోంది. ఇక, ఈ రంగంలోనూ చిన్న వ్యాపారులు నిలవటం సాధ్యంకాదు.

వ్యవసాయ మార్కెట్ యార్డులలో రైతుల పంటలను కొనుగోలు చేసే సందర్భంలోనే తూకాలు, నాణ్యత మొదలుకొని ధరలు నిర్ణయించటం, డబ్బు చెల్లింపుల వరకు ఎన్నో అక్రమాలకు పాల్పడుతుంటే, వీటిని అరికట్టకుండా వ్యవసాయ మార్కెట్‌లనే ఎత్తివేయటమంటే, రైతులకుండే ఆపాటి రక్షణను కూడా రద్దుచేయటమే.

దీనికి బీహార్‌లో రైతాంగ పరిస్థితే ఓ ఉదాహరణ. రైతులకు పంట విక్రయించుకునే వెసులుబాటు, స్వేచ్ఛ కల్పించామంటూ 2006 సం॥లోనే బీహార్ రాష్ట్రవ్యాపితంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను రద్దుచేశారు. అక్కడ ప్రధాన పంట గోధుమకు 2019-20లో క్వింటా 1925 రూ॥లు కనీస మద్దతు ధరగా వున్నప్పటికీ ఏ వ్యాపారీ లేదా కంపెనీ 1500 రూ॥లు మించి కొనుగోలు చేయలేదు. ఇదే పరిస్థితి గత 15 సం॥లుగా కొనసాగుతూ బీహార్ రైతాంగాన్ని, గ్రామీణ ప్రజానీకాన్ని దారుణంగా దెబ్బతీసింది. ఎక్కడ చూసినా బీహార్ వలస కూలీలు వుండటం, దేశవ్యాపితంగా కారుచౌక శ్రమశక్తికి బీహార్ చిరునామాగా మారిపోవటం మన కళ్ళముందున్న వాస్తవమేగా?!

దేశంలో పండే 24 రకాల పంటలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటిస్తూ వస్తుంది. ఇంకా దేశ వ్యాపితంగా పండే అనేకరకాల పంటలకు కనీస మద్దతు ధరలను కూడా ప్రకటించటంలేదు. రెండేళ్ళక్రితం వరకు రాష్ట్రాలలో పండే పంటలలో - కేంద్రం మద్దతు ధరలు ప్రకటించినవాటిలో 40 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతగా కొనుగోలు చేస్తానని ప్రకటిస్తూ వచ్చింది. ప్రస్తుతం ఈ మోతాదును 25 శాతానికి తగ్గించింది. మద్దతుధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించి కొనుగోలు చేయకుండా, తమపై ఆ భారాన్ని మోపుతోందని రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయా పంటలను కొనుగోలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని కేంద్రం - ఒకరిపై ఒకరు నెపం మోపుకుంటూ, రైతులను గాలికొదిలేస్తున్నారు. దేశ ప్రజల ఆకలితీర్చే ప్రధాన పంటలైన బియ్యం, గోధుమల్లో సగం పరిమాణాన్నైనా ప్రభుత్వాలు మద్దతు ధరనిచ్చి కొనుగోలు చేయటంలేదు. మద్దతు ధర ప్రకటించిన ఇతర పంటల్లో కనీసం మూడవ వంతును కూడా ప్రభుత్వాలు కొనుగోలు చేయటం లేదు. రైతుల కుటుంబ శ్రమ, ఉత్పాదక ఖర్చు, కౌలు, వడ్డీలు మొదలైనవన్నీ పరిగణలోకి తీసుకొని శాస్త్రీయ పద్ధతిలో న్యాయమైన ధరలను పంటలకు నిర్ణయించి, ప్రకటించి, పంటలన్నీ కొనుగోలు చేయాల్సి వుండగా, మద్దతు ధరల ప్రకటనను కూడా పాలకులు ఎత్తివేయనున్నారు.

## ధరల స్థిరీకరణ నిధికి మొండిచేయి

పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి గొప్ప ఘనకార్యం చేసినట్లుగా ప్రభుత్వం చేతులు దులుపు కుంటోంది. మార్కెట్‌లో తాను ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ ధరకు రైతుల నుండి వ్యాపారులు పంటలను కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వాల బాధ్యత ఏమిటి? ప్రభుత్వరంగ సంస్థలు రంగంలోకి దిగి కనీస మద్దతుధరైనా రైతుకు దక్కేట్లు తామే కొనుగోలుచేయాలి కదా?! వ్యాపారులు చిత్తమొచ్చినవిధంగా ధరలను తగ్గించి కొనుగోలు చేయటాన్ని అడ్డుకోవాలి కదా?! కానీ కేంద్ర, రాష్ట్ర పాలకులు ఒకరిపై ఒకరు నెపాన్ని మోపుకుంటూ వారి బాధ్యతను విస్మరిస్తున్నారు. అధికారంలోకి రాబోయే ముందు అన్ని పార్టీలూ రైతులకు న్యాయమైన ధర కల్పిస్తామని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పరిచి రైతులు నష్టపోకుండా ఆదుకుంటామని ప్రకటించినవారే! కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల స్థిరీకరణ నిధికి మొండి చేయి చూపుతున్నారు.

దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి మైనస్ 23 శాతానికి వృద్ధిరేటు పడిపోయిందన్న కరోనా కాలంలో కూడా బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రుణాలందజేయటమేగాక, పారుబాకీల పేరిట వారు ఎగ్గొట్టిన 70 వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రద్దు చేసింది. కానీ ప్రభుత్వరంగ సంస్థలు నేరుగా రైతుల పంటలను కొనుగోలు చేసేందుకు వీలుగా నికరమైన శాశ్వతమైన ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయటానికి మాత్రం పూనుకోవటంలేదు. రైతాంగాన్ని సామ్రాజ్యవాద వ్యవసాయ వాణిజ్య కంపెనీల ముందు, బడా వ్యాపారుల ముందు నిస్సహాయంగా పడదోయటం కాదా ఇది?!

## వ్యవసాయ కంపెనీలతో ఒప్పందాలు– రైతుల మెడకు ఉరితాళ్ళు

దీనికంటే ప్రమాదకరమైనది – రెండవ చట్టం. వ్యాపారులు, కార్పొరేటు కంపెనీలు, రైతులతో చేసుకునే ముందస్తు ఒప్పందాలకు చట్ట బద్ధత కల్పిస్తూ చేసిన చట్టమే – **'రైతుల (సాధికారత, రక్షణ) ధరల హామీ, సేవల ఒప్పంద చట్టం'!**

కార్పొరేటు కంపెనీల ముందు, వ్యాపారుల ముందు రైతులను బలిపశువులుగా కట్టిపడేసే చట్టం ఇది. మార్కెట్‌లో రైతులకు విక్రయించే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు మొదలైనవి నాసిరకానివనీ, కల్తీవనీ రైతాంగం అనేక చోట్ల ప్రతి వ్యవసాయ సీజన్‌లోనూ ఆందోళనలు సాగిస్తూనే వున్నారు. అయినా, అందుకు బాధ్యులైన ఆయా కంపెనీల యాజమాన్యాలను శిక్షించటంగానీ, కనీసం వారి నుండి రైతులకు పరిహారాన్ని ఇప్పించటం గానీ పాలకులేనాడూ చేయలేదు. రైతాంగ ఆందోళనల వత్తిడి ఎక్కువగా వుంటే తప్ప, ప్రభుత్వాలు అన్నివేళలా వ్యవసాయ కంపెనీల, కార్పొరేటు కంపెనీల పక్షాననే నిలుస్తూ వచ్చాయి. కాగా ఈనాడు రైతులు, వ్యవసాయ కంపెనీలతో చేసుకునే ఒప్పందాలు, రైతుల 'సాధికారత'కు తోడ్పడతాయని ఎవరైనా ఎలా విశ్వసించగలరు?

2020 రబీ సీజన్ నుండే కంపెనీలు రైతులతో ఒప్పందాలు చేసుకునేందుకు వ్యవసాయ శాఖ అనుమతించింది. ఈ ఒప్పందాల మార్గదర్శకాలను ఒక్కసారి పరిశీలిస్తే, రైతాంగాన్ని ఎంతగా దగా చేస్తున్నారో అర్థమౌతుంది.

ఈ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం రైతులు, వ్యాపారుల మధ్య కుదిరిన ఒప్పందాలపై ఏ కోర్టు జోక్యం చేసుకోవటానికి వీలులేదు. ఒకసారి ఒప్పందం జరిగాక వివాదమేమైనా ఏర్పడితే, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అవకాశం కూడా కోర్టులకు లేదు. అంటే ఈ వివాద ప్రక్రియ మొత్తంలో న్యాయస్థానాలకు ఏ విధమైన ప్రమేయం వుండదు. రైతు పండించిన పంట విషయంలో కానీ, ధర విషయంలో గానీ కంపెనీకి, రైతుకు మధ్య వివాదం వస్తే ఆర్‌డిఓ స్థాయి అధికారులు తీర్పు జెప్పాలిట! దీనికి 30 రోజులు సమయం తీసుకోవచ్చు. ఈ తీర్పు నచ్చకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవాలిట! దీనికీ మరో 30 రోజులు గడువు వుంది. అంటే ఫిర్యాదులు చేసుకునే ఈ 60 రోజుల వరకూ – ఒకవేళ కంపెనీ రైతుకు డబ్బు చెల్లించాల్సి వస్తే కూడా – చెల్లించకుండా

> మోడీ ప్రభుత్వం చేసిన ఈ మూడు చట్టాలు – వ్యవసాయాన్ని కార్పొరేటీకరించి, రైతాంగాన్ని సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లజేసే ప్రమాదకరమైనవి. రైతాంగం, ప్రజానీకం ఇప్పటికే పోరాడి సాధించుకున్న కనీసపాటి ఆసరాలను – వ్యవసాయ మార్కెట్ యార్డులు, కనీస మద్దతు ధరలు, నిత్యావసరాల నియంత్రణ, ప్రజాపంపిణీ వ్యవస్థ వంటి వాటన్నింటినీ రద్దుచేసే కుట్ర, రైతుల నుండి భూములను పరాయీకరించే కుట్ర ఈ చట్టాలలో దాగుంది.

వుండవచ్చు. రైతును ఎంతటి దయనీయ స్థితికి నెట్టివేశారో కదా?! న్యాయస్థానాలలోనే ప్రజలకు న్యాయం కరవౌతుంటే, ఇక ఆర్‌డీఓ, కలెక్టర్ స్థాయి అధికారుల వద్ద రైతులకు న్యాయం జరుగుతుందనటాన్ని మించిన అపహాస్యం మరోటి ఏముంది?!

## కార్పొరేట్ సేద్యంతో ముంచుకొస్తున్న ముప్పు

ఒక కార్పొరేటు కంపెనీ రైతులతో సాగు విషయమై ఒకసారి ఒప్పందం నమోదు చేసుకుంటే, ఆ ఒప్పందంలో రాసుకున్న గడువు పూర్తయ్యేదాకా దానికి ఇరుపక్షాలు కట్టుబడాలి అని పేర్కొన్నా, కంపెనీదే అన్ని విషయాల్లోనూ పైచేయిగా వుంటుందనేది అందరికీ తెలిసిందే. ఒప్పందం ప్రకారం కంపెనీ పంపిన సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే రైతులు పంటను సాగుచేయాలి. కానీ, పంట చేతికి రాకపోతే మాత్రం వారి బాధ్యతేమీ లేదు! పెట్టుబడి మొత్తం రైతులే సమకూర్చుకోవాలి. పంట బీమా సైతం రైతుల డబ్బుతోనే చేయించాలి. ఒప్పంద కాలపరిమితి ఐదు ఏళ్ళకు లోబడి వుండవచ్చు. ఏ పరిస్థితిలోనైనా రైతు తన పంటను బయట అమ్మాలంటే ఒప్పందం చేసుకున్న కంపెనీ లేదా సంస్థ నుండి రాతపూర్వకంగా అనుమతి తీసుకోవల్సిందే.

పంట చేతికొచ్చాక ఒప్పందం ప్రకారం పంట నాణ్యతను కంపెనీ అధికారులు ఏ,బి,సి – అని మూడు రకాలుగా వర్గీకరిస్తారు. కంపెనీ ఒప్పందంలో పేర్కొన్న ధరను 'ఏ' రకానికి మాత్రమే చెల్లిస్తుంది. 'బి', 'సి' రకాలకు ధర తగ్గించి ఇచ్చే హక్కును కంపెనీకి ఈ చట్టంలో కల్పించారు. తాలుకాయల పేరిట, రంగుమారిందనే పేరిట, తడిసిందనే పేరిట పంటల నాణ్యతను తగ్గించి చూపి, రైతుకు చెల్లిస్తున్న ధరలను సైతం నేడు దిగకోస్తున్నారు. ఈ ఒప్పంద సేద్యంతో ఈ తీరులోనే రైతుల నుండి అత్యంత తక్కువ ధరకు వ్యాపారులు నిర్బంధంగా పంటను కొనుగోలు చేయటమే జరుగుతుంది.

దేశంలో కంపెనీ సేద్యం లేదా కార్పొరేటు వ్యవసాయం విస్తరింపజేసే కుట్రపూరిత పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం

ఈ చట్టం చేసింది. సామ్రాజ్యవాద దేశాల, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ఆదేశాలకనుగుణంగా రైతాంగాన్ని వ్యవసాయం నుండి క్రమంగా దూరంచేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. అందుకు ఒక ముఖ్యమైన మార్గమే కంపెనీ సేద్యం లేదా కార్పొరేట్ సేద్యం. దేశంలో ఈ తరహా ఒప్పందాలతో సాగించే వ్యవసాయం విస్తరించటమంటే, రైతాంగం తమ అస్తిత్వాన్ని కోల్పోవటమే. అంతేగాక బడా కార్పొరేట్లకు, కంపెనీలకు బందీలై తమ భూముల్లోనే శాశ్వతంగా వెట్టి చేసేవారుగా మిగిలిపోతారు. రైతులను బంధ విముక్తుల్ని చేస్తామని ఓ వైపున ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తూనే, వారిని పాలేర్లుగా దిగజారుస్తున్నది.

విశాల భూ ఖండాలలో కాంట్రాక్టు సేద్యం సాగించే ఆయా కంపెనీలు వ్యవసాయ పనులలో యంత్రాల వినియోగాన్ని పెంచి, గ్రామీణ ప్రాంతాల్లోని అత్యధిక జనాభా జీవనోపాధిని దెబ్బతీస్తారు. వీరంతా కారుచౌక కూలీలుగా పొట్ట చేత బట్టుకొని పట్టణాలకు నగరాలకు వలసలు వెళ్ళటమే జరుగుతుంది. ఇప్పటికే ఈ తీరులో గ్రామాలలో పనులు కోల్పోయినవారి వలసలు పెద్ద సంఖ్యలో సాగుతున్నాయి. రైతాంగాన్ని, గ్రామీణ పేదలను భూముల నుండి దూరంజేసి, గ్రామీణ ప్రాంతాల్లో వారి జీవనోపాధి హరించి, బడా పారిశ్రామికవేత్తల పరిశ్రమలలో, నిర్మాణాల్లో కారుచౌక శ్రమశక్తిగా వారిని వినియోగించే వ్యూహం దీని వెనుక వుంది.

## ప్రజలపై నిత్యావసరాల ధరల పెనుభారం

మూడవ చట్టం – నిత్యావసరాలైన చిరుధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు మొదలైనవాటి నిల్వలపై ఆంక్షలను తొలగిస్తూ చేసిన **'నిత్యావసర సరుకుల (సవరణ) చట్టం'.**

యుద్ధం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప చిరుధాన్యాలు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు సహా పలు నిత్యావసర వస్తువుల నిల్వ, సరఫరాలలో ఇప్పటివరకు నియంత్రణ ఉండేది. దీనిని ఈ చట్టం ఎత్తివేయటంతో వ్యవసాయ వాణిజ్యసంస్థలు భారీగా లాభాలార్జిస్తాయి. ఈ బడా కంపెనీలు చిన్న రైతులతో ఒప్పందాలు చేసుకొని చౌక ధరలకు పెద్ద మొత్తంలో పంటలను కొని నిల్వజేస్తాయి. పంటల సరఫరా తగ్గి ధరలు పెరిగిన సమయంలో వినియోగదారులకు అమ్ముకొని లాభాలను దండుకుంటాయి. ఇంకా చెప్పుకోవాలంటే సరఫరా తగ్గవలసిన అవసరమేమీ లేదు. బడా కార్పొరేట్లు అన్నీ కుమ్మక్కు అయి, మొత్తం పంటను తమ వద్దే నిల్వజేసుకొని, కృత్రిమ కొరత సృష్టించి, ధరలను పెంచి అమ్ముకొని అనూహ్య లాభాలార్జిస్తాయి.

ఆహార భద్రత చట్టాలెన్ని చేసుకున్నా, ఈనాటికీ దేశంలోని ప్రజలందరికీ అవసరమైన ఆహారధాన్యాలు, పప్పుదినుసులు మొదలైనవాటిని అందించలేక పోతున్నాం. 1961 సం॥లో బియ్యం వార్షిక తలసరి సగటు లభ్యత 73.4 కిలోలు కాగా, 2019 నాటికి అది 69.1 కిలోలకు తగ్గిందని కేంద్ర వ్యవసాయశాఖ గణాంకాలు తెల్పుతున్నాయి. ఆ వివరాల ప్రకారమే 1956 సం॥లో పప్పుధాన్యాల వార్షిక తలసరి సగటు లభ్యత 25.7 కిలోల నుండి 2019 నాటికి 17.5 కిలోలకు పడిపోయింది. వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా వుండగలిగి కూడా, సామ్రాజ్యవాదుల ఆదేశాల మేరకు వంటనూనెలు దిగుమతి చేసుకుంటున్నాం. దేశీయంగా విరివిగా పండే వేరుశనగ పంటను నిరుత్సాహపరిచి, పాలకులు పామోలిన్ పంటను ప్రోత్సహించారు. వేరుశనగ పంట గిట్టుబాటు కాకుండా పోవడంతో ఎంతోమంది వేరుశనగ రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవటం అందరికీ తెలిసిందే. అంతేగాక, 70 వేల కోట్ల రూ॥ విదేశీ మారకద్రవ్యం వెచ్చించి విదేశాల నుండి వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్న దుస్థితికి పాలకులు వ్యవసాయాన్ని దిగజార్చారు. ఇప్పటికే కుంటుకుంటూ నడుస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)ను ఈ చట్టం ద్వారా పూర్తి నిరుపయోగమైందిగా మార్చదలచుకున్నారు.

ఆహారధాన్యాలు, పప్పులు, కూరగాయలు తదితరాలపై ప్రభుత్వసంస్థల నియంత్రణ వుందనుకున్నపుడే నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలంటుతున్నాయి. నిత్యావసరాల నిల్వలపై ప్రభుత్వ నియంత్రణను ఎత్తివేస్తూ చేసిన నిత్యావసర సరుకుల (సవరణ) చట్టంతో ఫ్యూచర్ ట్రేడింగ్ (భవిష్య వాణిజ్యం)కు చట్టబద్ధత కల్పించనున్నారు. ఫలితంగా రానున్న కాలంలో రైతాంగమే కాక దేశ ప్రజానీకమంతా ధరల భారాన్ని మోయవలసి వస్తుంది. చిల్లర వర్తకంలోకి వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను, బహుళజాతి, బడా కార్పొరేటు పరిశ్రమలను అనుమతించటంతో దేశవ్యాపితంగా స్వయం ఉపాధి ద్వారా జీవనం సాగిస్తున్న 8 కోట్ల కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది.

## భ్రమలకు లోనుకావద్దు – పోరాటమే ఏకైక మార్గం

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ముందుకు తెచ్చిన వ్యవసాయ, రైతాంగ వ్యతిరేక చట్టాలను దేశంలోని 18 పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. బిజెపి భావజాలానికనుగుణంగా రైతాంగంలో పనిచేసే భారతీయ కిసాన్ సంఘ్ (బికెఎస్) కూడా ఈ చట్టాలు రైతాంగానికి నష్టం చేస్తాయని చెప్పక తప్పలేదు. ఎన్‌డిఏ కూటమిలో భాగస్వామి అయిన పంజాబ్‌కు చెందిన అకాలీదళ్ పార్టీ ఈ చట్టాలను నిరసిస్తూ కేంద్ర మంత్రివర్గం నుండే కాక కూటమి నుండి వైదొలగింది. రైతన్నలను పాండవులుగా, మోదీ ప్రభుత్వాన్ని కౌరవులుగా ఈ చట్టాలపై పోరాటాన్ని మహాభారత యుద్ధంగా కాంగ్రెస్ పేర్కొంది. తాము అధికారంలోకి వస్తే ఈ 3 చట్టాలను చెత్త బుట్టలోకి చేరుస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించాడు. 2 కోట్ల సంతకాల సేకరణకు పిలుపునిచ్చాడు.

జూన్‌లో ఆర్డినెన్స్‌లు తెచ్చిన కాలం నుండీ, చట్టాల రూపం తీసుకున్న తర్వాత కూడా దేశవ్యాపితంగా రైతులు వీటిని నిరసిస్తూ ఆందోళనలు సాగించారు. ప్రధానంగా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, బెంగుళూరులలో రైతులు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. 250 రైతుసంఘాలతో కూడిన ఏఐకెఎస్‌సిసి ఆధ్వర్యంలో దేశవ్యాపితంగా నిరసనలు, ధర్నాలు, రాస్తారోకో, బంద్‌లు, ఆందోళనలు నిర్వహించారు.

ఇరు తెలుగు రాష్ట్రాలలోని పాలకులు, ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా నాటకాలాడుతున్నారు. ముఖ్యంగా రైతాంగ, వ్యవసాయ వ్యతిరేక బిల్లులకు ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి, టిడిపిలు మద్దతునివ్వగా, తెలంగాణాలోని టిఆర్‌ఎస్ నిరసన తెలుపుతూ పరోక్ష మద్దతునిచ్చింది. విద్యుత్తురంగ సంస్కరణల

పేరుతో నాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై భారీ భారాలు మోపి బషీర్‌బాగ్ కాల్పులను సాగించింది. తిరిగి అదే చంద్రబాబు ఉచిత విద్యుత్తు, రైతులు పోరాడి సాధించుకున్న హక్కుని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టటం ఆ హక్కును హరించటమేనని వీరోచితంగా మాట్లాడుతున్నాడు. కాగా విద్యుత్‌రంగాన్ని ప్రయివేటీకరిస్తూ, రాష్ట్రాల హక్కులను హరించివేసే ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు జోహుకుం అంటూ జగన్ ప్రభుత్వం స్వాగతం పలుకుతోంది. విద్యుత్తురంగ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణా అసెంబ్లీ తీర్మానం చేసి, ప్రజలపక్షాన నిలుస్తున్నట్లు పోజు పెడుతోంది.

పాలకపార్టీలు అధికారంలో వున్నపుడు ప్రజలను అణచివేసే విధంగా, అధికారం కోల్పోయినపుడు ప్రజల పక్షాన వుంటున్న విధంగా మాటలు, ప్రకటనలు, కార్యక్రమాలతో ప్రజలను మభ్యపరిచేందుకు ప్రయత్నించటం పరిపాటి అయింది. తిరిగి అధికారంలోకి రావటానికి, ఓట్ల ప్రయోజనాల కోసం ఉద్యమాలు నిర్వహించేవారెవరో, చిత్తశుద్ధితో ప్రజా సమస్యలపై నిలకడగా ఆందోళనలు నిర్వహించేదెవరో ప్రజలు చైతన్యవంతంగా గ్రహించాలి.

## ఐక్య ప్రజా ఉద్యమం అవసరం

వ్యవసాయరంగ సమస్యల పరిష్కారం కోసం 2017 జూన్‌లో మధ్యప్రదేశ్ రైతాంగం మిలిటెంట్ ఆందోళన సాగించారు. ఆందోళనకారులపై మందసార్‌లో పోలీసులు కాల్పులు జరిపి ఆరుగురు రైతులను బలిగొన్నా వెనుదిరగకుండా ఉద్యమం సాగించారు. 2018 మార్చిలో రైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ నాసిక్ నుండి ముంబయి వరకు 200 కి॥మీ॥ దూరం 30 వేలమంది ఆదివాసులు, రైతులు మహా పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచగలిగారు. న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఉత్తరాఖండ్ నుండి కిసాన్ క్రాంతి యాత్ర నిర్వహిస్తున్నవారిపై 2018 అక్టోబర్‌లో ఢిల్లీ శివారు ఘజియాబాద్ వద్ద పోలీసులు విరుచుకుపడినా రైతాంగం లెక్కచేయక ముందుకే సాగింది. ఈ వరుసలోనే వ్యవసాయ వ్యతిరేక చట్టాలని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరవధిక ఆందోళన సాగించారు.

మోడీ ప్రభుత్వం చేసిన ఈ మూడు చట్టాలు – వ్యవసాయాన్ని కార్పొరేటీకరించి, రైతాంగాన్ని సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లజేసే ప్రమాదకరమైనవి. రైతాంగం, ప్రజానీకం ఇప్పటికే పోరాడి సాధించుకున్న కనీసపాటి ఆసరాలను – వ్యవసాయ మార్కెట్ యార్డులు, కనీస మద్దతు ధరలు, నిత్యావసరాల నియంత్రణ, ప్రజాపంపిణీ వ్యవస్థ వంటివాటన్నింటినీ రద్దుచేసే కుట్ర, రైతుల నుండి భూములను పరాయీకరించే కుట్ర ఈ చట్టాలలో దాగుంది. ఈ రైతాంగ, వ్యవసాయ చట్టాలు దేశంలోని యావత్ ప్రజానీకానికి వ్యతిరేకమైనవి.





# రైతు భేరి

- పినాకిని

ఓరోరే కాషాయోడా...
కార్పొరేట్ జీతగాడా....
ఏమాయరా దేశభక్తి - ఎటుబోయర రాంభక్తి
రైతునోట మట్టిగొట్టి -
భూములు తాకట్టుపెట్టి అంబానీ అదానీల -
అరికాళ్లకు పూజలేంది
భరతమాత పేరుజెప్పి -
బాంచెనని మొక్కుడేంది ॥ ఓరోరే ॥

గొర్రెకు తోడేలు భలే
-కాపలా కాస్తదని
మేకల మందకు బెబ్బులి - అండదండలిస్తదని
పులితోడేలు తలకు -
స్వదేశీ తొడుగు తొడిగే
నక్కజిత్తు ఎత్తులన్ని- నమ్మరిపుడు రైతుజనం
నయానయా వ్యాపారీ-
నయవంచక దళారీ... ॥ ఏమాయర ॥

పచ్చని పైరుని పెంచి-
పశువుల పక్షుల సాకి
ప్రకృతిలో పరవశించే-
రైతు బతుకు స్వేచ్ఛకన్న
కార్పొరేట్ బందిఖాన-
మేలెట్టర పిచ్చికన్న
గోమాతని మాకుచెప్పి - అంబానిని పూజిస్తవు.
అసల్ సిసల్ క్యాప్టలిస్ట్ - కసాయి అవతారమా
॥ ఓరోరే ॥

అదానోడి ఆస్తుల్లో - మీకొచ్చే వాటాలెంతో
అంబానీ షేరాస్తిలో - బహుళజాతి భాగమెంతో
గంటకు వందలకోట్లు - మీ ఆస్తులు పెరిగిపోయే
కష్టజీవి కష్టమంత - కార్పొరేట్ల పరమాయే
కాంగిరేసు తలదన్నిన - కాషాయపు దోపిడోడ
॥ ఏమాయర ॥

ఎనభై శాతం
మా అన్నదాత లోకవైపు
శ్రమదోపిడి కార్పొరేటు - కంపెనీలు నీ వైపు
మా భూమిలో మేముంటే -
బానిసలం దొరకమని
సాగుమాకు దండగని -
కంపెనీల దించినవ్
కార్పొరేట్ వ్యవసాయం - కహానీలు చెప్తున్నవ్
॥ ఓరోరే ॥

ఐటీసీలో ఐ వుంటే - ఇండియాది అవుతుందా
రిలయన్స్‌లో ఎల్ ఉంటే -
దేశప్రేమ పుడుతుందా నీ దృష్టిలో దేశమొక -
లిమిటెడ్ అయిపోయిందా
శ్రమజీవుల చేతులపై - నిలిచిందిర ఈగోళం
దేశమంటే మట్టికాదు -
మట్టిమనిషిదే ఈ దేశం
ఢిల్లి దాక తాకిందిరా - కష్టజీవి సందేశం
మోగిందిర రైతుభేరి...
కాసుకోర బేహారీ..... ॥ ఓరోరే ॥

# స్ఫూర్తిదాయక రైతాంగ ఉద్యమం

## 2020 జూన్ - 2021 డిసెంబర్



**దేశ** ప్రజానీకం యావత్తు కరోనా బారినపడి విలవిలలాడుతున్న సమయంలో – 2020 జూన్‌లో – కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హడావుడిగా రైతాంగ, ప్రజావ్యతిరేకమైన మూడు సాగు చట్టాలను మొదట ఆర్డినెన్స్‌లుగా ముందుకు తెచ్చింది. దీనికి తోడు – రైతులకిచ్చే విద్యుత్తు సబ్సిడీలను రద్దుచేస్తూ, పారిశ్రామికవేత్తలకు విద్యుత్తు రాయితీలు కల్పిస్తూ ప్రమాదకరమైన అంశాలతో విద్యుత్తు బిల్లు–2020ని ముందుకు తెచ్చారు.

వీటి ప్రమాదాన్ని గుర్తెరిగిన రైతాంగం – ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం ఈ ఆర్డినెన్స్‌లకు వ్యతిరేకంగా కరోనాను లెక్కచేయకుండా భారీ సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. ఆగస్టు 5న 'జైల్ భరో' కార్యక్రమాన్ని, ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాపిత ప్రదర్శనలను, వందలాది రైతు సంఘాలతో కూడిన ఏఐకెఎస్‌సిసి (ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ కో–ఆర్డినేషన్ కమిటీ) ఆధ్వర్యంలో రైతాంగం నిర్వహించారు.

రైతాంగ, ప్రజా నిరసనలను బేఖాతరు చేస్తూ మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడు సాగు ఆర్డినెన్స్‌లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, కనీస చర్చకు అవకాశమివ్వకుండా అత్యంత అప్రజాస్వామికంగా వాటికి చట్టరూపమిచ్చింది.

ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం మరింత సమన్వయంతో ఆందోళనలు చేపట్టారు. సెప్టెంబర్ 14న ఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సెప్టెంబర్ 25న జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేశారు. సెప్టెంబర్‌లో ముఖ్యంగా పంజాబ్, హర్యానాలలో ఈ పిలుపులను మిలిటెంట్‌గా అమలు చేశారు. సెప్టెంబర్ 24 నుండి 26 వరకు 3 రోజులు రైలుపట్టాలపై రైళ్ళు తిరగనివ్వకుండా బంద్ చేశారు. రచయితలు, గాయకులు, అనేక సాంస్కృతిక సంస్థల కార్యకర్తలు రైతాంగానికి మద్దతుగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో మహిళలు ఆందోళనల్లో ముందుభాగాన నిలిచారు. ఉపాధ్యాయులు, న్యాయవాదులు, పోలీసు, పెన్షనర్లు కూడా క్రియాశీలక మద్దతునందించారు. సెప్టెంబర్ 25న పంజాబ్‌లో 400 ప్రదేశాలలో ప్రజలు భారీ ధర్నా, రోడ్, రైల్‌రోకో కార్యక్రమాలు చేపట్టారు.

కార్పొరేట్ సంస్థలకనుగుణంగా రూపొందించిన సాగుచట్టాలను నిరసిస్తూ అంబానీ, అదానీల మాల్స్, పెట్రోల్ బంకులు, మొబైల్ సేవలన్నింటినీ ప్రజలు బహిష్కరించారు. జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారులపై భాష్పవాయువు, జలఫిరంగులలో దాడి చేసినా రైతాంగం లెక్కచేయలేదు. రాత్రిళ్ళు కూడా ధర్నాలను కొనసాగించారు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం 3 సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ తక్షణం శాసనసభను సమావేశపరిచి తీర్మానం చేయాలని డిమాండ్ చేసి సాధించుకున్నారు. దేశంలో పదికి పైగా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాలను వ్యతిరేకించాయి.

నవంబర్ 5న ఏఐకెఎస్‌సిసి ఇచ్చిన జాతీయ రహదారుల దిగ్బంధనం పిలుపుమేరకు 18 రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. దీనిలో సుమారు 5 లక్షలమంది రైతాంగ, ప్రజానీకం పాల్గొన్నారు.

ఇరు తెలుగు రాష్ట్రాలలోని పాలకులు వైసిపి, టిఆర్ఎస్‌లతో పాటు టిడిపి కూడా ఈ చట్టాలకు పరోక్ష మద్దతునివ్వటం ద్వారా వారి రైతాంగ, ప్రజావ్యతిరేక స్వభావాన్ని, ఈ విషయంలో వారి నడుమ ఏకీభావాన్ని మరోసారి స్పష్టం చేశాయి.

కార్మికులు సాగించిన ఆందోళనకు రైతాంగం అండగా నిలిచారు. అదే విధంగా 3 సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ నిరవధిక ఆందోళనకు కార్మికవర్గం సంపూర్ణ సంఘీభావాన్ని అందజేసింది. నిరంకుశ పాలకుల మెడలు వంచేందుకు అత్యావశ్యకమైన కార్మిక-రైతాంగ మైత్రి సంవత్సర కాలంపైగా సాగిన రైతాంగ ఆందోళనల సందర్భంగా వెల్లివిరియటం సానుకూల అంశం.

మూడు సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ 2020 నవంబర్ 26న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ అడ్డంకులను దాటుకుంటూ లక్షలాదిగా రైతాంగ ప్రజానీకం ఢిల్లీ శివార్లకు చేరుకున్నారు. జలఫిరంగులు, భాష్పవాయు ప్రయోగాలు, లాఠీఛార్జీలకు ప్రజలు వెనుదీయలేదు. దిక్కుతోచని ప్రభుత్వం మునుపెన్నడూ కనివినీ ఎరుగని విధంగా రోడ్లపై కందకాలు తవ్వించి, మేకులు పాతించి రైతాంగాన్ని నిరోధించటానికి విఫల ప్రయత్నం చేసింది. రాష్ట్రాల సరిహద్దులలో ముళ్ళతీగలు, బారికేడ్లను ఏర్పరచి, వేలాదిమంది పోలీసులను మోహరించినా, జనప్రవాహన్ని నిరోధించటం సాధ్యం కాలేదు.

## కార్మికులు, రైతాంగం పరస్పర సంఘీభావం

దేశవ్యాపితంగా కార్మికులు నవంబర్ 26న సార్వత్రిక సమ్మె నిర్వహించి కోట్లాది మంది వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ కాలరాస్తూ, 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా రూపొందించే కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ కార్మికులు సాగించిన ఆందోళనకు రైతాంగం అండగా నిలిచారు. అదే విధంగా 3 సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ నిరవధిక ఆందోళనకు కార్మికవర్గం సంపూర్ణ సంఘీభావాన్ని అంద జేసింది. నిరంకుశ పాలకుల మెడలు వంచేందుకు అత్యావశ్యకమైన కార్మిక-రైతాంగ మైత్రి సంవత్సర కాలంపైగా సాగిన రైతాంగ ఆందోళనల సందర్భంగా వెల్లివిరియటం సానుకూల అంశం.

## ఆటంకాలను అధిగమిస్తూ సాగిన ఆందోళనోద్యమం

ఢిల్లీ సరిహద్దులలోనే నిలిచి 3 నల్లచట్టాల రద్దు కోసం గడ్డకట్టే చలిని, మండే ఎండలను, జడివానలతో పాటు ప్రపంచాన్ని వణికించిన కరోనా తీవ్రతను సైతం లెక్కచేయకుండా రైతాంగం ఆందోళన సాగించారు. ప్రభుత్వాల నిర్బంధ చర్యలన్నింటినీ ధిక్కరించారు. అక్రమ కేసులను ఎదుర్కొన్నారు. మోడీ అనుకూల మీడియా సాగించే దుష్ప్రచారాలను తిప్పికొట్టారు. ప్రభుత్వ బూటకపు చర్చల తతంగాన్ని ఎండగట్టారు. 500లకు పైగా సంఘాల సమన్వయంలో 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆధ్వర్యంలో నిరంతరాయ ఆందోళనా కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ ఉద్యమ క్రమంలో 700 మందికి పైగా రైతాంగ ప్రజానీకం అమరులైనప్పటికీ మొక్కవోని దీక్షను ప్రదర్శించారు.

2021 జనవరి 26న సంయుక్త కిసాన్ మోర్చా రైతు గణతంత్ర దినోత్సవంగా ప్రకటించి ట్రాక్టర్ల ర్యాలీలు జరపని పిలుపునిచ్చింది. ఢిల్లీలో రైతుల ట్రాక్టర్ల ర్యాలీకి మొదటి అనుమతినిచ్చిన ప్రభుత్వం, తర్వాత అనేక షరతులు విధించి, కుట్రలకు సిద్ధమైంది. కిసాన్ మోర్చా ఆధ్వర్యాన క్రమశిక్షణాయుతంగా వేలాది ట్రాక్టర్లతో ప్రదర్శన జరిగింది. ప్రదర్శనకారులపై ఢిల్లీ ప్రజలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. మంచినీరు, మిఠాయిలు అందించారు. ఇంతలో కట్టుదిట్టమైన భద్రతా వలయాల మధ్య నుండి సజావుగా ఎర్రకోట పైకి బిజెపి అనుయాయులు చేరుకొని, సిక్కు మత చిహ్నంతోనున్న జెండాను ఎగురవేశారు. ఎస్‌కెఎం ఆధ్వర్యంలో జరుగుతున్న రైతాంగ ప్రదర్శనను చూపకుండా, ఎర్రకోటపై సిక్కు మతపరమైన జెండా ఎగురవేసిన దృశ్యాలను రైతాంగ ఉద్యమానికి ఆపాదిస్తూ ప్రభుత్వం ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం గావించింది. 'ఎర్రకోట ఘటన'ను ఆసరా చేసుకొని నాజీ తరహాలో రైతాంగంపై ముప్పేట దాడి చేశారు. సరిహద్దులలో రైతాంగ శిబిరాలకు విద్యుత్తు, మంచినీటి సరఫరాలను బంద్ చేశారు; శిబిరాలపై దాడి చేసి ఖాళీ చేయించే ప్రయత్నాలు చేశారు. వందలాది మంది కార్యకర్తలు, నాయకులతో పాటు జర్నలిస్టులపై సైతం రాజద్రోహ నేరం మోపి కేసులు పెట్టి, అరెస్టులు చేసి, జైళ్ళలో నిర్బంధించారు. దీనినంతా రైతాంగ ఉద్యమం తిప్పికొట్టి, జనవరి 26 ఘటన బిజెపి కుట్రలో భాగమేనని ప్రపంచానికి వెల్లడిచేసి, ఆందోళనను కొనసాగించింది.

1975 నాటి 'అత్యవసర పరిస్థితి'కి 46 సం॥లు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని 2021 జూన్ 26వ తేదీన 'సేవ్ అగ్రికల్చర్.. సేవ్ డెమోక్రసీ' నినాదంతో దేశవ్యాపితంగా అన్ని రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి గవర్నర్ల ద్వారా రాష్ట్రపతికి మెమోరాండం అందజేశారు.

2021 ఆగస్టు 26, 27 తేదీల్లో ఢిల్లీ సరిహద్దు సింఘు బోర్డర్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో జాతీయ సదస్సు నిర్వహించి వివరణాత్మకమైన తీర్మానాన్ని ఆమోదించారు. **(తీర్మానం పూర్తి పాఠాన్ని విడిగా అందిస్తున్నాం.)**

ఈ సదస్సులో ఇచ్చిన పిలుపుమేరకు 2021 సెప్టెంబర్ 27న దేశవ్యాపితంగా బంద్ విజయవంతంగా జరిగింది. 22 రాష్ట్రాల్లో ఈ బంద్ ప్రభావం చూపింది. దేశం మొత్తం మీద వందలాది రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాలు, కార్మిక, ప్రజా సంఘాలు సంయుక్తంగా, విడివిడిగా కూడా ఈ బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో వర్షంలోనూ బంద్ జరిగింది. పారిశ్రామిక ప్రాంతాలు, ట్రేడ్ యూనియన్ పట్టు వున్నచోట బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. తమిళనాడు,

ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో అధికార పార్టీలు కేంద్రానికి భయపడి బంద్‌కు సహకరిస్తున్నట్లే వుండి శాంతిభద్రతల పేరుతో అడ్డుకున్నాయి. కార్మిక-కర్షక మైత్రి ఆవశ్యకతను ఈ బంద్ మరోసారి చాటిచెప్పింది.

ఎట్టకేలకు 2021 నవంబర్ 19న ప్రధాని మోడీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మూడు సాగు చట్టాలను ఉపసంహరించు కుంటున్నట్లుగా ప్రకటించాడు. ఈ చట్టాలు మంచివే అయినా రైతులు సరిగ్గా అర్థం చేసుకోనందువలన ఆందోళన చేశారని పేర్కొన్నాడు. ఈ ఉద్యమ క్రమంలో మరణించిన 700 మంది రైతులకు సంతాపం తెలపటానికి కూడా మోడీకి నోరు పెగలలేదు.

అయితే మూడు చట్టాల రద్దుతోపాటు విద్యుత్తు బిల్లు-2020ని చట్టపరంగా ఉపసంహరించుకోనంతవరకూ తమ ఆవాసాల నుండి కదిలేది లేదని రైతాంగం తేల్చిచెప్పారు.

ఎప్పటిలాగానే, ఎలాంటి చర్చకూ అవకాశం లేకుండా 3 సాగు చట్టాలను రద్దు చేస్తున్నట్లుగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టాలను ఉపసంహరించుకున్నారు. విద్యుత్తు బిల్లు తదితర రైతాంగ డిమాండ్లపై కిసాన్ మోర్చా సభ్యులతో కూడిన ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పరిచి, దాని ఆధ్వర్యంలో డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపడతామని ప్రకటన చేశారు. నిరంకుశ ప్రభుత్వాన్ని మెడలు వంచేవిధంగా ఆ మేరకు రైతాంగ ఉద్యమం విజయం సాధించింది.

## రైతు పోరాట సమన్వయ సమితిలో భాగంగా....

సంవత్సర కాలం పైగా సాగిన రైతాంగ ఉద్యమ నాయకత్వంలో ఏఐకెఎంకెఎస్ భాగస్వామ్య సంఘంగా వుంది. వడ్డే శోభనాద్రీశ్వరరావుగారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'రైతు పోరాట సమన్వయ సమితి' పిలుపులన్నింటిలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) క్రియాశీలకంగా పాల్గొంది. రైతాంగ ఉద్యమాన్ని చాటి చెపుతూ, సంఘం ఆధ్వర్యంలో ఒక బుక్‌లెట్ వెలువరించటంతోపాటు ఆ ఆందోళనా రిపోర్టులు, విశేషాలతో రైతుకూలీ సంఘం ప్రత్యేక బులిటెన్లను, అనేక కరపత్రాలను ముద్రించి రైతు, కూలీ, గ్రామీణ పేదల నడుమ విస్తృత ప్రచారం, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించింది. సంఘం ఆధ్వర్యంలో రైతాంగ ఉద్యమానికి మద్దతుగా పలు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించింది.

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్లను బలపర్చుతూనే, కౌలు రైతుల, వ్యవసాయ కూలీల డిమాండ్లను, దున్నేవానికే భూమి నినాదాన్ని రైతుకూలీ సంఘంగా ముందుకు తీసుకువచ్చింది. రైతాంగ ఉద్యమం సాగుతున్న కాలంలో 3 సందర్భాలలో సంఘ నాయకత్వ ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళి వారికి సంఘీభావం తెలిపింది. మూడు సాగు చట్టాలుగా ఈనాడు నిర్దిష్ట రూపంలో ముందుకు తెచ్చినప్పటికీ, ఇవి ఏనాటి నుండో వివిధ రూపాల్లో, అనేక రాష్ట్రాలో అమలవుతున్నాయని, సామ్రాజ్యవాదులకు వ్యవసాయాన్ని ధారాదత్తం చేయటంలో భాగమే ఈ చట్టాలనే అవగాహనను ఆయా వేదికలపై నుండీ, స్వతంత్రంగానూ ప్రకటిస్తూ వస్తోంది.

మోడీ ప్రకటనలోని మోసకారీతనం, విద్రోహం మరోమారు వెల్లడైంది. గిట్టుబాటు ధరల సమస్య, విద్యుత్తు బిల్లు తదితర అంశాలపై నియమిస్తామన్న కమిటీని ఏర్పరచనే లేదు. తిరిగి మరోసారి దీర్ఘకాల రైతాంగ ఉద్యమం సాగించటానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

---

"ఇది రాసే సమయానికి
ఈ దేశపు చెరసాలను
వేలకొలది మణిపూసల
కాలవాలమయి వున్నవి

వీరంతా గొప్ప కుట్ర
దారులంట చట్టబద్ధ
సర్కారును సాయుధ సమ
రంలో కూలుస్తారట!

బ్రిటీషు వాడుకూడ యీ
ప్రేలాపనతోనే మన
అల్లూరీ, భగత్సింగు
లందరినీ తినేశాడు!

అదే ఆర్గుమెంటు నేడు
అదే రాక్షస వ్యవస్థ
అదే చదువు, అదే బ్రతుకు
అదే కోర్టు, అదే జైలు!"

- శ్రీశ్రీ 'రాక్షస ఉగాది' నుండి
(12-4-1975)

# రైతులు నాటౌట్‌గా నిలవాలి

- సైఫ్ అలీ సయ్యద్

**వికెట్** పడిపోతేనే దేశం ఓడిపోతుందని భయపడే
దేశ భక్తా
దేశానికి అన్నం పెట్టే దేహాలెన్నో పడిపోతున్నాయ్
పట్టించుకుంటున్నావా దేశభక్తా ?

ఇష్టమయిన క్రికెటరెవరో
వంద పరుగులు చెయ్యాలని
దేవుణ్ణి మొక్కుకున్నట్లు,
నీకు తెలిసిన రైతు ఎవరైనా
వంద బస్తాలు పండించాలని
ఎప్పుడైనా మనసారా కోరుకున్నావా దేశభక్తా ?

రెండు గంటలు బ్యాటు పట్టుకొని
ఆడినతను గాడ్ అయితే
నీకు జీవితాంతం బువ్వ పెట్టే రైతన్నకు
ఏ పేరు పెడుతావ్ దేశభక్తా ?

దేశాన్ని గెలిపించడానికి
కొన్ని బంతులే ఉన్నాయని తెలిస్తేనే,
టెన్షన్ పడి గొంతు తడుపుకుంటావ్
దేశాన్ని బతికించే
నదులు, చెరువులు కొన్ని మాత్రమే నీళ్ళతో ఉన్నాయ్
అనే ఆందోళన నీకుందా దేశభక్తా ?

నీకు సంతోషం ఇచ్చే ఆటగాళ్ళను
నీకు ఇష్టమయిన రీతిలో ఎంకరేజ్ చేస్తుంటావ్
నిన్ను బతికించే రైతులనెవరూ
ఎంకరేజ్ చెయ్యడం లేదని తెలుసా దేశభక్తా ?

నీకు ఏ స్టేడియంలో పిచ్ ఎలా ఉంటదో తెలుసు కానీ
నీ ఊరిలో మార్కెట్టు యార్డు అసలెక్కడుందో
ఎలాంటి పరిస్థితుల్లో ఉందో తెలుసా దేశ భక్తా?

అన్నం తింటూ కూడా ..
ఏ విదేశి టీం ని దేశంలోకి రానియ్యాల వద్దా అని
నీకు తెలిసిన గొప్పలు ప్రదర్శిస్తావ్
అసలు నీ చేతిలో ఉన్నది స్వదేశి బియ్యమో
విదేశి దిగుమతి బియ్యమో తెలుసా దేశభక్తా?

ఇండియన్ క్రికెట్ బోర్డో , క్రికేట్ టీమో
చేసే తప్పొప్పులన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటావ్
వ్యవసాయానికి పెట్టింది పేరయిన దేశంలో
ప్రభుత్వాలు చేసే తప్పొప్పుల్ని
అసలెప్పుడయినా పట్టించుకున్నావా దేశభక్తా ?

ఎవరు ఎప్పుడు ఎంత స్కోర్ చేసారో తెలిసిన నీకు
రోజెక్కడెక్కడ ఎంతమంది రైతులు చస్తున్నారో తెలుసా దేశభక్తా?

అసలు,
అసలయిన పరుగులు తియ్యడం అంటే
ఏమిటో నీకు తెలుసా దేశభక్తా ?
ఎప్పుడయినా,
గిట్టు బాటు ధరలకోసమో, విద్యుత్తుకోసమో పోరాటం చేస్తూ

లాఠీ దెబ్బలు తింటూ పరిగెత్తే రైతన్నలను చూసావా దేశభక్తా?

ఏ దేశం బౌలరు ఎలా బాల్ వేస్తాడో తెలిసిన నీకు
ఎవరు ఎలా రైతులను మోసం చేస్తున్నారో
తెలియకుండా ఉంటుందా దేశభక్తా?

పిల్లలను స్టేడియాలకు తీసుకెళ్ళినట్లు,
చెక్కతో బ్యాట్ మాత్రమే కాదు
నాగలి పనిముట్లు కూడా చేస్తారు అని
ఎప్పుడయినా పొలాలకు తీసుకెళ్ళి చెప్పావా దేశభక్తా ?

క్రికెటర్లు
బూస్టులో, కూల్ డ్రింకులో తాగి
ఆరోగ్యంగా ఆడుతున్నారని
నువ్వు అన్నం తినకుండా బతగ్గలవా దేశభక్తా?

కామెంట్రీలు వింటూ టీవీలకు అతుక్కుపోయినట్లు
రైతుల గురించి చర్చాకార్యక్రమాలు చూసావా దేశభక్తా ?

ఎప్పుడు ఎలా ఆడితే
దేశం గెలుపోటముల అవకాశాలున్నాయో
చెప్పగలవ్ కదా దేశభక్తా !
మరి ఎప్పుడు ఎలా
దేశం ఆహార పంటల విషయంలో గెలుస్తుందో చెప్పలేవా?

పది మంది ఆడే ఆటకోసం లక్షల మంది ఒక్కటౌతున్నాం
కోట్లమంది ఆకలి తీర్చే రైతుల కోసం ఏం చేస్తున్నాం దేశభక్తా?

ఇండియాని గెలిపించే వాళ్ళను కూడా
బతికించే వాళ్ళ గురించి ఆలోచించు దేశభక్తా

ఇండియా గెలవాల్సింది స్టేడియాల్లో కాదు
పచ్చని పొలాల్లో దేశభక్తా
అందుకు
రైతులు నాటౌట్ గా నిలవాలి
మనం చీర్ లీడర్స్ కావాలి.

# కర్ణాటక రైతాంగ పాదయాత్ర

## 2021 మార్చి 5 - మార్చి 23




**కేంద్రప్రభుత్వం** తీసుకుని వచ్చిన వ్యవసాయ వ్యతిరేక 3 నల్ల చట్టాలు, విద్యుత్ బిల్లు 2020ను వెనక్కు తీసుకోవాలన్న ప్రధాన డిమాండ్లతో దేశవ్యాప్తంగా, ప్రధానంగా ఉత్తర భారతదేశంలో, ఢిల్లీ సరిహద్దులలో రైతాంగం సాగిస్తున్న ఆందోళనలకు సంఘీభావంగా ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధ కర్ణాటక రాజ్య రైతుసంఘ, సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఇచ్చే అనేక ఆందోళనా కార్యక్రమాలను అమలు చేస్తూ ఆ ఉద్యమంలో భాగమైంది. సమైక్య ఆందోళనలలో పాలుపంచుకోవడంతోపాటు ప్రజలకు, రైతాంగానికి ఈ చట్టాల గురించి వివరంగా చెప్పి అర్థం చేయించాలని, ప్రత్యక్షంగా వేలాదిమందిని కలవాలని భావించి, వందలాది మీటింగులను నిర్వహించింది.

2021 మార్చి 5న బసవ కళ్యాణ (బీదర్ జిల్లా)లోని బసవన్న విగ్రహం ముందు ప్రారంభ సభ జరిగింది. ఈ సభకు కర్ణాటక తెలంగాణ, మహారాష్ట్ర ఏఐకెఎమ్‌కెఎస్ కార్యకర్తలు హాజరై కాలినడకకు తోడుగా నిలిచారు. ప్రముఖ కన్నడ రచయిత సి.రఘునాథగారు రైతుసంఘ జెండా ఊపి కాలినడక ప్రారంభించారు. తనకు ఒక్క కాలున్నా, కర్రలతో నడిచారు. మరో 150 మంది రైతాంగంతో కాలినడక మొదలైంది. మార్చి 23వ తేదీ భగత్సింగ్ వర్ధంతిరోజుకు బళ్ళారికి 442 కిలోమీటర్ల దూరం సాగింది. 100 గ్రామాలు, 130 వరకు చిన్న పెద్ద మీటింగులు పెడుతూ 19 రోజులు సాగిన ఈ కాలినడకలో మధ్యలో వందలాది మంది పాదయాత్రలో భాగస్వాములయ్యారు. తమ గ్రామాలకు ఆహ్వానిస్తూ, ఆదరిస్తూ భోజనాలు, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ తమదైన ఉద్యమాన్ని చివరివరకూ ఆదరించారు.

ఒక ట్రాక్టర్‌లో భోజన ఏర్పాట్లు, మరొక ట్రాక్టర్‌ని మొబైల్ స్టేజ్‌గా మార్చుకొని ఎక్కడ చీకటిపడితే అక్కడ కాగడాలతో ప్రదర్శన నిర్వహిస్తూ చట్టంలోని అంశాలను ఒక్కొక్కటి వివరించే నాయకుల ఉపన్యాసాలు, స్థానిక ప్రజల స్పందనలు తెలపడానికి అవకాశం ఇస్తూ ఈ సభలు, కాలినడక సాగాయి. ఎంతో పట్టుదలతో కర్ణాటక రాజ్య రైతుసంఘ నాయకులు, హసిరు సేన కార్యకర్తలు ఈ కార్యక్రమం మొదటినుంచి చివరివరకు 60 వేలకు పైగా కన్నడ, హిందీ, ఇంగ్లీష్, తెలుగు కరపత్రాలు పంచుతూ, ప్రజలకు రానున్న వ్యవసాయరంగ సంక్షోభం గురించి వివరిస్తూ ఈ కాలినడక సాగింది. ప్రధాన స్రవంతి ఎలక్ట్రానిక్ మీడియా ఎంత పక్కకు పెట్టాలని చూసినా స్థానిక చానళ్లు, ప్రింట్‌మీడియా కొంతవరకు ప్రచారం కల్పించింది.

ఈ మొత్తం పాదయాత్రలో వివిధ రైతుసంఘాలు, రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు, రచయితలు మేధావులు మద్దతుగా వచ్చి పాల్గొని వెళ్ళారు. చివరి ముగింపుసభలో వచ్చి మాట్లాడారు.

### బళ్ళారిలో ముగింపు సభ

22 రాత్రికే బళ్లారికి 6 కి.మీ. సమీపంలోకి చేరుకొని, ఉదయాన్నే బళ్లారికి చేరిన రైతాంగానికి స్వాగతం పలుకుతూ బళ్ళారి సమీప గ్రామాల నుంచి వచ్చిన వందలాదిమంది రైతులు తోడయ్యారు. కాలినడక బళ్లారిలో పెద్ద ప్రదర్శనతో ముగించుకున్నది. మున్సిపల్ గ్రౌండ్ స్థలంలో సభ ప్రారంభమైంది. రైతాంగం కేంద్ర,

ప్రముఖ కన్నడ రచయిత సి.రఘునాథగారు రైతుసంఘ జెండా ఊపి కాలినడక ప్రారంభించారు. తనకు ఒక్క కాలున్నా, కర్రలతో నడిచారు. మరో 150 మంది రైతాంగంతో కాలినడక మొదలైంది. మార్చి 23వ తేదీ భగత్సింగ్ వర్ధంతి రోజుకు బళ్ళారికి 442 కిలోమీటర్ల దూరం సాగింది. 100 గ్రామాలు, 130 వరకు చిన్న పెద్ద మీటింగులు పెడుతూ 19 రోజులు సాగిన ఈ కాలినడకలో మధ్యలో వందలాది మంది పాదయాత్రలో భాగస్వాములయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక చర్యలపై దారిపొడవునా నినాదాలిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఉదయం 12 గంటలకు రైతు గీతంతో సభ ప్రారంభమైంది.

ఏఐకెఎంకెఎస్ కోకన్వీనర్ ఎస్. ఝాన్సీ మాట్లాడుతూ '450 కిలోమీటర్ల పాదయాత్రలో లక్షలాది మంది ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలు దేశ ప్రజలకు, రైతాంగానికి ఏ విధంగా నష్టాలను, కష్టాలను కలుగజేస్తాయో, ఆహారభద్రతకు ఏ విధంగా నష్టంగా ఉందో వివరించి, చైతన్యాన్ని కలిగించి దక్షిణ భారతదేశంలోనే ఒక చరిత్రను సృష్టించిన మీ అందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నాను. ఇదొక చారిత్రాత్మక ఘట్టం. ఎందుకంటే కష్ట భరితమైన పోరాట రూపాన్ని ఎంచుకున్న మీరు భారతదేశ చరిత్రలో, దక్షిణ భారతదేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా చేశారు. మన భారతదేశానికి సంపూర్ణమైన స్వాతంత్రం రావాలని పోరాడిన భగత్‌సింగ్ వర్ధంతి రోజున సభ జరుపు కుంటున్నాము. అఖిల భారత కిసాన్ సంఘర్షణ సమితి భగత్సింగ్ వర్ధంతి సందర్భంగా మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలనే నినాదాన్ని, పిలుపును ఇచ్చింది. బ్రిటీష్ కాలం నుంచి పాలకులందరూ అమలు చేసిన విధానాల ఫలితంగానే వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. ఫలితంగా రైతాంగం వ్యవసాయ కూలీలుగా, వలస కూలీలుగా మారి చివరకు ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారు. బహుళజాతి కంపెనీలు మనదేశంలో ఉన్న అపారమైన సంపదల్ని తరలించుకు పోయాయి. అందుకోసమే రకరకాల చట్టాలు చేస్తున్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్ముతున్నారు. ప్రభుత్వ కంపెనీలను, సంస్థలను అమ్మేస్తున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంఘటితంగా నిలబడి, కలబడితేనే ఈ పరిస్థితి నుంచి బయట పడతామని, సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రముఖకన్నడ, తెలుగు అనువాదకులు, రచయిత సి.రఘునాథ మాట్లాడుతూ "కాలినడక రైతులందరి నడక. రైతుల ఆకలికి ఎవరూ స్పాన్సరర్లు ఉండరు. మా నడకను మేమే నిర్వహించుకున్నాం. ఇంటింటి నుంచి బియ్యం, పప్పులు, కొందరు దాతల నుంచి నూనె సేకరించుకుని అతి తక్కువ వనరులతో, తక్కువ డబ్బుతో మేం 19 రోజులు పాదయాత్ర సాగించగలిగామని ప్రకటించారు. 'ఈ భూమి మనది. ఈ వ్యవసాయం మనది. మాభూమి తల్లిని ఎవడికో కాంట్రాక్టుకు మేము ఇవ్వము' అని శపథం చేపట్టడానికి మనం ఈ కాలినడక ముగింపు సభలో కూర్చున్నాం" అన్నారు.

అడ్వకేట్, చాగనూరు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ – రైతు వ్యతిరేక చట్టాల గురించి ముందు మనం తెలుసుకోవాలి. అందులో స్పాన్సర్స్ అన్న పదం ఉంది. ఇప్పుడు రైతులకు బ్యాంకులు అప్పులు ఇస్తున్నాయి. అవి ఇక ఇవ్వవు. ఈ స్పాన్సరర్స్‌కి లక్షల కోట్లు బ్యాంకులిస్తే రేపు రాబోయే స్పాన్సరర్లు అనే చిన్న జమీందార్లు మనకు అప్పులిస్తారు. జాగ్రత్తగా ఈ చట్టాల్ని అర్థం చేసుకొని, అవి రద్దయ్యేంత వరకు పోరాడాలని మనం ప్రజల్లోకి వెళ్లి ఈ కాలినడకలో గ్రామ గ్రామాన వివరించామన్నారు.

కెఆర్‌ఆర్ఎస్ స్టేట్ ప్రెసిడెంట్, జి. జె. హళ్లి నారాయణస్వామి మాట్లాడుతూ – ఈ భూమి ఎవరిది? ఈ నీరు ఎవరిది? ఈ విద్యుత్ ఎవరిది? ఇవన్నీ మనవే. ఈ చట్టాలు చేసి ప్రజలకు ఇవేవీ సొంతం కానివ్వకుండా చేయ జూస్తున్నారు. ఆనాడు కార్గిల్ కంపెనీలు వచ్చినప్పుడే మనం రైతునాయకుడు ప్రో. నంజుండ స్వామి నాయకత్వంలో వ్యతిరేకించాం. మనం పండించే పంటలకు కనీస మద్దతు ధర లభించే వరకు మన పోరాటం ఆగదని ప్రకటించారు.

కెఆర్‌ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.మాధవరెడ్డి మాట్లాడుతూ కాలినడకలో పాల్గొన్న మా అందరికీ ఒక గొప్ప పోరాట అనుభవం వచ్చింది. ప్రజల మధ్యకు, వివిధ గ్రామాల రైతుల మధ్యకు మేము వెళ్ళగలిగాము, అనేక సమస్యలు వాళ్ళు మాకు చెప్పారు. ఇప్పటికే ఢిల్లీలో 300 మందికి పైగారైతులు ప్రాణాలు వదిలారు. ఈ రైతాంగ పోరాటం గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలకనుకూలంగా నిలిచారు. మేం ప్రతిఘటిస్తూ ఈ కాలినడక చేపట్టాము. ఈ కాలినడకకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ ముగించారు.

ఈ సభలో ఏఐకెఎమ్‌కెఎస్ మహారాష్ట్ర నాయకులు కా॥ బాబూరావ్, తమిళనాడు నాయకులు కా॥ గుణాలన్, గుల్బర్గ మాజీ ఎమ్మెల్యే బి.ఆర్. పాటిల్, రచయిత బి. సూర్యసాగర్, విఠల్, కాళిదాసు, లేపాక్షి, ఉల్లిగయ్య తదితర నాయకులు మాట్లాడారు. పాదయాత్రలో చివరివరకు విడవకుండా పాల్గొన్న 7 మంది మహిళలను వేదికపైన అభినందించారు. కర్నాటక రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ప్రతినిధులుగా వచ్చిన రైతులంతా సభలో ఈ చట్టాలు రద్దయ్యే వరకు పోరాడతామని ప్రతినపూనారు.

# సంయుక్త కిసాన్ మోర్చా తీర్మానం

## 2021 ఆగస్టు 26, 27 తేదీలు

**కార్పొరేట్** అనుకూల మూడు వ్యవసాయ చట్టాలను, నూతన విద్యుత్తు బిల్లు – 2020ను, నేషనల్ క్యాపిటల్ రీజియన్, నైబరింగ్ ఏరియాస్ యాక్టుపై AQ – అట్మాస్ఫియర్ క్వాలిటి (వాతావరణ నాణ్యత) కమిషన్‌లను జాతీయ సదస్సు చర్చించింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరకు అన్ని వ్యవసాయ పంటలను సేకరించేందుకు చట్టపరమైన హక్కులను రైతులకు కల్పించటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని పరిగణలోకి తీసుకున్నది. అలాగే రైతులు, వ్యవసాయ కార్మికులు ఇతర సెక్షన్ల శ్రామిక ప్రజానీకంలో నిలకడగా, హెచ్చుస్థాయిలో ఆగ్రహం పెరుగుతూండటాన్ని పరిగణలోకి తీసుకొని దేశవ్యాపితంగా రైతాంగ ఉద్యమాన్ని విస్తృతం చేయాలని, 2021 సెప్టెంబర్ 27న రైతులు, కార్మికులు, శ్రామిక ప్రజానీకమంతా ఒక్కరోజు దేశవ్యాపిత బంద్ పాటించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది.

అలాగే సెప్టెంబర్ 5న ముజఫర్‌నగర్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహించతలపెట్టిన భారీ ప్రదర్శనను గతంలో అన్నిటికంటే ఘనంగా విజయవంతం చేయాలని, 'మిషన్ యుపి, ఉత్తరాఖండ్' చేపట్టి ఉద్యమాన్ని గ్రామాలలో మూలాలలోకి తీసుకువెళ్ళటానికి అన్ని ప్రయత్నాలు చేయాలని ఈ సదస్సు రైతులకు, రైతులకు మద్దతుగా నిలుస్తున్న సంస్థలన్నింటికీ పిలుపునిచ్చింది.

అన్ని రాష్ట్రాలలోనూ, జిల్లాలలోనూ సంయుక్త కిసాన్ మోర్చా విభాగాలను ఏర్పరచి, కలిసివచ్చే సంస్థలన్నింటినీ కలుపుకొని రాష్ట్ర, జిల్లాస్థాయి సదస్సులు, ప్రదర్శనలు, టోల్‌ప్లాజాల వద్ద పన్ను చెల్లించకుండా నిరసనలు; భారత రైతాంగ దేశభక్తియుత డిమాండ్లను ఆమోదించకుండా వ్యతిరేకిస్తున్న బిజెపి, ఎన్‌డిఏ కూటమికి చెందిన ఎంపీలు, ఎంఎల్ఏలకు వ్యతిరేకంగా నిరసనలు మొదలైన కార్యక్రమాలను ప్రారంభించవలసిందిగా రైతాంగానికంతటికీ ఈ సదస్సు పిలుపునిచ్చింది.

కాంట్రాక్టు వ్యవసాయ చట్టం – బడా కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీలు కేవలం వ్యాపార విలువ కలిగిన పంటలు పండించేందుకు భారత రైతాంగంచే దుర్మార్గమైన అసమాన ఒప్పందాలపై బలవంతంగా సంతకం చేయించటానికి భారత ప్రభుత్వానికి వీలు కల్పిస్తుందని ఈ సదస్సు అభిప్రాయపడుతోంది. అలాగే ఆహారపంటలు పండించుకునే రైతాంగ స్వేచ్ఛను కోల్పోవలసి వస్తుందని; ఒప్పందం చేసుకున్న కంపెనీలు అమ్మే ఖరీదైన ఉత్పాదకాలను, యాంత్రీకరించిన వ్యవసాయ సేవలను అధిక ధరలకు కొనుగోలు చేయవలసి వస్తుందని; ఉత్పాదకాలకు డబ్బు చెల్లించటానికి రుణసంస్థలతో విడి ఒప్పందాలు చేయించి రైతుల భూములను, ఇతర ఆస్తులను తాకట్టు పెట్టవలసి వస్తుందని; పంట చేతికొచ్చాక నాణ్యతను నిర్ధారించి పంటకు చెల్లించే ధరలతో రైతాంగం తీవ్ర నష్టాలపాలవుతారని; ఒప్పంద షరతుల అమలును పర్యవేక్షించేందుకు ఈ ఒప్పందంలోని షరతుల ప్రకారం మధ్య దళారీల శ్రేణి స్థిరీకరింపబడుతుందని; కంపెనీలకు కేటాయింపుల ప్రకారం జిల్లాలన్నింటిలోనూ లేదా కొన్ని భాగాలలోను పంటల నమూనాలను మార్చటం జరుగుతుందని ఈ సదస్సు అభిప్రాయపడింది.

మండీ లేదా వ్యవసాయ మార్కెట్ యార్డులను తప్పించే ఈ చట్టం, ప్రైవేట్ ఆహార కార్పొరేషన్లలోకి శక్తివంతమైన దళారీలను ప్రవేశ పెడుతుందని; వ్యవసాయ సహకార సొసైటీలు, వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఎలక్ట్రానిక్ వ్యాపార ప్లాట్‌ఫారమ్‌ల ఏర్పాటుకు, ఆన్‌లైన్ ధరలలో అత్యంత కనిష్ట ధరలకు పంటలను కొనుగోలు చేయటానికి అవకాశమిస్తుందని; ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం ఏవిధమైన కొనుగోలునూ ఇది అంగీకరించదని; ఆహార పంటలను ఈ కార్పొరేషన్లు స్వేచ్ఛగా సేకరించి, నిలవచేసు కోవటానికి అవకాశమిస్తుందని; వ్యాపారంలో ఈ 'ప్రత్యామ్నాయ' మార్గాలను ప్రభుత్వం ప్రోత్సహించటమంటే, ప్రభుత్వ మండీ లేదా ప్రభుత్వ మార్కెట్ యార్డులకు, వాటిల్లో మద్దతు ధరకు కొనుగోలు చేయటానికి ప్రభుత్వం అనుకూలంగా లేదని; ఈ ప్రైవేటు మార్కెట్ యార్డులు తమ చిత్తానుసారం పన్నులను విధించటంతోపాటుగా సరసమైన వ్యాపారానికి తామే విధానాలను, మార్గదర్శకాలను నిర్ణయిస్తాయని, వీరు రూపొందించిన విధివిధానాలే అన్ని చట్టపర వివాదాల పరిష్కారానికి ప్రాతిపదికగా వుంటాయని; ఈ విధంగా మార్కెట్ యార్డులపై, వ్యాపారంపై అదుపు ద్వారా కార్పొరేషన్లు వ్యవసాయ ఉత్పాదకాలకు అధిక ధరలను, పండిన పంటలకు తక్కువ ధరలను నిర్ణయిస్తాయని; తద్వారా పంట కొనుగోలు, నిల్వ, రవాణా, శుద్ధిచేయటం, శుద్ధిచేసిన ఆహార పదార్థాలను మార్కెట్‌లలో విక్రయించటం వరకు సాగే ఈ యావత్ ఆహార గొలుసు వ్యవస్థను కార్పొరేషన్లే అదుపు చేస్తాయని సదస్సు నిర్ధారించింది.

నిత్యావసర సరుకుల చట్టంలో అత్యవసర వస్తువుల జాబితా నుండి ఆహారాన్ని తొలగించటం పట్ల; తృణధాన్యాలు, పప్పుదినుసులు, నూనెగింజల ధరలను ప్రతి సంవత్సరం ఒకటిన్నర రెట్లు, కూరగాయల, పండ్ల ధరలను రెండు రెట్లు పెంపు చేయడానికి స్వేచ్ఛనివ్వటం పట్ల; ప్రపంచ వాణిజ్య సంస్థ షరతుల ప్రకారం ప్రభుత్వ సేకరణ, సరఫరా

ఆర్ఎస్ఎస్, బిజెపిలు, తీవ్రంగా రెచ్చగొట్టే చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆధార రహితమైన తప్పుడు ఆరోపణలకు పాల్పడు తున్నప్పటికీ, దేశభక్తియుత రైతాంగంపై క్రూరమైన చట్టాలతో, తప్పుడు పద్ధతుల్లో కేసులు మోపుతున్నప్పటికీ మేము – రైతాంగం, అత్యంత శాంతియుతంగానే నిరసనలు కొనసాగిస్తున్నాము. మతాలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరినీ ఈ చారిత్రక ఉద్యమం ఏకం చేసింది. ఈ ఉద్యమం – బడా కార్పొరేషన్ల దోపిడీకి వ్యతిరేకంగా అన్ని పీడిత సెక్షన్ల ప్రజలు విస్తృతంగా పాల్గొనేలా స్ఫూర్తి నింపింది.

లేకపోవటంతో ప్రభుత్వ పంపిణీవ్యవస్థ ఆగిపోవలసి రావటంపట్ల; బహుళజాతి, బడా భారత ఆహార కార్పొరేషన్లు అంతులేకుండా ఆహార నిల్వలు చేయటానికి, బ్లాక్ మార్కెట్‌లో ఆహారం విక్రయించటానికి ఈ చట్టం అనుమతించటం పట్ల – సదస్సు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

వ్యవసాయానికి, గ్రామీణ గృహావసరాలకు సబ్సిడీతో విద్యుత్ సరఫరా చేయటాన్ని నూతన విద్యుత్తు బిల్లు ఉపసంహరించుకోనుంది. విద్యుత్తు ఛార్జీలు రెట్టింపుకంటే అధికం అయ్యే ప్రమాదముంది. కుటీర పరిశ్రమలపై సైతం వాణిజ్య విద్యుత్తు ఛార్జీలు మోపటం జరుగుతుంది. జాతీయ సదస్సు ఈ బిల్లుపై చర్చించి ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దేశ రాజధాని పరిసర ప్రాంతాలలో వాతావరణ నాణ్యతపై నియమించిన కమిషన్ ప్రకారం కాలుష్యానికి కారకుల పేరున గడ్డి దుబ్బులు తగులబెట్టినా రాజధాని పరిసర ప్రాంతాలలో వాతావరణం కాలుష్యమైందంటూ రైతులను దోషులుగా న్యాయస్థానాల్లో విచారించటాన్ని, అధిక జరిమానాలు విధించటాన్ని, తీవ్రంగా వ్యతిరేకించింది; తిరస్కరించింది.

వ్యవసాయ పంటలన్నింటినీ 'సి2'కు 50 శాతం కలిపి కనీస మద్దతుధర చొప్పున అమ్మటానికి రైతులకు చట్టపరమైన గ్యారెంటీ కల్పించాలని; వ్యవసాయ ఉత్పాదకాల, వ్యవసాయ సేవల ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని, రైతుల ఉత్పాదక ఖర్చును పరిగణలోకి తీసుకొని పండించిన పంటకు ధరను నిర్ధారించాలని; వ్యవసాయ పంటలన్నింటికీ సి2'కు 50 శాతం కలిపి మద్దతు ధరగా ప్రకటించాలని, రైతులకు ఈ ధర లభించే విధంగా ప్రభుత్వం తన ఎగుమతి – దిగుమతి మరియు ఇతర విధానాలన్నింటినీ నియంత్రించాలని; నిర్ధారించిన ధర కంటే తక్కువకు అమ్మకం జరిగే పంటలన్నింటినీ సేకరించాలని సదస్సు డిమాండ్ చేసింది.

భారత రైతాంగం భారీ ప్రజాకదలికతో, ప్రజాస్వామ్య యుతంగా, శాంతియుతంగా ఉద్యమం నిర్మించి సమస్యకు కారణాన్ని ఎత్తిచూపి, పరిశీలించమని ప్రభుత్వాన్ని కోరినప్పటికీ, కార్పొరేట్ల లాభాలకు, వారి ప్రయోజనాలకు సేవజేసేందుకే కట్టుబడిన గుడ్డితనంతో, ప్రభుత్వం మొండిగా ఈ మూలాన్ని చూసేందుకు నిరాకరిస్తోందని ఈ సదస్సు పేర్కొంది.

ఈ చట్టాలలో మార్పులు చేయటానికి ప్రభుత్వం ముందుకు తెచ్చిన ప్రతిపాదనలన్నీ – వ్యవసాయ ఉత్పత్తులపై, ఆహార శుద్ధి క్రమాలపై, మార్కెట్లపై కార్పొరేట్లు ఆధిపత్యం చేస్తాయనే రైతాంగ భయాలకుగానీ; భూమిని, జీవనోపాధిని కోల్పోతామనే వారి ఆవేదనకుగానీ; అలాగే దేశ జీవావరణానికి, పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి జరిగే నష్టం గురించిగానీ; ఏమాత్రం ఉపశమనాన్ని, సమాధానాన్ని ఇవ్వటంలేదు.

ఆర్ఎస్ఎస్, బిజెపిలు, తీవ్రంగా రెచ్చగొట్టే చర్యలు చేపడు తున్నప్పటికీ, ప్రభుత్వం ఆధార రహితమైన తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్నప్పటికీ, దేశభక్తియుత రైతాంగంపై క్రూరమైన చట్టాలతో, తప్పుడు పద్ధతుల్లో కేసులు మోపుతున్నప్పటికీ మేము – రైతాంగం, అత్యంత శాంతియుతంగానే నిరసనలు కొనసాగిస్తున్నాము. మతాలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరినీ ఈ చారిత్రక ఉద్యమం ఏకం చేసింది. ఈ ఉద్యమం – బడా కార్పొరేషన్ల దోపిడీకి వ్యతిరేకంగా అన్ని పీడిత సెక్షన్ల ప్రజలు విస్తృతంగా పాల్గొనేలా స్ఫూర్తి నింపింది. ఈ కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం సాగించే ఫాశిస్టు దాడికి వ్యతిరేకంగా భారత ప్రజానీకం స్థిరంగా, ఐక్యంగా నిలవగలరనే నమ్మకాన్ని, స్ఫూర్తిని ఈ ఉద్యమం అందించింది.

ఈ పాఠాలన్నింటినీ తీసుకుంటూ, సెప్టెంబర్ 5న ముజఫర్‌నగర్‌లో జరిగే ప్రదర్శనను విజయవంతం చేసేందుకు; ఈ ఉద్యమం ఇచ్చిన మొదటి బంద్ పిలుపుకు సంవత్సరం అయిన సందర్భం, అలాగే ఢిల్లీ సరిహద్దులలో బైఠాయింపు ఉద్యమానికి 10 నెలలు నిండుతున్న ఈ సందర్భంలో **2021 సెప్టెంబర్ 27న అఖిలభారత బంద్**ను విజయవంతం చేయవలసిందిగా పిలుపునిస్తోంది.

**(2021 ఆగస్టు 26, 27 తేదీలలో
న్యూఢిల్లీ – సింఘు బార్డర్ వద్ద జరిగిన
సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సదస్సులో ఆమోదించినది)**

కా॥ కోటయ్య 2వ వర్ధంతి ( 1-12-2019) సందర్భంగా....

# 'తీవ్రమౌతున్న వ్యవసాయరంగ సంక్షోభం - మనముందున్న కర్తవ్యాల'పై రాష్ట్ర సదస్సు

## 2019 డిసెంబర్ 8




**పీడిత** ప్రజాఉద్యమనేత, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కొప్పుల కోటయ్య రెండవ వర్ధంతి సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ఆధ్వర్యంలో **'తీవ్రమౌతున్న వ్యవసాయరంగ సంక్షోభం-మనముందున్న కర్తవ్యాల'**పై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. డిసెంబర్ 8వ తేదీ ఉ॥11 గం॥కు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ప్రారంభమైన ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ అధ్యక్షత వహించారు.

కా॥ ఝాన్సీ అధ్యక్షోపన్యాసం చేస్తూ కా॥ కోటయ్య ఉద్యమ జీవిత విశేషాల్ని గుర్తుచేశారు. కా॥ కోటయ్యకు జోహార్లర్పిస్తూ, సదస్సుకు హాజరైన వారంతా రెండు నిముషాలు మౌనం పాటిస్తూ లేచి నిలబడ్డారు. అమరులను స్మరిస్తూ ప్రజాకళాకారులు పాటలు పాడారు.

సదస్సులో తొలుత **'జనశక్తి' సంపాదకులు డా॥ పి. జస్వంతరావు** ప్రసంగించారు. **(ఆయన ప్రసంగపాఠాన్ని విడిగా అందిస్తున్నాం.)**

వ్యవసాయరంగ సంక్షోభానికి పాలకులు అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాలే కారణమని ఒడిషా – సంబల్‌పూర్ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు **ప్రొఫెసర్ గోలక్ బీహారీనాథ్** వ్యాఖ్యానించారు. రాష్ట్రసదస్సులో ముఖ్యవక్తగా ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ బీహారీనాథ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ జిడిపి 4.5 శాతానికి ఘోరంగా పడిపోయిన పరిస్థితుల్లో; విద్య, వైద్యం, రైల్వే, బీమా, రక్షణ రంగాలన్నింటినీ ప్రైవేటీకరిస్తున్న నేపథ్యంలో; దళితులు, మైనారిటీలు, ఆదివాసీలపై హంతకదాడులు జరుగుతున్న కాలంలో; అర్బన్ మావోయిస్టుల పేరున ప్రజాస్వామికవాదుల గొంతు నులుముతున్న సందర్భంలో – చుట్టుముట్టిన తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నడుమ ఈ సదస్సు జరుకుంటున్నామని నేపథ్యాన్ని గుర్తుచేశారు. కొందరు ఆర్థికవేత్తలు చెబుతున్నట్లుగా ఈ ఆర్థిక మందగమనం చక్రభ్రమణ స్వభావం కలదికాదని, వ్యవసాయ పారిశ్రామికరంగాల ఘోర నిర్లక్ష్యం ఫలితంగానే ఈ సంక్షోభం ఏర్పడిందని ఆయన సోదాహరణంగా వివరించారు. దేశ అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక విధానాలను అనుసరించాలని; గ్రామీణ ప్రాంతంలో రైతులకు, వ్యవసాయ కూలీలకు భూమిపై హక్కు కల్పించాలన్నారు. ఈ వ్యవస్థను సమూలంగా మార్పుచేసుకునే దిశగా ఉద్యమాలను ఎక్కుపెట్టాలని ప్రొఫెసర్ బీహారీనాథ్ తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

**విశ్రాంత ఆచార్యులు ప్రొ॥ఎన్. వేణు గోపాలరావు** మాట్లాడుతూ రైతాంగం పండించిన పంటకు ఉత్పాదక ఖర్చు పెరిగిపోవటం, పంటకు గిట్టుబాటు ధర లేకపోవటం, సకాలంలో సరైన ధరకు రైతాంగం పండించిన పంటను కొనుగోలుచేయకపోవటం, సంస్థాగత రుణాలు లభించక ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడటం వంటి కారణాలన్నీ రైతాంగాన్ని పీకలలోతు సంక్షోభంలోకి నెడుతున్నాయన్నారు.

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర కార్యదర్శి కా॥ఎం.ఎస్.నాగరాజు** మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించే చర్యలు చేపట్టని పాలకులు, ప్రజల్ని మోసగించి తాత్కాలికంగా జోకొట్టే విధానాల్ని అనుసరిస్తున్నారన్నారు. 'రైతుభరోసా' పేరున కేంద్రం మరియు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు రైతులకు నేరుగా అందించే నగదు సహాయం వ్యవసాయ, రైతాంగ సంక్షోభ పరిష్కారానికి ఏవిధంగానూ తోడ్పడదన్నారు. పంట ఉత్పాదకాల ఖర్చులన్నీ తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

**సంఘం రాష్ట్రఅధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ** మాట్లాడుతూ వ్యవసాయరంగ సంక్షోభాన్ని కప్పిపుచ్చే మరో నాటకమే జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్ (జెడ్‌బిఎన్ఎఫ్) అని వివరించారు. పాలకుల మాయమాటలకు, మోసపు వాగ్దానాలకు, ప్రజాకర్షక చిట్కాలకు లోనుగాకుండా రైతాంగం, ప్రజానీకమంతా తమ సమస్యలకు గల అసలు కారణాన్ని గుర్తెరగాలన్నారు. మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో ప్రజలను చీల్చి, విద్వేషాలు రెచ్చగొట్టి, పాలకులు తమ పబ్బంగడుపుకుంటున్నారని సోదాహరణంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు జోడిస్తూ ఆమె వివరించారు. కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై సంఘటిత ఉద్యమ నిర్మాణానికి కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## ముగింపులో -

1. 2020 జనవరి 8న దేశవ్యాపితంగా 'గ్రామీణ భారత బంద్'లో సంఘం శ్రేణులంతా క్రియాశీలకంగా పాల్గొనాలని-

2. వ్యవసాయరంగ సంక్షోభాన్ని కప్పిపుచ్చే మరో నాటకమే జీరోబడ్జెట్ ప్రకృతి వ్యవసాయమని ప్రకటిస్తూ-

3. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య (ఆర్సెప్) వాణిజ్య ఒప్పందాల నుండి మనదేశం వెంటనే వైదొలగాలని డిమాండ్ చేస్తూ-

4. రైతాంగ వ్యతిరేకమైన నూతన విత్తన చట్ట ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ - సదస్సు తీర్మానాలను ఆమోదించింది. ప్రజాకళాకారుల పాటలు, బాలకళాకారుల నృత్యాలు సదస్సుకు హాజరైనవారిని ఆకట్టుకున్నాయి.




'రైతు పాదాల నుండి పాకి
చేతులపైకెక్కుతోంది
నూతన ప్రపంచం!
నేల అతడిది; ఈ లోక రచన అతడిది
సౌందర్యమతడిది;
పిడికెడు మట్టిలో
గరిసెడు గ్రామాలతడు
పట్టెడు సారంలో
పుట్టెడు పట్టణాలతడు
ప్రవాహం రైతు!
పట్టలేని సంతోషమంటే రైతు
వేడి వేడి పాలూ పాకాల కావ్యమతడు
నాగలి భుజానికెత్తుకొని నడుస్తున్న
భూగోళమతడు
నేలను ఆకాశానికెత్తి
బుగులుతున్న భూగోళం రైతు
ఆకర్షణల అద్భుతమతడు
వికర్షణల విస్ఫోటనమతడు
అమృత సారమూ అతడే
అగ్నిశిల్పమూ అతడే'

– ఛాయరాజ్

# 'దున్నేవానికే భూమి అత్యావశ్యకం'

- కా॥ పి. జశ్వంతరావు

***2019 డిసెంబర్ 8వ తేదీన విజయవాడలో కా॥ కోటయ్యగారి 2వ వర్ధంతి సందర్భంగా 'వ్యవసాయరంగ సంక్షోభం'పై జరిగిన సదస్సులో కా॥ జశ్వంతరావు చేసిన ఉపన్యాసం***

***అధ్యక్షా! కామ్రేడ్స్!***

వ్యవసాయరంగ సంక్షోభం దానికి చేయాల్సిన పరిష్కారాలు ఏమిటి అన్నది ఈ రోజు అంశం. వ్యవసాయ సంక్షోభానికి, ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి మధ్య సంబంధం డా॥ గోలక్ బిహారీనాథ్‌గారు వివరిస్తారు, కనుక నేను ఆ అంశంలోకి వెళ్ళబోవటంలేదు. గత రెండున్నర దశాబ్దాలకు పైగా వ్యవసాయ రంగంలో నెలకొని ఉన్న సంక్షోభానికి, తత్ఫలితంగా 4 లక్షలకుపైగా రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్న సందర్భంగా దీనికి కారణాలు ఏంటో, దీనికి పాలకులు చెబుతున్న పరిష్కార మార్గాలేమిటో, అవి ఏవిధంగా నిష్ఫలమవుతున్నాయో, సరైన పరిష్కారాలెలా వుంటాయో నేను కొద్దిగా వివరిస్తాను.

ఇటీవల ప్రధానమంత్రిగారు ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) అన్న దాంట్లో నుంచి మన దేశ రైతుల సంక్షేమం రీత్యా బైటకొచ్చేస్తున్నామని ప్రకటించాడు. దీన్ని పత్రికలన్నీ ఘనంగా స్వాగతించి పొగిడాయి. నిజంగానే రైతాంగం కోసం, రైతాంగం యొక్క సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధానమంత్రి ఈ పనిచేశారా అనేది మనం కొంచెం పరిశీలిద్దాం.

ఇది భారత పాలకవర్గాలు గత రెండున్నర దశాబ్దాలుగా ఆడుతున్న ఒక ప్రహసనాన్ని, వారి వర్గ స్వభావాన్ని బైటపెట్టే సంఘటన. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక సహకారం అన్న పేరిట 16 ఆసియా ప్రాంత దేశాల మధ్య ఒక స్వేచ్ఛా వాణిజ్య ఒడంబడిక జరగాలన్న ప్రతిపాదన మీద, గత 7 సంవత్సరాల నుంచి చర్చలు జరుగుతున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలో లేని అంశాలు కూడా, దానికంటే అధికమైన అంశాలు కూడా ఈ ఒప్పందంలో వున్నాయి. ఈ ఒప్పందం డబ్ల్యుటిఓలో లేని పెట్టుబడి మదుపు, మేధోపర హక్కులను కూడా దీనిలో చేర్చింది. దీని వల్ల జరగబోయే నష్టమేమిటంటే, ఈ 16 దేశాలలోని ఏ దేశం నుంచైనా ఒక పెట్టుబడిదారుడు వచ్చి భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడితే, అతన్ని భారతదేశపు పెట్టుబడిదారుడితో సమానంగా చూడాలి. ఇక్కడ భారత పెట్టుబడి దారుడికి ఎలాంటి హక్కులు వుంటాయో, అధికారాలు వుంటాయో, అవన్నీ వాళ్ళకు కూడా వర్తిస్తాయి అనేది ఒక కీలకమైన అంశం. అంటే ఇన్నాళ్ళూ భారతదేశపు చట్టాల ప్రకారం ఓ విదేశీ పెట్టుబడిదారుడు వచ్చి



భారతదేశంలో వ్యవసాయ భూమిని కొనుగోలు చేసుకోవటానికి వీలులేదు. అంటే రేప్రొద్దుట ఈ 16 దేశాలలోంచి ఏ పెట్టుబడి దారుడైనా ఈ దేశంలోకి వస్తే, అతనికి ఈ దేశంలో ఎలాంటి వ్యవసాయ భూమినైనా, ఎంతయినా గరిష్ట పరిమితి చట్టాలు లేకుండా కొనుగోలు చేసుకోవటానికి అతనిని అనుమతించటం. ప్రత్యేకంగా అనుమతించక్కర్లేదు, అనుమతి ఎక్కడ జరిగిపోయిందంటే భారతీయ పెట్టుబడిదారుడితో సమానంగా చూస్తాను అన్న దానివల్ల. ఇది కేవలం ఊహ కాదు. ఈ పదహారు దేశాలలో కొన్ని దేశాల మధ్య ఇప్పటికే స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు, ద్విపక్ష వాణిజ్య ఒప్పందాలు వున్నాయి. ఉదా॥ చైనాకి, న్యూజిలాండ్‌కి మధ్య వుంది. న్యూజిలాండ్‌లో 40,000 హెక్టార్ల వైశాల్యంలో డైరీఫారం నడుపుతున్న న్యూజిలాండ్ కంపెనీని, ఈ ఒప్పందం ప్రకారం చైనాకు చెందిన ఆలీబాబా అనే కంపెనీ వచ్చి కొన్నది. మొత్తం 40,000 హెక్టార్లని కొన్నది. డైరీఫారంని సొంతం చేసుకున్నది. అలాగే ఈ దేశానికి ఇండోనేషియాలో, లేదా సింగపూరులో వున్న కంపెనీలు ఒక్క థాయిలాండ్‌లోని 4 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిని రైతాంగం నుంచి కొనుగోలు చేసుకున్నాయి. ఇది మొట్టమొదటి సమస్య, ఈ ఒప్పందానికి ప్రధానమంత్రిగారు కానీ, భారత ప్రభుత్వం కానీ, ఇక్కడ నుంచి వెళ్ళిన పియూష్ గోయల్ కాని, భారత ప్రతినిధివర్గం కాని అభ్యంతరం చెప్పకపోగా, మాకు ఇది ఆమోదయోగ్యం అని చెప్పి వచ్చారు. అంటే ఇక్కడ రైతు సంక్షేమం ముఖ్యం కాదు, రైతులను ఆర్థిక మీటలతోటి భూమి నుంచి తొలగించటానికి వీరికి అభ్యంతరం లేదని ఒప్పుకొని వచ్చారు.

ఇక మేధోపరమైన హక్కుల విషయానికి వస్తే వ్యవసాయ రంగానికి సంబంధించి విత్తన చట్టం గురించి వివరంగా మాట్లాడతాను. విత్తన చట్టం ప్రకారం వాళ్ళకి ఏర్పడ్డ హక్కులన్నింటిని వీళ్ళు గుర్తిస్తారు.

అంటే రేప్రొద్దుట ఈ మల్టీనేషనల్ కంపెనీలు దేశంలోకి వస్తే, ఈ దేశపు రైతాంగం నుండి భూమిని తీసుకోవటమే కాకుండా ఈ రైతులకి ఏఏ విత్తనాలు వేయాలో, వాటి మీద వాటికి కావలసిన రాయల్టీలు అన్నీ చెల్లించటానికి ఒప్పుకుంటారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలకన్నా మరింత ఎక్కువ నష్టదాయకమైన ఆర్‌సిఇపి ఒప్పందాలను భారత ప్రభుత్వం అంగీకరించి సంతకం పెట్టటానికి సిద్ధపడింది. అయితే దేని మీద భారత ప్రభుత్వం అంగీకారం లేదని చెప్పింది? మేమడిగిన రాయితీలు యిస్తే ఇప్పటికయినా చేరటానికి సిద్ధమేనంటే ఏమిటి ఆయన అడిగిన రాయితీలు? ఒకవేళ మా రైతుల ధరల కంటే తక్కువ ధరలకి విదేశాల నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు దిగుమతి అవుతుంటే వాటి మీద సుంకం విధించుకునే హక్కు మాకుండాలి. మీరు జీరో సుంకం అని ఒప్పందంలో పెట్టారు. నా ఉత్పత్తుల మీద చైనా సుంకం వెయ్యటానికి లేదు, చైనా ఉత్పత్తుల మీద నేను సుంకం వెయ్యటానికి లేదు, అంతా జీరో పన్ను రేటే వుండాలి అన్నారు. ఇది ఒక్కోసారి మాకు నష్టదాయకం అవుతుంది, మేమెంతయినా పన్ను వేసుకోవటానికి అవకాశం వుండే విధంగా, మా రైతుతో సమానంగా ధర వుండే విధంగా మీరు ఒప్పుకోవాలని అడిగారు. వాస్తవమే అవతల ప్రక్కనుంచి తక్కువ ధరకు మనదేశంలో కుమ్మరిస్తే భారతదేశానికి, భారత రైతాంగానికి నష్టం జరుగుతుంది. దీనికి సంబంధించిన అనుభవం కూడా మన ముందు వుంది. ఈ దేశంలో పెట్రోలు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి తరువాత, వంటనూనెల దిగుమతే రెండవ అగ్రస్థానంలో వుంది. అత్యంత ఎక్కువగా దిగుమతి అయ్యేది పామాయిలు, విలువ రీత్యా, క్వాలిటీ రీత్యా కూడా. ఒక సమయంలో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా వుండగా అనుకుంటాను ఆయిల్ మిల్స్ టెక్నాలజీ మిషన్స్ అని పెట్టి, ప్రత్యేకంగా దేశంలో వంటనూనెల దిగుబడి పెంచే ప్రయత్నాలు చేస్తే బాగుంటుందని ప్రభుత్వం ఆయిల్ మిషన్స్ వర్కింగ్ కమిటీని ప్రవేశపెట్టింది. దీని ఫలితంగా ఒక ఐదేళ్ళలో దేశం ఒక లీటరు కూడా విదేశాల నుంచి వంటనూనెలు దిగుమతి చేసుకునే అవసరం లేకుండా, ఈ దేశంలో వేరుశనగ, మస్టర్డ్ ఆయిల్‌లాంటి ఉత్పత్తులన్నీ విపరీతంగా పెరిగి, దేశం స్వయం సమృద్ధిని సాధించింది. ఇదీ ప్రభుత్వం చేయాల్సింది. మనకి తెలుసు, రైతాంగానికి సంక్షేమాన్ని కలిగించాలనుకుంటే, రైతాంగాన్నించి ఉత్పత్తులు పెంచి వారి ఆదాయాన్ని పెంచదలచుకుంటే, పైన చెప్పినట్లు మధ్యలో కూడా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకొని వాటిని అభివృద్ధి చేయగలదు అని మనకి ఈ ఉదాహరణ తెలియజేస్తుంది.

అయితే జరిగిందేమిటి? బంగీ అమెరికా కంపెనీ, సింగపూర్‌లో ఉంది. ప్రపంచంలోనే పాయాయిల్ ఉత్పత్తిలో 80% ఈ బంగీ కంపెనీ చేతుల్లోనే ఉంది. ఈ బంగీ కంపెనీ నుంచి లీటరు పది రూపాయలకి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటే, డబ్ల్యు.టి.ఓ ఒప్పందం ప్రకారమే 60% దాని మీద పన్ను విధించగలిగే హక్కు మనకుండి కూడా, ఈనాటికీ 10%, 20% మాత్రమే పన్ను వేస్తున్నారు. దాని ఫలితంగా దేశంలో వంటనూనెల ఉత్పత్తి తగ్గిపోయి, ఈ రోజున మళ్ళీ 20 ఏళ్ళ క్రితం ఏ రకంగా పెట్రోలు తరువాత, వంటనూనెలు దిగుమతి చేసుకోవల్సిన స్థితి వచ్చిందో, ఆ స్థితి తిరిగి ఈ రోజున ఏర్పడింది. ఫలితం మనందరం చూశాం. ఒక్క కర్నూలు జిల్లాలోనే వేరుశనగ నుంచి నూనెతీసే కర్మాగారాలు, చిన్న కర్మాగారాలు 300 వరకు మూతబడ్డాయి. ఈ రోజుకింక తెరుచుకోనివెన్నో నాకు తెలియదు. అంటే ఎంత మంది ఉపాధిని కోల్పోయారన్నది మనకిది స్పష్టం చేస్తుంది. అయితే తనకి అధికారం వున్నప్పటికీ, తనకి డబ్ల్యు.టి.ఓ ఒప్పందం ప్రకారం హక్కు వున్నప్పటికీ, దానిమీద తగినంత పన్ను విధించకుండా, విదేశీ పెట్టుబడులకు లొంగిపోయి ఈ దేశంలో పాయాయిల్ ప్రవాహంలా ప్రవహించటానికి తోడ్పడిన భారత పాలకులు, రేపొద్దున 30%, 40% సుంకం వేసుకోవచ్చు అన్నా, వేసుకోగల శక్తి వీళ్ళకు వుందా అన్నది ప్రశ్న. ఇది ప్రజల ముందు నాటకం ఆడటానికి, ప్రజలను భ్రమలలో వుంచడానికి చేసిన ఒక చర్చ తప్ప, వాస్తవానికి ఆర్.సి.ఇ.పి. ఒప్పందంలో కీలకాంశాలు వేటికీ భారత పాలకులు వ్యతిరేకం కాదు. వాటిని అమలుజరపడానికి వచ్చే వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకునే, కాస్త ముందు వెనక అడుగులేస్తూ తాత్సారం చేస్తున్నారంతే. ఇంకా సంవత్సరం టైం ఉంది. చైనా అయితే మీరడిగిన కన్సెషన్స్ యిస్తాము. మాట్లాడుకుందాం అంటోంది. ఫైనల్ సంతకాలు జరగటానికి ఇంకా సంవత్సరం టైం ఉంది.

ఈ మొత్తంలో మనకి కనిపిస్తున్న అంశం ఏమిటంటే, ఒకటి భారత ప్రభుత్వం మన ప్రధాని మోడీగారు ప్రకటించిన విధంగా మన రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చెయ్యాలి అనుకుంటే, ఈ వ్యవస్థ పరిధిలో కూడా వ్యవసాయరంగంలో కొన్ని చర్యలు తీసుకోవటం ద్వారా రైతాంగపు ఆదాయాన్ని పెంచగలదు. ఆరేళ్ళ పాలనలో 5 ఏళ్ళు అయిపోయింది. మళ్ళీ అధికారంలోకి వచ్చాడు. ఆయన చెప్పినట్టు రెట్టింపు కాలేదు కానీ, రైతాంగ ఆదాయం పెరిగింది, ద్రవ్యోల్బణం వల్ల. ఇటీవలే చేసిన అధికారిక సర్వే పేర్కొన్నదేమిటంటే ఎకనామిక్ టైమ్స్‌లో వచ్చింది. రైతాంగానికి ఆదాయం 10% పెరిగితే దానికయిన ఖర్చులు 110% పెరిగాయని ఆ సర్వే పేర్కొంది. అది అధికారిక సర్వేనే. అంటే, రైతాంగానికి ఆదాయం డబ్బు రూపంలో పెరిగింది. పెరగలేదని నేను అనను, ఇది వరకు అంటే 5 ఏళ్ళ క్రితం అమ్మిన ధాన్యం రేటు కంటే ఇవ్వాళ ఎక్కువ రేటుకు రైతు ధాన్యం అమ్ముతున్నాడు, కానీ ఆ ధాన్యం పండించటానికి అతను పెడుతున్న ఖర్చు అంతకు 10 రెట్లు పైన పెరిగింది అనేది దృష్టిలో పెట్టుకుంటే జరుగుతున్న మోసం ఎక్కడ వుందో అర్థమవుతుంది.

సరే ఇప్పుడు ఇంకొక ఉచ్చులోకి వస్తాను, సంక్షోభం వుందని పాలకవర్గాలకు తెలుసు. ఎందుకంటే అది వాళ్ళు సృష్టించిన సంక్షోభం. ఆ సంక్షోభానికి వాళ్ళనుకుంటున్న పరిష్కారాన్నే వాళ్ళు చూపిస్తున్నారు. అదే రైతాంగానికి సంక్షేమంగా చిత్రీకరిస్తున్నారు. ఇది మనం దృష్టిలో పెట్టుకోవలసిన అంశం. రెండ్రోజుల క్రితం పదిహేనో ఫైనాన్స్ కమిషన్ తన నివేదికను రాష్ట్రపతిగారికి సమర్పించింది. పూర్తి నివేదిక బైటకు రాలేదు, కానీ పత్రిక వార్తల ప్రకారం, ఇప్పటికే కేంద్ర నిధుల నుంచి 9 నుండి 12% వరకు రాష్ట్రాలకు అందజేస్తున్నారు. వితరణ చేస్తున్నారు. దీన్ని 25%కి పెంచాలని పదిహేనవ ఫైనాన్స్ కమిషన్ సూచించింది. ఈ అదనంగా ఇస్తున్న 9 నుంచి 12%ని ఎలా యివ్వాలి, ఎందుకు యివ్వాలి

అన్నదానికి కూడా ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేసింది. వ్యవసాయరంగంలో సంస్కరణలు అమలుజరుపుతున్న తీరు ఎంత వేగంగా, ఎంత చక్కగా అమలు జరుగుతుందన్న దాని మీద ఆధారపడి రాష్ట్రాలకు అధికంగా నిధులు యివ్వాలి. ఈ అదనపు నిధులు ఆయా రాష్ట్రాలకు కేటాయించాలి అని సూచించింది. తద్వారా వ్యవసాయరంగంలో సంక్షోభం పరిష్కారం జరుగుతుందని పేర్కొంది.

ఇక్కడ కీలకమైన అంశం సంస్కరణలు అన్నది. మనమేమి భ్రమపడనక్కర లేదు. నూతన ఆర్థిక విధానాల తర్వాత అన్ని పదాల అర్థాలు మారిపోయాయి. గతంలో చెడ్డను తొలగించి ఒక మంచిని తీసుకురావటాన్ని సంస్కరణ అని పిలిచేవాళ్ళం. ఇవాళ సంస్కరణ అంటే మార్పు అనే సామాన్య అర్థాన్నే భారత పాలకవర్గాలు యిస్తున్నాయి. ఈ సంస్కరణ ఏంటి? అగ్రికల్చరల్ ప్రొడ్యూసర్స్ మార్కెటింగ్ ఏజెన్సీ అంటే మన మార్కెట్ యార్డులు ఉండేవి. ఈ మార్కెట్ యార్డ్‌లకు ఒక చట్టం వుంది. ఆ చట్టాన్ని మార్పు చెయ్యాలి. ఆ చట్టాన్ని మార్పు చెయ్యటానికి కేంద్ర ప్రభుత్వం ఒక మోడల్ చట్టాన్ని తయారుచేసింది. ఆ మోడల్ చట్టం ప్రకారం వీటిని విడిచెయ్యాలి. ఇలా దీనిని సంస్కరణ అంటున్నారు. దీని ప్రకారం ఎవ్వరు బాగా చేస్తే వారికి ఇవ్వండి అని ఫైనాన్స్ కమిషన్ చెబుతోంది. ఈ మార్కెటింగ్ చట్టంలో వున్నదేమిటంటే, ఇవ్వాళ టుబాకో లేదా మిర్చి పంటలకు మార్కెట్ యార్డ్‌లు ఉన్నాయి. ఈ మార్కెట్ యార్డ్‌లు అన్నింటిని ప్రయివేటీకరిచటం, వాటిని ఎక్కడపడితే అక్కడ పెట్టుకోవటానికి ప్రయివేట్ కంపెనీలకి, ప్రయివేట్ వ్యాపారులకి అధికారాలు యివ్వటం అనేది దీని లక్ష్యం. దీనిని ఎంత బాగా అమలు జరిపారు అన్నదాని మీద ఆధారపడి నిధులిస్తారు.

రెండో అంశం వ్యవసాయరంగ సంస్కరణల కింద వారు చెబుతున్నది కాంట్రాక్ట్ వ్యవసాయానికి సంబంధించి. కేంద్ర ప్రభుత్వం దీనికి ఒక మోడల్ చట్టాన్ని చేసింది. ఈ మోడల్ చట్టాన్ని రాష్ట్రంలో చట్టంగా చేసి ఎంత బాగా అమలు జరిపితే అంత ఎక్కువగా నిధులు వాళ్ళకి ఇవ్వాలి. అంటే వ్యవసాయరంగానికి వీళ్ళు చెబుతున్న పరిష్కారం, ఫైనాన్స్ కమిషన్‌తో సహా భారత పాలకులు చెపుతున్న పరిష్కారం, మొదటిది కాంట్రాక్ట్ వ్యవసాయం తీసుకు రావటం, రెండోది అగ్రికల్చర్ మార్కెటింగ్ సొసైటిలను తొలగించటం, వాటి స్థానంలో ప్రైవేటు మార్కెటింగ్ వ్యవస్థలను ప్రవేశపెట్టడం. దానికనుగుణంగా దానిలోని మిగతా సంస్కరణలు, ఏంటంటే ప్రతి గ్రామాన్ని రోడ్లతో ఆల్‌టైం రోడ్లతోటి, బ్లాక్‌టాప్ రోడ్లతోటి అనుసంధానం చేయటం, ప్రతి మండల కేంద్రంలోను శీతల గిడ్డంగులు పెట్టడం ఇలాంటివి చేస్తారు. ఈ చట్టాల పరిధి ఎంతవరకు అంటే మనకందరికి తెలుసు, కాంట్రాక్టు వ్యవసాయం ఏ విధంగా రైతాంగాన్ని భూమి నుంచి తొలగించి వారి భూమిమీద వారిని కూలీలను చేస్తుందో, కంపెనీల వ్యవసాయం ఎలా ముందుకు వస్తుందో మనకు తెలుసు. కనుక ఫైనాన్స్ కమిషన్ చేస్తున్న సూచన ప్రధానంగా ఈ అంశం మీదే. వ్యవసాయ రంగానికి సంబంధించి వీళ్ళు చేస్తున్న సూచనలన్నీ ప్రధానంగా వ్యవసాయరంగంలోనికి విదేశీ పెట్టుబడి ఎంత లోతుగా రావాలి అనేదే. విదేశీ పెట్టుబడి

**పాలకులు పెట్టుబడిదారీ విధానంలోకి ఒక క్రమ పరివర్తన చేయటానికి పూనుకున్నారు. ఆ క్రమ పరివర్తన ఫలితం అత్యంత దుర్భరంగా ఉంటుంది. లక్షలాది రైతాంగాన్ని కష్టాల భరితమైన జీవితంలోకి నెడుతుంది. అత్యంత నెమ్మదిగా సాగే ఈ విధానాన్ని మనం వ్యతిరేకించాలి. రైతాంగం యొక్క చొరవని బయటకు తీసుకువచ్చి, విప్లవాత్మకంగా భూపంపకం జరిగే విధంగా చూస్తేనే దేశానికి మేలు జరుగుతుంది.**

ఈ దేశంలోనికి ప్రవేశించడానికి అనువుగా వాళ్ళకి అవసరమైన అన్ని రకాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను క్రియేట్ చేస్తూ ఇది రైతాంగం మేలు కోసం చేస్తున్నాము అని పేర్కొంటున్న అంశం ఇక్కడ వుంది. ఇది ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నప్పుడు, ఈ పరిష్కారమార్గాలు ఇలా ఉంటాయి అనే అంశాన్ని దూరదృష్టితో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఒకటి వ్యవసాయరంగం సంక్షోభంలో ఉన్నది. మొత్తంగా రైతాంగం అప్పుల పాలవటం వలన ఆ అప్పుల నుంచి తొలగించ టానికంటూ కేంద్రప్రభుత్వంతో మొదలెట్టి రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ పార్టీలు అప్పుల రద్దుని ప్రబోధిస్తున్నాయి. ఈ అప్పుల రద్దు ఏ విధంగాను రైతాంగాన్ని తిరిగి అప్పుల ఊబిలోంచి బయటపడవేయ లేదని గత 20 సంవత్సరాల అనుభవం మనకు తెలియజేస్తోంది. ఇది వాళ్ళు చెపుతున్న ఒక పరిష్కారమార్గం. రెండోది వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ విధానంగా మార్చాలనే ఒక అంశంలో, వాళ్ళు విదేశీ పెట్టుబడి మీద ఆధారపడటం ద్వారా దేశీయంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం కంటే, వ్యవసాయంలో వస్తున్న అదనపు సంపదని, వ్యవసాయరంగంలో సృష్టింపబడుతున్న సంపదని విదేశీపెట్టుబడి తరలించుకుపోవటానికి వీలుగా చేస్తున్న అంశం ఇది. కనుక వ్యవసాయంలో వచ్చిన సంపద, వ్యవసాయాభివృద్ధికి తిరిగి పెట్టుబడి పెట్టడానికి ఏవిధంగాను తోడ్పడదు. ఆ విధంగా వ్యవసాయ సంపదని, తిరిగి వ్యవసాయాభివృద్ధికి పెట్టుబడి పెట్టలేని స్థితి ఏర్పడినప్పుడు వ్యవసాయం కునారిల్లిపోతుంది. వ్యక్తికి వస్తున్న సమస్య కంటే వ్యవసాయం కునారిల్లిపోవటం ఇక్కడ గమనించాల్సిన విషయం.

వ్యవసాయాభివృద్ధికి కీలకమైన అంశం నీటిపారుదల. ఈ నీటిపారుదలకి మొదటి పంచవర్ష ప్రణాళికలో అత్యధికంగా ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం, ఈ రోజు నీటిపారుదలకి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకుండా, ఇది చాలు ఇప్పటివరకు ఇచ్చిన నీటిపారుదల చాలు ఇంతకు మించి మనం ఏమీ చెయ్యక్కర్లేదు అన్న వైఖరిని

తీసుకున్నదని మనకు తెలుసు. వ్యవసాయరంగంలో ప్రభుత్వరంగ పెట్టుబడి ఏ విధంగా కునారిల్లిపోతుందో మనందరికి తెలిసిందే. బి.జె.పి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఈ రోజు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకి ప్రభుత్వం వ్యవసాయరంగంలో పెట్టుబడి మదుపు పెట్టకపోవటం ఏమిటని కాంగ్రెసు ప్రభుత్వాన్ని విమర్శించింది. వీళ్ళు అధికారంలోకి వచ్చిన తర్వాత చేసినదేమీ లేదు, ఈ రోజుకీ అదే పరిస్థితి ఉంది. మన కళ్ళముందు కె.సి.ఆర్ లాంటివాళ్ళు తెలంగాణాలో ప్రతి ఎకరానికి నీళ్ళు ఇస్తానని అనవచ్చుకానీ అది ఏ రోజుకీ, ఈ రోజుకీ శ్రద్ధగా పూర్తి అయినది లేదు. 5 ఏళ్ళ పాలన పూర్తి అయ్యింది. ప్రాజెక్టులను ఓపెన్ చేశాడు. లిఫ్ట్ ఇరిగేషన్ పంపులు బయటకు వచ్చినవి అంటున్నాడు. వాళ్ళు తవ్విపెట్టిన కాలవలోనికి నీళ్ళు వచ్చినవి, వాళ్ళు తవ్విన దానివల్ల వచ్చినవి కానీ వాస్తవానికి సెంటు భూమికి చుక్కనీరు ఈ రోజుకీ అందలేదు. ఇది వాస్తవం. అయితే రైతాంగం కొంత సంతోషంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతాంగం కె.సి.ఆర్ మంచాడండీ అని అంటున్నారు, ఎందుకంటే ఈ నీళ్ళు కాల్వల్లో నిలబడ్డాయి. వాన నీళ్ళు కాలవలో నిలబడ్డాయి, కొన్ని చెరువులు తవ్వారు నీళ్ళు నిలబడ్డాయి. ఈ రోజు 1,000 అడుగులు లోతుకు పోయిన భూగర్భ జలాలు వంద అడుగుల లోతుకు వచ్చిన ప్రాంతాలు 10, 15 మండలాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో, ఆ రైతాంగానికి ఆయన నీళ్ళు ఎప్పటికైనా యివ్వనీయండి, ప్రస్తుతం మా భూగర్భజలాలు నిండినవి, వ్యవసాయం చేసుకో గలుగుతున్నాం అనే తృప్తి ఉంది. ఈరకపు ప్రదర్శనాత్మక చర్యలతోటి లక్షల కోట్లు ఖర్చుపెడుతున్నామని చూపిస్తున్నారే తప్ప రైతాంగానికి నిజంగా మేలు చేకూర్చగల స్థితి లేదు. ఒకప్పుడు నాగార్జునసాగర్ డాం కట్టడానికి 20 సంవత్సరాలు పట్టింది. ఇంకా రెండోదశ పూర్తికాలేదు. కానీ ఈరోజు వచ్చిన ఆధునిక యంత్రాలతోటి మూడు ఏళ్ళలో ఖచ్చితంగా మొత్తం ఒక నాగార్జునసాగర్ లాంటి పెద్ద ప్రాజెక్టు కానీ లేదా పోలవరం ప్రాజెక్టులాంటి దాన్ని పూర్తి చెయ్యవచ్చు. కానీ ఈ రోజుకీ ఆ పని చెయ్యని స్థితి ఉంది. అంటే వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి లేకుండా చేసి అది కునారిల్లిన తర్వాత దానిలో ప్రైవేటు పెట్టుబడిని, ప్రధానంగా విదేశీ పెట్టుబడిని తీసుకురావటం అన్నది వీరి లక్ష్యంగా ఉంది.

ఇక రెండోది, ఇందాక చెప్పిన విత్తన చట్టాన్ని గురించి ఆర్.సి.ఇ.పి ఒప్పందంలోను, మిగతా వాటిల్లోను కూడా విత్తన (ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్) మేధోపర హక్కులు, వాణిజ్య హక్కుల గురించి చెప్పాం. ఈ పరిస్థితే వస్తే దేశంలో మొత్తం వ్యవసాయ రంగం ఒకరకంగా వ్యవసాయరంగంలో వున్న బహుళజాతి కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోతుంది. 2019 వ్యవసాయ విత్తన చట్టాన్ని తీసుకువచ్చారు. ఇది వాస్తవంగా 2014లో చేశారు. పార్లమెంటులో చర్చ జరిగి దీనిని సెలక్ట్ కమీటికి పంపించారు. సెలక్ట్ కమీటి సూచనలతో బయటకు వచ్చింది. దీంట్లో వున్న ప్రమాదకరమైన అంశాలేమిటో చూడాలి. అంతకుముందు రైతాంగం అంటే ఈ చట్టంలో ఒక నిర్వచనం వున్నది. ఆ నిర్వచనం ఏమిటంటే వ్యవసాయ రంగంలో భూమి కలిగి ఉండి, పంట సాగుచేస్తున్న వాళ్ళందరిని వ్యవసాయదారులుగా, రైతులుగా గుర్తిస్తాము. అది కౌలుభూమి అయినా వ్యవసాయదారులుగా గుర్తిస్తాము, గుర్తించాలి అన్నది అంతకుముందున్న చట్టం. దాంట్లోనే సబ్‌క్లాజ్‌లో వ్యవసాయరంగానికి అవసరమైన రసాయనాలు చేసే కంపెనీలు కాని, వ్యవసాయరంగానికి అవసరమైన ఇతరములు తయారుచేసే పరిశ్రమలు కానీ, కంపెనీలు కానీ వ్యవసాయదారులు కాబోవు అనేది వుంది. అంటే ఎవరు వ్యవసాయదారులు కారో అక్కడ నిర్వచించారు. కొత్త చట్టంలోని నిబంధనల్లో ఇవన్నీ తీసేసి రైతు అంటే సాగు కార్యక్రమంలో నిమగ్నమైనవాళ్ళు రైతులు అని ఒక నిర్వచనం ఇచ్చారు. అంటే విదేశీ కంపెనీలు కూడా రైతులుగా గుర్తించబడతాయి. ఇది రెండో ప్రమాదకరమైన అంశం. విత్తనచట్టంలోని ప్రమాదకరమైన అంశం. రేప్రొద్దుట వాళ్ళు రైతులుగా గుర్తించబడతారు. విదేశీ కంపెనీకి ఇక్కడ రైతు హోదా ఇచ్చాక, అదే చట్టంలో ఒక విత్తనాన్ని అభివృద్ధి చేయటానికి, మార్కెట్‌లో కొన్న తన విత్తనాన్ని తిరిగి నాటుకోవటానికి, వాటిని అమ్ముకోవడానికి, వాటిని విస్తరింపచేయటానికి రైతులకి హక్కు కలిగి ఉంటుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఏ చట్టమున్నా అది పనికిరాదు అని పెట్టారు. మోసం ఎంత చక్కగా ఉంటుందో మీరు గమనించండి.

రైతాంగానికి హక్కులు ఇచ్చాను అని చెపుతున్నారు. ఇప్పుడు కొత్తచట్టం ప్రకారం, ఒక పక్క మల్టీనేషనల్ కంపెనీ పెట్టుబడిదారుడు రైతు స్థాయిలో ఈ దేశంలో ఉండి, ఈ దేశంలో భూమి కొనుగోలు చేసుకోవటానికి అనుమతించబడి, ఈ దేశంలో సాగుదారుగా గుర్తించబడిన తర్వాత, రెండు ఎకరాలు కలిగి, 86% కమతాలలో ఉన్న చిన్న రైతులు ఈ కంపెనీతో పోటీపడాలి. హక్కు వాళ్ళకి కల్పించలేదు వాస్తవానికి, హక్కు విదేశీ కంపెనీలకు కల్పించారు. ఈ దేశంలో తాము విత్తనాల్ని అమ్ముకోవటానికి విత్తనచట్టంలో ఈ హక్కుల్ని కల్పించారు. తిరగేసి చూస్తే మనకు కనబడేది ఇది. ఇది డెఫినిషన్‌లో జరిగిన అన్యాయం. నేను పెద్ద భూతంలా దీనిని చిత్రీకరిస్తున్నాని మీరు అనుకోవద్దు. 1990కి ముందు విదేశీ కంపెనీలు ఏవీ ఈ దేశ వ్యవసాయంలో ప్రవేశించడానికి వీలు లేదని నిబంధనలుండేవి. వీటిని మెల్లిగా, పూర్తిగా నూతన ఆర్థిక విధానాల క్రమంలో సడలించుకుంటూ వచ్చారు. కానీ 1990 నాటికే 34% వ్యవసాయరంగం విదేశీ పెట్టుబడి చేతుల్లో ఉంది. ప్రత్యేకించి విత్తనరంగం 34% వాళ్ళ కంట్రోల్‌లోకి వెళ్ళిపోయింది 90 నాటికే. ఈ రోజు ఎంత శాతం వుందో అంచనాలకి అందని స్థితి ఉంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తున్నప్పుడు నాలుగు కంపెనీలు డౌవ్ కానీ, క్యెమ్‌చినా గానీ, అలాగే మోన్‌సాంటో, మరొక కంపెనీ ఈ నాలుగు కంపెనీలు మొత్తం ప్రపంచ విత్తనరంగంలోనే 60% పైగా వాటాని కలిగి ఉన్నాయి. అంతకుముందు 8 కంపెనీలుగా ఉండేవి. డౌవ్ కంపెనీ డ్యూపాంట్‌ని కొనేసింది. సీజెంటాని chemchina కొనేసింది. అలాగే మోన్‌సాంటోను మరో కంపెనీ కొనేసింది. ఇవి యిప్పుడు రీఆర్గనైజ్ అవుతున్నాయి. డౌవ్ అంటే మొదట్లో అది ఒక పెద్ద కెమికల్ కంపెనీ. అది వ్యవసాయరంగంలో ఒక విత్తనాలు తయారుచేసే కంపెనీని కొన్నది. ఇప్పుడు అది తన కెమికల్స్‌లో పారిశ్రామిక కెమికల్స్ అన్నింటిని ఒక కంపెనీగా చేసింది. మొత్తం

వ్యవసాయరంగానికి సంబంధించిన కెమికల్స్ తయారుచేసే కంపెనీ లన్నింటిని ఒక ప్రక్కకు చేర్చింది. ఈరకంగా అన్నీ రీఆర్గనైజ్ అవుతున్నాయి. అవి 16 కంపెనీలుగానో లేదా 15 కంపెనీలుగానో పేర్లు రావచ్చు. కానీ ఫైనల్‌గా వచ్చేది ఆ డౌవ్ కంపెనీ, క్యెమ్‌చినా, మోన్‌సాంటో, లేదా మరొక కంపెనీ. ఇలా నాలుగు కంపెనీల చేతుల్లోనే ఉంటుంది. ఇవి మొత్తం విత్తనరంగాన్ని ఎంత ఆక్రమించ బోతున్నాయో అనేది మొత్తం పిక్చర్ వస్తేకానీ చెప్పలేము. ప్రస్తుతానికి ప్రపంచ వ్యాపితంగానే 60% పైగా విత్తనరంగాన్ని ఇవి ఆక్రమించి కూర్చున్నాయి. ప్రభుత్వం పెట్టే ఏ చట్టమైనా సరే వీటికి అనుకూలంగా ఉంటుంది తప్ప మరోరకంగా ఉండటానికి సాధ్యంకాదు. విత్తన రంగంలో మరో అంశం ఇదివరకు గొడవచేసిన మూలంగా మానేసారు. ఇప్పుడు జన్యుమార్పిడి విత్తనాలను ప్రవేశపెట్టడానికి అనేక రకాల మార్గాలను వెతుకుతున్నారు. అవి ప్రవేశపెడుతున్నారు. ఇది ప్రవేశపెట్టిన తరువాత రైతాంగంపై అన్ని విధాల ఇప్పటికే వున్న పరాధీనత, విదేశీ కంపెనీల మీద పరాధీనత మరింతగా పెరుగుతుంది. రైతాంగం తాము సాంప్రదాయకంగా వాడుకునే హక్కులన్నీ కోల్పోతారు. ఇది విత్తనరంగం నుంచి మనకు ఎదురౌతున్న ప్రధానమైన సమస్య. మనం వ్యతిరేకించవలసిన ప్రధానమైన అంశం కూడా యిదే. అలాగే ఆర్.సి.ఇ.పి.ని కూడా మనం వ్యతిరేకించాలి. మోడీ చెప్పినవి ప్రదర్శనాత్మక చర్యలని గమనించాలి. ఒక పొలిటికల్ మాస్ ట్రిక్ చేయటంలో పెద్దదిట్ట. అసలు విషయాల నుంచి ప్రజలందరి దృష్టి ప్రక్కకు మళ్ళించటంలో, చాలా మంచి పనిచేశాడు అని పేరు తెచ్చుకోవటంలో మోడీ దిట్ట. పొలిటికల్ మాస్ ట్రిక్ ప్లే చేస్తాడు. ఆర్.సి.ఇ.పి. విషయంలోను ప్లే చేశాడు. ఈ ఒప్పందంపై ఎప్పుడైనాసరే సంతకం పెట్టే ప్రమాదముంది. దీనికి వ్యతిరేకంగా మనం చాలా స్పష్టంగా గొంతెత్తి అడగాల్సిన అవసరం ఉంది.

ఇక మొత్తం వ్యవసాయరంగంలోకి వస్తే మనకు కనిపించే సుధీర్ఘమైన అంశం ఒకటుంది. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన 'తాకట్టులో భారతదేశం'లో ఒక అంశాన్ని చెప్పాడు. భారత పాలక వర్గాలు వ్యవసాయరంగాన్ని పెట్టుబడిదారీ వ్యవసాయంగా మార్చాలని పూనుకున్నాయి. ఆ పూనుకోవటం వలన విప్లవాత్మకంగా రైతుకి దున్నేవాడికే భూమి అని పంపకం చేయటం ద్వారా వచ్చే మార్పుని తీసుకురావటానికి వాళ్ళు సిద్ధంగా లేరని, అత్యంత పాశవికంగా రైతాంగ ఉద్యమాన్ని అణిచివేసిన పాలకవర్గాలని ఆయన తేల్చి చెప్పారు. పాలకులు పెట్టుబడిదారీ విధానంలోకి ఒక క్రమ పరివర్తన చేయటానికి పూనుకున్నారు. ఆ క్రమ పరివర్తన ఫలితం అత్యంత దుర్భరంగా ఉంటుంది. లక్షలాది రైతాంగాన్ని కష్టాల భరితమైన జీవితంలోకి నెడుతుంది. అత్యంత నెమ్మదిగా సాగే ఈ విధానాన్ని మనం వ్యతిరేకించాలి. రైతాంగం యొక్క చొరవని బయటకు తీసుకువచ్చి, విప్లవాత్మకంగా భూపంపకం జరిగే విధంగా చూస్తేనే దేశానికి మేలు జరుగుతుంది. ఈ రోజున మన కళ్ళముందు జరుగుతోంది అదే. 4 లక్షల మంది రైతాంగం చనిపోతే ఎవ్వరికీ పట్టనట్లే, పాలకవర్గాలు విననట్లే ఊరుకుంటున్నారు. దాని గురించి ఎవ్వరూ మాట్లాడరు. నేను ఖండించటం లేదు కాని, ఒక నిర్భయ కేసులోనో, ఒక దిశ కేసులో ఒక అమ్మాయిని రేప్ చేస్తే,

> భూ సంస్కరణల అవసరం, దున్నేవాడికే భూమి ప్రాతిపదికగా భూమిని పంచాల్సిన అవసరం వుందని మనం గుర్తించాలి. దానిని ఎలుగెత్తి చాటాలి. ప్రభుత్వం చెప్పే ఏ పరిష్కార మార్గాలు, అవి దోపిడీవర్గాలను ముందుకు తీసుకెళ్ళేవే తప్ప మన వ్యవసాయరంగ సంక్షోభాన్ని పరిష్కరింపచేసేవి కావని గుర్తించి, ప్రజలను చైతన్యవంతం చెయ్యాల్సి వుంటుందని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను.

రోజూ వింటున్న వార్తే కానీ పెద్ద ఎత్తున కదిలి రైతాంగం ఖండించారు. నేను దానిని కాదనటం లేదు. కానీ 4 లక్షల మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు అంటే ఏ ఒక్కరూ ఎందుకు స్పందించరు? పాలకవర్గాల్లోని ఏ ఒక్కరూ ఎందుకు స్పందించరు! చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ఆ అపరాధిని, ఆ నిందితుడిని కాల్చి చంపేసేయండి అని నిలువున ఆర్డర్లిచ్చే పాలకవర్గాలు, ఒక్క క్షణం ఆలోచించి 4 లక్షలమంది రైతాంగం ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారు అని పట్టించుకోవటం లేదు. ఎందుకని? ఇది పాలకవర్గాలు అనుకున్నదే. రైతాంగాన్ని నష్టాలపాలు చేసి, ఆర్థిక మీటలతో భూమి నుంచి తొలగించటానికి వాళ్ళు నిర్ణయించుకున్నారు. దాని స్థానంలో పెట్టుబడిదారీ విధానాన్ని తీసుకురాదల్చుకున్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని తీసుకురావటాన్ని నేను వ్యతిరేకించటం లేదు. భారత వ్యవసాయరంగం వెనుకబాటుతనంతో ఫ్యూడల్ బంధనాల రీతిలో ఉండాలని నేను కోరుకోవటం లేదు. అయితే పెట్టుబడిదారీ విధానాన్ని తీసుకురావటానికి మరి సరైన మార్గం ఏమిటన్నది సమస్య. ఆ పెట్టుబడి ఏ డైరెక్షన్‌లో నడుస్తుంది అన్నది చర్చ. ఆ పెట్టుబడి భారత వ్యవసాయరంగాన్ని విదేశీ పెట్టుబడికి దాసోహం చేస్తుంది. వ్యవసాయరంగంలో వచ్చిన అదనపు సంపదంతా విదేశీ పెట్టుబడిదారులకు లాభాలుగా మారుతుంది. దీనినే మనం ప్రత్యేకంగా వ్యతిరేకించాలి. భారతపాలక వర్గాలు చెపుతున్న ప్రతి సంస్కరణ, 1950ల నుంచి చేసుకొస్తున్న ప్రతి సంస్కరణ ఈ దిశగానే సాగింది. 1950లో పెట్టిన ప్రాథమిక సహకార వ్యవసాయ క్షేత్రాలు కావచ్చు, ఈ రోజు మొబైల్ యాప్‌ల నుంచి ఇస్తున్న మైక్రోఫైనాన్సులు కావచ్చు, ఇవి ఎంత తీవ్రమైన పరిస్థితులలోనికి నెడుతున్నాయో మీకు ఒక ఉదాహరణ చెపుతాను.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి భూస్వాములు, ధనికరైతులు తక్కువ వడ్డీకి ఋణాలు తీసుకొని రైతాంగానికి వాళ్ళు ఎక్కువ వడ్డీకి ఋణాలు యిచ్చి, రైతాంగం మీద ఎలా దోపిడీ చేశారో మనకి తెలుసు. ఇది ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ కాని, విశాలాంధ్ర

పత్రిక కాని ఎంత పెద్దగా ఎక్స్‌పోజ్ చేసిందో తెలుసు. ఎందుకు ఈ పని చేశారంటే గ్రామంలో వ్యవసాయ రంగంలో ఉన్న భూస్వాముల ఆర్థిక పునాదిని బలీయం చేసి వాటిని పెట్టుబడిదారీ వైపు మల్చటానికి. భారత ప్రభుత్వం తెలియక చేసింది కాదు, తెలిసే చేసింది. ఇవ్వాళ అదే పరిస్థితి. మొబైల్‌రంగంలో ఈ రోజు దీనికి శ్రీకారం చుడుతున్నారు. మొబైల్ మైక్రోఫైనాన్స్ ఇప్పటికే కొంత వచ్చింది. దానికి సంబంధించిన వివరాలు ఎంత వరకు వచ్చినవో తెలియటం లేదు. మొబైల్ ఓపెన్ చేస్తే మొబైల్ మైక్రోఫైనాన్స్ సంస్థ మాది, మీరు మా దగ్గర ఎలాంటి ప్రోసెస్ ఏమీ లేకుండా అప్పులు తీసుకోవచ్చు, మీకు ఎంత కావాలంటే అంత ఇస్తాము, మీ చేతిలో మొబైల్ వుంటే చాలు అని అడ్వర్టైజ్‌మెంట్లు వస్తున్నాయి. అవి ఏమిటా అని నేను మళ్ళీ లోపలికి వెళ్ళి అన్నీ పరిశీలిస్తే, మొబైల్ ద్వారా మైక్రోఫైనాన్స్‌ను ఆపరేట్ చేయటం మొదలయ్యింది. వీటికి ప్రభుత్వం యొక్క ఎలాంటి లైసెన్సు అక్కరలేదు, చిట్‌కంపెనీలకు, బ్యాంకులకు ఉన్నట్లు లైసెన్సులు అవసరం లేదు. దీని ఫలితాలు ఎలా వుంటాయి? ఏ పద్ధతిలో చేస్తారు అని చూసినప్పుడు, కెన్యా దేశంలో ఈ ఉదాహరణ నాకు కనపడింది. కెన్యా దేశంలో మనలాగే మొబైల్‌ఫోన్లు అత్యంత పెద్దఎత్తున ఉన్నాయి. 90% జనాభా దగ్గర మొబైల్‌ఫోన్లు ఉన్నాయి. అడిగినవాళ్ళకి వెంటనే మొబైల్ యాప్‌లో వాళ్ళకి మన అకౌంట్‌లన్నీ చెపుతాము, మన ఆర్థిక పరిస్థితి తెలుస్తుంది. మనకి మైక్రోఫైనాన్స్ కింద పదివేలో, లక్షరూపాయలో మనకి అప్పు ఇస్తారు. ఫలితం ఇవ్వాళ అక్కడ రైతాంగం మొబైల్ ఫైనాన్స్ కంపెనీలకి బానిసలుగా వున్నారు. వారు ఏ పంట వెయ్యాలో, వేసిన పంట ఏ రేటుకి అమ్మాలో మొత్తం ఫైనాన్స్ కంపెనీలే నిర్ణయిస్తున్నాయి. నీ బ్యాంక్ బ్యాలన్స్‌లన్నీ వాడి కంట్రోల్‌లోకి వెళ్ళిపోయాయి. ఇదే రేపు రాబోతున్నది. ఇప్పటికే నిన్నో మొన్నో ఆశ్చర్యకరంగా Advertisementలు వచ్చేశాయి. ఇది రైతాంగాన్ని ఆర్థిక మీటలతో తొలగించటానికే చేస్తోంది. దీనికి ఎలాంటి లైసెన్సులు అక్కరలేదు. ఎలాంటి బ్యాంకింగ్ వ్యవస్థలాంటి రెగ్యులేటరీ కమీషన్ కిందకి రాదు. వాడు ఏం వడ్డీ వేస్తున్నాడో, ఏమి చేస్తున్నారో తెలియదు. అవసరం ఉండి మైక్రోఫైనాన్స్ కంపెనీల చేతుల్లో పడి గ్రామీణ మహిళలు ఎన్ని కష్టాలు అనుభవించారో మనకి తెలుసు. రేపు రైతాంగం మొత్తానికి దీనిని విస్తరింపచేయటానికి ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి. మొత్తంగా రైతాంగాన్ని ఒక సంక్షోభంలోకి వాళ్ళే నెట్టారు. గతంలో అనేకసార్లు మనం వివరించుకున్నాం. ఒకప్పుడు ఈ రైతాంగం దేశంలో గ్రీన్ రివల్యూషన్‌తో పెద్దఎత్తున అభివృద్ధి చెందింది. దేశం తిండి గింజల విషయంలో స్వయంసమృద్ధిని సాధించింది అని గొప్పలు చెప్పుకున్నాం. కానీ తిండిగింజలు స్వయం సమృద్ధి సాధించడంలో ఎవరి పాత్ర ఎంత అని చూస్తే, అప్పటి ప్రణాళికా కమిషన్ అంచనా ప్రకారమే చిన్న రైతాంగం తమ పంటని పసిపిల్లల్లా సాకటంవల్ల ఈ దేశంలో సస్యవిప్లవం విజయం అయ్యింది తప్ప, పెద్దఎత్తున భూమి కలిగిన వర్గాల వలన ఈ సస్యవిప్లవం విజయం కాలేదని, ఒకరకంగా అధికారికంగానే వివరించింది. ఎందువలన చిన్న రైతాంగం కష్టపడి పనిచేశారంటే, ఆ రోజున వ్యవసాయ ఉత్పత్తి పెంచటం కోసం భారత ప్రభుత్వం ఆ రైతాంగానికి కావలసిన సహాయ సహకారాలన్నీ అందించింది. నీరు ఇచ్చింది. అలాగే సబ్సిడీ రేట్లకు ఎరువులిచ్చింది. సబ్సిడీ రేట్లకి వ్యవసాయ పనిముట్లు ఇచ్చింది. వెంటనే సలహాలు చెప్పటానికి విస్తరణాధికారులను గ్రామ గ్రామాన పెట్టింది. నూతన ఆర్థిక విధానాలతో జరిగిందేమిటి? ఎరువుల రేట్లను పెంచివేయటం, ప్రతి నీటిచుక్కకి డబ్బులు కట్టాలనటం, వసూలు చేయటం యివన్నీ మన కళ్ళముందు ఉన్నాయి. రైతాంగానికి ఏ సహాయమైతే ఇచ్చిందో, ఏ సహాయ ఫలితంగా వాళ్ళు నిలబడ్డారో, ఇవ్వాళ ఆ సహాయాన్నంతా ఉపసంహరించుకుంది. అన్నింటి కంటే ముఖ్యమైనది ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర రాకపోతే నేనుకొంటాను, నా సంస్థ ఇక్కడ ఉంది వచ్చి అమ్ముకోండి అని గ్రామగ్రామాన తెరవటం. 70లలో ఫుడ్ కార్పొరేషన్ కొనుగోలు కేంద్రాలు తెరవటం ఒక్కరోజు ఆలస్యం అయితే ఆందోళన చేసేవారు రైతాంగం. దానిని మనం దృష్టిలో పెట్టుకున్నప్పుడు, ఈ రోజు ఎక్కడా నేను కొనను అని ప్రభుత్వం ప్రకటించేసింది, రైతాంగం అడిగితే మీరే కొనుక్కోండి, నాకు కావలసి వస్తే నాకు సరఫరా చేయండి అంటోంది. దీని ఫలితంగా ఏమైంది? కనీస కొనుగోలు రేటు, గరిష్ట అమ్మకం రేటు అయ్యింది. ఈ రోజు వ్యాపారస్తుడు గవర్నమెంటే 1800 ప్రకటించింది. నేను 1700లకు కొంటాను. ఇష్టమయితే అమ్ము లేకపోతే లేదు అనే స్థితి కల్పించారు. ఈ రకంగా తాను సృష్టించిన సంక్షోభానికి తాను అనుకున్న పరిష్కార మార్గాలు చూపుతున్న దీనిని మనం వ్యతిరేకిస్తూ, ప్రధానంగా భారతదేశ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించటానికి దున్నేవాడికే భూమి మీద అధికారం కల్పించాలి అనే అంశాన్ని మనం పదే పదే చెప్పాలి. ఈ రోజు ఎలా చూసుకున్నా కృష్ణా, గుంటూరు లాంటి జిల్లాలలో 80% మంది కౌలురైతులుగానే ఉన్న స్థితి ఉంది. ఇది దేశవ్యాప్తంగా 50% దాటిందనే అనుకుంటున్నాను. అంటే భూమి మీద ఎలాంటి హక్కులు లేకుండా కౌలుదారీ చట్టాన్ని పక్కన పెట్టి, ఈ రోజు వీళ్ళకి భూమి మీద ఏ హక్కులు లేకుండా చేసినందువల్ల వారు చేస్తున్న వ్యవసాయంలో వారి శ్రమ వారికి దక్కని స్థితి వుంది. అది దక్కిన రోజు మాత్రమే వ్యవసాయరంగంలో సంక్షోభ పరిష్కారానికి కావలసిన భూమిక ఏర్పడుతుంది. దీనిని మనం దృష్టిలో పెట్టుకున్నప్పుడు మళ్ళీ మరొక్కసారి భూ సంస్కరణల అవసరం, దున్నేవాడికే భూమి ప్రాతిపదికగా భూమిని పంచాల్సిన అవసరం వుందని మనం గుర్తించాలి. దానిని ఎలుగెత్తి చాటాలి. ప్రభుత్వం చెప్పే ఏ పరిష్కార మార్గాలు, అవి దోపిడీవర్గాలను ముందుకు తీసుకెళ్ళేవే తప్ప మన వ్యవసాయరంగ సంక్షోభాన్ని పరిష్కరింపచేసేవి కావని గుర్తించి, ప్రజలను చైతన్యవంతం చెయ్యాల్సి వుంటుందని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను.

# ‘అడవులనుండి ఆదివాసులను గెంటివేసే పాలకుల నిరంతర కుట్రలను ఎదుర్కొందాం’

## 2019 జూన్ 5 - ఏఐకెఎంకెఎస్ సదస్సు పిలుపు



**వందల** తరాలుగా అడవులలో నివసిస్తూ, అడవులను పరిరక్షిస్తూ, పర్యావరణాన్ని కాపాడుతూ వస్తున్న ఆదివాసులను అడవుల నుండి తొలగించబూనుకోవటం దుర్మార్గమని, క్షమార్హంకాదని నల్సార్ యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు, కేంద్ర సమాచార హక్కుల శాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఉద్ఘాటించారు. 5-6-2019న ఉ॥11 గం॥కు విశాఖపట్నంలోని సుబ్బలక్ష్మీ కళ్యాణమండపంలో ఏఐకెఎమ్‌కెఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

“బ్రిటిష్‌వాడు మన దేశాన్ని ఆక్రమించుకొని సంపదను కొల్లగొట్టుకెళ్ళాడు. అటవీ సంపదలపై కన్నేసి, వారి దోపిడీకి అడ్డుగా వున్న ఆదివాసులపై పలురకాల అణచివేత చర్యలకు పాల్పడ్డాడు. దీనిని వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్య పోరాటంతో సమాంతరంగా ఆదివాసుల పోరాటాలు సాగాయి. పోరాటాల ఫలితంగా ‘గిరిజనుల భూములు గిరిజనులవే’ అని ప్రకటించాల్సి వచ్చింది. హైమన్ డార్ఫ్ గిరిజనుల జీవన స్థితిగతులపై ఆనాడే ఓ వివరమైన నివేదిక రూపొందించాడు. నిరంకుశ నిజాం ఏలుబడిలోని ప్రాంతాలలోనూ గిరిజనులకు అడవిపై హక్కులు కల్పిస్తూ చట్టాలు చేయక తప్పలేదు.

స్వాతంత్ర్యానంతరం రూపొందించుకున్న భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ళు, దేశంలోని ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేకించి వర్తిస్తాయి. అధికారంలో కొనసాగుతూవస్తున్న పాలకులు వీటిని సక్రమంగా అమలుచేయకపోవటమే గిరిజనులలో అసంతృప్తికి కారణంగా వుంది. విప్లవోద్యమాలు ముందుకు రావటానికి ఇదే కారణం.

2006లో కేంద్రప్రభుత్వం చేసిన అటవీ హక్కుల చట్టం ప్రకారం అడవులలోని ఆదివాసుల నివాస హక్కును గుర్తించాలి. ఈ చట్టం ప్రకారం 46 లక్షలమంది ఆదివాసులు తమకు నివాస హక్కు కావాలని అభ్యర్ధనలు అందజేస్తే అందులో 20 లక్షల అభ్యర్ధనలను కుంటిసాకుతో తిరస్కరించారు. వీరి అభ్యర్ధనలు తిరస్కరించబడ్డాయి కనుక, వీరు ఆదివాసులు కారంటూ వీరిని తొలగించాలని సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13న ఆదేశమిచ్చింది. ఈ విషయంలో ఆదివాసుల పక్షాన సుప్రీంకోర్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనను గట్టిగా వినిపించకపోవటం దుర్మార్గం.

కాగా, ఎన్‌డిఏ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కాలంలో ఆదివాసులను అణచివేసే మరింత ప్రమాదకరమైన బిల్లును రూపొందించింది. దీనిపై ప్రజల అభిప్రాయాలను తెలియజేసేందుకు జూన్ 7వ తేదీన ఆఖరు దినంగా ప్రకటించింది. అటవీ అధికారులకు తుపాకులు, మందుగుండు సామాగ్రి ఇవ్వాలని, ఆదివాసులపై

**ఆదివాసుల భూ బదలాయింపును నిరోధించే 1/70 (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా), 2/56 (ఒడిషా) మరియు 'పెసా' వంటి చట్టాలన్నీ నిరంతరం ఉల్లంఘనలకు గురవుతూనే వున్నాయని, ఈ చట్టాలను పకడ్బందీగా అమలు చేయవలసిన ప్రభుత్వాధికార యంత్రాంగమే లక్షలాది ఎకరాల అటవీ భూములను కార్పొరేటు సంస్థలకు కేటాయిస్తూ, వారి సూపర్ లాభార్జనలకు దోహదపడుతూనే, మరోవైపున అడవులు తరగిపోవటానికి ఆదివాసులే కారణమంటూ నెపాన్ని వారిపై మోపటాన్ని ఈ సదస్సు ముక్తకంఠంతో నిరసిస్తున్నది.**

అటవీ అధికారులు జరిపే దౌర్జన్యాలపై కేసులు కూడా పెట్టరాదనే అంశాలతో ఈ బిల్లు చాలా ప్రమాదకరంగా ముందుకొస్తోంది.

ఏమైనా తరతరాలుగా అడవిలో వుంటున్న ఒక్క ఆదివాసీని కూడా తిరస్కరించటానికి వీలులేదు. అడవులపై పెత్తనాన్ని కొందరు నిరంకుశ అధికారుల చేతుల్లో పెట్టటానికి ఉద్దేశించిన ఈ బిల్లును సంపూర్ణంగా వ్యతిరేకిస్తూ ఈ సదస్సు తీర్మానం చేయాల్సిందిగా కోరుతూ, కోర్టుల తీర్పులపై ఆధారపడకుండా తమ హక్కుల సాధనకు ఆదివాసులే నడుం బిగించాల"ని ప్రొఫెసర్ శ్రీధర్ తన ఉపన్యాసంలో ప్రధానంగా పేర్కొన్నారు.

'అడవుల నుండి ఆదివాసులను గెంటివేసే పాలకుల నిరంతర కుట్రలను ఎదుర్కొందాం' పేరుతో రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) నిర్వహణలో ఏఐకెఎమ్‌కెఎస్ నాయకత్వంలో జరిగిన ఈ ఒకరోజు సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా రాష్ట్రాల నుండి ప్రజానీకం ముఖ్యంగా వేలాదిగా ఆదివాసులు, గిరిజన సంఘాల పెద్దలు, వివిధ ప్రజాసంఘాల నేతలు, మేధావులు, ప్రజాతంత్రవాదులు పాల్గొన్నారు. జూన్ 5 ఉదయం 11 గం॥ నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ సదస్సుకు అధ్యక్షవర్గాన్ని, వక్తలను రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥డి.వర్మ తొలుత వేదికపైకి ఆహ్వానించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యదర్శి కా॥ ఎమ్.ఎస్. నాగరాజు, ఏఐకెఎమ్‌కెఎస్ తెలంగాణా ప్రతినిధి కా॥ బొర్రా ఆనంద్, ఒడిషా ఆదివాసీ నాయకురాలు కా॥ పైడమ్మ ఈ సదస్సుకు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

సదస్సులో **ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత కన్వీనర్ కా॥ సుబోధ్ మిత్రా** మాట్లాడుతూ అడవులలోని ఖనిజ, అటవీ సంపదను సామ్రాజ్యవాద బహుళజాతి, కార్పొరేటు సంస్థలు విచ్చలవిడిగా కొల్లగొట్టుకెళ్ళేందుకు వీలుగా, వివిధ రూపాలలో, వివిధ చట్టాలతో ఆదివాసులను అడవుల నుండి తరిమివేయాలని పాలకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఈ కుట్రలను అర్ధంచేసుకొని వాటికి వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

**'జనశక్తి' సంపాదకులు డా॥ పి.జస్వంతరావు** మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు అవసరమైన ఖనిజ సంపదను ప్రైవేటు, కార్పొరేట్ల తక్షణ లాభాలకోసం విచక్షణారహితంగా తవ్వి తీస్తున్నారని, దీనిని అడ్డుకుంటున్న ఆదివాసులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు.

**ఏఐకెఎమ్‌కెఎస్ కో కన్వీనర్, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సీ** మాట్లాడుతూ ఆదివాసుల పోరాటాల ఫలితంగా ఉనికిలోవచ్చిన 1/70, 'పెసా' వంటి చట్టాలను, ఒడిషాలో 2/56 వంటి చట్టాలను పాలకులు నీరుగార్చారన్నారు. చట్టాలు, కోర్టు తీర్పులతో నిమిత్తం లేకుండా ఆదివాసులు తమ సంఘటిత చైతన్యాన్ని పెంపొందించుకోవటం ద్వారా, గిరిజనేతర పేదప్రజల, మేధావుల, సమాజంలో వివిధ వర్గాల మద్దతును సంపాదించుకోవటం ద్వారా తమ హక్కులను పరిరక్షించుకోవటం సాధ్యమౌతుందన్నారు. పోలవరం ముంపు ప్రాంతాల ఆదివాసీ ప్రజానీకానికి సమగ్ర శాస్త్రీయ పునరావాసం కల్పించని పాలకుల దుర్మార్గాన్ని ఆమె ఎండగట్టారు. ఆదివాసులకు అండగా నిలచిన మేధావులు డా॥ బి.డి. శర్మ, యస్.ఆర్. శంకరన్‌లకు; గిరిజనోద్యమ అమరులందరుకూ ఆమె ఈ సందర్భంగా జోహార్లర్పించారు.

**ఏఐకెఎమ్‌కెఎస్ (ఒడిషా) కేంద్ర కార్యవర్గ సభ్యులు కా॥శ్రీకాంత్ మొహంతి**, ఒడిషాలో విస్థాపనకు వ్యతిరేకంగా ఆదివాసులు సాగిస్తున్న ఆందోళనను వివరించారు.

**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి పాకలపాటి రఘువర్మ** మాట్లాడుతూ చట్టసభల వేదికగా ఆదివాసీ సమస్యలను ప్రస్తావిస్తామని, ఆదివాసుల ఉద్యమాలకు మద్దతుగా నిలుస్తామన్నారు. **మాజీ శాసన సభ్యులు కోలక లక్ష్మణరావు** ఐక్య ఆదివాసీ ఉద్యమం సాగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ఇంకా, **ఏజన్సీ గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఇల్లా రామిరెడ్డి, గిరిజనసంఘం నాయకులు కా॥ కుంజం రామారావు, కా॥ చెదల వీరపురెడ్డి** తదితరులు ఈ సదస్సులో మాట్లాడారు.

అడవులనుండి ఆదివాసులను గెంటివేసే చర్యలను వ్యతిరేకిస్తూ కా॥ ఝాన్సీ ప్రతిపాదించిన తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది. **(తీర్మానం పూర్తిపాఠం విడిగా అందిస్తున్నాం)** సదస్సు ప్రారంభానికి ముందుగా ఆదివాసీ ప్రజాకళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు, ప్రజాకళాకారులు ఆలపించిన ఆదివాసీ పోరాట పాటలు సదస్సుకు హాజరైన ప్రజానీకాన్ని ఆకట్టుకున్నాయి.

## విశాఖను అరుణవర్ణంలో ముంచెత్తిన ప్రదర్శన

సదస్సు అనంతరం ఏఐకెఎమ్‌కెఎస్ ఆధ్వర్యంలో సా॥ 4 గం॥కు సుబ్బలక్ష్మీ కళ్యాణ మండపంనుండి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిషా రాష్ట్రాలనుండి వేలాదిగా వచ్చిన ఆదివాసులు ఎర్రజెండాలు చేతబట్టి, రెండు వరుసలుగా క్రమశిక్షణతో నిర్వహించిన ఊరేగింపు, ఊరేగింపుకు ముందు భాగాన ఆదివాసీ ప్రజాకళాకారులు ప్రదర్శించిన కిందిరి, డప్పునృత్యాలు నగర

ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. 'పర్యావరణాన్ని రక్షించేది, ఆదివాసులే' 'పర్యావరణాన్ని విధ్వంసం చేసేది, బహుళజాతి కంపెనీలే' 'ఆదివాసులను అడవి నుండి గెంటివేసే కుట్రలను తిప్పికొడదాం' 'పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలి' అంటూ ఈ సందర్భంగా ప్రదర్శకులు పెద్దపెట్టున నినదించారు. సుబ్బలక్ష్మి కళ్యాణమండపం నుండి రైల్వే న్యూకాలని, దొండపర్తి, డైమండ్‌పార్క్, ద్వారకానగర్, ఆర్టీసి కాంప్లెక్సు మీదుగా పాత జైలు రోడ్డులోని బహిరంగ సభాస్థలికి ప్రదర్శన చేరుకుంది.

## బహిరంగసభ

పాత జైలురోడ్డులోని పార్క్ వద్దనున్న సభాస్థలంలో సా॥ 5.30 గం॥కు జరిగిన బహిరంగసభకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి. వర్మ అధ్యక్షత వహించారు. అడవుల నుండి ఆదివాసులను గెంటివేసే పాలకుల కుట్రలను సమైక్యంగా తిప్పికొడదామని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ యస్. ఝాన్సీ తన ప్రసంగంలో పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ప్రస్తుతం తన ఆదేశంపై 'స్టే' విధించినా, వారు ఇచ్చిన దుర్మార్గమైన ఆదేశాన్ని పాలకులెవరూ ప్రశ్నించక పోవటాన్ని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. రానున్న కాలంలో మరింత దుర్మార్గమైన చట్టాలకు పాలకులు పదును పెడుతున్నారని, దీనికి వ్యతిరేకంగా ఆదివాసులు, రైతుకూలీలు సమైక్యంగా ఉద్యమించాలని ఆమె పేర్కొన్నారు. ఈ సభలో ఇంకా ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత కన్వీనర్ సుబోధ్‌మిత్రా, ఏజన్సీ గిరిజన సంఘం రాష్ట్రఅధ్యక్షులు కా॥ ఇల్లా రామిరెడ్డి, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్రనాయకులు కా॥ ఊయక ముత్యాలు, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ గణేష్ పండా, ఉత్తరాంధ్ర 'ఉపాధ్యాయ' ఎంఎల్‌సి పి.రఘువర్మ, రైతుకూలీ సంఘం తెలంగాణా రాష్ట్ర నాయకులు కా॥ ఉప్పలయ్య తదితరులు ప్రసంగించారు. సుప్రీంకోర్టు ఆదేశం నేపధ్యంలో భూపాల్ రచించగా, రౌతు వాసుదేవరావు దర్శకత్వం వహించి 'ప్రజాకళాకారుల సమాఖ్య' ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'మా ప్రజాతీర్పు' కళారూపకం బహిరంగసభకు హాజరైన ప్రజానీకాన్ని బాగా ఆకట్టుకుంది.

# స్టాన్ స్వామి కోసం....

- ఓపీవీయస్

**ఆదివాసీలంటే**
అడవిపూల రెమ్మలనీ,
చిగురుటాకుల హరితమని
సెలయేళ్ళ జీవమని అన్నావు
కిందిరి మేఘాల సయ్యాటలలోంచి
తొంగిచూసే సూర్యరశ్మంతా
కొండపాటల గాలుల సత్తువలో
ఒదిగి సాగే బతుకంతా
వాళ్ళదేనన్నావు
వారికేనన్నావు
కొండలలో కొండలై నిలిచి
గెడ్డలలో గెడ్డలై పారే
వాళ్ళవైన స్వేచ్ఛాజీవితాలు
వాళ్ళకు దక్కాలని నీ ఆశ
ప్రజలకు అవసరమైనంత
ప్రజలకొరకే తీసుకోవాలిగాని
మీ లాభాలు మేటలు వేయడానికి
అడవిని కొల్లగొట్టడమేమిటి?....

జలపాతాలను జైళ్ళల్లో నింపడమేమిటని
అడవి బిడ్డల్లో విచ్చుకుంటున్న నీ ప్రశ్నల చూపు
ఎడారి దాహానికి ఆటంకంగా నిలిచింది
రాజ్యాన్ని వణికించింది
కాషాయం పొదల్లో నక్కి కూర్చున్న
పెట్టుబడి పులికళ్ళు ఎరుపెక్కాయి
కంప్యూటర్ల అబద్ధాల వైరస్‌లు
కేసుల సాలెగూళ్ళై అల్లుకున్నాయి
ముదిమి దేహం చుట్టూ
నిర్బంధపు జైళ్ళు మొలుచుకొచ్చాయి
మానవీయ ఆలోచనను ఏమీ చేయలేక
మానవదేహాన్ని అంతం చేశాయి
అడవిపూలు విప్పారాలనే నీ ఆకాంక్ష ముందు
దోపిడి అమానవీయమనే నీ ఆలోచన ముందు
వసంతాన్ని కాల్చుకు తినాలనే దోపిడీ తంత్రాలు
రాజ్యం ప్రయోగిస్తున్న మారణ యంత్రాలు
మరుగుజ్జులై ఓడిపోతున్నాయి
పిరికిపందలై పారిపోతున్నాయి

# ఆదివాసీ సదస్సు తీర్మానం

## 5-6-2019

**ఆదివాసులు** తమ భూముల పరాయీకరణకు వ్యతిరేకంగా, సుదీర్ఘకాలంపాటు సాగించిన పోరాటాల ఫలితంగా యుపిఏ ప్రభుత్వం 2006 సం॥లో అటవీ హక్కుల చట్టాన్ని చేసినప్పటికీ, ఆదివాసుల హక్కుల పరిరక్షణ దిశగా ఆ చట్టం ఏ మాత్రం అమలుకాలేదు. ఆ చట్టాన్ని నిరుపయోగం చేసే అన్ని చర్యలూ ఒకదాని తర్వాత మరొకటిగా చేపడుతున్నారు. అందులో భాగంగానే అటవీ భూమిపై హక్కు తమదేనన్న లక్షలాది ఆదివాసుల అభ్యర్థనలను (క్లెయిమ్‌లను) నిర్దాక్షిణ్యంగా తిరస్కరించారు. ఈ పరిస్థితినే అవకాశంగా తీసుకొని పది లక్షలమంది పైగా ఆదివాసులను అడవుల నుండి తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశం ఇచ్చేలా కేంద్రప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరించింది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఆదేశం అమలును తాత్కాలికంగా నిలుపుదల (స్టే) చేసింది.

స్టే తొలగిపోయి, సుప్రీంకోర్టు ఆదేశం అమలు జరిగేట్లయితే ఆంధ్రప్రదేశ్‌లోని 66,000 ఆదివాసీ కుటుంబాలు, తెలంగాణాలోని 82,000 ఆదివాసీ కుటుంబాలు, ఒడిషాలోని 1,22,000 కుటుంబాలు అటవీ ప్రాంతాలలోని తమతమ ఆవాసాలను ఖాళీ చేయాల్సి వుంటుంది.

కాగా, గత ఒకటిన్నర దశాబ్ద కాలంగా (అటవీ హక్కుల చట్టం రూపొందిన నాటినుండి) ఆదివాసులను అడవులనుండి బలవంతంగా తొలగించటానికి వారి ఇళ్ళను, పంటలను తగులబెట్టటం, నీటి వనరులను ధ్వంసం చేయటం, మహిళలపై లైంగిక దాడులు సాగించటం, ఆదివాసులను హత్యగావించటం వంటి అనేక క్రూరమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు ప్రభుత్వాలే పాల్పడుతూ వుండటం ఆదివాసుల అనుభవంలో వున్నదే.

రాజ్యాంగంలోని 5వ షెడ్యూలుకు విరుద్ధంగా చట్టబద్ధమైన అనుమతులు లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో పాలకులు విచ్చలవిడిగా అటవీ భూములను సేకరించి, పోడు వ్యవసాయం సాగిస్తున్న ఆదివాసులను గెంటివేస్తున్నారు. ఒడిషాలో 'అభివృద్ధి', గనుల తవ్వకం పేర్లతో లక్షలాదిమంది ఆదివాసులను వారి నివాసాల నుండి తొలగిస్తున్నారు.

ఆదివాసుల భూ బదలాయింపును నిరోధించే 1/70 (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా), 2/56 (ఒడిషా) మరియు 'పెసా' వంటి చట్టాలన్నీ నిరంతరం ఉల్లంఘనలకు గురవుతూనే వున్నాయని, ఈ చట్టాలను పకడ్బందీగా అమలుచేయవలసిన ప్రభుత్వాధికార యంత్రాంగమే లక్షలాది ఎకరాల అటవీ భూములను కార్పొరేటు సంస్థలకు కేటాయిస్తూ, వారి సూపర్ లాభార్జనలకు దోహదపడుతూనే, మరోవైపున అడవులు తరగిపోవటానికి ఆదివాసులే కారణమంటూ నెపాన్ని వారిపై మోపటాన్ని ఈ సదస్సు ముక్తకంఠంతో నిరసిస్తున్నది.

ప్రభుత్వాలే వన సంరక్షణ, అటవీ పునరుజ్జీవం వంటి పేర్లతో జీవవైవిధ్యాన్ని, ఆదివాసుల జీవనోపాధిని, వన్యప్రాణుల మనుగడను దెబ్బతీసేవిధంగా వాణిజ్య అడవుల పెంపకం, ఒకే తరహా ప్లాంటేషన్‌ల పెంపకం వంటి విధానాలను ప్రోత్సహించడాన్ని ఈ సదస్సు వ్యతిరేకిస్తున్నది.

దేశవ్యాప్తంగా మూకుమ్మడిగా ఆదివాసులను అడవులనుండి తొలగించే ఈ చర్యలను తక్షణం నిలుపుదల చేయాల్సిందిగా ఈ సదస్సు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది.

అటవీ హక్కుల చట్టం – 2006ను పటిష్టంగా అమలుచేసేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని, భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూలులో ఆదివాసులకు కల్పించిన రక్షణలన్నీ అమలుచేయాలని ఈ సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో నిమిత్తం లేకుండానే ఆదివాసుల హక్కులను పరిరక్షించే విశిష్టాధికారం రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు గవర్నర్‌లకు కల్పించిన అంశాన్ని పరిగణలోకి తీసుకొని ఆయా రాష్ట్రాల గవర్నర్లు, గౌ॥ భారత రాష్ట్రపతి తక్షణం ఈ విషయమై జోక్యం చేసుకోవలసినదిగా ఈ సదస్సు వారికి విజ్ఞప్తి చేస్తున్నది.

భూమి నుండి గెంటివేయబడటాన్ని ఆపివేయాలని, అడవిలో జీవించే హక్కు, వనరులను అనుభవించే ఆదివాసుల హక్కులకు భంగం కలిగించరాదని ఈ సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది. ఆదివాసులు తమకు జరిగిన "చారిత్రక అన్యాయానికి" వ్యతిరేకంగా సంఘటింతంగా నిలబడాలని, అలాగే ప్రజాజీవన మనుగడకు హాని కలిగిస్తూ పర్యావరణ విధ్వంసం సాగిస్తున్న స్వార్థపరత్వానికి వ్యతిరేకంగా నిలవాలని సోదర ప్రజానికానికి ఈ సదస్సు పిలుపునిస్తున్నది.

5–6–2019న విశాఖపట్నంలో ఏ.ఐ.కె.ఎం.కె.ఎస్ నాయకత్వాన జరిగిన ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా రాష్ట్రాల నుండి వివిధ గిరిజన సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలు, ప్రముఖ ప్రజాతంత్రవాదులు పాల్గొని తమ నిరసనను, ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆదివాసులమైన తాము సాగిస్తున్న ప్రజాస్వామిక డిమాండ్ల సాధనకు తోడ్పడవలసిందిగా, సంఘీభావం తెలుపవలసినదిగా మైదాన ప్రాంత గ్రామీణ, పట్టణ సోదరీసోదరులకు ఈ సదస్సు విజ్ఞప్తి చేసింది.

# అటవీ చట్టానికి సవరణ - అటవీ సంరక్షణ నియమాలు 2022

**సామ్రాజ్యవాదులకు,** కార్పొరేట్ శక్తులకు అడవులను కట్టబెట్టే విధంగా అటవీ (సంరక్షణ) నిబంధనలు - 2022 పేరున గత పార్లమెంటు సమావేశాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. ఆదివాసులకు అరాకొరాగా మిగిలిన కొద్దిపాటి 'గ్రామసభ' వంటి హక్కులను కూడా గుంజివేసు కోవటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒకవైపున ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమం కోసమే తామున్నామంటూనే, మరోవైపున అడవుల నుండి ఆదివాసులను గెంటివేసే క్రమాన్ని వేగవంతం చేస్తోంది.

## ఆదివాసుల జీవనహక్కుకై దాడులు

అటవీ (సంరక్షణ) చట్టం - 1980, ప్రభుత్వ అంగీకారం లేకుండా అడవులలో నివసించేవారందరినీ చట్టవిరుద్ధ ఆక్రమణ దారులని ప్రకటించింది. అంటే, తరతరాలుగా అడవినే నమ్ముకుని అడవుల్లో జీవించే ఆదివాసులను, అన్ని కష్టనష్టాలకోర్చి, పోడు వ్యవసాయం చేసుకుంటూ, అడవులను కాపాడుకుంటూ వస్తున్న ఆదివాసులను ఈ చట్టం నేరస్థులని పేర్కొంటోంది. ఈ చట్టం ద్వారా ఆదివాసులను అడవుల నుండి తొలగించటానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. అనేకమంది ఆదివాసుల నివాస గుడిశెలను తగులబెట్టి బూడిద చేయటం కూడా జరిగింది.

అడవుల నుండి ఆదివాసులను విస్థాపనకు గురిచేసే క్రూరమైన ప్రయత్నాలకు వ్యతిరేకంగా, అఖిలభారత స్థాయిలో ఆదివాసీ, ప్రజాతంత్ర ఉద్యమాలు జరిగాయి. ఫలితంగా ఆదివాసులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. చారిత్రకంగా ఆదివాసులకు అన్యాయం జరిగిందని ఆ ప్రక్రియ తేల్చిచెప్పి, "అటవీ హక్కుల చట్టం-2006"ను ముందుకు తెచ్చింది. స్వేచ్ఛా సంచారంగావించే ఆదివాసులకు ఈ చట్టం ద్వారా కూడా ప్రభుత్వం నిర్దిష్ట స్థలానికి పరిమితం చేయటానికి ప్రయత్నిస్తోంది. ఇంకా, ప్రభుత్వం ఆదివాసులు సాగుచేసిన కొండపోలాలను గుర్తించనేలేదు.

ఈ చట్టం చేసి ఒకటిన్నర దశాబ్దకాలం గడిచిపోయింది; అయినప్పటికీ ఆదివాసీ హక్కుల సమస్య అనేది ఇంకా పరిష్కరించ బడలేదు. కనుక, అనేక ఆటంకాలను సృష్టించి, ఆదివాసుల విజ్ఞప్తులను బయటకు రానీయకుండా తొక్కిపెట్టటమే ఈ చట్టం యొక్క ఉద్దేశ్యమని అర్థమౌతోంది.

2019లో కేంద్ర ప్రభుత్వం, ఇప్పటికీ ఇంకా ఆదివాసులుగా గుర్తింపు లభించనివారందరినీ నేరస్థులుగా పరిగణిస్తూ వారిని బలవంతంగా అడవుల నుండి గెంటివేసే ఆదేశాన్ని సుప్రీంకోర్టు నుండి తీసుకువచ్చింది. ఈ ఆదేశం, కొంతకాలం నిలిపి ఉంచి నప్పటికీ, ఆదివాసుల మెడలపై కత్తిలా అది ఇంకా వేళ్ళాడుతూనే వుంది. జాతీయ పార్కులు, వన్యప్రాణుల సంరక్షణ స్థలాల్లోని ఆదివాసుల హక్కులను నిర్ణయించే అటవీ జంతువుల (పరిరక్షణ) చట్టం దీనికి తోడైంది.

## కార్పొరేట్లకు అడవులను అప్పగించే పన్నాగం

ప్రభుత్వాలు ముందుకు తెచ్చిన ఆదివాసీ చట్టాలన్నీ ఒకవైపున ఆదివాసులను దురాక్రమణదారులుగా నేరపూరితులుగా పరిగణిస్తూ, మరోవైపున అటవీ సంపదను కార్పొరేట్లు మరింతగా దోచుకెళ్ళటానికి దోహదపడుతున్నాయి. 2019-21 సం॥ల మధ్యకాలంలో 5543 చ॥కి॥మీ అటవీ భూమి కార్పొరేట్ దోపిడీదారులకు అటవీయేతర కార్యక్రమాలైన గనులు, భారీ ప్రాజెక్టుల వంటివాటి కోసం ప్రక్కకు మళ్ళించటం జరిగింది.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అటవీ (సంరక్షణ) నిబంధనలు - 2022 కార్పొరేట్లకు అటవీ భూములను కట్టబెట్టే ప్రక్రియను మరింత సులభతరం చేస్తోంది. అటవీయేతర ప్రయోజనాల కోసం అటవీ భూములను కేటాయించటానికి 'గ్రామసభ' ఆమోదం పొందాలనే కనీసపాటి నిబంధనను కూడా ఈ సవరణలతో రద్దుచేస్తున్నారు.

సుమారు 123 పేజీల ఈ ముసాయిదా సవరణ చట్టంలో సెక్షన్-26 అడవులలో పశువుల మేపును, వివిధరకాల ఆహారపదార్థాల సేకరణను నిషేధిస్తోంది. సెక్షన్ 22(ఎ)2ఏ గిరిజన కుటుంబమైనా అటవీ సంరక్షణ చట్టానికి అనుగుణంగా లేదని ఫారెస్టు అధికారి భావిస్తే, ఆ కుటుంబానికి ఉన్న అటవీ హక్కులు రద్దు చేయవచ్చని చెపుతున్నది. ఇక్కడ చట్టానికి 'అనుగుణంగా లేకపోవడం' అన్నదానికి నిర్వచనంలేదు. దానిని నిర్ణయించే అధికారం ఫారెస్ట్ అధికారికి మాత్రం ఇవ్వబడుతుంది. ఇదే ముసాయిదా చట్టంలో సెక్షన్ 66 - ఫారెస్టు అధికారులకు ఆయుధాలు ఇవ్వాలనీ, వారిపై వచ్చే మానవ హక్కుల ఉల్లంఘనల కేసులపై పై అధికారుల అనుమతి లేకుండా నేరుగా కేసులు నమోదుచేయకూడదని పేర్కొంటోంది. అటవీ అధికారులు ఎవరినైనా నేరస్తులని నిర్ధారిస్తే చాలు 50 వేల రూపాయల వరకూ జరిమానా విధించే అధికారం, 7 సంవత్సరాల వరకూ జైలుశిక్ష విధించే అధికారం ఈ ముసాయిదా దఖలు పరుస్తున్నది. అంతేగాక ఫారెస్టు అధికారుల విచక్షణలో అడవులలో పశువులను మేపుతున్నందుకు పన్నులు వసూలు చేసే నిబంధనలను

**సుమారు 123 పేజీల ఈ ముసాయిదా సవరణ చట్టంలో సెక్షన్-26 అడవులలో పశువుల మేపును, వివిధరకాల ఆహార పదార్థాల సేకరణను నిషేధిస్తోంది. సెక్షన్ 22(ఎ)2ఏ గిరిజన కుటుంబమైనా అటవీ సంరక్షణ చట్టానికి అనుగుణంగా లేదని ఫారెస్టు అధికారి భావిస్తే, ఆ కుటుంబానికి ఉన్న అటవీ హక్కులు రద్దు చేయవచ్చని చెపుతున్నది. సెక్షన్ 66-ఫారెస్టు అధికారులకు ఆయుధాలు ఇవ్వాలనీ,వారిపై వచ్చే మానవ హక్కుల ఉల్లంఘనల కేసులపై పై అధికారుల అనుమతి లేకుండా నేరుగా కేసులు నమోదు చేయకూడదని పేర్కొంటోంది.**

(అంటే పాత పుల్లరి), అడవులలో గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద బతకనిస్తున్నందుకు ఫారెస్టు పనులలో పాల్గొనాలని (అంటే పాత వెట్టి) నిబంధనలను ఈ 1927 అటవీ చట్టానికి ముసాయిదా సవరణ పేర్కొంది. అన్నింటికంటే ముఖ్యంగా ఈ ముసాయిదా "ఉత్పాదక అడవులనే" విధానాన్ని ముందుకు తెచ్చింది. అంటే పరిశ్రమలకు ముడిసరకుల సరఫరా కేంద్రాలుగా ప్లాంటేషన్‌ల పెంపకం, వాణిజ్యం కోసం అడవులు అన్న విధానం, అటవీ ఉత్పత్తులపై పన్ను విధింపు వంటివి ముందుకు తేవడం ఈ సవరణల ముఖ్య ఉద్దేశ్యం. అడవులను కార్పోరేట్‌లకు అప్పచెప్పడానికి ఆటంకంగా వున్న ఆదివాసి అనుకూల చట్టాలను, విధానాలను ఆచరణలో రద్దుచేయడం ఈ ముసాయిదా సవరణ యొక్క మరో ప్రయోజనం. ముసాయిదా స్పష్టంగా చెపుతున్నదేమంటే "అటవీ సంరక్షణకు" అడ్డుగా అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసులు భూములు కలిగివున్నట్లు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే వారికి కొంత నష్టపరిహారం ఇచ్చి, వేరేచోట వారు నివసించే చోటు చూపించో ఆ ఆదివాసులను తరలించమని చెపుతున్నది. నిర్వాసితుల విషయంలో ప్రభుత్వాలు ఎంత దుర్మార్గంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో గమనించితే ఈ ముసాయిదా అంతా 'పెసా', 'అటవీహక్కుల చట్టాలలో' పేర్కొన్న ఆదివాసుల గ్రామసభల అధికారాలు, హక్కులన్నన్నింటినీ కాలరాచేందుకు వచ్చిందని అర్థం అవుతుంది.

## ఆదివాసీ పోరాట లక్ష్యం

దోపిడీశక్తుల దురాశ ఫలితంగా, ప్రకృతిని విచ్చలవిడిగా నాశనం చేసిన ఫలితంగా ప్రకృతిలో తీవ్ర మార్పులు, శీతోష్ణస్థితులలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. ప్రకృతిని నాశనంగావించే ఇంతటి గంభీరమైన పర్యావరణ ఉల్లంఘనలను తీవ్ర నేరాల స్థాయి నుండి కొద్దిపాటి జరిమానాలతో సరిపెట్టే స్థాయికి ప్రస్తుత అటవీ చట్ట సవరణలలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అటవీభూములను విచ్చలవిడిగా కొల్లగొట్టటానికి దోపిడీదారులకు ఇది మరింత వూతమిస్తోంది. ఇంతేకాదు; మధ్యప్రదేశ్ రాష్ట్రం - భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ పరిశ్రమ నుండి వెలువడిన, వేలాదిమందిని హతమార్చిన విషవాయువు లీకేజీ కానీ; ఇటీవల ఎల్‌జి పాలీమర్స్‌లో విషవాయువులు వెలువడటం వంటివి కానీ - నేరపూరిత చర్యలుగా ఇకనెంతమాత్రమూ పరిగణింపబడవు. ఇలాంటి ఘటనలలో మరణించినవారి కుటుంబాలకు ప్రభుత్వం కొంత మొత్తంలో పరిహారం చెల్లించి, దీనికి కారణమైన పరిశ్రమపై కొంత పన్ను విధించటంతో కథ ముగిసిపోతుంది.

కనుక, ఆదివాసీలు, ప్రజానీకం మొత్తంగా ప్రస్తుత ప్రతిపాదిత 1927 అటవీ చట్టసవరణలను వ్యతిరేకించాలి. మన పర్యావరణాన్ని కాలుష్యమయం చేసే, మన అటవీ భూములను కొల్లగొట్టే ఈ సవరణలను వ్యతిరేకిస్తూ ఆదివాసులు తమ జీవించే హక్కు కోసం, ప్రజానీకం ఆరోగ్యకర పర్యావరణం కోసం డిమాండ్ చేస్తూ ఉద్యమించాలి.



# పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల వ్యధలూ-ఆందోళనలు

**పోలవరం** ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద నిర్వాసితుల సమూహాలను సృష్టిస్తున్న ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు వల్ల 256 గ్రాములు మునిగిపోతాయని, 1,77,275 మంది నిర్వాసితులౌతారని 1985 నాటి సర్వే మీద ఆధారపడి గత ప్రభుత్వాలు అంచనా వేశాయి. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు వల్ల ఏర్పడుతున్న ముంపు వల్ల ఈ లెక్కలు ఇంకా పెరిగి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 371 గ్రామాలు ముంపుకు గురౌతాయని తేలింది. 2019లో ఆర్&ఆర్ కమీషనర్ నివేదిక ప్రకారం 5,08,874 మంది నిర్వాసితులౌతారు. మొత్తం నిర్వాసితులలో 53 శాతం మంది అనగా 3 లక్షలమంది ఆదివాసులే ఉన్నారు. ప్రాజెక్టు వల్ల కలిగే లాభాలను ఎక్కువగా చెప్పి, దానికయ్యే ఖర్చులు, సమస్యలను తక్కువ చేసి చెప్పాలనే రాజకీయ అవసరాల రీత్యానే నిర్వాసితుల గురించి తక్కువ అంచనాలు వేయబడినాయని అర్ధమౌతుంది.

గత ఇరవై ఏళ్ళుగా అధికారంలో ఉన్న పార్టీలు అవి, కేంద్రంలోని కాంగ్రెసు, బిజెపిలూ, రాష్ట్రంలోని కాంగ్రెసు, టి.డి.పి, వై.సి.పిలలో అది ఏదైనా పోలవరం ప్రాజెక్టు మా హయాంలోనే 70 శాతం, 80 శాతం పూర్తయిందని గొప్పలు చెప్పుకొంటూ వచ్చాయి కానీ నిర్వాసితులకు ఎంతవరకూ పునారావాసం కల్పించాయో చూస్తే ప్రజల పట్ల వీటి చిత్తశుద్ధి ఏమిటో తేలుతుంది. 2019 నాటికి మొత్తం నిర్వాసితులలో కేవలం 4 శాతం మందికి మాత్రమే పునరావాసం కల్పించారు. 2019 నాటికి ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాము కట్టినందువలన, ప్రాజెక్టు పూర్తవడంతో సంబంధం లేకుండా ముంపు సమస్య ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న గ్రామాలూ, పొలాలు నెలల తరబడి నీటిలో మునిగి ఉంటున్నాయి. నిర్వాసితులు వారివారి గ్రామాలలో నివశించే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల ఎత్తున కట్టి నీరు నిల్వచేస్తామని చెప్పినవారు, ఇప్పుడు 41.15 మీటర్ల ఎత్తు వరకే ప్రాజెక్టు నీరు నిల్వచేస్తాము కనుక అంత ఎత్తువరకూ మునిగిపోయే గ్రామాలకే పునరావాసం కల్పిస్తామని చెపుతున్నారు. దాని ప్రకారం చూసినా 2023 పార్లమెంటులో కేంద్రం చెప్పినదాని ప్రకారం 41 మీటర్ల ఎత్తు వరకూ ముంపుకు గురయ్యే 20,946 కుటుంబాలకు గానూ ఇప్పటివరకూ పునరావాసం కల్పించిన కుటుంబాలు 11,677 మాత్రమే. (ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య 1,06,006) దీనిని బట్టి ఈ ప్రాజెక్టు వల్ల సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా పునరావాసం కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైయ్యాయని ప్రభుత్వాల లెక్కలే చెపుతున్నాయి.

నిర్వాసితులకు కల్పించినట్లుగా చెపుతున్న నష్టపరిహారం, పునరావాసాలు కూడా అరకొర లెక్కలే. ఒకరికి కుటుంబ పరిహారం (ఆర్&ఆర్ ) ఇస్తే, వారికి ఇళ్ల నష్టపరిహారం రాలేదు. అంతేకాదు, ఈ 10 శాతం మందికి పునరావాసం కూడా నిర్వాసితుల సొంత నిర్ణయాలతో జరగలేదు. వరదలు వచ్చి ముంచెత్తుతుంటే విధిలేని స్థితిలో కాలనీల నిర్మాణం పూర్తికాకుండానే గ్రామాలను ఖాళీ చేయాల్సిన స్థితి ఏర్పడింది. అయినా వరదలు మాకు కొత్తకాదని నిలబడ్డచోట, అధికారులు వివిధ రూపాలలో బెదిరించి ఖాళీ చేయించారు.

## బలవంతపు తరలింపులు

పోలవరం ప్రాజెక్టు పునరావాసం పూర్తిగా కల్పించకుండానే 2019 నాటికి ఎగువ కాఫర్ డ్యామ్ అనే మట్టికట్టని వేసి నీరు నిల్వబెట్టి, నిర్వాసిత ప్రజలను భయభ్రాంతులకి గురిచేసి, 2021 జూలై నాటికి దేవీపట్నం మండలంలోని 44 గ్రామాలలో 32 గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించారు. కచ్చులూరు, గొందూరు, ఏనుగులగూడెం, సీతారం గ్రామాలను ప్రొక్లెయినర్లు పెట్టి ఇళ్ళను కూలగొట్టించారు. మరోవైపు దళారులు, వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు, అధికారులు ప్రజలను భయాందోళనలకు గురిచేసారు. ప్రజలకు ఇవ్వవలసిన కనీసపాటి ఆర్&ఆర్ కూడా ఇవ్వకుండా, భూములకు పూర్తిగా నష్టపరిహారాలు ఇవ్వకుండా, పునరావాస కాలనీలు పూర్తి చేయకుండా, ఆ కాలనీలలో కనీసపాటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా చేసారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి స్థిరనివాసం ఉంటున్న అనేక మందిని చిన్న చిన్న సాంకేతిక కారణాల సాకుతో ఆర్&ఆర్‌కు అనర్హులుగా ప్రకటించారు. అనేక గ్రామాలలో గిరిజనుల సాగులో ఉన్న పట్టా భూములకు ఇప్పటికీ నష్టపరిహారాలు నిర్ణయించలేదు. పోలవరం మండలంలోని కొరుటూరు, టేకూరు గ్రామాలకి వివాదాలలో ఉన్న భూమి చూపించడం ద్వారా అక్కడ భూముల పొందలేక ఇప్పటికీ అక్కడ ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు విలీన మండలంలో వందలాది గ్రామాలు ఇటీవల వరదలలో ముంపునకు గురయ్యాయి. ఈ సమస్యలు ఏమీ పరిష్కారం చేయకుండా వరద భయం చూపించి బలవంతంగా ఖాళీ చేయించారు.

## కాంటూరులనే తప్పుడు లెక్కలతో నిర్వాసితులను విభజించడం

భూముల ఎత్తు పల్లాలను మ్యాపులలో వివరించే రేఖలను కాంటూరు లెక్కలని అంటారు. ఒక కాంటూరును ఒక మీటరు ఎత్తుగా నిర్ణయించి 41 మీటర్ల ఎత్తు అంటే 41 కాంటూరు ఎత్తు అనే పరిభాషను పత్రికల వారు ప్రజలకు నేర్పారు. ఇప్పుడు అందరి నోటి వెంట 'ఆర్&ఆర్' (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్), 'కాంటూరు' లాంటి మాటలను పునరావాస ప్రాంతాలలో మనం వినవచ్చు. 2013 భూసేకరణ చట్టం తర్వాత పునరావాసం, నష్టపరిహారాల చెల్లింపులను ఎగవేయడానికి ప్రభుత్వాలు ఈ కాంటూరు లెక్కల వాదనలను ముందుకు తెచ్చాయి. నిర్వాసితుల బతుకు సమస్యల కంటే కాంట్రాక్టర్ల, పాలకుల అవసరాలే ప్రాధాన్యత కలవని అధికారులు అనుకొన్నారు. నిజానికి కాంటూరులు మారవు కానీ ఈ కాంటూరు లెక్కలను ప్రభుత్వ రాజకీయ అవసరాలకు తగ్గట్లు అధికారులు మార్చడంతో నిర్వాసితులలో భయాందోళనలూ, గందరగోళాలు ఏర్పడ్డాయి.

దేవీపట్నం మండలంలోని దేవీపట్నం, పూడిపల్లి, కోయల వీరవరం, దామనపల్లి, కొత్తగూడెం, కత్తనపల్లి గ్రామాలు 41వ కాంటూరు లోపు లేవు కనుక, అవి మునగవు అని, ఈ 6 గ్రామాలను పునరావాసం కల్పించాల్సిన గ్రామాల లిస్టు నుండి 2018 నాటికే మినహాయించారు. ఈ 6 గ్రామాలకు మిగతా వారితోపాటు కాలనీల నిర్మాణం చేపట్టలేదు. అధికారులు కాగితాల మీద గోదావరి నది గురించి ఏ లెక్కలు వేసుకొన్నా 'నీరు పల్లమే ఎరుగును' అన్న భౌతిక సత్యం మారదు. 2019లో గోదావరికి వచ్చిన వరదలతో దేవీపట్నం, పూడిపల్లి, వీరవరం, కత్తనపల్లి, కొత్తగూడెం గ్రామాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. దీనితో పొమ్మనకుండానే పొగబెట్టినట్లు దేవీపట్నం, పూడిపల్లి గ్రామస్తులు 2020 సంవత్సరం నుండి ఇందుకూరు, గోకవరం, రంపచోడవరం, అద్దె ఇళ్ళలో ఉంటూ ఉపాధిలేక, అద్దెకట్టుకొలేక అనేక అవస్థలు పడుతున్నారు.

విలీన మండలాలైన చింతూరు వద్ద బొజ్జిరాయిగూడెం అనే ఆదివాసి గ్రామం మునుగుతుందని అధికారులు, రాయనపేట అనేచోట పునరావాస కాలనీ కట్టారు. అది కట్టేటప్పుడే ప్రజలు, ఈ కాలనీ కట్టే ప్రాంతం కూడా 1986లో వచ్చిన వరదలకు మునిగిందని చెప్పారు. అయినా కాంటూరు మ్యాపులో ఇది 42 మీటర్ల కంటే ఎత్తులో ఉందని అధికారులు పునరావాస కాలనీ అక్కడే కట్టారు. అది మొన్నటి వరదలకు దారుణంగా మునిగిపోయింది. 41 కాంటూరు కంటే ఎత్తులో ఉంది కనుక మునగదని అధికారులు చెప్పిన శబరికొత్తగూడెం గ్రామం కూడా ఇలాగే మునిగిపోయింది. వీటన్నిటి వల్ల విలీన మండలాల నిర్వాసితులు చాలా కలత చెందుతున్నారు. వారు సాగించిన ఆందోళనల వల్ల 42 కాంటూరు కంటే ఎత్తులో ఉన్నాయని మొదట మినహాయించిన 36 గ్రామాలను 41 కాంటూరు కంటే దిగువన ఉన్న గ్రామాలుగా గుర్తించి పునరావాసం కల్పించేందుకు ఇప్పుడు గ్రామసభలను అధికారులు నిర్వహిస్తున్నారు. ఇక వారికి కాలనీల నిర్మాణం జరిగేలోపు ఎన్ని సార్లు వరదలు రావాలో?

రైతుకూలీ సంఘం మొదటి నుండి ఈ కాంటూరు లెక్కలను వ్యతిరేకిస్తూ వస్తున్నది. కొండమొదలు ప్రజలు వారి పంచాయితీ గ్రామాలైన కత్తనపల్లి, కొత్తగూడెంలను మొత్తం గ్రామాల నుండి మినహాయించడాన్ని మొదట నుండీ వ్యతిరేకించారు. కొండమొదలు పంచాయితీలో వరదలు వస్తే మొదటగా ముంపునకు గురి అయ్యేది కత్తనపల్లి, కొత్తగూడెం ఈ రెండు గ్రామాలే. ఇంజనీరింగ్ అధికారుల యొక్క నిర్లక్ష్యం ఫలితంగా ఈ రెండు గ్రామాలను పోర్త్ ఫేజ్‌లో పెట్టి పంచాయితీలోని మిగతా గ్రామాలతోపాటు పునరావాస చర్యలు చేపట్టకుండా పక్కన పెట్టారు. ఆ రెండు గ్రామలకు కూడా పునరావాసం ప్రకటించేవరకూ తామూ కదలమని మిగిలిన గ్రామాల ప్రజలు స్పష్టం చేసారు. ఇలా అనేక ఆందోళనలు ఫలితంగా 2019 సెప్టెంబర్ నాటికి ఆ గ్రామాలకు కూడా అధికారులు గ్రామసభలు జరిపి ఆర్&ఆర్ నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటికే కొండమొదలు నిర్వాసితులు భూమికి భూమి కోరుకొన్న నేలదోనెలపాడు అనే ప్రాంతంలో మిగిలిన గ్రామాలకు ప్రభుత్వం పునరావాస కాలనీ నిర్మాణం ప్రారంభించింది. ఈ కత్తనపల్లి, కొత్తగూడెం గ్రామాలకు కూడా కొండమొదలు 10 గ్రామాలు నిర్వాసితులతో కలిపి కాలనీల నిర్మాణం జరపాలని, ఆ కాలనీల నిర్మాణం పూర్తయ్యే వరకూ, అందరికీ ప్రభుత్వం ఒప్పుకొన్న భూములు సమకూర్చేవరకూ ప్రజలు వరద ముంపులో కొండమొదలులోనే ఉన్నారు కానీ గ్రామాలను ఖాళీ చేయలేదు. అయినా ఈ రెండు గ్రామాల కాలనీల నిర్మాణం ఆలస్యం అయింది. ఆ రెండు గ్రామాల వారూ, నేలదోనెలపాడు పునరావాస కాలనీ పక్కనే సర్వే నెంబరు 4 నుండి 10 మధ్యలోని ఎతైన ప్రదేశంలో కాలనీ నిర్మాణం జరపాలని కోరుకోగా ప్రభుత్వం మాత్రం నేలదోనెలపాడులోనే ఊట భూములలో కాలనీ నిర్మాణం చేపట్టారు. "ఈ ఊట భూములలో కాలనీల నిర్మాణం జరిగితే ప్రతి వర్షానికి ఇళ్ళు మునిగిపోతాయని ప్రజలు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ఫలితంగా స్థలం అయితే మార్చలేదుకానీ ఆ ఊట భూములలో భవిష్యత్‌లో ఊట సమస్యలు లేకుండా మిగిలిన కాలనీల ఎత్తువరకూ మొత్తం 6 అడుగుల ఎత్తున మట్టిపోయించి, కాలనీ నిర్మాణం గట్టిగా చేయించుకోగలిగారు.

## సమస్యల నిలయాలుగా పునరావాస కాలనీలు – నిర్వాసితుల నిరసనలు

2013 భూసేకరణ చట్టం అమలు చేయడంలో అధికారులు ఘోరంగా విఫలం అయ్యారు. ఫలితంగా ఇప్పటికీ లక్షలాది నిర్వాసిత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. నిర్వాసితుల మనోభావాలను కనీసం పరిగణలోకి తీసుకోకుండా నిర్వాసిత ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా ఆర్&ఆర్ కాలనీలు నిర్మాణం చేపట్టారు. మంటూరు గ్రామ నిర్వాసితులు మొదట నుండి గంగవరం మండలం పిడతమామిడి గ్రామం వద్ద పునరావాసం కోరుకున్నారు. ఏనుగులగూడెం, అగ్రహారం, తాళ్ళూరు గిరిజనులు దేవీపట్నం మండలంలోని ముంపుకి గురికాని ఎం.రావిలంక వద్ద పునరావాసం కోరుకున్నారు. కానీ అధికార యంత్రాంగం మాత్రం ఈ నాలుగు

గ్రామాల గిరిజనులు కోరుకున్న చోట కాలనీలు కట్టలేదు. ఇప్పటికీ ఆ కాలనీకి పూర్తి మౌలిక సదుపాయలు కల్పించలేదు. తాళ్ళూరు గ్రామానికి కూడా అంతే. వాళ్ళు ఇప్పటికీ కాలనీకి పూర్తిగా రాలేదు. మడిపల్లి, పెనికిలపాడు, మూలపాడు, గానుగులగూడెం, గుబ్బలంపాలెం, చిన్న రమణయ్య పేట, దండంగి, సీతారం, కచ్చులూరు, గొందూరు తదితర నిర్వాసిత కాలనీలలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అయిన మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు, స్మశానాలు పూర్తి చేయలేదు. మరికొన్ని ఇళ్ళ నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి చేయలేదు. గోకవరం మండలం కృష్ణుడుపాలెంలో నిర్మించిన గిరిజనేతరుల కాలనీ అయితే (సుమారు 1100 ఇళ్ళు) ఇప్పటికీ అక్కడ స్మశానం లేదు. భూమికి భూమి అనేది పూర్తిగా అమలు కాకపోవడం, భూములు కూడా వ్యవసాయానికి పనికిరాని భూములు చూపించడం, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాస కాలనీల్లో కల్పించవలసిన 25 రకాల మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించడం జరగలేదు. ఫలితంగా కాలనీలకి వెళ్ళిన ప్రజలు ఉపాధి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ కూలీ పనులను వెతుక్కోవడానికి చుట్టుపక్కల గ్రామాలకు వెళుతున్నారు. వీరు వెళుతుండటంతో కూలీ రేట్లు కూడా సగానికి సగం తగ్గించి వేశారు యజమానులు. ఎక్కువ శ్రమతో తక్కువ వేతనాలను పొందుతూ జీవితాలను గడపవలసిన స్థితిలోకి నెట్టబడ్డారు అడవి బిడ్డలు.

ప్రభుత్వం మొదట నిర్వాసితులకు అగ్గిపెట్టె లాంటి ఒంటిగది కాలనిల నిర్మాణాలు చేపట్టింది. రెండు గదుల కాలనీ కావాలంటే నిర్వాసితులు తమ ఆర్&ఆర్‌లో వచ్చే డబ్బులు చెల్లించాలని చెప్పింది. మరోవైపు జీవో 641 అనే రహస్య జీవోను విడుదల చేసింది. ప్రతి నిర్వాసిత కాలనీకి రెండు గదుల నిర్మాణం కోసం 4 లక్షల 55 వేలు కేటాయిస్తున్నట్లు పేర్కొంది. దానిని నిర్వాసితులకు తెలియకుండా దాచిపెట్టింది. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకొనేందుకే ఈ జీవో వచ్చింది. ఈ విషయం బట్టబయలు అవడంతో నిర్వాసితుల ఆందోళనలు ముందుకు వచ్చాయి. 2018లో దేవీపట్నం ప్రాంత నిర్వాసిత పోరాట కమిటీ ఏజెన్సీ గిరిజన సంఘం నాయకుడు, అమరుడు కా॥ చెదల వీరపురెడ్డి నాయకత్వాన ఏర్పడింది. వివిధ ప్రాంతాల కాలనీ నిర్మాణ పనులను ఆపి రెండు గదుల కాలనీ ప్రభుత్వ ఖర్చుతోనే నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఆ కాలంలో ఇంకా వివిధ ప్రాంతాలలో జరిగిన ఆందోళనల ఫలితంగా రెండు గదులు, వంటగది, వరండా, బాత్‌రూంలతో కూడిన కాలనీ ఇంటిని నిర్వాసితులు సాధించుకొన్నారు. పునరావాసం బిచ్చం కాదనీ, ఆత్మగౌరవంతో నివసించడం నిర్వాసితుల హక్కు అని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) మొదటి నుండి నినదిస్తూనే వుంది.

## భూమి హక్కు సాధనతో ముడిపడివున్న నిజమైన పునరావాసం

ప్రభుత్వ పునరావాస విధానం నిర్వాసితుల జీవితాలను పనిదినాలతో లెక్కించి నాలుగు డబ్బులు విదిలించడంగానూ, తమ గ్రామాలను ఖాళీ చేసి వచ్చిన నిర్వాసితులను ఒకే చోట కేంద్రీకరించేలా పునరావాస కాలనీలను ఒకే ప్రాంతంలో నిర్మించడంగా వుంది. ఆదివాసులందరూ వ్యవసాయదారులే. కానీ భూమి పట్టాలు కలిగి వున్నవారే రైతులంటున్నది ప్రభుత్వం. కొండపోడులు, కొండబంజర్లు సాగుచేస్తున్నవారు. తమ పెద్దల భూముల కాజేసిన భూస్వాములపై పోరాడుతూ తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకొని సాగుచేస్తున్న ఆదివాసులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. కానీ ప్రభుత్వం ఇలాంటి నిర్వాసితులను రైతులుగా కాక కూలీలుగా పరిగణించి, భూమికి భూమి ఇవ్వకుండానే నిర్వాసితుల కాలనీలను చౌక కూలీల అడ్డాలుగా మార్చుతున్నది. భూమికి భూమి, అడవికి అడవి అన్నవి న్యాయమైన పునరావాసానికి ప్రాధమికమైనవి. వీటిని ప్రభుత్వం ఆచరణలో గుర్తించ నిరాకరిస్తున్నది.

ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) అనుబంధ సంఘంగా గత 50 సంవత్సరాలుగా భూపోరాటాలను సాగిస్తున్నది. సంఘ నాయకత్వాన ఆదివాసుల న్యాయమైన భూపోరాటాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాలలో పునరావాసంలో భూమి హక్కును కాపాడుకొన్నారు. కొండమొదలు ఆదివాసులు వివిధ రూపాలలో సాగించిన పోరాటల ఫలితంగా ప్రభుత్వం 22-6-2017న ఆదివాసులకు వారి సాగులో ఉన్న 426 ఎకారాల భూమికి 426 కొనుగోలు ఇస్తామని, ఆదివాసుల సాగులో ఉన్న 160 ఎకరాల బంజరు భూములకు నష్టపరిహారం అందిస్తామని, చెపుతూ ఆదివాసి పెద్దలతో ఒక అవగాహన పూర్వక ఒప్పందం (ఎం.ఒ.యు) కుదుర్చుకొంది. దాని అమలు కోసం తాత్సారం చేస్తుంటే ఆదివాసులు వివిధ సమయాలలో ఆందోళనలు చేయడమే కాక 2019 నుంచీ మిగిలిన ఆదివాసీ గ్రామల వారు ఖాళీ చేసినా కొండమొదలు పంచాయితీ గ్రామాలు ఖాళీ చేయకుండా భూముల సంగతి తేల్చినాకే ఇక్కడినుంచి కదులుతామని స్పష్టం చేసారు. కరెంటు లేకపోయినా, రవాణా సౌకర్యాలు, వైద్య సౌకర్యాలను నిలిపివేసినా గొప్ప నిబ్బరంతో నిలిచారు. భూముల నోటిఫికేషన్‌లన్నీ విడుదల అయినాక, వారు కోరుకొన్న నేలదోనెలపాడు కాలనీలో అన్ని నిర్మాణాలు పూర్తయిన మీదట 2022 ఏప్రియల్‌లో కాలనీలోకి ప్రవేశించారు. ఈవిధంగా భూమి హక్కుతోనే ఇతర అంశాలన్నీ ముడిపడివున్నాయని వారు తమ పోరాటం ద్వారా చాటి చెప్పారు.

# అడవులను కాపాడరో....

- రైతు వాసుదేవరావు

పల్లవి : అడవులను కడతేర్చి ఆ గనులను దిగమింగి
పాలకులే పగబట్టి పాపానికి ఒడిగట్టి
బహుళజాతి కంపెనీల బానిసలుగ ఐనారు
ఆదివాసులనెల్ల వెళ్ళగొడుతున్నారు
ఆదివాసులకండగా ఓరన్నా
అడవులను కాపాడరో మాయన్న
దేశాన్ని కాపాడరో మాయన్న ॥ ఆదివాసుల ॥

చ॥ నీటిలోని చేపలను నింగిలోని చుక్కలను
ఎగిరేటి పక్షులను చెట్టులను చేమలను
సమస్త లోకమును హస్తగతమున చేయ
ఆదివాసులంత అడవి నొదలాలంటు
పాలకుల పాచికతో సుప్రీము తీర్పంట
అన్యాయమిది యంటు ఎదిరించరండయా ॥ ఆదివాసుల ॥

చ॥ ఆదివాసులంటె ఎవరు కాదా మన పూర్వీకులు
నిప్పు ఒక్కటే కాదు విల్లు భల్లెమెక్కడిది
వారేసిన తొలి అడుగులే ఓరన్న
మన అందరి మలి బాటలురా మాయన్న ॥ ఆదివాసుల ॥

చ॥ లక్షలాది చెట్లు నరికి అడవులనంతంచేసి
మొక్కుబడిగ మొక్కలేసి నర్సరీల పెంపకం
నబోనబోనకజనకరి బేడపరక బాగోతం
లాభాల ఆబలో బహుళజాతి దుర్మార్గం ॥ ఆదివాసుల ॥

చ॥ పోరుసలిపి సాధించిన ఎన్నెన్నో చట్టాలను
తుంగలోన తొక్కినారు నిను నిలువున దోచినారు
అటవీ హక్కుల చట్టం ఆ కోవలో చేరింది
అడవిలోన ఆదివాసి ఆక్రందన వినకున్నది
నువు చేసిన చట్టాన్నే అమలుచేయమంటుంటే
నక్సలైటు నీవంటు చెరసాలలో బెడుతోంది ॥ ఆదివాసుల ॥

చ॥ ఆదివాసీలేని అడవి అసలు లేనే లేదు
అడవిలో ప్రతి అణువు ఆదివాసీదేనోయ్
ఏమార్చి ఉండగా వామనుడు వచ్చాడు
అడవులను గుత్తగా మింగజూస్తున్నాడు
పీడితులు తాడితులు అడవి బిడ్డలంతా
పోరాట యోధులు పోరాడ కదిలారు
చావో రేవో అంటూ శపథమె చేబూనారు ॥ ఆదివాసుల ॥

# పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల నిరవధిక ధర్నా

## రంపచోడవరం - 2020 నవంబరు 30, డిసెంబరు 1




**పోలవరం** ప్రాజెక్టు నిధుల సమస్యలు, అంచనాల వివాదాలకే పత్రికలూ, మీడియాలో చర్చ పరిమితమైపోయింది. ఇలాంటి సమయంలో విస్మరించబడుతున్న, అసలు మౌలిక సమస్య అయిన నిర్వాసితుల సమస్యలను తెర మీదకు తెచ్చేలా నవంబరు 30, డిసెంబరు 1వ తేదీలలో రంపచోడవరంలో నిర్వాసితుల నిరవధిక ధర్నా జరిగింది. ఒకపక్క ప్రాజెక్టు నిర్మాణం వెంటనే పూర్తిచేయాలనే ప్రకటనలూ, మరోపక్క అమలుకాని పునరావాసం, నష్టపరిహారం గురించి చట్టంలో పేర్కొన్న అంశాలు నిర్వాసితులలో తీవ్ర అలజడులను రేకెత్తిస్తున్నాయి. పేరుకొనిపోతున్న సమస్యలపై ఇప్పుడు కదలకపోతే తీవ్రంగా నష్టపోతామనే ఆందోళనతో నిర్వాసితులంతా వున్న సమయంలో ఈ నిరవధిక ధర్నాకి ఏజెన్సీ గిరిజన సంఘం పిలుపు ఇచ్చింది.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో నిర్వాసిత సమస్యలలో ఆదివాసుల భూమి, ఆత్మగౌరవ సమస్యలు కూడా మిళితమై వున్నాయి. ముఖ్యంగా గిరిజనోద్యమం సాగుతున్న ప్రాంతాలైన కొండమొదలు, మంటూరులలో ఆదివాసుల భూపోరాటంతో ముడిపడిన నష్టపరిహారం, పునరావాస సమస్యలపై చాలాకాలంగా ఎడతెగని ఆందోళన సాగుతున్నది. రక్తాన్ని చిందించి భూములను నిలబెట్టు కొంటూనే కొండమొదలు గిరిజనులుసంఘం నాయకత్వాన భూస్వాములు వేసిన కేసులపైనా, భూసేకరణ అధికారుల నిర్ణయాలపైనా న్యాయపోరాటం కూడా చేసారు. ఈ క్రమంలో గిరిజనులకు 426 ఎకరాల భూమి కొనుగోలుచేసి ఇవ్వడం, ఆదివాసుల సాగులోని 150 ఎకరాల బంజరు భూములకు నష్ట పరిహారం చెల్లించడం వంటి అంశాలతో అధికారులు ఆదివాసులతో అవగాహన పూర్వక ఒప్పందాన్ని (ఎం.ఓ.యు) 22-6-2017న చేసుకొన్నారు. కానీ దానిని అమలుచేయడంలో జరుగుతున్న విపరీతమైన జాప్యం ఆదివాసుల ఆందోళనకి కారణంగా వుంది. ఇలా ఎంఓయును అమలుచేయకపోగా, భూవివాదాల కేసులు నడుస్తుండగానే 10 మంది గిరిజనేతరులకు కొందరు అధికారులు అక్రమంగా 4 కోట్ల 88 లక్షలు చెల్లించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను శిక్షించి, ఇచ్చిన సొమ్ములను తిరిగి రాబట్టాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మంటూరు ఆదివాసులకు వారు కోరుకొన్నచోటకాక అధికారులు నిర్ణయించినచోట పునరావాసకాలనీ కట్టటాన్ని వ్యతిరేకిస్తున్నారు. వారి సాగులోని డి. పట్టా భూములకు, బంజరుభూములకు నష్టపరిహారం లెక్కించాలని కోరుతున్నారు. ఇలాంటి నిర్దిష్టమైన డిమాండ్‌లతోపాటు మొత్తం ప్రాజెక్టు నిర్మాణం డిమాండ్‌లతోపాటు మొత్తం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేనాటికి 18 ఏళ్ళు నిండినవారినందరినీ పునరావాసానికి అర్హుల జాబితాలో చేర్చాలని, అలా నిర్వాసితుల అర్హుల లిస్టును గ్రామ సభల ముందుంచి ఆమోదించాక ఖరారు చేయాలని, సరైన నాణ్యతా ప్రమాణాలతో కాలనీల నిర్మాణం జరగాలని, ఇంకా నష్టపరిహారాలు అందనివారందరికీ నష్టపరిహారాలు అందించాలని కోరుతున్నారు.

**"2017 నాటి ఎంఓయును అమలు చేయాలని, అవినీతి నిగ్గుతేల్చాలని, బంజరు, డి పట్టా భూములకు నష్టపరిహారం ఇవ్వాలని, 18 ఏళ్ళు నిండినవారందరికీ ఆర్అండ్ఆర్ కల్పించాలని, ఆదివాసులు కోరుకొన్నచోటే పునరావాసం కల్పించాలని" తదితర నినాదాలతో రంపచోడవరం జూనియర్ కాలేజి నుండి బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ఐటిడిఏ కార్యాలయం వరకూ ఊరేగింపు సాగింది.**

పై డిమాండ్లపై 30-11-2020న వందలాదిమందితో ఊరేగింపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనే పట్టుదలతో కొండమొదలు, మంటూరు తదితర ప్రాంతాలనుంచీ సరైన రవాణా సదుపాయాలు లేకపోయినా స్త్రీ పురుషులంతా కదిలారు. నామమాత్రపు నష్టపరిహారం పొంది దగాపడ్డ కచ్చులూరు, పెనికలపాడు, నేలకోట వంటి వివిధ గ్రామాలనుంచీ ప్రతినిధులు వచ్చారు. కొండమొదలు గిరిజనోద్యమ ప్రేరణతో పశ్చిమగోదావరి జిల్లాలో సాగుతున్న గిరిజనోద్యమ గ్రామాల నుంచీ ఆదివాసి ప్రతినిధులూ ఈ నిరవధిక ధర్నాకు తరలివచ్చారు. "2017 నాటి ఎంఓయును అమలుచేయాలని, అవినీతి నిగ్గుతేల్చాలని, బంజరు, డి పట్టా భూములకు నష్టపరిహారం ఇవ్వాలని, 18 ఏళ్ళు నిండిన వారందరికీ ఆర్అండ్ఆర్ కల్పించాలని, ఆదివాసులు కోరుకొన్నచోటే పునరావాసం కల్పించాలని" తదితర నినాదాలతో రంపచోడవరం జూనియర్ కాలేజి నుండి బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ఐటిడిఏ కార్యాలయం వరకూ ఊరేగింపు సాగింది.

అనంతరం నిరవధిక ధర్నాను ఏజెన్సీ గిరిజనసంఘం అధ్యక్షుడు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి ప్రారంభించారు. ధర్నాకు హాజరైనవారిని ఉద్దేశించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పునరావాసం బిచ్చం కాదని నిర్వాసితుల హక్కని వివరించారు. కొండమొదలు గిరిజనులు 50 ఏళ్లుగా భూముల కోసం పోరాడుతూ సాగుచేస్తూ ఉంటే, వారికి కాకుండా శివనారాయణరెడ్డి అనే అధికారి గిరిజనేతరులకు 4 కోట్ల 88 లక్షల రూపాయలను అక్రమంగా ఇచ్చారని, వీరందరిపై క్రిమినల్ కేసులు బనాయించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. అదేవిధంగా 2017లో ఎంఓయును కుదుర్చుకునేప్పుడు దానిని 6 నెలల్లో అమలుచేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు అయినా ఇప్పటివరకు అమలుచేయలేదని వివరించారు. ఎంఓయును వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేసారు. రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ డి. వర్మ ధర్నా ఎన్నిరోజులైనా కొనసాగుతుందని స్పష్టం చేశారు. మొదటిరోజు ధర్నాలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ, ఎపి గిరిజనసంఘం రాష్ట్ర నాయకులు ఎం. వాణిశ్రీ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఐ. రమణ, ఆదివాసుల ఆందోళనకు మద్దతుగా మాట్లాడారు. నవయువ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బాషా, పిడిఎస్ఓ నాయకులు విశ్వతేజ, విశ్వనాథ్లూ, ఆదివాసుల ఆందోళనకు సంపూర్ణమైన మద్దతు ప్రకటించారు. ఏజెన్సీ గిరిజన సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, సవలం రాంబాబు, రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కామ్రేడ్ శ్రీనునాయుడులు నిర్వాసిత ఆదివాసుల ఆందోళనకు మద్దతుగా ప్రసంగించారు. ఏజెన్సీ గిరిజనసంఘం నాయకులు కామ్రేడ్స్ వేట్ల విజయ, చెదల వీరపరెడ్డి తదితరులు సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ధర్నా కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేసారు. చీకటిపడే వరకు పాటలు, ఉపన్యాసాలు సాగాయి. ఆ చలిలో ప్రజలు అక్కడే రోడ్డు పక్కన వంటలు చేసుకొని తిన్నారు. ఆ టెంటులలోనే నిద్రపోయారు.

మరునాడు అంటే 1-12-2020న ఉదయం 8 గంటల నుండే ధర్నా కొనసాగింది. తొలుత 1982 నవంబరు 29న అమరులైన కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల 37వ వర్ధంతిగా ధర్నా శిబిరంలోనే కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి అధ్యక్షతన సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాట క్రమాన్ని వివరించారు. కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ నిర్బంధాన్ని అధిగమించి భూములను సంఘ నాయకత్వాన ఆదివాసులు స్వాధీన పర్చుకొన్నారని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా ఆ భూములు ఆదివాసులవేనని స్పష్టం చేసిందని చెప్పారు. జిల్లా న్యాయస్థానాలు సైతం భూములు గిరిజనులవేనని చెప్పినా వాటిని రెవెన్యూశాఖ అమలుచేయని ఫలితంగా 500 ఎకరాల భూమి సమస్య పరిష్కారం కాలేదని, అయినా పోరాటం కొనసాగుతూనే వుందని, ఈ క్రమంలో రాజులు, లక్ష్మయ్యల పోరాట స్ఫూర్తితో ముందుకు పోవాలని వివరించారు. అనంతరం నాటి కార్యక్రమంలో రైతుకూలీసంఘం గత రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె. కోటయ్య, పీడిత ప్రజల నాయకుడు, గిరిజన బిడ్డ కామ్రేడ్ అంగడి చెన్నయ్యలు డిసెంబరు 1వ తేదీన అమరులైనారని, వీరి కృషిని సంఘం సహాయ కార్యదర్శి కామ్రేడ్ డి. వర్మ వివరించగా ధర్నా శిబిరం వారికి ప్రత్యేకంగా జోహార్లు తెలిపింది. అనంతరం పంజాబ్ రైతాంగ ఆందోళనకు మద్దతుగా, ఆ ఆందోళనలో మరణించినవారికి జోహార్లు చెబుతూ ధర్నా శిబిరం మౌనం పాటించింది. ఈ ధర్నాలో మానవ హక్కుల కార్యకర్త అక్కిస బాలు, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కామ్రేడ్ సోమన్న, చింతూరు నుంచి మడిరాజు, సి.పి.ఐ. డివిజన్ కార్యదర్శి కుమార్ తదితరులు ధర్నాలో ఆదివాసులు ప్రదర్శిస్తున్న పట్టుదలకు అభినందనలు తెలిపారు. ధర్నాకు సంఘీభావం ప్రకటించారు.

మధ్యాహ్నం ప్రాజెక్టు అధికారితో చర్చలు జరిగాయి. ధర్నాలో వ్యక్తం అయిన నిర్దిష్టమైన డిమాండ్‌లను 10 రోజులలో పరిష్కరించే క్రమం మొదలుపెడతామని, ఈ సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్య స్పష్టం చేశారు. మొత్తం సమస్యలను ప్రభుత్వానికి తెలిపి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

రెండు రోజులపాటు ధర్నా శిబిరం నినాదాలు, పాటలు, రేల నృత్యాలు, ఉపన్యాసాలతో స్ఫూర్తిదాయకంగా జరిగింది. క్రమశిక్షణతో, రాజకీయ పట్టుదలతో ఆదివాసులు చివరివరకూ పాల్గొన్నారు. ఈ నిరవధిక ధర్నాకు సంఘీభావంగా పశ్చిమగోదావరి జిల్లా నుండి ఏజెన్సీ గిరిజనసంఘం నాయకులు, ప్రతినిధులు హాజరై, రెండురోజులు ధర్నాలో పాల్గొన్నారు. ముగింపుగా ధర్నాకు హాజరైనవారికీ, ఈ ధర్నా విజయవంతం కావడానికి సహకరించిన ఉద్యోగ, ప్రజానీకానికి, మద్దతు తెలిపిన వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులకు, మేధావి, ప్రజాతంత్రవాదులకు ఏజెన్సీ గిరిజనసంఘ నాయకులు కామ్రేడ్స్ చెదల వీరపురెడ్డి, వంజం జోగారావులు ధన్యవాదాలు తెలిపారు.

“అమ్మకుతోడుగ నడుస్తూ నాన్నతో పోటీపడుతూ
లేలేత పాదాలతో పరిగెడుతున్న
బుడిబుడి నడకల బుడ్డోడు
ఎండిన రొమ్ములపైకి ఎగబడుతున్న పసికూనలు
చీకీ చీకీ చీదరపెడుతూ చంటిబిడ్డలు
కన్నీళ్ళుతప్ప చనుబాలు కరువైన అమ్మతనం!
పాలకు ఏడ్చిఏడ్చి ప్రాణాలొదిలేస్తున్న పసికూనలు
సొమ్మసిల్లి సోలిపోతున్న చిన్నారులు
మార్గమధ్యంలో కాలంచేసిన తల్లులు
కడసారి చూపు నోచుకోని బిడ్డలు
బంధాన్ని వదులుకోలేని ఆత్మీయులు
భార్యను భుజానమోస్తున్న పెనిమిటి
కుంటుతున్న చిన్నారి, కూలబడ్డ పసివాడు
నడుస్తున్న దారిలో నవజాతశిశు మరణం
మార్గమధ్యాన వదిలేసి మైలబట్టలతో సాగిపోతున్న
కన్నతల్లి గర్భశోకం!
చెట్టుకు కాయలు బరువుకాదన్నట్టు
ముగ్గురు బిడ్డల్ని మోస్తున్న మాతృమూర్తి!
గత్యంతరంలేని ప్రయాణం
గమ్యం చేరాలన్న తపన!
అగచాట్లు బగిచాట్లు నిట్టూర్పులు ఓదార్పులు
దారిపొడవునా తలచుకుంటూ
కలలను తలపోసుకుంటూ
తలబాదుకుంటూ పయనం!
బొబ్బలెక్కిన పాదాలు,
రక్తం చిమ్ముతున్న గాయాలు
బీళ్ళు పగులిచ్చినట్టు నెర్రెలిచ్చిన అరికాలి మడమలు
కళ్ళు తిరుగుతున్నాయి కాళ్ళు లాగుతున్నాయి
నీరసం ఆవహిస్తోంది, వళ్ళు జలదరిస్తోంది
పాలిపోయిన శరీరం తూలిపోతోంది
అయినా ఆగని ప్రయాణం!
ఊరికి చేరాలని ఉబలాటం
సాంత్వన పొందాలని ఆరాటం
అడుగడుగున అవరోధం
కన్నీటి మడుగుల్లో ప్రయాణం!
దారి పొడవునా రక్త పాదముద్రలతో
వలస భారత ఆధునిక చిత్రం
అది దీక్షకు సంకేతం
సంకల్పానికి సాకారం
పట్టుదలకు పతాకం
పాలకుల నిర్లక్ష్యానికి
పటేలు విగ్రహమెత్తు చిహ్నం!!”

– డా॥ జి.వి. కృష్ణయ్య

‘వలస భారతం’ (వచన కవితాకావ్యం) నుండి







# కొండమొదలు పునరావాస కాలనీ ఏర్పాటు

## 2022 ఏప్రిల్ 19



**గిరిజనులు** భూమి కోసం, అడవి, అటవీ సంపదపై సర్వహక్కులు గిరిజనులవేనని సుదీర్ఘకాలం పాటు సాగించి పాక్షిక విజయాలు పొందిన పోరాటం – కొండమొదలు భూపోరాటం. ఈ పోరాటం యొక్క క్రమం చాలా ఉన్నతమైనది. భూస్వాములకు, పెత్తందారీ శక్తులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక అరెస్టులను, నిర్భంధాలను, కాల్పులను తట్టుకొని 53 సంవత్సరాలపాటు సాగించిన, సాగుతున్న పోరాటం.

1969 నుండి నేటివరకు అనేక మలుపులతో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో గిరిజన ప్రజానీకం ఈ భూ పోరాటాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు. ప్రజలకు నాయకత్వం, నాయకత్వానికి ప్రజలు అన్న విధంగా ప్రజాస్వామిక చర్చల ద్వారా నాటి నుండి నేటి వరకు ప్రజలతో మమేకమై పార్టీ మార్గదర్శకత్వంలో చేసిన నిర్ణయాలను అమలు చేస్తూనే ఉన్నారు. 1982లో కుంజం రాజులు, మడిం లక్ష్మయ్యల బలిదానంతో కొండమొదలు గిరిజనోద్యమం ముఖ్యమైన మలుపు తీసుకున్నప్పుడు, సంయమనంతో వ్యవహరించి విజయాన్ని నిలబెట్టుకొన్నారు. ఇక్కడ బాధ్యత వహించిన అనేకమంది కామ్రేడ్స్ అందించిన స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

2004 నాటికి ఉభయగోదావరి జిల్లాలు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న ఖమ్మం జిల్లాలోని చింతూరు, భద్రాచలం, తదితర ప్రాంతాలలో ఆదివాసీ సమస్యలు, ముఖ్యంగా భూమి సమస్యపై ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రభావవంతమైన కృషి జరుగుతూ వచ్చింది.

సరిగ్గా ఆదివాసుల భూమి హక్కు సమస్య బలంగా ముందుకు వస్తున్న ఆ సమయంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తెరపైకి వచ్చింది. దానితో ప్రజాపోరాటంలో ఉన్న పోరాటశక్తుల బలాబలాల్లో మార్పులు వచ్చాయి. అంతవరకు ఒక్క భూస్వాములతోనే ప్రధానంగా పోరాటం ఉండేది. ప్రభుత్వం భూస్వాముల కొమ్ముకాయాలని ఎంత ప్రయత్నించినా తను చేసిన చట్టాలే తనకు ఆటంకంగా ప్రజలచేత మార్చబడ్డాయి. ప్రాజెక్టును సాకుగా చూపి అభివృద్ధికి – ఆదివాసులకు మధ్య పోటీ పెట్టి, 2009 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందనే ప్రభుత్వ ప్రచార హోరును ఉధృతంగా సాగించింది. నేటికీ పాలకవర్గ పార్టీలు ఈ ప్రచార హోరును ఆపలేదు. మొత్తం భూస్వామ్య శక్తులన్నీ ప్రాజెక్టు కాంట్రాక్టర్లను (రాజకీయ నాయకులే) ప్రజా వ్యతిరేకులను ఒక తాటిమీదకు తీసుకువచ్చి గిరిజన గ్రామ పెత్తందార్లను డబ్బుతో మభ్యపెట్టి లొంగదీసుకోవాలని చూసారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది అని తెలిసి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు మీదుగా ఖమ్మం జిల్లాలలో ప్రజలకు మరీ ముఖ్యంగా ఆదివాసీ ప్రజానీకానికి ఆందోళన కలిగించింది. అంతకు ముందున్న జలయజ్ఞం పేరుతో కొవ్వాడ (పశ్చిమగోదావరి), సూరంపాలెం (తూర్పుగోదావరి) ప్రాజెక్టుల నిర్వాసితుల పరిస్థితి ఒక్కసారిగా కళ్ళముందు మెదలడంతో ఆనాడు

ప్రజల్లో తీవ్ర నిరాశా నిస్పృహలు ఆవహించాయి. గ్రామాలు గ్రామాలు పంటలు పండించక, ఇళ్ళ మరమత్తుల వంటి పనులు కూడా ఏవీ జరగకుండా నిర్జీవంగా ఉన్న వాతావరణంలో ఉద్యమ నాయకత్వం ప్రజలకు శాస్త్రీయంగా పరిస్థితిని వివరిస్తూ, 2020 నాటికి కూడా ప్రాజెక్టు పూర్తికాదని సంఘం, సంఘం నాయకత్వం ప్రతి మలుపులోను తమ పోరాటాన్ని నిలుపుకుంటూనే పునరావాస సమస్యలపై ప్రజలను సమీకరించిన తీరును గమనించవచ్చును.

భూమి భూపోరాటం కేంద్రంగా అంతర్జాతీయ ప్రమాణాలతో శాస్త్రీయ, సమగ్ర పునరావాసం సాధన అన్న ఎజెండాతో ఏజెన్సీ గిరిజన సంఘం మడమ తప్పకుండా 'ముందు పునరావాసం, తరువాతే నిర్మాణం' అన్న స్పష్టమైన వైఖరితో నాటి నుండి ఈనాటికి కార్యక్రమాలు సాగిస్తున్నది.

ఇతర విప్లవ గ్రూపులతో భిన్నాభిప్రాయాలు, వివాదాలు ఉన్నప్పటికీ వాటిని ఎన్నడూ వివాదస్పదం చేయడానికి గాని, బహిరంగ ప్రచారం చేసే పద్ధతిని గాని ఎప్పుడు ఎంచుకోకుండా ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, మధ్యవర్తులకు, ప్రజాతంత్రవాదులకు వాస్తవాలు వెల్లడి చేస్తూనే వ్యతిరేక ప్రచారాలను తిప్పికొడుతూ వచ్చింది. భౌతికదాడులకు దారితీసిన సందర్భాలలో ప్రజల సహకారంతో వ్యవహరించిన తీరు ఎంతో ప్రభావవంతమైనది. ముఖ్యంగా వామపక్ష, ఇతర విప్లవ గ్రూపులతో ఐక్యంగా పోరాడే వైఖరిని కూడా అనుసరించారు.

ఏజెన్సీ గిరిజనసంఘ నాయకత్వం (రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) అనుబంధం) 2004 నుండి 'ముందు సమగ్ర పునరావాసం, తరువాతే ప్రాజెక్టు నిర్మాణం' అన్న విషయంపైనే ఆందోళనను కేంద్రీకరించింది. ప్రభుత్వాలు మాత్రం ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసం ఏకకాలంలో జరుగుతాయని చెప్పాయి. అంతా హుళక్కి.

ఇన్నేళ్ళుగా ప్రజలు చేసే ఆందోళనలు న్యాయమైనవని తెలిసింది. దాదాపు దశాబ్దన్నర పైగా నిర్మాణం జరుగుతున్న ప్రాజెక్టు సమగ్రమైన పునరావాసం కల్పించకుండా కాసిన్ని డబ్బులిచ్చి, భూములకు భూములివ్వకుండానే, సరైన పక్కా ఇళ్ల నిర్మాణం జరగకుండానే (పునరావాసం కల్పించకుండానే), స్పిల్‌వే నిర్మించకుండా కాఫర్ డ్యామ్ నిర్మించి గోదావరిలో నీళ్ళు నిలబెట్టి గ్రామాలను ముంచి రవాణా వ్యవస్థను స్తంభింప చేసి ప్రజలను తరలించే ప్రయత్నం చేసారు.

ఇటువంటి స్థితిలో 'గిరిజనులు, గిరిజనేతరులు ఎవరిదారిన వారు పోవటంకాదు. అందరం ఒక్కటై అందరికీ సమగ్ర, సక్రమ పునరావాసం పునర్‌నిర్మాణం సాధించుకుని కదలాలి' అని అమరులు కా॥ చదల వీరపురెడ్డి కన్వీనర్‌గా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పోరాట కమిటీ ద్వారా ప్రజలను సమీకరించారు. ప్రత్యక్షంగా కొండమొదలు భూపోరాటంతో సంబంధం ఉన్న గ్రామాలు మాత్రం అనేక ఆందోళనలు, నిరసనల రూపంలో ఈ పోరాటాన్ని సాగించిన ఫలితంగా ప్రజలు కోరిన దగ్గర కాలనీ ఇళ్ళ నిర్మాణం జరిగింది.

**'గిరిజనులు, గిరిజనేతరులు ఎవరిదారిన వారు పోవటం కాదు. అందరం ఒక్కటై అందరికీ సమగ్ర, సక్రమ పునరావాసం పునర్ నిర్మాణం సాధించుకుని కదలాలి' అని అమరులు కా॥ చదల వీరపురెడ్డి కన్వీనర్‌గా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పోరాట కమిటీ ద్వారా ప్రజలను సమీకరించారు. ప్రత్యక్షంగా కొండ మొదలు భూపోరాటంతో సంబంధం ఉన్న గ్రామాలు మాత్రం అనేక ఆందోళనలు, నిరసనల రూపంలో ఈ పోరాటాన్ని సాగించిన ఫలితంగా ప్రజలు కోరిన దగ్గర కాలనీ ఇళ్ళ నిర్మాణం జరిగింది. గ్రామసభల ద్వారా నిర్మాణం సక్రమంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్మించుకున్నారు.**

గ్రామసభల ద్వారా నిర్మాణం సక్రమంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్మించుకున్నారు.

కాలనీ ప్రారంభోత్సవంలో ప్రభుత్వం చొరబడి ఉద్యమాల ద్వారా సాధించుకున్న మొత్తం ఉద్యమ ఫలాన్ని స్థానిక రాజకీయ నాయకులు కాజేయాలని ప్రభుత్వం, అధికార యంత్రాంగం అండతో పెత్తనం చెలాయించాలని చూశారు. దీనిని గ్రహించిన ప్రజలలో ఆగ్రహం రగిలింది. సంఘం సంయమనంతో వ్యవహరించింది. ఇలాంటి సందర్భాలు రాకుండా వుండవని మనం సాధించుకోవలసింది మునుముందు చాలా ఉందని చెప్పుకుంటూ, ప్రజల చైతన్య స్థాయిని పెంచేలా చాలా ఓర్పుతో వ్యవహరించారు.

పునరావాస కాలనీ ప్రారంభోత్సవ సభలో నాయకత్వం ఇలా పేర్కొంది. 'ఎవరైతే ప్రాజెక్టు వల్ల నష్టపోతారో, వారే ఆ ప్రాజెక్టు వల్ల లాభపడేవారిలో ప్రథమంగా ఉండాలి. ఆర్ అండ్ ఆర్ ద్వారా నష్టపరిహారంగా డబ్బులు విసిరేసి చేతులు దులుపుకోవడం కాకుండా, జీవితాలను గౌరవించే మానవీయ, సామాజిక దృక్పథం కావాల'ని తెలుపుతూ, 'మరీ ముఖ్యంగా మనం ఎవరిమైనా, ఎంత గొప్పవారమైనా కన్నతల్లిని, జన్మభూమిని సొంత ఊరుని మర్చిపోకూడదని పెద్ద లంటారు. కానీ ఈ పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులైనవారు సరిగ్గా అటువంటి అనుబంధాలన్నిటినీ, వాతావరణాన్నీ పూర్తిగా కోల్పోతున్నారు. దేశ ప్రజలందరి కోసం వాళ్ళు చేస్తున్న త్యాగాలకు వెలకట్టలేము. కావున వాళ్ళకు ఆత్మగౌరవంతో కూడిన పునరావాసం కల్పించడం ప్రభుత్వాల పని. కనుక అర్హత కలిగిన ప్రజలందరికి శాస్త్రీయ, సమగ్ర పునరావాసం కల్పించాల'ని అధికారులకు ఉద్వేగ పూరితంగా విజ్ఞప్తి చేశారు.

# పాలకుల జలవిధానాలపై దక్షిణ భారతస్థాయి సెమినార్

## 2021 డిసెంబరు 19, బెంగుళూరు




**'పాలకుల** జల విధానాలు, వివాదాలు – నదుల, డ్యాముల ప్రైవేటీకరణ అంశం'పై బెంగుళూరులోని గాంధీభవన్‌లో ఏఐకెఎమ్‌కెఎస్, కర్ణాటక రాజ్యరైతు సంఘ సంయుక్త నిర్వహణలో సెమినార్ జరిగింది. కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలనుండి 100 మంది ప్రతినిధులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. కర్ణాటక ఏఐకెఎమ్‌కెఎస్ నాయకులు చాగనూరు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఏఐకెఎమ్‌కెఎస్ కో–కన్వీనర్ కా॥ఎస్.ఝాన్సీ కీనోట్ ప్రవేశపెట్టారు. (కీనోట్ ప్రక్కపేజీలో అందిస్తున్నాం).

అనంతరం మొదటి సెషన్‌లో కర్ణాటక జలవనరుల నిపుణులు కెప్టెన్ రాజారావ్, విశ్రాంత ఇంజనీర్, ద్వారకానాథ్, రిటైర్డ్ ఇంజనీర్ ఉద్దేహాళ్, ఏపికి చెందిన జలవనరుల నిపుణులు ఎస్ఎమ్ బాషా, చంద్రశేఖర్‌లు దక్షిణ భారతదేశంలో జల వివాదాలపైన, వివిధ రాష్ట్రాలకు వున్న తాగు, సాగునీటి అవసరాలు, వర్షపాతం, డ్యాముల కెపాసిటి, డ్యాం సేఫ్టీ చట్టం పేరుతో కేంద్రం చేస్తున్న కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాలపై మాట్లాడారు. ద్వారకానాథ్ దేశంలో రోజురోజుకూ తగ్గుతున్న డ్యాముల కెపాసిటీ, సిల్ట్ తొలగింపు పద్ధతులపై చర్చా పత్రాన్ని ప్రవేశపెట్టారు.

భోజన విరామం తర్వాత జరిగిన రెండవ సెషన్‌లో వివిధ రాష్ట్రాల ఏఐకెఎమ్‌కెఎస్ ప్రతినిధులు కా॥ సుశీలన్, కా॥ గుణలన్, కా॥ బాబూరావ్ కుంబర్‌గావ్, కా॥ ప్రసాద్, కర్ణాటక రాజ్యరైతు సంఘ హాగూ హసిరు సేనె నాయకులు ఆర్.మాధవరెడ్డి, నాగరత్నమ్మ, 'ఆరంభ' కన్నడ పత్రిక సంపాదకులు సా.రఘునాథ, కర్ణాటక రాష్ట్ర జనశక్తి నాయకులు గుడి మణే, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥సి.పెద్దన్న రైతాంగానికి ఎదురవుతున్న సాగునీటి సమస్యలు, కేంద్ర రాష్ట్ర పాలకుల విధానాలపైన, కీనోట్‌లోని అంశాలపైన ప్రసంగించారు.

అనంతరం సెమినార్ ముందు కా॥ ఝాన్సీ కొన్ని తీర్మానాలను ప్రతిపాదించగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. (తీర్మానాలను విడిగా అందిస్తున్నాం). సెమినార్‌ను బళ్లారికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు అబ్దుల్ షుకూర్ నిర్వహించారు. సెమినార్ గురించి తెలుగు, ఇంగ్లీష్‌లలో కరపత్రాలు ప్రచురించారు. సెమినార్ జల వివాదాల గురించి, జలవనరుల గురించి అవగాహన కల్గించింది. వివిధ రాష్ట్రాలలో ఈ తరహా కార్యక్రమాలు కొనసాగించాలని వక్తలు, కొందరు ప్రతినిధులు కోరారు.

> **"ఐక్యం అన్నింటికీ మూలం**
> **అటే కదుల్తోంది కాలం**
> **పురోగతి ప్రపంచనీతి**
> **మనదొకే మానవజాతి**
> **వ్యక్తికి**
> **బహువచనం శక్తి"**
>
> **- శ్రీశ్రీ**

# "పాలకుల జల విధానాలు" అంశంపై సెమినార్-కీ నోట్

## ప్రస్తావన

ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా జల వివాదాలు మరోసారి ముందుకు వచ్చాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో జల వివాదాలు, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టటానికి పాలక వర్గశక్తుల చేతులలో ఒక ఇంధనంగా మారిపోతున్నాయి. మరో పక్క కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని నీటి ప్రాజెక్టులను తన చేతుల్లోకి తీసుకునేందుకు డ్యామ్ సేఫ్టీ చట్టం తెచ్చింది. భూసేకరణచట్టం, మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాల లాగానే ఇదికూడాభూమి, వ్యవసాయాలను బహుళజాతి బడా కార్పొరేట్లకు అనుగుణంగా మార్చాలన్న ఒకపెద్ద వ్యూహంలో భాగం. నీటిపై పెత్తనాన్ని పూర్తిగా తన చెప్పు చేతల్లోకి తీసుకోవటం, నీటి ప్రాజెక్టులను ప్రైవేటుపరం చేసి బహుళజాతి సంస్థలకు అప్పగించడం కోసం తెచ్చిన డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని ప్రజానీకం వ్యతిరేకించాలి. ఈ చట్టం వెనుక ఉన్న ప్రమాదాన్ని అందరూ గుర్తించాలి. మరోవైపు దక్షిణాది రాష్ట్రాలు వివిధ రకాల జల వివాదాలలో తలమునకలై వున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యల పరిష్కారం పట్ల ఒక ప్రజాస్వామిక వైఖరిని ప్రజల ముందుంచవలసిన అవసరం ఉందని ఏఐకెఎంకెఎస్ భావిస్తున్నది. ఈ స్థితిలో వివిధ దక్షిణాది రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులు, రైతుఉద్యమ నాయకులు, ప్రజాస్వామికవాదుల భాగస్వామ్యంతో ఈ సెమినార్‌ను నిర్వహించడం జరుగుతోంది.

నీటిపారుదలరంగ నిర్వహణ ఏ దేశంలోనైనా ప్రభుత్వాలదే బాధ్యత. కొన్ని సందర్భాలలో ప్రజల బాధ్యతపై చిన్న నీటి వనరులు ఏర్పాటుచేసుకొన్న చరిత్ర మన దేశానికి ఉంది. భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను సామ్రాజ్య వాదుల బండి చక్రాలకు కట్టేసి దేశాన్ని వారి పెరటిదొడ్డిగా నాటి పాలకులు మార్చారు. ఫలితంగా కరువులు, వరదలు భారత జన జీవితాన్ని అతలాకుతలం చేశాయి. పాలకులు తమ వ్యాపార పంటల కోసమే, పారిశ్రామిక అవసరాల కోసమే, జలవనరుల విధానాన్ని అమలు చేశారు. ఫలితంగా భారతదేశం యొక్క అసమాన అభివృద్ధి ఒక ప్రత్యేక లక్షణంగా మారుతున్నది.

భూమిసమస్య, నీటిసమస్య ఒక దానితో ఒకటి ముడివేసుకొన్నవి. భూస్వామ్యవర్గాలు భూమిని నీటిని తమ స్వార్థం, ఆధిపత్యాలకు సాధనాలుగా మార్చుకొన్నారు.

1947 తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు నాటి బ్రిటిష్ పాలనా విధానం కొనసాగించారు. బ్రిటిష్ పరిపాలనా కాలంలో ఏర్పాటుచేసిన పెద్ద ప్రాజెక్టులు ఒక క్రమంలో సరిహద్దు రాష్ట్రాల ప్రజల మధ్య వైరుధ్యాలను, వైషమ్యాలను పెంచటానికి పాలకవర్గాలు ఈ సమస్యలను ఒక సాధనంగా ఉపయోగించుకొంటున్నాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇచ్చినా రెండవ పంచవర్ష ప్రణాళిక కాలం నుండి వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడానికి బదులుగా జలవనరుల అభివృద్ధిని కుంటుపరుస్తూ వచ్చారు. సామ్రాజ్యవాదుల కనుసన్నలలో పారిశ్రామికరంగానికి జల వనరులను వినియోగిస్తూ వచ్చారు. ఫలితంగా కొన్ని ప్రాంతాలు చౌక కూలీల సరఫరా కేంద్రాలుగా, మరికొన్ని ప్రాంతాలు పారిశ్రామికరంగానికి ముడి సరుకులు సరఫరా చేసే జిల్లాలుగా మారేందుకు అనువైన జలవనరుల విధానం అమలు జరిగింది. ముఖ్యంగా 1990 నూతన ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకు భారత పాలకులు పూర్తిగా తలవొగ్గిన ఫలితంగా నీటి పారుదల ప్రాజెక్టులనేవి మొదట వరద నివారణ, తద్వారా కరువు నివారణ, దానివల్ల వ్యవసాయ అభివృద్ధి, తర్వాత విద్యుత్ ఉత్పత్తి అన్న ప్రాధాన్యతా క్రమం మారిపోయింది. వాణిజ్య ప్రయోజనాల కోసం మాత్రమే నీటిపారుదల అన్నది వచ్చింది. విద్యుత్ ఉత్పత్తికి మొదటి ప్రాధాన్యత ఇచ్చే విధంగా జలవనరుల నిర్వహణ ప్రాధాన్యతలను పాలకులు మార్చివేశారు.

2012లో నాటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ జల విధానం, నీటిని బహుళజాతి సంస్థలకు అప్పజెప్పింది. ఫలితంగా ప్రకృతి సిద్ధమైన నీరు మీద కోట్లాది రూపాయల వ్యాపారం జరిగే లాగా, తాగునీరు కొనుక్కుని తాగేలామార్చారు. రైతుల అవసరాల కోసం పొలాలకు నీళ్లు మళ్ళించడం కన్నా విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలకు నీటిని మళ్ళిస్తున్నారు. మరోపక్క తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాల మధ్య చిచ్చు రేపుతున్నారు.

## దక్షిణాది రాష్ట్రాల జల వివాదాలు

ఫలితంగా ఒకపక్క నదులలో నీరు ప్రవహిస్తున్నది. మరోపక్క నీటి కొరత ఏర్పడుతోంది. అది రాష్ట్రాల మధ్య జలవివాదాల రూపంలో బయటపడుతోంది. కృష్ణ, గోదావరి, కావేరి, తుంగభద్ర, జంఝావతి, వంశధార ఇలా, అది పేరుకు ఏ నది అయినా, రాష్ట్రాల మధ్య ప్రవహించే ప్రతి నదీ, వివాదాల మయంగా మారిపోయింది. ఉదాహరణకు కృష్ణానదిపై జల వివాదం మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రల మధ్య ఉంటే, గోదావరి నదిపై మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్‌లకు మధ్య ఉన్నది. ఇక

**జలవనరులు, నదీజలాల పంపిణి, నిర్వహణలలో ప్రజాస్వామికమైన విధానాలు అమలులోకి రావాలి. ప్రజల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి, ప్రజలకు శుభ్రమైన తాగునీరు, రైతుల పొలాలకు సాగునీరు కనీసం అందించేలా నీటిపారుదల జలవనరుల విధానం ఉండాలి. ప్రజల మధ్య ప్రజాస్వామిక జల సంబంధాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకునేలా పాలకులు వ్యవహరించేలాగా ప్రజాకార్యాచరణ సాగాలి.**

తుంగభద్ర నది కర్ణాటక, ఆంధ్రల మధ్య, కావేరీ నది కర్ణాటక, తమిళనాడుల మధ్య, నిరంతరం నదీ జలాల వివాదాలకు కారణాలుగా ఉండిపోయాయి. జల వివాదాలను పాలకులు ప్రజలను విభజించటానికి, ఓటు బ్యాంకు రాజకీయాలను కొనసాగించడానికి ఒక సాధనంగా వాడుకుంటున్నారు తప్ప జలవనరుల సక్రమ ప్రజాస్వామిక పంపిణీని కోరుకోవడం లేదు.

మానవ మనుగడకు అత్యంత జీవనాధారమైన నీరు అన్నది తాగునీరుగా, సాగునీరుగా, పారిశుద్ధ్య అవసరాల కోసం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాల జలవనరుల విధానం ఉండాలి. కానీ దురదృష్టవశాత్తు 1947 తర్వాత కూడా ఇప్పటివరకూ అలాంటి విధానం ఏర్పడలేదు. ఫలితంగా కరువులు, వరదలు, వలసలు నేటికీ ప్రజల జీవితాల్లో ఒక భాగంగా కొనసాగుతున్నాయి. ఉత్తర భారతదేశంలో సట్లెజ్, యమునా లింక్ కాలువ పేరుతో పంజాబ్ హర్యానా రాష్ట్రాలకు: నర్మద నదిపై మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఈ విధంగానే వివాదాలు నడుస్తున్నాయి. కాబట్టి ఈనాడు దేశంలో చూస్తున్న జల వివాదాలకు, భవిష్యత్తులో జరగబోయే నీటి యుద్ధాలకు కారకులు పాలకులే.

ఈ విధంగా 70 సంవత్సరాలపైగా పాలన ఏ జల వివాదాన్నీ పరిష్కరించలేదు సరికదా, కొత్తవాటిని సృష్టించింది. ఈ వివాదాల పరిష్కారం కోసం ఏర్పడిన నదీజలాల ట్రిబ్యునళ్ళు, నదీజలాల బోర్డులు, కోర్టుల తీర్పులు అన్నీ దశాబ్దాల కాలం వ్యవధి తీసుకోవడంవల్ల ఆయా రాష్ట్రాల మధ్య జల వివాదాలు మరింత జటిలం అయ్యాయి. ఇలాంటి వివాదం ఎక్కడ తలెత్తినా మధ్యవర్తిత్వం వహించి జలవివాదాలను సామరస్యంగా పరిష్కరింపచేయాల్సిన కేంద్రప్రభుత్వం ఆ పని చేయడంలేదు. అంతిమంగా కేంద్రం జల వివాదాలను రాష్ట్రాలపై పెత్తనానికి ఒక సాధనంగా వాడుకుంటున్నది.

## ప్రమాదకరమైన డ్యామ్ సేఫ్టీ చట్టం

దీనికి తాజా ఉదాహరణ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన డ్యాం సేఫ్టీ చట్టం. ఇది నీటి ప్రాజెక్టులపై రాష్ట్రాల అధికారాలను గుంజుకోవటానికి, డ్యాములను ప్రైవేటీకరించి, జలవనరులను ప్రైవేటు దోపిడీ శక్తులపరం చేయడానికి ఉద్దేశించబడింది. దేశ ఫెడరల్ విధానాన్ని దెబ్బతీసి రాష్ట్రాల ప్రజలమధ్య చీలికలు పెంచి పోషించడానికి పూనుకొంటున్నది .

అదేవిధంగా ఆంధ్ర తెలంగాణాల మధ్య ఉన్న నదీజలాల వివాదంలో మొత్తం కృష్ణ, గోదావరి నదులపై ఉన్న అన్ని ప్రాజెక్టులను, వాటి మొత్తం ఆస్తులను, సిబ్బందినీ, ప్రాజెక్టుల నిర్వహణలను కేంద్రం చెప్పుచేతుల్లో తీసుకునేలాగా, దానికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చెరి రెండు వందల కోట్లను చెల్లించేలా నదుల బోర్డును ఏర్పాటు చేయాలనే నిర్ణయం కూడా ప్రజావ్యతిరేకమైంది.

## ముగింపు

ఇలాంటి స్థితిలో జలవనరులు, నదీజలాల పంపిణి, నిర్వహణలలో ప్రజాస్వామికమైన విధానాలు అమలులోకి రావాలి. ప్రజల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి, ప్రజలకు శుభ్రమైన తాగునీరు, రైతుల పొలాలకు సాగునీరు కనీసం అందించేలా నీటిపారుదల జలవనరుల విధానం ఉండాలి. ప్రజల మధ్య ప్రజాస్వామిక జల సంబంధాల అభివృద్ధికోసం చర్యలు తీసుకునేలా పాలకులు వ్యవహరించేలాగా ప్రజాకార్యాచరణ సాగాలి. నీళ్లను నిప్పులాగ ప్రజల మధ్య చీలికలకు, విభేదాలకు వాడుకునేలా కాకుండా, దాహంతో అలమటిస్తున్న ప్రజల గొంతు తడపటానికి, కరువు పీడిత ప్రాంతాల నేలలను తడపటానికి, అందరికీ తగినంత నీరు అందుబాటులో ఉంచటానికి, తగిన చర్యలను పాలకులు తీసుకునేలా ప్రజల, రైతు రంగాల, ప్రజాతంత్రవాదుల కార్యాచరణ సాగాలి. ప్రతి ప్రాంతం ఒక యూనిట్‌గా ఆ ప్రాంతాల్లో లభ్యమవుతున్న భూ ఉపరితల, భూగర్భ జలవనరులు అన్నింటి సక్రమ వినియోగం ప్రజాస్వామిక పంపిణీ జరిగేలా, ప్రజలూ, జలవనరులు రెండూ పరస్పరం అభివృద్ధి చెందేలా ప్రజాస్వామిక విధానం కోసం ఉద్యమించాలి. డ్యామ్ సేఫ్టీ చట్టం వంటి వాటిని స్పష్టంగా వ్యతిరేకించాలి.

**19-12-2021**

**అఖిల భారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకెఎంకెఎస్)**
**కర్ణాటక రాజ్యరైతుసంఘ హాగూ హసిరు సేనె**
**బెంగుళూరు**

# దక్షిణభారత స్థాయి సెమినార్ తీర్మానాలు

## 19-12-2021

**1. నీటిలో ద్వేష రాజకీయాలను నడపరాదని ప్రభుత్వాలకు విజ్ఞప్తి :**

కేంద్ర, రాష్ట్రాల పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం నదీ జలాల మీద ప్రజలను రెచ్చగొడుతూ ద్వేషాన్ని నింపుతున్నారు. దేశ దిమ్మరులుగా తిరుగుతున్న మానవ సమూహాలను స్థిరంగా నిలిపి వ్యవసాయం ద్వారా మనుషులందరినీ ఒక్కటి చేసిన నదీజలాలను కూడా కులం, మతంతో పాటు ప్రజలను విభజించే ఆయుధంగా మలుచుకొనడాన్ని ఈ సమావేశం గర్హిస్తున్నది.

దక్షిణాది రాష్ట్రాల ప్రజల జీవనాధారమైన కావేరి, గోదావరి, కృష్ణానదుల నీటితోపాటు, ద్వేషాన్ని ప్రవహింపచేస్తున్నారు. ప్రజాస్వామిక పద్ధతులలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ సమావేశం తీర్మానించింది.

**2. ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో జలవనరులను ప్రైవేటీకరించరాదు :**

ప్రపంచబ్యాంకు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం జలవనరులను, నదులను ప్రైవేటీకరించడానికి అనువుగా ఇటీవల డ్యాం సేఫ్టీ పేరున ఒక బిల్లు తెచ్చింది. ఇప్పటివరకు రాష్ట్రాలు, స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఉన్న జల వనరులన్నీ ప్రైవేటు గుత్త పెట్టుబడిదారీ సంస్థల ఆధీనంలోకి వెళ్లిపోతాయి. కొళాయిల్లో వచ్చే తాగునీరు, పొలాలకు పారే సాగునీరు అన్నింటినీ ప్రజలు, రైతులు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడబోతోంది. కేంద్రప్రభుత్వ ఈ దుర్మార్గ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని, డ్యాం సేఫ్టీ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

**3. ప్రజల ఐక్యత మాత్రమే సమస్యలను పరిష్కరిస్తుంది :**

ప్రజల మధ్య నీటి పంపిణీలో ఏర్పడి ఉన్న అనైక్యత, రాష్ట్రాల మధ్య విద్వేష రాజకీయాల ఆసరాతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ఆధీనంలో ఉన్న నీటి వనరులను తన అధీనంలోకి తెచ్చుకుంటోంది. బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, ప్రజాసంఘాలు అన్నీ దీనికి వ్యతిరేకంగా గళమెత్తాల్సిందిగా ఈ సభ విజ్ఞప్తి చేస్తోంది.

"తాతల కాన్నుండి తన్ని చంపుతుండ్రు
ఎట్టి చాకిరితోటె తొక్కి పారేసిండ్రు
చుండూరు మాలోల్ల గుండెల్లో పొడిచిరి
నీరుకొండ పైన నిప్పులే పోసిరి

పదిరికుప్పాన్ని తగుల బెట్టేసిరి
ఎదురు తిరిగేటోల్ల నెగరేసి నరికిరి
రాబందుల రాజ్యమాయె-ఓరన్న-
రామచిలకలు మూగబోయే-మాయన్న

దళితులు ఏకమై దండోర కొట్టాలి
కూలీలు ఏకమై కన్నెర్ర చేయాలి
ఊరిలో దొరగాండ్ల ఓడించి గెలవాలి
వాడవాడకు ఎర్రజెండాలు ఎగరాలి
డప్పుపై దండోర కొడితే-ఓరన్న
ఢిల్లీలో గుండెలదరాలి-మాయన్న"

**- 'మాలోడి బతుకోద్దు' పాట నుండి**

"ఓహో ఓ విద్యార్థీ
ఓహోహో ఓ మేధావీ
పొట్టకూడు మీకియ్యక
చట్టుబండలాయె చదువు
మేటవేసిపోయె మెదడు
భ్రష్టుపట్టిపోయె బ్రతుకు
మెదడైనా ఒడలైనా
శ్రమచేస్తేనే సంపద
కలవారల కొమ్ము కాసి
పడుచుకునే వృత్తిరోసి
కర్షక కార్మిక జన సం
ఘాతంతో కలియండి"

**- శ్రీశ్రీ 'మరోప్రస్థానం' నుండి**

# అమరులకు జోహార్లు

## (2018 ఆగస్టు - విజయనగరంలో జరిగిన రైతుకూలీసంఘం జనరల్ కౌన్సిల్ నుండి 2022 డిసెంబర్ వరకు)

**మార్క్సిస్టు** మేధావి, శ్రామికవర్గ దార్శనికుడు, విప్లవ కమ్యూనిస్టు పత్రికలు క్లాస్‌స్ట్రగుల్, జనశక్తిల సంపాదకుడు, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి **కామ్రేడ్ పోలవరపు జశ్వంతరావు** (73 సం॥లు) కరోనాతో, తీవ్రమైన ఊపరితిత్తులకు సంబంధించిన జబ్బుతో రెండు వారాలపాటు పోరాడి 2020 ఆగస్టు 27న తుదిశ్వాస వదిలారు. గ్రామీణ ప్రాంతాల కృషిలో భాగంగా కామ్రేడ్ జశ్వంత్ గ్రామీణ పేదల మధ్యకు, గిరిజనుల మధ్యకు వెళ్ళారు; వారి మధ్య పనిచేశారు; వారితో మమేకమయ్యారు. గ్రామీణ ప్రాంత ఆర్థిక పరిస్థితులను, దోపిడీ పీడనలను సన్నిహితంగా అధ్యయనం చేశారు. భూస్వామ్య వ్యవస్థ రద్దు, వ్యవసాయ విప్లవ ప్రాముఖ్యతలను ఆయన సాధికారంగా వివరించేవారు. 'తాకట్టులో భారతదేశం'లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చేసిన మౌలిక సూత్రీకరణలను, విశ్లేషణలను, నిర్ధారణలను భారత నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి వివరించటాన్ని ఒక ముఖ్యమైన బాధ్యతగా, రాజకీయ కర్తవ్యంగా స్వీకరించి దానికోసం ప్రత్యేక కృషిచేశారు. రైతుకూలీసంఘం, ఏజన్సీ గిరిజన సంఘాల సదస్సులు, సభలలో ఎన్నో సందర్భాలలో కామ్రేడ్ జశ్వంత్ తన కంచు కంఠంతో శక్తివంతంగా ప్రసంగించారు. ఉన్నత మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన కా॥ జశ్వంత్, వైద్య విద్యను అభ్యసించారు. వైద్యునిగా సుఖవంతమైన జీవితం గడిపే అవకాశమున్నప్పటికీ, దానిని కాదనుకొని ఈ అసమాన సమాజాన్ని రూపుమాపటంకోసం, సమాజంలో ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పుకోసం, సమసమాజాన్ని నిర్మించటంకోసం ప్రజలపక్షాన నిలిచారు. ఎమర్జన్సీ చీకటి రోజులలో అరెస్టుకాబడి, కుట్రకేసు బనాయించబడి అనేక చిత్రహింసలనెదుర్కొన్నారు. అంకితభావంతో, నిబద్ధతతో ప్రజలపక్షాన నిలచిన ఆయన త్యాగమయ జీవితం అత్యుత్తమ విలువలను నెలకొల్పిన దార్శనికుల సరసన నిలుస్తుంది. కామ్రేడ్ జశ్వంతరావుకు విప్లవ జోహార్లు.

పీడిత ప్రజాఉద్యమ నాయకులు, ఏఐకెఎమ్‌కెఎస్ జాతీయ కమిటిసభ్యులు **కామ్రేడ్ మధు** (78సం॥లు) 16-4-21న మరణించారు. హైస్కూలు విద్యనభ్యసించే కాలంలోనే కా॥మధు వామపక్ష విద్యార్థి ఉద్యమ కార్యకలాపాల పట్ల ఆకర్షితులయ్యారు. విద్యార్థి, సాహిత్యోద్యమాలలో పాల్గొంటూ విప్లవకార్యకర్తగా ఎదిగారు. కామ్రేడ్ మధు పలు విప్లవ పత్రికలకు సమర్థవంతంగా సారధ్యం వహించారు. నిరంతర అధ్యయనశీలిగా శ్రేణుల సిద్ధాంత, రాజకీయస్థాయి పెరుగుదలకు కృషిచేశారు. రాజకీయ అధ్యయన తరగతుల్లో ముఖ్యమైన భూమికను నిర్వహించారు. ఒడిషాలో మైదాన ప్రాంత ఉద్యమాలకు దీర్ఘకాలం మార్గదర్శకత్వం వహించారు. సాహిత్యరంగంలో పెడధోరణు లెదుర్కొనేందుకు విశేష కృషిచేశారు. నిగర్వి, మృదుభాషి, ఉన్నతాదర్శాలతో కూడిన జీవనశైలి, స్నేహహృదయుడైన ఆయన వ్యక్తిత్వం ఆచరణీయం, ఆదర్శప్రాయం. నిబద్ధత నిమగ్నతల యోగ్యతలతో విప్లవోద్యమానికి తనను తాను అంకింతం చేసుకున్న కామ్రేడ్ మధుకు విప్లవ జోహార్లు.

ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు **కా॥ నూతలపాటి పరమేశ్వరరావు** (81సం॥లు) 11-1-2022న విజయవాడలో మరణించారు. కా॥పరమేశ్వరరావు యువకునిగా వున్న కాలం నుండే వారి స్వగ్రామం గుంటూరుజిల్లా - నిమ్మగడ్డవారిపాలెంలో వారి సోదరునితో కలసి వామపక్ష రాజకీయాలు స్వీకరించి చురుకైన పాత్ర నిర్వహించారు. విజయవాడ వచ్చిన తర్వాత ఆరు దశాబ్దాల కాలం ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణానికి తన శక్తిసామర్ధ్యాలను వెచ్చిస్తూనే పునాది ప్రాంత, రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలపట్ల సంఘీభావంతో వుండేవారు. ఉద్యమ పత్రికలకు ఎనలేని సేవలందించారు. ఎన్నో విలువైన ఆదర్శనీయ లక్షణాలను పుణికి పుచ్చుకున్న కా॥ పరమేశ్వరరావుకు జోహార్లు.

పీడిత ప్రజాఉద్యమ నాయకులు **కామ్రేడ్ బ్రహ్మానందమాలిక్** (86 సం॥లు) 4-5-2019న ఒడిషా రాష్ట్రం-పూరీజిల్లాలోని గోప్‌లో కనుమూశారు. పేద రైతాంగ కుటుంబానికి చెందిన ఆయన 1951 నుండి అనేక రైతాంగ ఉద్యమాలను నిర్వహించారు. నిజాయితీ, ముక్కుసూటిదనం, నిరాడంబరత్వం, క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధతకు ఆయన నిదర్శనంగా వుండేవారు. యువ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన కా॥ బ్రహ్మానందమాలిక్‌కు విప్లవ జోహార్లు.

పశ్చిమబెంగాల్ ఏఐకెఎమ్‌కెఎస్ నాయకులు **కా॥ యోగేన్ బిశ్వకర్మాకర్** 29-7-21న సిలిగిరిలో మరణించారు. రైతాంగ విప్లవోద్యమంతో ఆయన చాలాకాలంగా అనుబంధం కలిగి వున్నారు. కామ్రేడ్ కానూసన్యాల్‌తో కలిసి పోరాడిన యోధుడు కూడా.

నగ్జల్బరీ, భారీబేరి, ఫన్సిదేవా ప్రాంతాలలో రైతాంగ ఉద్యమాలు నిర్మించటంలో కా॥ యోగేన్ ప్రముఖపాత్ర నిర్వహించారు. కా॥ యోగేన్‌కు విప్లవజోహార్లు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు **కామ్రేడ్ ఇ. రామన్నగౌడ్** (87సం॥లు) కర్నూలుజిల్లా ఎమ్మిగనూరులో 26-6-19న మరణించారు. చిన్ననాటినుండే వామపక్ష భావాలను స్వీకరించిన ఆయన ఆ ప్రాంతంలో నిర్వహించిన అనేక భూపోరాటాలు, ఇళ్ళస్థలాల ఆందోళనలకు నాయకత్వం వహించారు. కులవివక్ష, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. కార్మిక నాయకునిగా కార్మికుల ఆందోళనలు నడిపించారు. నమ్మిన ఆశయంకోసం తుదిదాకా నిలచిన కా॥ రామన్నగౌడ్‌కు విప్లవజోహార్లు.

తెలంగాణా రైతుకూలీసంఘం రాష్ట్రఅధ్యక్షులు **కామ్రేడ్ నల్లాన స్వామీరావు** (73సం॥లు) 24-7-19న తుదిశ్వాస విడిచారు. చిన్నతనం నుండే వామపక్ష భావాలతో ఎదిగిన కా॥ స్వామీరావు ములుగు ప్రాంత పీడిత, రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలతో మమేకమయ్యారు. ఎన్నో నిర్బంధాలను తట్టుకొని నిబ్బరంగా నిలిచారు. ఉద్యమ శ్రేణులకు చివరికంటా ఉత్తేజంగా నిలచిన కా॥ నల్లాన స్వామీరావుకు విప్లవజోహార్లు.

విజయవాడలోని కమ్యూనిస్టు శ్రేణులందరికీ 'పూర్ణ'గా, 'బాబాయ్'గా సుపరిచితులైన **కా॥ టి. పూర్ణచంద్రరావు** (80సం॥లు) కోవిడ్ బారినపడి 2020 అక్టోబర్ 26వ తేదీన మరణించారు. ఎర్రజెండాల నీడలో పెరిగిన కా॥ పూర్ణ, తరగతిగది చదువులు చదవకపోయినా, వర్గరాజకీయాలను అవగాహన చేసుకొని ఆచరించారు. కా॥ తరిమెల నాగిరెడ్డి ప్రబోధించిన వ్యవసాయ విప్లవపంథాను విశ్వసించి కడదాకా కొనసాగారు. విజయవాడలో ఇళ్ళస్థలాల కోసం, నిడమానూరులో చెరకు పరిశ్రమ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, నిడమానూరు దళితుల భూస్వాధీన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. చారిత్రక రైల్వే కార్మికుల సమ్మె సందర్భంగా వారికి క్రియాశీలక మద్దతునందించారు. పలుమార్లు దాడులను, పోలీసు నిర్బంధాన్ని, చిత్రహింసలను ఎదుర్కొన్నారు. పీడిత ప్రజాఉద్యమ నాయకునిగా, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కృషి సాగించిన కా॥ పూర్ణకు విప్లవ జోహార్లు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యవర్గ సభ్యులు **కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి** (78 సం॥లు) 31-3-2021న కాజ గ్రామంలో మరణించారు. చిన్నతనంలోనే వామపక్ష భావాలకు ఆకర్షితులైన ఆయన యువజన, వ్యవసాయకూలీ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. 1986 నుండి సంఘ నిర్మాణ కృషిలో ఆయన భాగస్వామిగా వున్నారు. స్వతహాగా రైతు జీవనం సాగించే కా॥లక్ష్మారెడ్డి, రైతాంగ సమస్యల మూలాలను తన అనుభవాలతో జోడించి చెప్పేవారు. రైతుకూలీ ఉద్యమానికి మద్దతుగా అనేక క్యాంపెయిన్‌లలో పాల్గొన్నారు. నాయకుడిగా ఆర్తితో ఆయన పాడే పాటలు ఎందరినో ఆకట్టుకునేవి. పోరుజెండా ముద్దుబిడ్డ కా॥ లక్ష్మారెడ్డికి విప్లవజోహార్లు.

తూర్పుగోదావరిజిల్లా గిరిజనోద్యమ నాయకులు **కా॥ చదల వీరపురెడ్డి** (55 సం॥లు) క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ 11-5-21న మరణించారు. 1969 నాటి కొండమొదలు గిరిజనోద్యమ ప్రభావతంతో చిన్నతనంలోనే కా॥వీరపరెడ్డి ఉద్యమాలపట్ల ఆకర్షితులయ్యారు. 90లలో ముందుకొచ్చిన ఆదివాసీ భూపోరాటాలలో ఆయన చురుకైన పాత్ర వహించారు. ఉభయగోదావరి జిల్లాల ఆదివాసీ, రైతుకూలీ ఉద్యమాలలో వెనుదిరగకుండా నిలిచారు. కా॥ చదల వీరపురెడ్డికి జోహార్లు.

విప్లవ కార్మికయోధుడు **కామ్రేడ్ షేక్ మదార్** (92 సం॥లు) 16-10-22న విజయవాడలో మరణించారు. చిన్నతనంనుండే పీడిత ప్రజాఉద్యమాలపట్ల ఆకర్షితులైన కా॥ మదార్, ఆర్‌టిసి కార్మికోద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. కార్మికులకు వర్గచైతన్యం అందించే కృషిని శ్రద్ధతో చేశారు. ప్రజలపై నిర్బంధం, అణచివేతల ప్రతి సందర్భంలోనూ ఆయన స్పందించేవారు. అఖిలభారత రైల్వే సమ్మె సందర్భంగా సమ్మెకు సహకారంగా విశేష కృషిచేశారు. కడదాకా ఆదర్శ కార్మికవర్గ ప్రతినిధిగా నిబద్ధత, క్రమశిక్షణతో జీవించిన కామ్రేడ్ మదార్‌కు జోహార్లు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకమిటి సభ్యులు **కా॥ ముచ్చు సుధాకర్‌రావు** (40 సం॥లు) కరోనా వ్యాధికి గురై 23-5-21న బందరులో మరణించారు. కా॥ సుధాకర్ ప్రజాకళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలపట్ల ఆకర్షితుడై, కళారూపాల ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొనేవారు. బందరు యువజన సంఘం బాధ్యతలు నిర్వహించారు. నిరుపేద శ్రామిక కుటుంబంలో జన్మించిన కా॥ సుధాకర్ క్రియాశీల కార్యకర్తగా చివరివరకూ కృషిచేశారు. కా॥ సోనీ మరణానంతరం బాధ్యతలు మోస్తూ అంకితభావంతో కృషి కొనసాగించిన కా॥ సుధాకర్‌కు విప్లవ జోహార్లు.

విప్లవ కార్మికోద్యమ నాయకులు **కామ్రేడ్ జగ్గారపు సుబ్బారావు** (84 సం॥లు) 17-12-22న మంగళగిరిలో మరణించారు. చేనేత కార్మికునిగా వుంటూ విప్లవ రాజకీయాలను స్వీకరించిన కా॥ సుబ్బారావు కడదాకా అదే నిబద్ధతతో కొనసాగారు. ప్రజాతంత్ర

చేనేత కార్మిక సంఘం రాష్ట్రకన్వీనర్‌గా కొనసాగారు. చేనేత కార్మికుల సమస్యలపై మిలిటెంట్ ఆందోళనలు నిర్వహించారు. 1982లో స్థానిక రతనాల చెరువు బంజరుభూమిలో శ్రామికనగర్ ఏర్పాటుకు ఇతర కామ్రేడ్స్‌తో కలసి కా॥ సుబ్బారావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రౌడీగూండాల దాడులు, పోలీసు నిర్బంధం, కేసులు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతం నుండే మంగళగిరి మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేశారు. పాలకపార్టీల ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా నిలిచారు. కొండమోడు రైతాంగ ఉద్యమానికి అండగా నిలిచారు. నిరంతరం రాజకీయ ప్రచార కృషిసాగించిన కామ్రేడ్ జగ్గారపు సుబ్బారావుకు విప్లవజోహార్లు.

అనంతపురంజిల్లా పీడిత ప్రజల నేత **కామ్రేడ్ పెద్దక్క** అనంతపురంలో అనారోగ్యంతో 30-9-20న మరణించారు. ఈమె కా॥తరిమెల నాగిరెడ్డి ఆశయస్ఫూర్తితో కడదాకా జీవించారు. పీడితవర్గంలో పుట్టి, కష్టజీవిగా జీవిస్తూ, సంస్థను ఉద్యమాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కామ్రేడ్స్ అందరినీ ఆదరించే గొప్ప ఉత్తేజకర పాత్ర నిర్వహించారు. చదువు రాకున్నా పత్రికలలోని వ్యాసాలను చదివించుకొని అర్థంచేసుకునేవారు. పాటలను కూడా వినికిడితోనే గుర్తుపెట్టుకొని ఉత్సాహంగా పాడేవారు. కా॥ పెద్దక్కకు విప్లవజోహార్లు.

ఏజెన్సీ గిరిజన సంఘం నాయకుడు **కామ్రేడ్ చింతలాడ విజయ్‌రెడ్డి** (42 సం॥లు) గోదావరి వరద ముంపు ప్రాంతమైన కత్తనపల్లి గ్రామంలో 23-7-2022న జ్వరం, అనారోగ్యం కారణంగా మరణించాడు. ఏజెన్సీ గిరిజన సంఘ నాయకునిగా ఆదివాసుల భూపోరాటం, పునరావాసం, కొండపోడుల సమస్యలపై పోరాటాల్లో విజయ్‌రెడ్డి ముందునిలిచాడు. తన తండ్రి చింతలాడు పెద్దిరెడ్డి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు. 2022 జులైలో వచ్చిన వరదల సమయంలో సరైన నీరు, సౌకర్యాలు లేక కత్తనాపల్లి, కొత్తగూడెంలో చాలామందికి విషజ్వరాలొచ్చాయి. కా॥ విజయ్‌రెడ్డి జ్వరంతోనే కాలకృత్యాలకు వెళ్ళి నీటిమడుగులో పడి మరణించాడు. కా॥ విజయ్‌రెడ్డికి జోహార్లు.

తరిమెల గ్రామానికి చెందిన **కామ్రేడ్ తరిమెల నాగరత్నమ్మ** (72 సం॥లు) 16-11-22న తరిమెలలో మరణించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆమె కా॥ నాగిరెడ్డి విప్లవోద్యమ రాజకీయాలతో కొనసాగారు. తరిమెలలో నిర్మించిన తరిమెల నాగిరెడ్డి స్మారకస్థూపం, కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో జరిగిన అన్ని కార్యక్రమాల్లో ఆమె క్రియాశీలకంగా పాల్గొన్నారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా ఉపాధ్యక్షురాలిగా, రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన కా॥ తరిమెల నాగరత్నమ్మకు జోహార్లు.

పల్నాడు ప్రాంత రైతుకూలీ మహిళా ఉద్యమ నాయకురాలు **కా॥ దేగల దానమ్మ** 5-8-20న అనారోగ్యంతో మరణించారు. రెంటచింతల ప్రాంతంలో జరిగిన అనేక భూపోరాటాలు, ఇళ్ళస్థలాల కోసం జరిగిన పోరాటాల్లో ఆమె చురుకైన పాత్ర నిర్వహించారు. సాధించుకున్న విజయాలను వమ్ముచేసేందుకు జరిగిన అనేక విచ్ఛిన్న చర్యలను ఎదుర్కొని నిలిచారు. కా॥ దేగల దానమ్మకు విప్లవజోహార్లు.

ఏజన్సీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు **కా॥ సున్నం రాజు** అనారోగ్యంతో 15-9-20న మరణించారు. పోలవరం మండలం చేగొండపల్లి గ్రామస్థుడైన కా॥ సున్నం రాజు 1992 నుండి తూటిగుంట, తెల్లవరం ప్రాంతాలలో సాగుతున్న గిరిజనోద్యమంతో ఉత్తేజితుడై సంఘ పరిచయాల్లోకి వచ్చారు. సింగనపల్లి, చేగొండపల్లి ప్రజల్ని కూడగట్టటంలో కీలకమైన పాత్ర నిర్వహించారు. భూముల పునరాక్రమణలో భూస్వాముల్ని, పోలీసుల్ని ఎదిరించి, నిలువరించటంలో బాధ్యతాయుతంగా వ్యవహరించారు. భూమి సమస్య పరిష్కారం కాకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టరాదనే నిర్ణయానికనుగుణంగా గిరిజన, గిరిజనేతర ప్రజలను ఐక్యంచేసే కృషిలో కీలకపాత్ర వహించారు. పోలీసు నిర్బంధాన్ని, రాజద్రోహ నేరారోపణతో కేసును ఎదుర్కొన్నారు. 9 నెలలు జైలు జీవితాన్ని అనుభవించారు. కడదాకా సంఘం జెండాను సమున్నతంగా నిలిపిన కా॥ సున్నం రాజుకు జోహార్లు.

బందరు ప్రాంతంలో గత నాలుగు దశాబ్దాలుగా రైతుకూలీరంగంలో చురుకైన కార్యకర్తగా పనిచేసిన **కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు** (62సం॥లు) 4-11-22న గుండెపోటుతో చిన్నాపురంలో మరణించారు. ప్రజాకళారూపాలపట్ల ఆకర్షితుడైన ఉమామహేశ్వరరావు చిన్నాపురంలో జరిగిన సాంస్కృతిక శిక్షణా శిబిరంలో కళాకారునిగా పాల్గొన్నారు. అనేక దళ ప్రచారాల్లో ప్రజలను చైతన్యపరిచారు. గ్రామపెత్తందార్లను ఎదిరించి నిలిచారు. సంఘ కార్యకలాపాల్లో నిరంతరాయంగా పాల్గొన్నారు. కా॥ ఉమామహేశ్వరరావుకు జోహార్లు.

58 సం॥ల జీవితంలో 40 సంవత్సరాలు విప్లవోద్యమ నిర్మాణమే కర్తవ్యంగా జీవించిన **కా॥ ముఖ్తార్ పాషా** 24-9-20న కరోనా కారణంగా మరణించారు. విప్లవం తప్ప మరే వ్యాపకంగానీ, ఆలోచనగానీ లేని జీవిత కాలపు వృత్తి విప్లవకారుడు కా॥ పాషా. ఖమ్మంజిల్లా ఇల్లెందులో విద్యార్థిగానున్న కాలంలో పిడిఎస్‌యు రాజకీయాలతో ప్రభావితమై తదనంతరం విప్లవ కార్మికోద్యమానికి

అంకితమయ్యారు. ఉమ్మడి ఖమ్మం - వరంగల్ జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణానికి ముఖ్యంగా అటవీ ప్రాంత ఉద్యమ నిర్మాణంలో కా॥ పాషా పోషించిన పాత్ర ఎంతో కీలకమైనది. పీడిత వర్గ ఉద్యమానికే తన జీవితాన్ని అంకింతం చేసిన కా॥ పాషాకు విప్లవ జోహార్లు.

తెలంగాణా రైతుకూలీసంఘం నల్గొండజిల్లా అధ్యక్షులు **కా॥ చింతపల్లి నరసింహ** (83 సం॥లు) 15-6-21న మరణించారు. కడదాకా విప్లవ రాజకీయాలను విశ్వసిస్తూ పీడిత ప్రజల సమస్యల పరిష్కారంకోసం పరితపించారు. జీవితకాలంలో ఎన్నో నిర్బంధాలను, ఆటుపోట్లను తట్టుకొని నిలిచారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడు కా॥ నరసన్నకు జోహార్లు.

ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు **కా॥ విశ్వనాథం ఈశ్వరయ్య** (61సం॥లు) 9-8-21న వెంకటగిరిలో మరణించారు. చేనేత కార్మిక ఆందోళనల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవారు. మజూరి పెంపు ఆందోళనల్లో కమిటీ తీసుకున్న నిర్ణయానుసారం నిక్కచ్చిగా వ్యవహరించేవారు. కా॥ ఈశ్వరయ్యకు జోహార్లు.

గుంటూరుజిల్లాలో మహిళా ఉద్యమ నాయకురాలిగా క్రియాశీలక పాత్ర వహించిన **కా॥ కూరపాటి శాయమ్మ** 14-9-21న మంగళగిరిలో మరణించారు. మంగళగిరి శ్రామికనగర్ కాలనీ ఏర్పాటు బృందంలో సభ్యురాలిగా ఆమె చురుకైన పాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పోలీసు కేసులను ఎదుర్కొన్నారు. మహిళలపై అత్యాచారాలు, గృహహింస ఘటనలపై తీవ్రంగా స్పందించి ఉద్యమించారు. సారా వ్యతిరేక ఉద్యమంలో చొరవతో పాల్గొన్నారు. కా॥ కూరపాటి శాయమ్మకు విప్లవజోహార్లు.

తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లిలో జన్మించిన **స్టాన్‌స్వామి** (84 సం॥లు) జ్యుడిషియల్ కస్టడీలో 3-7-20న మరణించారు. మానవతావాది అయిన స్టాన్‌స్వామిని మార్క్సిజంలోని అత్యున్నత మానవతా దృక్పధం ఆకర్షించింది. బగైచా అనే ప్రభుత్వేతర సంస్థతో కలసి జార్ఖండ్ రాజధాని రాంచీలో ఆయన కార్యకలాపాలు సాగించారు. పియుసిల్‌లోనూ, విస్తాపనా విరోధి నవ నిర్మాణమోర్చా, విస్తాపనా విరోధి జనవికాస్ ఆందోళన్‌లలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ప్రజల తరపున నిలిచి, ఝార్ఖండ్‌లో దుర్మార్గంగా జరుగుతున్న భూసేకరణకు వ్యతిరేకంగానూ, పోటా, టాడా, ఊపా నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగానూ క్రియాశీలకంగా పాల్గొన్నందుకు రాజ్యం ఆయనను కుట్రకేసులో ఇరికించింది. మొదట ఫాదర్ స్టాన్‌స్వామితో సహా 20 మందిపై రాజద్రోహ నేరంపై కేసుపెట్టారు. 14 వేలమంది ఆదివాసీలపై ఈ సెక్షన్ల క్రింద ఎఫ్ఐఆర్‌లు తయారుచేశారు. ప్రభుత్వ క్రూరచర్యలకు వ్యతిరేకంగా ఆయన రాజీలేకుండా ఉద్యమించారు. ముద్దాయిలుగా వున్న యువకులు, ఆదివాసులకు అండగా నిలిచారు. భీమాకొరెగావ్ కేసులో ప్రభుత్వం ఫాదర్ స్టాన్‌స్వామిని ఇరికించింది. ఒక పథకం ప్రకారం ప్రభుత్వం అర్బన్ నక్సలైట్ల పేరుతో మేధావులను, ప్రజాతంత్రవాదులను హింసలపాలు చేస్తోంది. 10 నెలలపాటు జైలులో స్టాన్‌స్వామి అనేక జబ్బులతో బాధపడ్డారు. వైద్యం లభించలేదు. అంతిమంగా ఆయన జ్యుడిషియల్ కస్టడీలోనే మరణించారు. జల్-జంగిల్, భూమి, గనులు తమవేనని పోరాడుతున్న ప్రజలందరికోసం నిలచిన స్టాన్‌స్వామికి జోహార్లు.

సామాజిక కార్యకర్త, పండితుడు, ఆర్యసమాజ్ నాయకుడు **స్వామి అగ్నివేష్** (80 సం॥లు) 11-9-20న మరణించారు. అట్టడుగు పీడిత ప్రజలకోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. వెట్టిచాకిరి విముక్త ఫ్రంట్‌ను 1981లో ఏర్పరిచారు. హక్కుల ఉద్యమాల్లోనూ, దళితులపై, మహిళలపై అత్యాచారాలకు, ప్రజలపై రాజ్యహింసకు వ్యతిరేకంగానూ సాగిన అనేక ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. మతతత్వ ఛాందసత్వాన్ని వ్యతిరేకించిన అగ్నివేష్, మతసామరస్యానికై కృషిచేశారు. ఆదివాసీ పోరాటాలకు అండగా నిలిచినందుకుగానూ పలుమార్లు సంఘ్‌పరివార్ గూండాల దాడులను ఆయన ఎదుర్కొన్నారు. శ్రామిక, పీడిత ప్రజల నిజమైన స్నేహితుడు స్వామి అగ్నివేష్‌కు జోహార్లు.

ప్రజాతంత్రవాది, ప్రముఖ రంగస్థల కళాకారుడు **సయ్యద్ అహ్మద్‌కరీం** (65 సం॥లు) 2020 జులై 11న క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ 2020 జులై 11న కాకినాడలో మరణించారు. విద్యార్థి దశనుండే అభ్యుదయ భావాలపట్ల ఆకర్షితులైన ఆయన 1974-75 మధ్యకాలంలో కా॥ పి.జశ్వంతరావు తదితరులతో కలసి కాకినాడలో యువసాహిత్య సాంస్కృతిక సంస్థ కార్యకలాపాలలో క్రియాశీలకంగా కృషిచేశారు. అత్యవసర పరిస్థితి కాలంలో విప్లవ కార్యక్రమాలకు సహకరించారు. కాకినాడ 'సెజ్'కు వ్యతిరేకంగానూ, కొండమొదలు ప్రాంత ఆదివాసుల పునరావాస ఉద్యమంలోనూ రైతుకూలీసంఘానికి సహకార సంఘీభావాన్ని అందజేశారు. క్యాన్సర్‌వ్యాధితో పోరాడుతూనే ఎన్ఆర్‌సి - సిఏఏల వ్యతిరేక ఆందోళనలలో కాకినాడ బాలాజీ చెరువుకూడలిలో షహీన్‌బాగ్ తరహాలో సాగిన ఆందోళనల్లో పాల్గొన్న ప్రజాతంత్రవాది కరీంకు విప్లవజోహార్లు.

పౌరహక్కుల ఉద్యమనాయకుడు **ప్రొ॥ శేషూరి శేషయ్య** (66 సం॥లు) కరోనా కారణంగా 10-10-20న మరణించారు. పౌర, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకోసం, రాజ్యహింసకు వ్యతిరేకంగా జరిగిన పలు ఆందోళనల్లో ఆయన పాల్గొన్నారు. 'ప్రజాస్వేచ్ఛ' పత్రిక సంపాదకులుగా పనిచేశారు. బహుముఖ ప్రజ్ఞాపాటవాలు కలిగిన ప్రొ॥ శేషయ్యకు జోహార్లు.

పౌరహక్కుల సంఘం నాయకులు, ప్రజాకళాకారులు **కె.పి. సుబ్బారావు** (69 సం॥లు) విశాఖపట్నంలో 23-4-21న మరణించారు. ఆయన గాయకుడు, జననాట్యమండలి కళాకారుడు, సుదీర్ఘకాలం పౌరహక్కులసంఘం నాయకునిగా ప్రజాసంఘాల కార్యక్రమాలకు తన సహకారాన్ని అందించిన కె.పి. సుబ్బారావుకు జోహార్లు.

గొప్ప ప్రజాతంత్రవాది, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, వామపక్ష అభిమాని **కా॥ మారంరెడ్డి రామగోవిందరెడ్డి** (90 సం॥లు) 11-9-21న గుండెపోటుతో నంద్యాలలో మరణించారు. పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలకు తోడ్పాటునందించారు. విప్లవ ప్రజాసంఘాలకు, ఉద్యమాలకు, వివిధ రూపాల్లో ఆయన సహాయ, సహకారాలు అందించారు. ఎం.ఆర్. గోవిందరెడ్డిగార్కి విప్లవజోహార్లు.

ప్రజాతంత్రమేధావి, కథారచయిత **సింగమనేని నారాయణ** (78 సం॥లు) 25-2-22న అనంతపురంలో మరణించారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సింగమనేని వామపక్ష భావజాల ప్రభావంతో రచనలు చేశారు. రాయలసీమ కరవు, దుర్భర పరిస్థితులను ఆయన తన కథలలో ప్రతిబింబించారు. ఏపిటిఎఫ్ ఉద్యమంలో పనిచేశారు. అనంతపురం జిల్లా సాగునీటి వనరుల సాధన కోసం జరిగిన ఉద్యమంలోను, రైతాంగ ఆత్మహత్యల నేపథ్యంలో వారిలో మనోధైర్యం నింపే కృషిలో ఆయన ముందుపీఠిన నిలిచారు. 2010 రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలలో ఒంగోలులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. కా॥ సింగమనేనికి జోహార్లు.

పీడిత ప్రజల ధిక్కారస్వరాన్ని తన రచనలో ఎలుగెత్తిన **సి. హెచ్. మధు** (76 సం॥లు) 24-4-2021న నిజామాబాద్‌లో మరణించారు. ఐదున్నర దశాబ్దాల తన రాజకీయ జీవితంలో అనేక ప్రజాఉద్యమాలలో పాల్గొని, ఉద్యమ సంస్థలతో కలసి పనిచేశారు. వ్యక్తిగత జీవితంలో కష్టనష్టాలెన్ని ఎదురైనా పీడిత ప్రజల ధిక్కార స్వరాన్ని తన రచనలలో బలంగా వినిపించారు. వందలాది రచనలు చేసిన ప్రజాతంత్ర రచయిత సిహెచ్ మధుకు జోహార్లు.

ప్రజాతంత్రవాది, ప్రముఖ న్యాయవాది **కర్నాటి రామ్మోహనరావు** (82 సం॥లు) 7-11-21న విజయవాడలో మరణించారు. చిన్నతనంలోనే వామపక్ష భావజాలానికి ప్రభావితులైన కా॥ రామ్మోహనరావు వామపక్ష విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. అనంతరం 1967 నుండి న్యాయవాదిగా వుంటూ విజయవాడలో పౌరహక్కుల సంఘంలో పనిచేశారు. ఉరిశిక్షల రద్దుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ప్రజాఉద్యమ కార్యకర్తలపై పోలీసులు బనాయించిన అనేక కేసులలో సమర్ధవంతంగా వాదనలు వినిపించి కొట్టి వేయించారు. కర్నాటి రామ్మోహనరావుకు జోహార్లు.

1950 సం॥లో జన్మించిన **డా॥ వీరభద్రరావు** 6-9-20న 70వ ఏట మరణించారు. గ్రామీణ పేదలకు వైద్య సేవలందించాలన్న సంకల్పంతో సింగరాయకొండలో డా॥ శివరామిరెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. అనంతరం పెనుగంచిప్రోలులో వైద్యశాలను ప్రారంభించారు. విశాఖ పూర్ణమార్కెట్ సెంటర్‌లో చాలాకాలం వైద్యశాలను నిర్వహించి శ్రామిక ప్రజలకు అందుబాటులో వుండే డాక్టర్‌గా పేరుపొందారు. విజయనగరంజిల్లా కొమరాడ-దుగ్గేరు మండలాలలో రైతుకూలీసంఘం నిర్వహించిన వైద్య శిబిరాలన్నింటినీ విజయవంతం చేయటంలో ఎంతో చొరవ చూపి, బాధ్యత వహించారు. ఆయన మరణంతో రైతుకూలీ, ఆదివాసీ ఉద్యమం, ఒక ఆత్మీయ మిత్రుడిని కోల్పోయి నట్లయింది. డాక్టర్ వాసిరెడ్డి వీరభద్రరావుగారికి జోహార్లు.

ప్రజాన్యాయవాది, ప్రజాఉద్యమ సానుభూతిపరులు **సి. శివయ్య** 11-11-22న మరణించారు. అనకాపల్లిలో న్యాయవాద వృత్తి చేపట్టి కొనసాగించటంతోపాటు వామపక్ష ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. ఆ ప్రాంతంలో క్వారీ కార్మికుల హక్కుల అణచివేత సందర్భంలో వారికి అండగా వున్నారు. టి.ఎన్.ఎం. ట్రస్టు ప్రచురించిన 'జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి ఉపన్యాసాలు - వ్యాసాలు' పుస్తకంలోని అనేక వ్యాసాలను ఆయన ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదించారు. ప్రజాన్యాయవాది శివయ్యగార్కి జోహార్లు.

తూర్పుగోదావరిజిల్లా తొలితరం కమ్యూనిస్టు నాయకులలో ఒకరైన **కా॥ భూపతి నారాయణమూర్తి** (100సం॥లు) తన స్వగ్రామమైన మల్కీపురంలో 2019 నవంబర్‌లో మరణించారు. నాటి పీడిత ప్రజాఉద్యమ అమరులు కా॥ కందికట్ల నాగభూషణం వంటి వారి వీరోచిత జీవితాన్ని, కృషిని ఆయన వెలుగులోకి తెచ్చారు. రైతుకూలీసంఘంతో నిరంతరం సన్నిహితంగా మెలిగారు. అణచివేత, పీడనలపై, సాంఘిక వివక్షలపై ఎన్నో విలువైన రచనలు సాగించిన కామ్రేడ్ భూపతి నారాయణమూర్తికి విప్లవజోహార్లు.

కారామాస్టారుగా ప్రసిద్ధిచెందిన **కాళీపట్నం రామారావు** (97 సం॥లు) 4-5-2021న మరణించారు. సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన కారా ప్రజాఉద్యమ చైతన్యంతో ప్రగతిశీల రచయితగా ఎదిగారు. సామాజిక జీవితంతో బలంగా పెనవేసుకున్న ప్రగతిశీల కథలు, కథానికలను ఆయన రచించారు. శ్రీకాకుళంలో కథాసాహిత్య భాండాగారం 'కథానిలయాన్ని' స్థాపించిన కారా మాస్టారికి జోహార్లు.

ఆదివాసులు, దళితులు, పీడిత ప్రజల సమస్యలపై ఎన్నో అద్భుతమైన పాటలు రాసిన ప్రజాకవి **కా॥ వంగపండు ప్రసాదరావు** 4-8-20న మరణించారు. ఆయన రచించిన భూభాగోతం ఎన్నోసార్లు ప్రదర్శించబడి ఉత్తేజాన్ని అందించింది. రైతుకూలీల జీవన సమస్యలపై ఎంతో ఉత్తమమైన సాహిత్యాన్ని అందించిన కా॥ వంగపండుకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తోంది.

ప్రజాఉద్యమాలకు సానుభూతిపరులు **ఎం.వి. భద్రం** (90 సం॥లు) హైదరాబాద్‌లో 21-11-22న మరణించారు. విద్యార్థి దశలో వామపక్ష భావజాల వ్యాప్తికి కృషిచేశారు. హైదరాబాద్‌లో ప్రోగ్రెసివ్ ప్రెస్ స్థాపించి ఉద్యమాలకు తోడ్పడ్డారు. హైదరాబాద్ సమీపంలో ఆదర్శ వృద్ధాశ్రమం నిర్మించి దీర్ఘకాలం దానిని నిర్వహించారు. చివరిదాకా వామపక్ష ఉద్యమాలకు, సాహిత్యానికి తన తోడ్పాటునందించిన ముమ్మనేని వీరభద్రంకు జోహార్లు.

పీడిత ప్రజాఉద్యమ నాయకురాలు **కా॥ పైలా చంద్రమ్మ** 23-9-20న కరోనా కారణంగా మరణించారు. కష్టజీవుల కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ పైలా చంద్రమ్మ, మహత్తర శ్రీకాకుళ ప్రజాఉద్యమంలో ఎన్నో నిర్బంధాలను, ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. ఎన్నో సం॥ల అజ్ఞాతవాసం, 13 సం॥ల జైలుజీవితం గడిపారు. కా॥ పైలా వాసుదేవరావు జీవిత భాగస్వామిగా జీవితంలో, కుటుంబంలో అనేక ఆటుపోట్లను ఆమె ఎదుర్కొన్నారు. కడదాకా విప్లవోద్యమ పురోగమనంకోసం పరితపించిన కా॥ చంద్రమ్మకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జోహార్లర్పిస్తోంది.

పీడిత ప్రజాఉద్యమ నాయకులు **కా॥ డి.వి. కృష్ణ** (76 సం॥లు) క్యాన్సర్‌తో పోరాడుతూ 26-6-22న మరణించారు. గోదావరి లోయ రైతాంగ ఉద్యమ ప్రభావంతో ఉద్యోగానికి రాజీనామాచేసి ఉద్యమంలోకి వచ్చారు. ఫారెస్టు ప్రాంత ఉద్యమ బాధ్యతలు నిర్వహించారు. విప్లవ కార్మికనేతగా కృషి సాగించారు. కా॥ డి.వి. కృష్ణకు విప్లవ జోహార్లు.

ప్రజావైద్యులు, మార్క్సిస్టు విశ్లేషకులు **డా॥ ఏ.పి. విఠల్** (78 సం॥లు) విజయవాడలో 21-1-20న మరణించారు. అభ్యుదయ కుటుంబ నేపధ్యంలో పెరిగిన డా॥ ఏ.పి. విఠల్ గుంటూరులో వైద్యవిద్య నభ్యసించే రోజుల్లో వామపక్ష ఉద్యమాల పట్ల ఆకర్షితులయ్యారు. విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. 1972లో నల్గొండజిల్లా సూర్యాపేటలో ప్రజావైద్యశాలను స్థాపించి మూడు రూ॥ ఫీజుతో ప్రజల దవాఖానాగా మార్చారు. 'ప్రజాశక్తి' దినపత్రికలో పనిచేశారు. అనేక రచనలు చేశారు. డా॥ ఏ.పి.విఠల్‌కు జోహార్లు.

ఉ.సా.గా చిరపరిచితుడైన **ఉప్పుమాగులూరి సాంబశివరావు** 25-7-20న కరోనా కారణంగా మరణించారు. గుంటూరుజిల్లా బ్రాహ్మణకోడూరులో జన్మించిన ఆయన తెనాలి వియస్ఆర్ కాలేజీలో చదివే రోజులలో విప్లవ రాజకీయాలు స్వీకరించారు. ప్రజాసమస్యలపై ఎన్నో పాటలు రాశారు. కొండమొదలులో 1982 చివరిలో భూపోరాటం ప్రతిఘటనా స్థాయికి చేరుకుంది. ఆ కాలంలో ప్రజలలో వెల్లివిరిసిన పోరాట చైతన్యం, పోరాట నాయకత్వ దృక్పధంపట్ల ఉ.సా. ఉత్తేజితుడై ఈనాటికీ కార్యకర్తలు నిరంతరం పాడుకునే అనేక పాటలు రాశారు. 1982 తర్వాత నల్గొండజిల్లా మోత్కూరు ప్రాంతంలో లోవోల్టేజీకి వ్యతిరేకంగా వేలాదిమంది రైతాంగాన్ని కదిలించటంలో కా॥ ఉసా కృషిచేశారు. పోచంపాడు వరద కాల్వ సమస్యపై రైతాంగాన్ని కదిలించారు. పీడిత ప్రజాఉద్యమాల పక్షాన ఉ.సా. చేసిన కృషికి ఆయనకు జోహార్లు.

పీడిత ప్రజాఉద్యమ నాయకులుగా సుదీర్ఘకాలం కృష్ణాజిల్లా దివితాలూకాలో అనేక ప్రజాఉద్యమాలలో కలగలిసి జీవించిన **కా॥ చల్లపల్లి శ్రీనివాసరావు** (94సం॥లు) 26-8-20న మరణించారు. దివితాలూకా ఉప్పెన సందర్భంగా ఆయన నిర్వహించిన పాత్ర ముఖ్యమైనది. చివరివరకూ విప్లవ పతాక నీడలో జీవితం గడిపిన కా॥ చల్లపల్లి శ్రీనివాసరావుకు విప్లవజోహార్లు.

భద్రాచలం నియోజకవర్గం నుండి మూడుసార్లు గెలిచి, ఆదివాసుల సమస్యలపై ఎన్నో వేదికలమీద గళమెత్తిన **కా॥ సున్నం రాజయ్య** కోవిడ్ కారణంగా 4-8-20న మరణించారు. ప్రజాఉద్యమ కార్యకర్తలకు ఆదర్శనీయమైన నిరాడంబర జీవనాన్ని గడిపిన కా॥ సున్నం రాజయ్యకు జోహార్లు.

ఒడిషాకు చెందిన పీడిత ప్రజాఉద్యమ నాయకులు **కామ్రేడ్ గణనాధ్‌పాత్రో** (80 సం॥లు) 2020 జూన్ 6న అంతిమశ్వాస విడిచారు. నక్సల్బరీ ఉద్యమ ప్రేరణతో ఉద్యోగాన్ని వదలి ఆయన విప్లవోద్యమంలోకి ప్రవేశించారు. బాలాసోర్‌జిల్లా - బలియాపాల్ అణుక్షిపణి స్థావర వ్యతిరేక ఆందోళనలను గొప్ప ప్రజాఉద్యమంగా మలచడంలో కీలకపాత్ర వహించారు. జైలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. కా॥ జి.పి.కి. విప్లవజోహార్లు.

మార్క్సిజంపట్ల తిరుగులేని విశ్వాసంగల **కా॥ పి.కె.మూర్తి** (80 సం॥లు) 2 సం॥ల పాటు క్యాన్సర్‌తో పోరాడి 2020 మార్చి 22న మరణించారు. కా॥ పి.కె. మూర్తి చిన్నతనంలో పెరియార్ నాయకత్వంలోని కులవ్యతిరేక ఆత్మగౌరవ ఉద్యమంతో ప్రభావితులయ్యారు.

ప్యారిస్‌లో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న కాలంలో 1968లో ఫ్రెంచ్ విద్యార్థుల తిరుగుబాటులో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. కార్మికవర్గాన్ని విప్లవ రాజకీయాల్లోకి సమీకరించటానికి ఎనలేని కృషిచేశారు. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా బొగ్గుగనులలో కార్మికునిగా చేరి, గని కార్మికులను యూనియన్‌లోకి సమీకృతం చేశారు. కా॥పి.కె.మూర్తికి విప్లవజోహార్లు.

గోపీవల్లభపూర్ ప్రాంత ఉద్యమ నిర్మాణ నాయకత్వ సభ్యులలో ఒకరైన **కా॥ ప్రదీప్ బెనర్జీ** 7-5-21న మరణించారు. గోపీవల్లభపూర్ రైతాంగ ఉద్యమాన్ని నిర్మించి, అభివృద్ధి చేసిన ప్రధాన నాయకులలో కా॥ ప్రదీప్ బెనర్జీ ఒకరు. ఈ ఉద్యమంలో పాల్గొన్నందుకుగాను ఆయనకు జీవితకాల శిక్ష విధించారు. బెంగాల్‌లో వామపక్ష సంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడుదలయ్యారు. పీడిత ప్రజాఉద్యమాల ఐక్యతకోసం ఆయన కృషి సాగించారు. కా॥ ప్రదీప్ బెనర్జీకి విప్లవజోహార్లు.

పీడిత ప్రజా ఉద్యమ నాయకులు **కామ్రేడ్ మహమ్మద్ గౌస్** (60 సం॥లు) 19-4-21న కరోనా కారణంగా మరణించారు. విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా ఆయన తన రాజకీయ జీవితం ప్రారంభించారు. రైతుకూలీ, వామపక్ష, దళిత సంఘాలకు మంచి మిత్రులైన కామ్రేడ్ గౌస్‌కు జోహార్లు.

'చిప్కో' ఉద్యమనేత **సుందర్‌లాల్ బహుగుణ** (94 సం॥లు) 21-5-21న ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కన్నుమూశారు. 13వ ఏటనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. 17వ ఏట జైలుశిక్ష అనుభవించారు. 1949లో సామాజిక ఉద్యమకారునిగా కులవ్యవస్థపై పోరాడారు. గంగోత్రి, యమునోత్రి ఆలయాల్లోకి దళితుల ప్రవేశాన్ని సాధించారు. బిష్ణోయ్ గిరిజన తెగలవారి 'చిప్కో' ఉద్యమ సాంప్రదాయంతో (చెట్లను కౌగలించుకొని వాటిని నరకటానికి వచ్చినవారిని అడ్డుకోవటం) పర్యావరణరంగంలో విశేష కృషిచేసిన సుందర్‌లాల్ బహుగుణకు జోహార్లు.

పీడిత ప్రజాయోధుడు **కా॥ బంద్రు నర్సింహులు** (104 సం॥లు) 22-1-22న హైదరాబాద్‌లో కన్నుమూశారు. 1944లో ఆంధ్రమహాసభ భువనగిరిలో మహాసభ నిర్వహించిన సమయంలో కా॥ నర్సింహులు చురుకైన రాజకీయ జీవితంలోకి వచ్చారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన భాగస్వామి అయ్యారు. ఆ క్రమంలో తీవ్ర నిర్బంధానికి, జైలుజీవితానికి గురయ్యారు. హైదరాబాద్ కుట్రకేసులో ఇతర కామ్రేడ్స్‌తోపాటుగా కా॥ నర్సింహులు జైలు శిక్షననుభవించారు. 8 దశాబ్దాల విలువైన అనుభవాలతో యువశ్రేణులకు స్ఫూర్తిదాయకమైన కా॥ బంద్రు నర్సింహులకు జోహార్లు.

మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట కార్యకర్త, కార్మిక నాయకుడు, **కా॥ బూర్గుల నరసింగరావు** (89 సం॥లు) హైదరాబాద్‌లో మరణించారు. వివేకవర్ధిని, నిజాం కళాశాలల్లో చదివిన కా॥ నరసింగరావు ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ఏర్పరచి, నిజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో ప్రముఖ నాయకత్వ పాత్ర వహించారు. 1955లో లక్నోలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ మహాసభల్లో అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఏఐటియుసి నాయకునిగా కార్మికోద్యమంలో పనిచేశారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషా సాహిత్యాలలో లోతైన అవగాహన కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి కా॥ బూర్గుల నరసింగరావుకు జోహార్లు.

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటనేత **కామ్రేడ్ మల్లు స్వరాజ్యం** (91 సం॥లు) 19-3-22న హైదరాబాద్‌లో మరణించారు. 14 సం॥ల వయస్సులోనే ఆమె పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. క్రూరనైజాంకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజల్ని కూడగట్టేందుకు నాయకత్వం వహించారు. కళాకారిణిగా, ఉపన్యాసకురాలిగా, దళసభ్యురాలుగా కృషిచేశారు. స్త్రీలను ఉద్యమాలలోకి సమీకరించటంలో శ్రద్ధ చూపారు. స్ఫూర్తిదాయక ఉద్యమ జీవితమున్న కా॥ మల్లు స్వరాజ్యంకు జోహార్లు.

పీడిత ప్రజాఉద్యమ తెలంగాణా రాష్ట్ర నాయకులు **కా॥ తాండ్ర కుమార్** (60 సం॥లు) అనారోగ్యంతో 14-2-22న మరణించారు. పేదరైతు కుటుంబంలో జన్మించిన కుమార్, చిన్నతనంలోనే పటేల్, పట్వారీల అణచివేతను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ భూములను ప్రజలు స్వాధీనం చేసుకునే కార్యక్రమాలు నిర్వహించారు. కా॥ తాండ్ర కుమార్‌కు జోహార్లు.

విరసం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు **కా॥ సి.రామ్మోహన్** (74 సం॥లు) క్యాన్సర్‌వ్యాధితో పోరాడుతూ 8-3-22న మరణించారు. ఉపాధ్యాయ ఉద్యమంలో చురుగ్గా పనిచేసిన కా॥ రామ్మోహన్, ఉపాధ్యాయులను, విద్యార్థులను శాస్త్రీయంగా విద్యావంతం చేయటంలో కృషిచేశారు. కా॥ రామ్మోహన్‌కు జోహార్లు.

అరుణోదయను ఇంటి పేరుగా మార్చుకున్న **కా॥ రామారావు అలియాస్ సత్తెన్న** (65 సం॥లు) 2019 మే 5వ తేదీన గుండెపోటుతో హటాత్తుగా మరణించారు. విద్యార్థి దశనుండే వామపక్ష భావాలపట్ల ఆకర్షితుడైన కా॥ రామారావు, విప్లవ సాంస్కృతిక రంగంలో నాలుగు దశాబ్దాలపైగా కృషి సాగించారు. అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా విప్లవోద్యమ కృషిలో ఆయన తన

శక్తి సామర్థ్యాలను వెచ్చించారు. ప్రజాకళాకారునిగా పాటలు పాడటంతోపాటు వీధి నాటికలు, యక్షగానం, బుర్రకథలు, ఒగ్గుకథలు వంటి ఎన్నో జానపద కళారూపాలను ప్రజాసమస్యలతో జోడించి ప్రదర్శించటంలో ఆయన ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. కా॥ అరుణోదయ రామారావుకు జోహార్లు.

ప్రజాస్వామ్యవాది, సృజనశీల కళాకారుడు **గిరీష్ కర్నాడ్** (81 సం॥లు) బెంగుళూరులో అనారోగ్యంతో 10-6-2019న మరణించారు. ఆయన తన జీవిత కాలంలో మతతత్వ భావజాలాన్నీ, మూఢనమ్మకాలను, ప్రశ్నిస్తున్న గొంతులపై నిర్బంధాన్ని వ్యతిరేకించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం, రాజకీయశాస్త్రం, అర్థశాస్త్రం అభ్యసించారు. నాటకరంగంలో ఎనలేని కృషిచేశారు. పాలకుల మతతత్వ విధానాలను, ప్రజాస్వామిక భావనలను అణచివేయటాన్ని ప్రశ్నించిన గిరీష్ కర్నాడ్‌కు జోహార్లు.

నాలుగు దశాబ్దాలుగా ప్రజాకళాకారునిగా, ప్రజాకళామండలి గాయకునిగా ప్రాచుర్యం పొందిన **కా॥ దప్పు రమేష్** (62 సం॥లు) 18-3-22న విజయవాడలో మరణించారు. వివిధ రాష్ట్రాలలో ఆయన ముఖ్యంగా ఆదివాసుల నడుమ కృషి సాగించారు. తెలుగు, మరాఠీ, కోయ, కుయి భాషల్లో పాటలు పాడేవారు. అనేక కేసులు, అరెస్టులు ఎదుర్కొన్నాడు. కా॥ రమేష్‌కు జోహార్లు.

మూడు దశాబ్దాల కాలం విశాలాంధ్ర దినపత్రికకు సంపాదకునిగా పనిచేసిన **సి. రాఘవాచారి** (81 సం॥లు) 28-10-19న హైదరాబాద్‌లో మరణించారు. వామపక్ష భావజాలంపట్ల విద్యార్థి దశలో ఆకర్షితులైన ఆయన, సాంప్రదాయ భావాలను, గుర్తులను తీసివేశారు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో మంచి ప్రావీణ్యం వున్న రాఘవాచారి ఏ విషయంపైనైనా వామపక్ష భావజాల దృక్కోణంతో మాట్లాడేవారు. నాలుగు దశాబ్దాలకుపైగా కాలంలో ఎన్నో సాంప్రదాయేతర వివాహాలను జరిపించిన కా॥ రాఘవాచారికి జోహార్లు.

పశ్చిమబెంగాల్ రాష్ట్రం, 24 పరగణాల జిల్లాలో జన్మించిన **కా॥ కౌషిక్ బెనర్జీ** 1-11-22న మరణించారు. చదువును వదలి రైతాంగ ఉద్యమంలో ఆయన పనిచేశారు. విప్లవోద్యమ ఐక్యతకోసం కృషిచేశారు. అంతర్జాతీయంగా ఉద్యమశక్తులతో సంబంధాలు కొనసాగించి హైదరాబాద్‌లో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించటంలో కీలకపాత్ర పోషించారు. కా॥ కౌషిక్ బెనర్జీకి జోహార్లు.

సీనియర్ జర్నలిస్టు, వామపక్షవాది **కా॥ నిమ్మకాయల రంగనాథ్** (80 సం॥లు) 7-2-22న మరణించారు. హైస్కూల్ విద్యనభ్యసించే రోజులనుండే ఆయన ఉద్యమాలతో పరిచయమయ్యారు. అమలాపురంలో కార్మికులను, రైతులను సంఘటితపరిచారు. విప్లవ పత్రికల్లో క్రియాశీల కృషి సాగించారు. రైతాంగ, ఆదివాసీ ఉద్యమాల పక్షపాతి కా॥ రంగనాథ్‌కు జోహార్లు.

పేద ప్రజల ప్రముఖ లాయరు **చేకూరి లక్ష్మీకాంతరావు** (91 సం॥లు) నర్సరావుపేటలో 13-11-22న మరణించారు. విద్యార్థిగా వామపక్ష భావాలకు ఆకర్షితులైన ఆయన నాటి తెలంగాణా రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. నర్సరావుపేటలో 1962 నుండి న్యాయవాద వృత్తిని చేపట్టి పేద ప్రజల న్యాయవాదిగా పేరుగాంచారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమంలో పాల్గొన్నారు. భూసంస్కరణల చట్టం వచ్చినపుడు భూస్వాములకు అనుకూలంగా వాదించటానికి నిరాకరించారు. కా॥ విశ్వమోహనరెడ్డి నాయకత్వాన సాగిన పల్నాడు రైతాంగ, ప్రజాఉద్యమానికి వృత్తిపరంగా తోడ్పాటునివ్వటంతోపాటు అండగా నిలిచారు. ప్రజాపక్ష న్యాయవాది సిహెచ్. ఎల్. కాంతారావుగారికి జోహార్లు.

శోషిత్ జనసభ నాయకుడు **కసుకుర్తి రామలింగం** 17-10-19న హైదరాబాద్‌లో మరణించారు. వామపక్ష భావజాలంతో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా పనిచేసిన రామలింగం శోషిత్ జనసభ నాయకునిగా దళిత ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. లక్షింపేటలో దళితులపై హంతకదాడి తర్వాత బొజ్జా తారకంగారి నాయకత్వాన దీర్ఘకాలం సాగిన ఐక్య ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నారు. రైలు ప్రమాదంలో గాయమై చికిత్స పొందుతూ మరణించారు. కా॥ రామలింగంకు జోహార్లు.

దీర్ఘకాల అనారోగ్యంతో పోరాడుతూ **కామ్రేడ్ ఘంటా మారుతి** (74 సం॥లు) 28-8-22న విజయవాడలో మరణించారు. వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకురాలిగా పనిచేశారు. ప్రగతిశీల కార్యక్రమాలలో పాల్గొనేవారు. పీడిత ప్రజా ఉద్యమాలకు, రైతుకూలీ ఆదివాసీ ఉద్యమాలకు సహాయ సహకారాలందించేవారు. కా॥ మారుతికి జోహార్లు.

సామాజిక ఉద్యమకారుడు **డా॥ ఎం.వి. రమణారెడ్డి** (78 సం॥లు) కర్నూలులో 29-9-21న మరణించారు. ఆయన గుంటూరు వైద్యకళాశాలలో వైద్యవిద్యనభ్యసించారు. పీడిత ప్రజాఉద్యమ నాయకుడయ్యారు. ఆయన పత్రికల్లో రాసిన వ్యాసాలపై ఆగ్రహించిన ప్రభుత్వం పి.డి. చట్టం సికింద్రాబాద్ జైలులో నిర్బంధించింది. రాయలసీమ విమోచన సమితి స్థాపించి, కరువు సమస్యలపై గళమెత్తిన ఎం.వి. రమణారెడ్డికి జోహార్లు.

పిల్లల వైద్యురాలు, అభ్యుదయవాది **డా॥ హేమ** (70 సం॥లు) విజయవాడలో 24-12-19న మరణించారు. గుంటూరు మెడికల్ కాలేజీలో వైద్యవిద్యనభ్యసించిన ఆమె పిల్లల వైద్యురాలిగా 'జాబిల్లి' వైద్యశాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో వైద్యసేవలందించారు. అసమానతలు, వివక్షలు, మూఢనమ్మకాలను వ్యతిరేకించారు. ఈ భావాలతో పిల్లలు ఎదిగేందుకు వికాస విద్యావనం స్థాపించి నిర్వహించటంలో యస్.ఆర్. పరిమిగారికి వెన్నంటి నిలిచారు. ప్రగతిశీల ఉద్యమాలకు సహాయకురాలిగానున్న డా॥ హేమకు జోహార్లు.

ఉద్యమశీలి **బి. పాండురంగారెడ్డి** (74 సం॥లు) ఉపాధ్యాయ, సాహిత్య ఉద్యమాలతోపాటు రాయలసీమ సమస్యలపై కృషిచేశారు. ఆయన 3-8-2020న కరోనాతో మరణించారు. రాయలసీమ ఉద్యమ కార్యాచరణ సమితి, కన్వీనర్‌గా పనిచేశారు. సాయుధ ముఠాల వ్యతిరేక పోరాట కమిటీలో క్రియాశీలకంగా పనిచేసిన బి. పాండురంగారెడ్డికి జోహార్లు.

ప్రజాగాయకుడు **నలుమూరి రాజారావు** (87 సం॥లు) తణుకులో 22-12-20న మరణించారు. ఆయన ప్రజల్ని చైతన్యపరిచే ఎన్నో నాటకాల్లో నటించారు; పాటలు పాడారు; బుర్రకథలు చెప్పారు; డప్పు కొట్టేవారు. ఖాకీ చొక్కా, తెల్లచొక్కాతో అతి నిరాడంబరంగా జీవించిన రాజారావు తెన్నేటిసూరి పాట 'స్వర్గానికి రోడ్డు'ను ప్రతి సభలోనూ పాడేవారు. నిబద్ధత గల ప్రజాకళాకారుడు కా॥ నలుమూరి రాజారావుకు జోహార్లు.

విశాలాంధ్ర సంపాదకుడు **ముత్యాల ప్రసాద్** (54 సం॥లు) విజయవాడలో 24-11-20న కరోనా బారినపడి మరణించారు. విద్యార్థిగా వామపక్ష భావజాలం పట్ల ఆకర్షితులై, విశాలాంధ్రలో జర్నలిస్టుగా, తదనంతరం సంపాదకునిగా ఎదిగారు. కరోనాతో చిన్నవయసులోనే మృతిచెందిన ముత్యాల ప్రసాద్‌కు జోహార్లు.

ఉపాధ్యాయ ఉద్యమ గుంటూరుజిల్లా నాయకుడు, ప్రజాతంత్రవాది **వంగర లక్ష్మీకాంత్** (53 సం॥లు) గుంటూరులో 21-4-21న కరోనాతో పోరాడుతూ మరణించారు. విద్యార్థి దశలో విప్లవ విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అభ్యుదయ రచనలు చేశారు. ఉపాధ్యాయునిగా విద్యార్థులకు అభ్యుదయ అంశాలతో బోధించేవారు. ప్రజాతంత్ర ఉద్యమాలకు అండగా నిలిచిన వంగర లక్ష్మీకాంత్‌కు జోహార్లు.

★ ★ ★

ఈ గత నాలుగు సం॥ల పైగా కాలంలో ముఖ్యంగా కోవిడ్‌బారిన పడి అనేకమంది మన సంఘ నాయకులు, కార్యకర్తలేగాక మనకు అత్యంత ఆప్తులు, ముఖ్యులను కూడా కోల్పోయాం. దేశవ్యాపితంగా లక్షలాదిమంది కోవిడ్‌వాతబడి ప్రాణాలొదిలారు. ప్రభుత్వం హటాత్తుగా ప్రకటించిన లాక్‌డౌన్‌తో లక్షలాదిమంది వేల మైళ్ళ దూరం కాలినడకన ముందుకు సాగే క్రమంలో మధ్యలో ఎందరో రాలిపోయారు. వారందరి మృతిపట్ల రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) సంతాపం వ్యక్తం చేస్తోంది.

ప్రకృతి విపత్తులలో మరణించినవారికి, బలవన్మరణాలకు పాల్పడిన రైతాంగానికి, పారిశ్రామిక ప్రమాదాలలో అశువులుబాసిన కార్మికులకు, రష్యా - ఉక్రెయిన్ యుద్ధ మృతులకు - పోలీసు కాల్పులలోను, బూటకపు ఎదురుకాల్పులలో, దీర్ఘకాలం సాగిన రైతాంగ ఉద్యమంలో అమరులైనవారందరి మృతిపట్ల రైతుకూలీసంఘం తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది.

# మృతవీరులారా లాల్ సలాం

**- రాంభట్ల**

మృతవీరులారా లాల్ సలాం
ఇదే మా లాల్ సలాం

దరిలేని బానిస చాకిరి
నరహంతకుల గూండాగిరీ
ఇక వద్దని ఇది రద్దని
పోరాడి నేలకు ఒరిగినా
రణధీరులారా లాల్ సలాం ॥మృత॥

మత మూఢవిశ్వాసాలను
కులజాతి విద్వేషాలను
నిరసించుతూ ఎదిరించుతూ
పోరాడి నేలకు ఒరిగినా
యువశూరులారా లాల్ సలాం ॥మృత॥

శ్రమశక్తి దోపిడీదారునీ
సమరాల గుత్త కుబేరుని
అరికట్టుతూ హతమార్చుతూ
పోరాడి నేలకు ఒరిగినా
శ్రమజీవులారా లాల్ సలాం ॥మృత॥

చిరశాంతి భువి నిండాలని
నరజాతి కల పండాలని
యుగస్రష్టలై కమ్యూనిస్టులై
ధృవతారలారా లాల్ సలాం ॥మృత॥

# విప్లవ మేథో దార్శనికుడు
# కామ్రేడ్ జశ్వంతరావుకు అరుణారుణ జోహార్లు



టి.ఎన్. ఆలోచనా 'ధార'సత్వం
ఆర్థికాంశ మూలాల పరిశోధనం
అయిదు దశాబ్దాల ఫలప్రద
విప్లవ రాజకీయ సాంగత్యం!

# శ్రామికవర్గ విప్లవ నాయకుడు

# కామ్రేడ్ మధుకు అరుణారుణ జోహార్లు



ఆరున్నర దశాబ్దాల
సుదీర్ఘ విప్లవ రాజకీయ ప్రస్థానం
మౌన గంభీర
విప్లవ మేధో మథనం



ఏఐకెఎంకెఎస్ నాయకులు

కామ్రేడ్ బ్రహ్మానంద మాలిక్‌కు జోహార్లు



ఏఐకెఎంకెఎస్ నాయకులు

కామ్రేడ్ విశ్వకర్మాకర్‌కు జోహార్లు



ఆదివాసీ ఆత్మబంధువు, ప్రజాతంత్రవాది

స్టాన్‌స్వామికి జోహార్లు



ఏజెన్సీ గిరిజనోద్యమ నాయకులు

కామ్రేడ్ చదల వీరపురెడ్డికి జోహార్లు

# అమరుల సంస్మరణలో....



శ్రీకాకుళ గిరిజనోద్యమ అమరయోధుల సంస్మరణ
శ్రీకాకుళం 31-10-2021




కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల వర్ధంతి సభ
కొండమొదలు 15-12-2018




కామ్రేడ్ సోమయ్య వర్ధంతిసభ సందర్భంగా....
అమరుల సంస్మరణసభ
కొండమొదలు 18-03-2022



సంస్మరణసభకు హాజరైన ప్రజానీకం




కొండమొదలు ఆర్ & ఆర్ నూతన కాలనీలో
కామ్రేడ్ కుండ్ల గంగరాజు వర్ధంతిసభ
నేలదోనెలపాడు 07-07-2022




కామ్రేడ్ జన్ని తిరుపతి 23వ వర్ధంతి సందర్భంగా ప్రదర్శన
దుగ్గేరు 17-11-2022

# అమరుల సంస్మరణలో....



కామ్రేడ్ కోటయ్య 5వ వర్ధంతిసభ
నందిగామ 03-12-2022



వర్ధంతిసభకు హాజరైన ప్రజానీకం



కామ్రేడ్ కారం పార్వతి 25వ వర్ధంతి సందర్భంగా అమరులకు జోహార్లు
మనుగోపుల 04-11-2019



రై.కూ.సం. రాష్ట్ర కార్యవర్గసభ్యులు కామ్రేడ్ సింహాద్రి లక్ష్మారెడ్డి వర్ధంతిసభ
కాజ, గుంటూరుజిల్లా 31-03-2022



రై.కూ.సం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ తిమ్మారెడ్డి వర్ధంతిసభ
రాయదుర్గం, అనంతపురం జిల్లా 06-06-2022




బొజ్జా తారకంగారి 6వ వర్ధంతి సభ
కాకినాడ 16-09-2021

# మూడు రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ....




గుంటూరులో ప్రదర్శన 01-12-2020




విజయవాడలో ధర్నా - ప్రదర్శన 15-12-2020




పార్వతీపురంలో సదస్సు 29-12-2020



సదస్సుకు హాజరైన ప్రజానీకం




సదస్సుకు హాజరైన ప్రజానీకం




నెల్లూరు జిల్లా సదస్సు - రాపూరు. 29-12-2020

# మూడు రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ....




భారత్ బంద్ సందర్భంగా ప్రదర్శన
దొండపూడి - ప.గో.జిల్లా 27-9-21



భారత్ బంద్ సందర్భంగా సభ
బొబ్బిలి 26-11-20




సార్వత్రిక సమ్మె సందర్భంగా....
ఒంగోలు 26-11-20




సార్వత్రిక సమ్మె సందర్భంగా....
అనంతపురం 26-11-20




భారత్ బంద్ సందర్భంగా....
దొండపూడి, ప.గో.జిల్లా 26-03-21



కిసాన్ జ్యోతి - స్మృతి దివస్ సందర్భంగా....
చోడవరం, విశాఖజిల్లా 20-12-21

# మూడు రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ....



అంతర్జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా.... పుస్తకావిష్కరణ
విజయవాడ, 23-12-2020




400 కి.మీ. పాదయాత్ర బృందానికి స్వాగతం
బళ్ళారి 22-03-2021




ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా....
నెల్లూరు 26-01-2021




కాగడాల ప్రదర్శన
ఒంగోలు 24-12-2020




సత్యాగ్రహ దీక్ష సందర్భంగా....
26-11-2021




కార్మిక, కర్షక సమ్మేళనం
నెల్లూరు 17-05-2022




....నిరపరాధులై దురదృష్టంచే
చెరసాలలో చిక్కేవాళ్ళూ -
లోహ రాక్షసుల పదఘట్టనచే
కొనప్రాణంతో కనలేవాళ్ళూ-
కష్టం చాలక కడుపుమంటచే
తెగించి సమ్మెలు కట్టేవాళ్ళూ-

శ్రమ నిష్ఫలమై, జని నిష్ఠురమై,
నూతిని గోతిని వెదకేవాళ్ళూ-
అనేకులింకా అభాగ్యులంతా,
అనాథులంతా, అశాంతులంతా
దీర్ఘశృతిలో, తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్!

- శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' నుండి

# రాజధాని అంశం - వాస్తవిక సమస్యల నుండి మళ్ళింపు

**2014** సం॥లో రాష్ట్ర విభజన నాటినుండి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపిల నేతృత్వంలోని ప్రభుత్వాలు - ప్రజల ఆలోచనలను నిరంతరం రాష్ట్ర రాజధాని అంశం చుట్టూతా తిరిగేలా చేస్తూ, వాస్తవిక సమస్యల నుండి వారిని ప్రక్కకు మళ్ళిస్తున్నాయి. 2019 సం॥లో అధికారంలోకి వచ్చిన వైసిపి, మూడు రాజధానులంటూ ముందుకొచ్చింది.

వాస్తవానికి 'గడపగడపకు ప్రభుత్వం' కార్యక్రమంలో అధికార ఎంఎల్ఏలకు, మంత్రులకు ప్రజల నుండి ఎదురవుతున్న చేదు అనుభవాలు వైసిపి నాయకత్వానికి కలవరం కలిగిస్తున్నాయి. తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వస్తున్న వివిధ రంగాల ప్రజానీకం సంఖ్య పెరుగుతోంది. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఎంతో కొంతమందికి ఏదోమేరకు ఆర్థిక లబ్ధి చేకూరినట్లు కన్పిస్తున్నప్పటికీ, ప్రజలపై నానాటికీ పెరుగుతున్న భారాలు - నిత్యావసరాల ధరల పెరుగుదల, విద్యుత్తు, ప్రయాణ, రవాణా ఛార్జీల పెరుగుదల; పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలలతో పాటు, పన్నుల, జరిమానాల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజానీకం కునారిల్లిపోతున్నారు. కరోనా మహమ్మారితో ఇప్పటికే కుదేలైవున్న ప్రజానీకానికి కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోగా, ఉన్న అవకాశాలనే రద్దుచేస్తుండటంతో అత్యధిక ప్రజానీకం అసంతృప్తితో వున్నారు. ఈ అసంతృప్తి వివిధ సందర్భాలలో నిరసనాందోళనలరూపం తీసుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వ 'భరోసా'లు, 'ఆసరా'లను గేలిచేస్తూ రుణభారం నుండి విముక్తి కాలేక రైతులనేకమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా వుంది. ప్రపంచబ్యాంకు ఆదేశాలకు తలొగ్గిన ప్రభుత్వం, రైతుల నిరసనలను బేఖాతరు చేస్తూ సాగు విద్యుత్తు మోటార్లకు మీటర్లు బిగించే పనిని వేగంగా సాగిస్తోంది. రాష్ట్రంలో సహకార పాడిపరిశ్రమను పడకన వేసి, తమ స్వార్థ ప్రయోజనాల కోసం 'అమూల్'ను ముందుకు తెచ్చి పాడిరైతులను దెబ్బతీస్తున్నారు. పోలవరం నిర్వాసితులు, ఆశావర్కర్స్, పారిశుద్ధ్య సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు, నిరుద్యోగ యువత, రైతాంగం, విశాఖ ఉక్కు కార్మికులు, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు.... ఇలా సమస్తరంగాల ప్రజానీకం తమ దీర్ఘకాల, అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రోడ్లమీదకు వస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో మరింతగా కూరుకు పోతూండగా, దీనంతటికీ కారణం మీరంటే మీరని, అధికార విపక్షాలు కొట్లాడుకుంటున్నాయి. సిపిఎస్ రద్దుకోసం నిరంతరాయంగా ఆందోళన సాగిస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, తీవ్ర వేధింపు చర్యలకు పాల్పడుతోంది. కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాచే వైపుగా సభలకు, ప్రదర్శనలకు అనుమతి నిరాకరిస్తూ నిరంకుశ చర్యలను చేపడుతోంది.

ఈ నేపథ్యంలో రాజధాని అంశాన్ని పరిశీలిద్దాం. చంద్రబాబు అధికారంలోనున్న కాలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములేగాక రాజధాని పేరుతో 33 వేల ఎకరాల భూములను రైతుల నుండి గుంజుకున్నారు. ఆనాటికి 10 సం॥ల కాలం హైదరాబాద్ రాజధానిగా కొనసాగటానికి ఇంకా ఉండే అవకాశాలను కాదని, లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలను చంద్రబాబు దాని చుట్టూతా తిప్పాడు. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, చంద్రబాబు పాలనలో రాజధాని భూములలో 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' జరిగిందని, భారీ అవినీతి చోటు చేసుకుందంటూ, మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చి చట్టం చేసింది. అయితే నాటకీయ పరిణామాలతో హైకోర్టులో దానిని విరమించుకున్నట్లుగా ప్రకటించి, మరల పకడ్బందీగా దానినే చట్టంగా తెస్తామని చెబుతున్నారు. అభివృద్ధి పేరిట పాలన వికేంద్రీకరణ చేయాలని అమరావతి నుండి రాజధానిని తరలించే ప్రయత్నాలు దోపిడీ పాలక ముఠాలలో తీవ్రమౌతున్న వైరుధ్యాలను వెల్లడి చేస్తున్నాయి. స్థిరపడిన పెట్టుబడిదారులకూ, కొత్తగా ఎదుగుతున్న పెట్టుబడిదారులకూ నడుమ రియల్‌ఎస్టేట్, కాంట్రాక్టులు, స్వీయ స్వార్థ ప్రయోజనాల కోసం పెరుగుతున్న వైరుధ్యాలే పోలవరం, రాజధాని అంశాలలో వివిధ సమస్యలుగా ప్రజల ముందుకు తెస్తున్నారు.

ఈలోగా, అమరావతి ఏకైక రాజధానిగా కొనసాగాలని చేస్తున్న ఆందోళన వెయ్యిరోజులు పూర్తయిన సందర్భంగా అమరావతి ప్రాంత రైతులు అమరావతి నుండి అరసవల్లి (శ్రీకాకుళం జిల్లా) వరకు పాదయాత్ర తలపెట్టి, న్యాయస్థానం నుండి అనుమతి పొంది, కొంతదూరం కొనసాగించారు. అధికారపార్టీ నేతలు మూడు రాజధానులంటూ సృష్టించిన ఉద్రిక్తతల నడుమ ఆ పాదయాత్రను అర్థాంతరంగా ముగించారు.

మూడు రాజధానులను కొనసాగించి తీరుతామని, అన్ని ప్రాంతాల అభివృద్ధే తమ లక్ష్యమంటూ మంత్రులు, ఎంఎల్ఏలే వివిధ జిల్లాలలో ప్రకటనలు చేస్తూ, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ, ఉద్రిక్త వాతావరణాన్ని రెచ్చగొడుతున్నారు. 'అమరావతి రైతులది పాదయాత్ర కాదు; దండయాత్ర' అంటూ, ఉత్తరాంధ్ర నుండి పోటీ యాత్రలకు పథకాలు రచిస్తూ దాడులకు పురిగొల్పు తున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా పేర్లతో తిరిగి

ప్రాంతీయ విద్వేషాలకు ఆజ్యం పోస్తున్నారు. ప్రజానీకం ప్రాంతీయ విద్వేషాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలి. అమరావతి రైతుల ఆందోళనమాటున తిరిగి బలం పుంజుకునేందుకు తెలుగుదేశం పార్టీ తన పావులు కదుపుతోంది.

రాష్ట్ర విభజన, సమైక్య ఆంధ్ర ఆందోళనల సందర్భంగా ప్రజల మౌలిక సమస్యలతో సంబంధంలేని ఈ అంశాల చుట్టూ ప్రజలను తిప్పి, పాలకులు పబ్బం గడుపుకున్నారన్న విషయం ఆచరణలో రుజువైంది.

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాడు చంద్రబాబు – రాజధాని, ప్రత్యేక హోదా చుట్టూ ప్రజల ఆలోచనలను తిప్పుతూ తన కాలం గడుపుకున్నాడు. ఈనాడు తిరిగి వైసిపి ప్రభుత్వం, 'అమరావతా లేక మూడు రాజధానులా' అనే అంశం చుట్టూ ప్రజల ఆలోచనలను మళ్ళించి, మౌలిక సమస్యల నుండి వారిని ప్రక్కకు నెట్టటానికి మరో ప్రయత్నం చేస్తోంది.

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాడు చంద్రబాబు – రాజధాని, ప్రత్యేక హోదా చుట్టూ ప్రజల ఆలోచనలను తిప్పుతూ తన కాలం గడుపుకున్నాడు. ఈనాడు తిరిగి వైసిపి ప్రభుత్వం, 'అమరావతా లేక మూడు రాజధానులా' అనే అంశం చుట్టూ ప్రజల ఆలోచనలను మళ్ళించి, మౌలిక సమస్యల నుండి వారిని ప్రక్కకు నెట్టటానికి మరో ప్రయత్నం చేస్తోంది.

రాష్ట్రాలను అస్థిరపరచటం ద్వారా సామ్రాజ్యవాదం వివిధ రూపాలలో దేశంలో మరింతగా వేళ్ళూనుకొంటోంది. అడవులను, గనులను, సమస్త వనరులను వారు విచక్షణారహితంగా దోపిడీ చేసుకోవటానికి; ప్రభుత్వ, ప్రభుత్వరంగ పరిశ్రమలను తెగనమ్మటానికి వీలైన చట్టాలను, చట్టసవరణలను 'సందట్లో సడేమియా'లాగా పాలక ప్రభుత్వాలు చకచకా చేసేస్తున్నాయి. రైతాంగం, కార్మికుల జీవితాలు నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. ప్రజాస్వామిక హక్కులు మృగ్యమవుతున్నాయి. ప్రజల వాస్తవిక సమస్యల నుండి ప్రక్కకు మళ్ళించి, పెడదోవ పట్టించే పాలకుల కుటిల విధానాలపట్ల ప్రజలు, అభ్యుదయ, విప్లవశక్తులు అప్రమత్తంగా ఉండటంతోపాటు, ప్రజల మౌలిక సమస్యలపై నిలకడైన, నిరంతరాయ పోరాటాలకు నిర్మాణాత్మక కృషి సాగించాలి.

## ప్రపంచ విషాద వాస్తవం



సంపన్నవర్గం ప్రజలు

# పేదల భూములు కబ్జా - జీవో నెం. 72

## 2020 జనవరి 25

**రాష్ట్ర** ప్రభుత్వం 2019లో ప్రకటించిన "నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు" పథకం కోసం అనేకచోట్ల భూములను సమీకరించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో కూడా విఎంఆర్డిఏ పరిధిలోని 1,50,554 జగనన్న ఇళ్ల పట్టాల కోసం, 6,116 ఎకరాల భారీ భూసమీకరణకు పూనుకుంది. అనకాపల్లి డివిజన్‌లోనే 1,452 ఎకరాల భూమిని మామిడిపాలెం, సంతపాలెం, పాపయ్యపాలెం, కొండుపాలెం, కుంచంగి, పిసినికాడ.... ఇలా 12 గ్రామాల్లో సమీకరించారు. దీనికోసం "మున్సిపాలిటీ పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి "శాఖ (MA&UD)ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి జీవో నెంబర్ -72ను తేదీ 25/01/2020న తీసుకువచ్చింది.

### పేదల, సామాన్యుల భూములు మాత్రమే స్వాహా !

ఈ భూసమీకరణలో 50 సెంట్లు, ఎకరం, రెండెకరాల డి-పట్టాలు, ఆక్రమణలు కలిగిన గిరిజన, దళిత, రైతుకూలీ, పేద ప్రజలే తీవ్రంగా నష్టపోయారు. పదులు, వందలు, వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేసిన రాజకీయ, రియల్ ఎస్టేట్ శక్తుల, బాబాల, స్వామీజీల ఆశ్రమాల జోలికి ప్రభుత్వం పొరపాటున కూడా పోలేదు. భూములను నిర్దిష్టంగా సెలెక్ట్ చేసుకున్న తర్వాతే ప్రభుత్వం భూ సమీకరణకు దిగింది. ఏళ్ల తరబడి పేదలు తుప్ప, డొంక నరికి సాగులోకి తెచ్చిన భూములవి. జీడి, మామిడి, కూరగాయలు, అపరాల పంటలతో, టేకు, యూకలిప్టస్ తోటలతో, ఆవులు, గేదెలు, మేకల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న రైతుకూలీ, పేద ప్రజలను తీవ్రంగా దెబ్బతీశారు. గ్రామసభల్లో భూసమీకరణను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ, ప్రభుత్వ ఒత్తిడితో రాజకీయ నాయకుల, అధికారుల అమలు కాని హామీలతో, బెదిరింపులు, గందరగోళాల మధ్యనే భూసమీకరణ ప్రక్రియ సాగింది. ఏపీ హైకోర్టు బలవంతంగా భూ సమీకరణ చేయరాదని, స్వచ్ఛందంగా ఇచ్చిన వారి నుండి మాత్రమే తీసుకోవాలనే వరకు భూములు లాక్కోవడం జరుగుతూ వచ్చింది. కానీ అప్పటికే ప్రజలందరి చేత ఫారమ్-3 ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. జరగాల్సిన నష్టమంతా జరిగిపోయింది.

### జీవో-72 అసలు లక్ష్యం "ల్యాండ్ పూలింగే"!

2016-19ల మధ్య జీవో 290,268,269,.... ఇలా ఏడు జీవోల ద్వారా వుడా (ప్రస్తుత విఎంఆర్డీఏ) మరియు రాష్ట్ర మున్సిపల్ శాఖ, ల్యాండ్ పూలింగ్ స్కీం (LPS)ను రూపొందించాయి. "విడివిడి వ్యక్తుల నుండి భూములను సమీకరించి, ప్లాట్‌లను అభివృద్ధి చేయడమే వీటి సారాంశం". కానీ ప్రస్తుత ప్రభుత్వం పాత జీవో లన్నింటినీ రద్దు చేస్తున్నామని చెప్పి," కొత్త సీసాలో పాతసారా"నే పోసి జీవో నెం-72తో మరింత దూకుడుగా అమలు చేసింది. ఈ క్రమంలోనే "నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు" కోసమని చెప్పి, భారీ ఎత్తున భూసమీకరణ చేపట్టింది. జీవోలో ప్రకటించిన 1,50,554 ఇళ్ళపట్టాల కోసమైతే, జీవో ప్రకారమే 10 మండలాల్లోని ఆక్రమణ భూములు, ప్రభుత్వ ఖాళీ భూములు కలిపితే 3,099.57 ఎకరాలు సరిపోదా?! ఇంత పెద్ద ఎత్తున జీవనోపాధిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తూ భూసమీకరణ చేయడం ఎవరి ప్రయోజనాల కోసం?!

### భూములు కోల్పోయినవారి పట్ల తీవ్ర నిర్లక్ష్యం

జీవో నెం-72లో డి-పట్టా భూమి కోల్పోయిన వారికి ఎకరానికి 18 సెంట్లు ఆక్రమణకు-9 సెంట్లు చొప్పున అభివృద్ధి చేసిన లేఔట్‌లో హౌస్ సైట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. LPOC(ల్యాండ్ పూలింగ్ ఓనర్షిప్ సర్టిఫికెట్లు) మంజూరుచేశారు." ఎకరాల్లో సాగు భూములు కోల్పోయినా, గజాల్లో వచ్చే హౌసింగ్ సైట్లతో మీరంతా లక్షాధికారులు కాబోతున్నారని" ప్రజలకు ఆశలు కల్పించారు. జీవో ప్రకారం భూ సమీకరణ నోటిఫికేషన్ (2020) వచ్చిన 5 నెలలలోగా లేఅవుట్లో హౌసింగ్ ప్లాట్లు డెవలప్ చేసి ఇస్తామన్నారు. భూసమీకరణ చేసి రెండేళ్ళు గడుస్తున్నా నేటికీ హౌస్ సైట్లు అప్పగించలేదు. మరోవైపు జగనన్న ఇళ్ల పట్టాల ప్లాట్లు కోసం మాత్రం బస్సుల్లో వందలాదిమందిని తీసుకొచ్చి 'జియో ట్యాగింగ్' చేస్తున్నారు. దీంతో భూములు కోల్పోయిన ప్రజలంతా, తమకు రావాల్సిన భూములు ఎప్పుడిస్తారోనని తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వం అమరావతిలో రాజధాని పేరుతో భారీ ఎత్తున భూ సమీకరణ చేపడితే, నేటి ప్రభుత్వం విశాఖలో ఇళ్ల పట్టాల కోసమని భూ సమీకరణ చేపట్టింది." అవసరం కంటే అదనంగా భూములను సమీకరించి బడా కంపెనీలకు, రియల్ఎస్టేట్ శక్తులకు, వ్యాపారీకరణకు మళ్ళించడమే అంతిమంగా జరుగుతున్నది." ప్రభుత్వాలు పెద్దల చేతుల్లో ఉన్న కబ్జాల స్వాధీనంతో ప్రత్యామ్నాయాలను అన్వేషించకుండా, పేద ప్రజల, రైతు కూలీల జీవనోపాధిని దెబ్బతీసేందుకే సిద్ధపడ్డాయి. పర్యావరణ, ఇరిగేషన్ చట్టాలను, పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ భూముల సమీకరణకు వ్యతిరేకంగా హైకోర్టు, సుప్రీంకోర్టులిచ్చిన తీర్పులను, జీవించే హక్కులను అన్నింటిని కాలరాస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా సరే, విధానాలు మాత్రం ఒక్కటిగానే ఉన్నాయనేది స్పష్టమవుతున్నది. ప్రజల జీవనోపాధిని, భూమి హక్కులను దెబ్బతీస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలి.

# ఒక దేశం - ఒకే పువ్వు

- డాక్టర్ దేవరాజు మహారాజు

ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ దశ ఏమిటో ఎటో
వివరాలు తెలియజేయాలని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు

గాలులు ఎంతదూరం పోవాలనుకున్నాయో
అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు
ఇప్పుడిక్కడ సుడిగాలులకు అనుమతి లేదు

మేం కడుతున్న ఆ పేకమేడల్ని
సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది
అందువల్ల ఈ చట్టాలు
సత్వరమే అమల్లోకొస్తున్నాయి!
తమ చుట్టాలకు అనుగుణంగా
ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు

ఒడ్డును తాకే కెరటాలక్కూడా ఒక హెచ్చరిక!
ఎగిసెగిసి పడటం మళ్లీ తిరిగి వెళ్ళడం
బలం పుంజుకుని మళ్లీ నీటి పిడికిళ్ళతో
తిరిగి రావడం ఇవన్నీ ఇప్పుడిక కుదరదు
తిరుగుబాట్లు, ఉద్యమాలు,
హోరెత్తిపోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డులోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది!

తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూల రంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమలులోకొచ్చింది
ఒకే రంగు మాత్రమే కాదు
ఏ పువ్వు రంగు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట!

ఒకే దేశం - ఒకే పువ్వు!!
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి?
తోటలో అన్ని మొక్కల పూలు ఒకే రకంగా ఉండవని-
ఉండటానికి వీలే లేదని -
ఒక రంగులో అనేక రంగులుంటాయని కూడా
వారికి ఎవడు చెప్పాలి?

గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీవోలతోనో వెనక్కి మళ్ళదని
ఎంతటివారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప
మరో మార్గం లేదని!
లేకపోతే, అవి సృష్టించే సునామీలో
అడ్రసు లేకుండా గల్లంతు కావల్సిందేనని
నామరూపాలు లేకుండా నశించాల్సిందేనని
వారికి ఎవరైనా చెప్పండి!
కనీస గౌరవమైనా.... కాపాడుకొమ్మని!!

# సాగు మీటర్లకు స్మార్ట్ మీటర్లు

**ఢిల్లీని** చుట్టుముట్టి ఒక సం॥ కాలానికి పైగా సాగిన రైతాంగ పోరాటపు డిమాండ్లలో 3 వ్యవసాయ చట్టాల రద్దుతోపాటు విద్యుత్ బిల్లు – 2020ను ఉపసంహరించాలన్న డిమాండ్ కూడా ఉంది. ఈ విద్యుత్ బిల్లు కూడ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ముందుకు తెస్తున్న ప్రైవేటీకరణ, నగదీకరణ (మానెటైజేషన్ – ప్రభుత్వ ఆస్తులను తన కనుకూలమైనవారికి కారుచౌకగా అమ్మివేయడం) పథకాల్లో భాగమేనన్నది స్పష్టం.

ఇందులో భాగంగానే 2021 జూలై నుండి ఆర్‌డిఎస్‌ఎస్ (రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) అన్న పథకాన్ని ముందుకు తెచ్చింది. విద్యుత్ ప్రసారం, పంపిణీ నష్టాలను తగ్గించడం కోసం ఈ పథకం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. అయితే విశ్లేషించి చూస్తే దాని అసలు ఉద్దేశ్యాలేమిటో అర్థమవుతాయి. విద్యుత్ రంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉన్నందువల్ల కేంద్రం తను అనుకున్నది చేయించాలంటే రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించడమో, బెదిరించడమో చేయడం "సహజం".

## ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ అత్యుత్సాహం

సాంకేతిక, వాణిజ్య (ఎటిఎస్‌సిఆర్) నష్టాలు (విద్యుత్ ప్రసారం చేసే క్రమంలో జరిగే నష్టం) 15 శాతానికి మించిన రాష్ట్రాలలో ఈ పథకం అమలుపరచాలని కేంద్రం చెప్పింది. ఆంధ్ర రాష్ట్రంలో 2021-22 నాటికే ప్రసార నష్టాలను 11.21శాతానికి తగ్గించ గలిగినట్లు లెక్కలు చూపిన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పథకాన్ని (ఆర్‌డిఎస్‌ఎస్) అమలుపరచబూనుకుంది. అనేక రాష్ట్రాలు వ్యవసాయ మోటర్లకు విద్యుత్ మీటర్లు అమర్చడానికి నిరాకరించాయి (తెలంగాణతో సహా). మన రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుని విద్యుత్ మీటర్లను వ్యవసాయ పంపుసెట్లన్నిటికీ బిగించారు. అంగీకరించని రైతులను పలు విధాలుగా బెదిరించి మరీ బిగించారు.

కేంద్ర ఇంధనశాఖ అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎఎమ్‌ఐ) పథకం కింద ఈ మీటర్లు బిగించారు. ఈ మీటర్లు బిగిస్తే రాష్ట్రాల రుణ సేకరణ అవకాశాన్ని పెంచుతానని కేంద్రం చెప్పింది. పీకలలోతు అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం అదనపు రుణ సేకరణ కోసం ఉపయోగపడుతూందని కూడా ఇందులోకి దిగింది. కేంద్ర ప్రభుత్వపు కుటిలత్వం అర్థమైనప్పటికీ అదనపు ఆర్థిక భారాలను ప్రజలపై, రైతులపై వేయడానికీ, ఆదానీ లాంటి గుత్త సంస్థలకు మేలు చేయడానికీ నిర్ణయించుకుంది.

## దొంగ లెక్కలు – కుంటి సమర్థనలు

శ్రీకాకుళం జిల్లాలో పథకం అమలు కోసం ఎఆర్‌డిఎస్ అనే టెక్నాలజీ వున్న మీటర్లు బిగించారు. ఇందుకోసం ఒక్కో మీటరుకు, దాని అనుబంధ పరికరాలకు కలిపి 2583 ఖర్చు పెట్టారు. ఈ మీటర్లు పెట్టడం వల్ల ఎంతమేరకు ప్రయోజనం కలిగిందన్న అంశాలపై రాష్ట్ర ఆర్థికశాఖ ప్రమాస్ గ్రూపు అనే సంస్థ ద్వారా సర్వే చేయించింది.

సారాంశంలో ఈ సర్వే తేల్చిందేమిటంటే వ్యవసాయ విద్యుత్ కోసం ఎంత కరంటు వాడుతున్నామన్న లెక్క తేల్చడానికి మోటరుకు, మీటరు పెట్టనక్కరలేదంది. ఇప్పటికే రాష్ట్రంలో హైవోల్టేజి పంపిణీ వ్యవస్థ నడుస్తోంది. వ్యసాయ ఫీడర్లను వేరు చేశారు. అందువల్ల ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల స్థాయిలో మీటర్లు పెడితే వ్యవసాయ వినియోగపు లెక్క తెల్సుకోవచ్చునని చెప్పింది.

అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాలను మరుగుపరచి విద్యుత్ మీటర్లని అమర్చడం వల్ల 33 శాతం విద్యుత్ ఆదా అయిందని ప్రచారం చేస్తోంది. మీటర్లు పెట్టడం వల్ల విద్యుత్ ఆదాకావడమేమిటో మనకెవరికీ అర్థం కాదు. తరచి ప్రశ్నించుకోని పరిశీలిస్తే అర్థమయ్యేదేమిటంటే గతంలో వ్యవసాయానికి ఎంత వాడుతున్నామో నిర్దిష్టంగా లెక్కలేదు గనుక ప్రసార నష్టాలు పోను వ్యవసాయ వినియోగాన్ని లెక్కిస్తూ వచ్చారు. ఇప్పుడు మీటర్లు పెట్టారు గనుక వ్యవసాయానికి వాడే విద్యుత్ ఎంతో లెక్క తేలిందంతే. విద్యుత్ ఆదాకావడం అన్న అంశం ఇందులో ఏమీలేదు. విద్యుత్ లెక్క తేలింది గనుక మిగిలింది ప్రసార నష్టంగా లెక్కించుకోవాలి.

రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ వినియోగం 12 వేల మిలియన్ యూనిట్లని అంచనా. ఇందులో 33 శాతం అయితే సం॥కి రూ.3600 కోట్లు మిగులుతాయనీ. దీనితో పోల్చితే మీటర్లకు పెట్టే ఖర్చు దుబారాకాదనీ–ఒకటి రెండు సం॥ల్లోనే ఆ పెట్టుబడి మేర ప్రభుత్వానికి ఆదా అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోంది.

## స్మార్ట్ మీటర్ల ఖర్చు అదనపు భారమే

అసలు వ్యవసాయ మోటర్లన్నిటికీ మీటర్లు పెట్టకుండానే వ్యవసాయ విద్యుత్‌ను లెక్కించగల మార్గాన్ని నిపుణులు సూచిస్తుండగా – రాష్ట్ర ప్రభుత్వం వీనిపై పెట్టే ఖర్చును మరింత పెంచింది. రాష్ట్రంలో ఇప్పటికున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1858 లక్షలు. శ్రీకాకుళంలో పెట్టిన మీటర్లకు అయిన ప్రకారం లెక్కిస్తే ఈ

మీటర్లన్నటికి అయ్యే ఖర్చు రూ.480 కోట్లు అవుతుంది. వీటి నిర్వహణకు అయ్యే ఖర్చును రూ.390 కోట్లు అనుకున్నా 5 ఏళ్ళకి కలిపి ఖర్చయ్యేది 870 కోట్లు.

అయితే ఐఆర్‌డి మీటర్లకన్నా ఆధునికమైన స్మార్ట్ మీటర్ల బిగింపుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మన డిస్కంలు ఇందు కోసం టెండర్లు పిలిచాయి. అందులో మీటరు ధరను రూ.7 వేలుగాను, అనుబంధపరికరాల ధరను రూ.12 వేలుగాను (శ్రీకాకుళంలో అయ్యింది రూ.615) నిర్ణయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం మీటరుకు రూ.950 మాత్రమే ఇస్తుంది. 2023 డిసెంబరులోపల మీటర్లు బిగిస్తే మరో రూ.450 గ్రాంటుగా ఇస్తుంది. మొత్తం కలిపినా రూ.1350 మాత్రమే చెల్లిస్తుంది. సవరించిన మీటరు ధర రూ.6 వేలు అనుకున్నా అందులో కేంద్రం చెల్లించేది రూ.1350 పోతే రూ.4650 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేయాలి. రైతులపై ఆ భారం మోపబోమని రాష్ట్ర ప్రభుత్వం పదేపదే హామీని ఇస్తోంది గనుక రాష్ట్ర ప్రజల నుండి వసూలు చేసిన పన్నుల నుండి దీన్ని చెల్లించాలి. అయితే ఉద్యోగుల జీతాలే సకాలంలో చెల్లించలేని రాష్ట్ర ప్రభుత్వం, తాను నిధులు విడుదల చేయకుండానే డిస్కంలపై ఆర్థిక భారం మోపింది.

ఎవరు భరించినా మీటరుకు అనుబంధ పరికరాలతో కలిపి సుమారు రూ.18 వేలేగాక వీటి నిర్వహణ వ్యయం కింద 5 సం॥లకు గాను మరో రూ.12 వేలు చెల్లించాల్సి వస్తుంది.

## పెండింగ్‌లో వ్యవసాయ విద్యుత్ దరఖాస్తులు

రాష్ట్రంలో 3 విద్యుత్ పంపిణీ సంస్థలున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఇపిడిసిఎల్) విజయవాడ కేంద్రంగా మధ్య పంపిణీ సంస్థ (సిపిడిసిఎల్), తిరుపతి కేంద్రంగా దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్)లు పని చేస్తున్నాయి. 2022 మార్చి నాటికి ఈ 3 డిస్కంల పరిధిలో 98,377 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. ఈ రైతులంతా నిబంధనల ప్రకారం 5 హెచ్ పంపిణీ మోటరు కోసం రూ.1200 డిపాజిట్‌నేగాక – 180 మీటర్ల కండక్టర్ వైరు, రెండు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకయ్యే ఖర్చును విద్యుత్‌శాఖ ఆధికారులు లెక్కించి చెప్పిన ప్రకారం చెల్లించినవారే. ఈ మేరకు డిడి (బ్యాంకు ఇచ్చే డిమాండ్ డ్రాఫ్టు) చెల్లించాకే రైతులిచ్చిన దరఖాస్తు సీనియారిటీ జాబితాలోకి చేరుతుంది. 2022 ఏప్రిల్ నుండి సెప్టెంబరు వరకు పైవాటిలో 41,275 కొత్త కనెక్షన్లు ఇచ్చారు. కొత్తగా చేరిన దరఖాస్తులతో కలుపుకుని ప్రస్తుత పెండింగ్ జాబితా 77,069కి చేరింది.

దీనిపై వస్తున్న విమర్శలకు జవాబుగా అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో వ్యవసాయ సర్వీసుకు రూ.11.20 లక్షలు భరిస్తున్నట్లు చెప్పడమేగాక – ఏటా సగటున 45 వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయనీ – వీటి రిపేరుకు రూ.102 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు లెక్క చెప్పడమేగాక–కాలిపోయిన 48 గంటల్లో రిపేరు చేయడం, లేదా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని విద్యుత్‌శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి జగన్ ఆదేశించినట్లు పేర్కొంది.

**నిజానికి రైతులపై ప్రేమ ఉంటే మీటర్ల కోసం రాష్ట్రం ఖర్చుపెడతానంటున్న రూ. 4 వేల కోట్లను కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసమూ, లైన్లు మెరుగుపరచడం కోసమూ, ట్రాన్స్ ఫార్మర్ల కోసమూ ఖర్చు చేస్తే రైతులకూ, వ్యవసాయానికీ మేలు జరుగుతుంది.**

నిజానికి రైతులపై ప్రేమ ఉంటే మీటర్ల కోసం రాష్ట్రం ఖర్చు పెడతానంటున్న రూ. 4 వేల కోట్లను కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసమూ, లైన్లు మెరుగుపరచడం కోసమూ, ట్రాన్స్‌ఫార్మర్ల కోసమూ ఖర్చుచేస్తే రైతులకూ, వ్యవసాయానికీ మేలు జరుగుతుంది.

## డిస్కం ఆర్థిక దుస్థితి

3 సంస్థలు (డిస్కమ్‌లు) కలిపి 56 వేలకోట్ల అప్పులో వున్నాయి. అసలుకు కిస్తీలు కట్టడానికి, వడ్డీలకు కలిపి నెలకు 800 కోట్లు చెల్లిస్తున్నాయి. వారం రోజులపాటు రోజుకు 24 గంటల విద్యుత్ సరఫరా (24/7) కోసం డిస్కంలు రూ.478 కోట్లు వ్యయం చేశాయి. ఇందులో ఇంటర్నేషనల్ బ్యాంక్‌ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఎస్‌బిడిఆర్) ద్వారా 200 కోట్లు, ఎసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎఐఐబి) ద్వారా 114 కోట్లు రుణంగా తీసుకున్నాయి.

డిస్కంలు నష్టాల్లో వుండగా కేంద్ర స్థాయిలోని ఎన్‌టిపిసి, రూరల్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ (ఆర్ఇసి)లు లాభాల్లో వున్నాయి. రైతుల కోసం పనిచేయాల్సిన ఆర్ఇసి వడ్డీలకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు రుణాలిస్తోంది.

స్మార్ట్ మీటర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వని కారణంగా ఆర్ఇసి దగ్గర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సి) రూ.36 వేల కోట్ల రుణం తీసుకొని మన డిస్కంలకు 11.5% ఇచ్చేలా ప్లాను చేశారు.

ఇలాంటి భారాలన్నీ డిస్కంలు వినియోగదారులపైనే వేస్తున్నాయి. ఇంధన ధరలు పెరిగాయంటూ ట్రూ అప్ ఛార్జీలు అన్న పేరుతో పాతకాలపు ఖర్చులు బిల్లుల్లో వడ్డీస్తున్నారు. ఇటీవలే విద్యుత్ సుంకాన్ని యూనిట్‌కు 6 పైసలుగా ఉన్న దాన్నీ 100 పైసలకు (1667 శాతం) పెంచారు. తెలంగాణాలో 6 పైసలు, తమిళనాడులో 36 పైసలు, కర్నాటకలో 47 పైసలు, ఉండగా మన రాష్ట్రంలో అత్యధికంగా వసూలు చేస్తున్నారు.

డిస్కంలు నష్టాల ఊబిలో కూరుకొనిపోవడానికి కారణం రాష్ట్రంలో అధికారంలో వున్న పాలకపక్షాలే. ప్రభుత్వ ఆఫీసులకు, స్థానిక సంస్థలకు విద్యుత్ బిల్లులు కోట్లలోనే బకాయిలున్నాయి. వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీల భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. అయితే ప్రభుత్వం ఎప్పుడూ వేల కోట్ల రూ॥లు బకాయి లుంటూనే వుంది.

మరోవైపు పాలకపక్షాల, పాలకవర్గాల పెద్దలు విద్యుత్‌చౌర్యం చేస్తూనే వున్నారు. బిల్లింగ్‌కాకుండా చేయడం ఒకటైతే, వేసిన బిల్లుల్ని కూడా చెల్లించకుండా ఎగగొడుతున్నప్పటికీ చర్యలు తీసుకునే స్థితి లేదు. సాధారణ ప్రజలను, చిన్న పరిశ్రమలను బెదిరించి గోళ్ళూడగొట్టి వసూలు చేస్తున్నారు.

## వ్యవసాయ మీటర్లకే కాదు - ఇతర కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు

ఆధునిక టెక్నాలజీ వచ్చినపుడల్లా ఆ భారం ప్రజలపై మోపుతూ లాభాల పంటలు పెట్టుబడిదారులకు, గుత్త సంస్థలకు అందిస్తున్నాయి పాలకవర్గాలు. గతంలో ఉన్న పాత మీటర్లను తొలగించి ఎఆర్‌డి మీటర్లను బిగించిన భారం వినియోగదారులపైనే వేశారు. ఇప్పుడు గృహ, వాణిజ్య, పారితోషిక సంస్థల వద్ద ఉన్న మీటర్లను స్కాన్‌చేసే సౌకర్యం ఉంది. బిల్లింగ్ చేసేవాళ్ళు సులభంగానే రీడింగ్ తీసి బిల్లులు ఇస్తున్నారు. వీటితో ఏ ఇబ్బందీ లేకున్నప్పటికీ స్మార్ట్‌మీటర్లు పెట్టాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి డిస్కంల ద్వారా వత్తిడి చేస్తోంది.

తద్వారా కొత్త మీటర్లు పెట్టడానికి, వాటి నిర్వహణకు రూ॥ 10 వేల వరకు ఒక్కో కనెక్షనుకూ చెల్లించాల్సి రావడమేగాక నెల నెల నిర్వహణ ఖర్చుల పేరిట బాదనున్నారు. రాష్ట్రంలో సుమారు 1 కోటి 50 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం తొలి దశలో నెలకు 300 యూనిట్లపైన విద్యుత్ వినియోగించే వారికి స్మార్ట్ మీటర్లు అమరుస్తారు. 2025 డిసెంబరు నాటికి 200 యూనిట్లు నెలవారి వినియోగం దాటిన వారందరికీ దీన్ని తప్పని సరి చేయనున్నారు.

## ఇంత వత్తిడి-ఇంత భారమూ ఎందుకోసం?

విద్యుత్‌ను ప్రజావసరం కోసం నాణ్యంగా, చౌకగా అందించడానికి బాధ్యతగల ప్రభుత్వాలు ఆలోచిస్తాయి. కాని మన పాలకులు తెస్తున్న సంస్కరణలు అందుకోసం ఉద్దేశించలేదు. టెలిఫోన్ రంగంలో జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఫోన్ కనెక్షన్లు ఇస్తున్నట్లు విద్యుత్‌ను ప్రైవేటు పంపిణీలోకి తేవాలన్నది పాలకుల లక్ష్యం.

బడా ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పేలోపల వారి పనిని సులభం చేసి వారికి అప్పనంగా లాభాలు సమకూర్చేందుకే స్మార్ట్ మీటర్లు. ఈ మీటర్లలో ఇంటికి వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం లేకుండా ముందస్తుగా చెల్లించే పద్ధతి (ప్రీపెయిడ్)ని తెస్తారు. ఇప్పుడు మనం రెండు నెలల బిల్లును డిపాజిట్‌గా చెల్లించి వున్నాం. అయినా ఆ పద్ధతికి బదులు ముందుగా చెల్లిస్తేనే, చెల్లించిన మేర మాత్రమే, విద్యుత్ వాడుకునేందుకు అనుమతిస్తారు. డబ్బులు అయిపోగానే ఆటోమేటిక్‌గా విద్యుత్ నిలిచిపోతుంది. మీటర్ల రీడింగులు తీసే వర్కర్లతో కూడా అప్పుడు పని ఉండదు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలమంది ఉపాధి కోల్పోతారు.

## సబ్సిడీలను కూడా కత్తిరిస్తారు

గ్యాస్ బండపై గతంలో సబ్సిడీ ధరనే వసూలే చేశారు. మోడీ వచ్చాక ముందు మీరు మొత్తం ధర చెల్లించి కొనుక్కోండి సబ్సిడీని మీ అకౌంట్లలో జమవేస్తాం అన్నారు. 6, 7 సం॥ల్లో మన అకౌంట్లలోకి వచ్చే సబ్సిడీ సున్నాకి చేరింది. అలాగే ఇప్పుడు విద్యుత్ బిల్లులు ముందు మీరు కట్టిండి సబ్సిడీ మొత్తం మీ అకౌంట్లలోకి జమ చేస్తాం (డైరెక్ట్ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్-డిబిటి) అంటున్నారు. గ్యాస్ బండ అనుభవమే వ్యవసాయ విద్యుత్‌కి వస్తుందని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

విద్యుత్ ప్రభుత్వరంగంలో ఉంది గనుక ఛార్జీలు నిర్ణయించే టప్పుడు సామాజిక న్యాయం అన్న సూత్రాన్ని పాటిస్తున్నారు. ఇంటి వినియోగానికి-వాణిజ్య వినియోగానికి, చిన్న పరిశ్రమలకు-పెద్ద పరిశ్రమలకు, ప్రజోపయోగాలకూ విద్యుత్ ధరలలో తేడాలు పాటిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ లాంటి బలహీనవర్గాలకు 200 యూనిట్ల వరకు, వ్యవసాయానికి పూర్తిగాను ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. ఇప్పుడు వచ్చే సంస్కరణలతో ఈ అవకాశం లేకుండా చేస్తారు.

ప్రభుత్వమే దశాబ్దాల తరబడి విద్యుత్ రంగంలో కావలసిన మౌలికవసతులను కల్పించింది. కొండల్లో, అడవుల్లో, సైతం విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లు, టాన్స్ ఫార్మర్లు వంటివన్నీ నిర్మించింది. విద్యుత్ ఉత్పత్తిలో ఒకప్పుడు ప్రభుత్వ సంస్థలే ఉండేవి. ఇప్పుడు ప్రైవేటు కంపెనీలు వచ్చాయి.

అలాగే విద్యుత్ పంపిణీలోకి ప్రైవేటు బడా కంపెనీలను అనుమతిస్తారు. ప్రభుత్వం నిర్మించిన వ్యవస్థను కారుచౌకగా వారికి లీజుకిస్తారు. వినియోగదారుల నుండి ప్రీపెయిడ్ పద్ధతిలో బిల్లులు వసూలు చేస్తారు గనుక తమ పెట్టుబడి ఏమీలేకుండానే వారు లాభాల పంటలు పిండుకుంటారు. విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీలకు చెల్లింపులు గ్యారంటీ అవుతాయి.

ఈరకంగా విద్యుత్ సంస్కరణల లక్ష్యం ఉచిత విద్యుత్‌ను రద్దు చేయడం-గుత్త కంపెనీలకు దోచిపెట్టడం మాత్రమే. అందుకే ఈ సంస్కరణల రద్దు కోసం రైతాంగం, కార్మికవర్గం, మధ్యతరగతి ప్రజానీకం సమైక్యంగా పోరాడి వాటిని తిప్పికొట్టాలి.

# రైతుబంధు, రైతుభరోసాలు - భూపరాయీకరణే అంతిమ లక్ష్యం

## 2018 - 19

**తెలంగాణా** రాష్ట్రప్రభుత్వం 2018 మే నుండి 'రైతుబంధు' పథకాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019 అక్టోబర్ నుండి 'రైతు భరోసా' పథకాన్ని ప్రారంభించాయి.

రైతుబంధు పథకంలో రాష్ట్రంలోని వ్యవసాయ భూయజమాను లందరికీ ఎకరానికి ఏడాదికి 8 వేల రూ॥లను ప్రభుత్వం మదుపు సహాయం క్రింద అందజేస్తుంది. 2018 మేలో పట్టాదార్ పాస్ పుస్తకాలతో సహా ఖరీఫ్ సీజన్‌లో మదుపు సహాయం క్రింద ఎకరాకు 4 వేల రూ॥ చొప్పున పంపిణీ చేశారు. నవంబర్ నెలలో మరో నాలుగు వేల రూ॥ అందజేశారు. తెలంగాణా రాష్ట్రంలో సాగులోనున్న మొత్తం భూమి 1 కోటీ 40 లక్షల ఎకరాలు కాగా, రెండు విడతలలో ప్రభుత్వం ఈ పథకం క్రింద 11,200 కోట్లు రూ॥ ఖర్చు చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో 2019 అక్టోబర్ 15 నుండి రైతుభరోసా పథకాన్ని వైసిపి ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఈ పథకం క్రింద సం॥నికి 13,500 రూ॥ను మదుపు సహాయంగా అందజేస్తోంది. దీనిలో పి.ఎం.కిసాన్ భరోసా క్రింద సం॥నికి చెల్లించే 6 వేల రూ॥లు కూడా కలిసే వున్నాయి.

ఈ పదకం అమలుకుగానూ తెలంగాణాలో, ఏపిలో భూరికార్డుల సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రపంచబ్యాంకు సహాయంతోనే అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం ఉనికిలో వున్న భూరికార్డులన్నింటినీ, ఈ మధ్యకాలంలోని మార్పు చేర్పులన్నింటిని సరిచేయాలని నిర్ణయించారు. 'డిజిటల్ ఇండియా భూరికార్డుల ఆధునీకరణ పథకాన్ని' (డిఐఎల్ఆర్ఎంపి) ఒక దశాబ్దం క్రితమే ప్రారంభించారు. భూమి గురించి సమాచారం అనగా యాజమాన్యం, వినియోగం తదితరాలతోపాటు కేంద్ర అధికారులు ఎక్కడనుండైనా ఆ భూమి గురించిన తాజా సమాచారాన్ని తెలుసుకునే విధంగా భూరికార్డులను నమోదుచేయటం ఈ పథకం లక్ష్యం. అయితే ఇది అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. భూములన్నింటినీ సర్వేచేసి, ఆ భూయజమాని వివరాలతో పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేయాలనేది తన బుర్రలో పుట్టిన బుద్ధిగా తెలంగాణా ముఖ్యమంత్రి చెప్పుకున్నాడు. దీనిని అత్యంత తక్కువ సమయంలో పరిపూర్తి చేశామని, ఆ కారణంగానే రైతుబంధు పథకం విజయవంతంగా అమలుచేయగలుగుతున్నామని చెప్పుకున్నాడు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా శాశ్వత భూహక్కు కల్పించేందుకు డిజిటల్, డ్రోన్, శాటిలైట్ సర్వేల ఆధారంగా రికార్డులను పక్కాగా తయారుచేయటం తమ ఘనతగా ప్రకటించుకున్నాడు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వీరు తయారు చేసిన భూకమతాల పట్టాదార్ పాస్‌పుస్తకాలు, వాటిలో అవకతవకలు, సామాన్య పేద భూయజమానులకు జరిగే అన్యాయాలు, రైతుబంధు, రైతు భరోసాల ద్వారా ఎంతో కొంతమంది రైతులకైనా, నిర్ణయించిన నగదు సహాయం అందేలోపు ఆచరణలో ఎదురౌతున్న సమస్యలు అనేకం వున్నాయి. వీటన్నింటినీ ప్రక్కనుంచితే, ఈ పథకాల వెనుక ఆలోచించవలసిన పెద్ద విషయాలున్నాయి.

రెండు రాష్ట్రాలలో ఆదివాసుల భూములు అత్యధికం పరాయీకరణకు గురయ్యాయి. ఆదివాసీ భూముల పరాయీకరణకు ఈ పథకాలు చట్టబద్ధత చేకూర్చి, ఆ భూములను తమ అధీనంలో వుంచుకున్న గిరిజనేతరుల చట్టవిరుద్ధ ఆక్రమణలకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీచేసింది.

అలాగే ప్రభుత్వ బంజరు, ఈనాం, మాన్యం తదితర పేర్లతో లక్షలాది ఎకరాల భూములున్నాయి. చట్టప్రకారం వీటన్నింటినీ భూమి హీనులైన నిరుపేద గ్రామీణ పేదలకు ఇవ్వాలి. అయితే, గ్రామీణ ప్రాంతంలోని నోరుగల ఆసాముల స్వాధీనంలోనే ఈ భూములన్నీ వుండిపోయాయి.

ఈ పథకాలు - కౌలు రైతాంగాన్ని ఏవిధంగానూ లెక్కలోకే తీసుకోలేదు. వాస్తవానికి అత్యధిక భూములను సాగుచేసి పంటలు పండించేది కౌలురైతులే. పేదరైతులుగా లేదా వ్యవసాయ కూలీలుగా వుండి కౌలుచేసుకుంటున్న వారెవరూ కౌలురైతులుగా నమోదు చేయరు; కనుక వారెవరికీ సేద్యపు మదుపు అందదన్నమాట! చట్టప్రకారం విధివిధానాలను పాటిస్తూనే దేవాలయ మాన్యం భూములు కౌలుచేసుకుంటున్న రైతులకు కూడా వారంతా కౌలురైతులనే పేరిట ఈ పథకాలు వర్తించకుండా నిరాకరించారు. వాస్తవానికి దేవాదాయశాఖకు కౌలు చెల్లిస్తూ వ్యవసాయం చేసుకుంటున్నవారే వీరంతా. రైతుల దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగా 1950లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కౌలు రైతుల రక్షణచట్టం ఉనికిలోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం మూజువాణి కౌలుకాకుండా, కౌలుదారుని నమోదు చేయాల్సి వుంటుంది. గత 7 దశాబ్దాలపైగా కాలంలో ఇది అమలుకు నోచుకోలేదు. భూయజమానులకు, రైతులకు నడుమ కౌలు ఒప్పందాలు నోటమాటగానే జరిగి పోతున్నాయి. 1950 చట్టంలోని సెక్షన్ 10(4) ప్రకారం కౌలు రైతులకు కూడా వ్యవస్థాగత రుణం కల్పించవచ్చు. కౌలురైతుల అనేక ఉద్యమాల తర్వాత కౌలురైతుల రుణఅర్హత సర్టిఫికెట్లు (ఎల్ఇసి) ఇవ్వటంద్వారా అరాకొరా రైతులు లబ్ధిపొందినా అత్యధిక

రానున్న కాలంలో రైతులకు ఇచ్చే సబ్సిడీలన్నింటినీ తొలగించివేసే ఒక పెద్ద విధానంలో భాగంగా తెలంగాణాలో తదనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన విధానాలే రైతుబంధు, రైతుభరోసాలు. శ్రమ చేయవద్దని డబ్బుల ఆశజూపి రైతాంగాన్ని లొంగదీసుకునే విధానమిది. ఈ పథకాలన్నింటి యొక్క అంతిమ లక్ష్యమేమంటే, రైతాంగాన్ని భూములనుండి పరాయీకరించటమే. అలాగే భారత వ్యవసాయరంగాన్ని, సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడికి సేవలందించే మార్కెట్‌శక్తుల కనుగుణంగా మలచటానికేననేది స్పష్టం.

కౌలురైతులకు నిరాశే మిగిలింది. భూయజమానులకు ఇబ్బంది కరంగా ఉందనే కారణంతో 1950 నాటి కౌలురైతు రక్షణ చట్టాన్ని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలూ ఎత్తివేశాయి. 'దున్నేవానికే భూమి' నినాదంతో ఎన్నో నిరంతరాయ పోరాటాలు నిర్వహించిన ఇరు రాష్ట్రాల్లో ఇది ఖచ్చితంగా రైతాంగ వ్యతిరేక తిరోగమన చర్యే!

ఇదే ముగింపు కాబోదు. రానున్న కాలంలో సంస్కరణలపేరిట మరిన్ని చర్యలు రాబోతున్నాయి. భారత ప్రభుత్వ సలహాదారుగా వుండి పదవీ విరమణ చేస్తున్న అరవింద సుబ్రహ్మణ్యం ఈ అంశాల్ని తెలియజేశాడు. తెలంగాణా రైతుబంధు పథకాన్ని భవిష్యత్తు భారతదేశ పథకంగా తయన కొనియాడాడు. (23-7-18 బిజినెస్ స్టాండర్డ్) ఆయన దీనిని క్యూబి (క్యుయుబిఐ-క్వాజీ యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) పథకంగా పేర్కొన్నాడు. "రైతుబంధు పథకం ఒక సామాజిక విధానంగాకంటే ప్రధానంగా ఓ వ్యవసాయ విధానంగా ఉద్దేశించి వుండవచ్చు. వాస్తవానికి, ఈ దృక్పథం నుండి పరిశీలిస్తే, ఇది భవిష్యత్ వ్యవసాయ విధానంగా వుండగలదు. ప్రస్తుత వ్యవస్థలో వ్యవసాయానికి ప్రభుత్వ మద్దతు ఎలా వుందో చూద్దాం. ఇక్కడ మొదలుకొని, ప్రపంచ నలుమూలలా ఎన్నో పథకాలు అమలులో వున్నాయి. పంటలు పండకపోతే పంటల బీమా, రుణమాఫీ వంటి పథకాలెన్నో వున్నాయి. అలాగే పంటలు బాగా పండితే, మద్దతు ధరలు మరియు సేకరణ, ప్రోత్సహకాలు తదితర పథకాలున్నాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, విద్యుత్తు, నీరు మొదలైన వాటిపై సబ్సిడీలు అందించే స్వతంత్ర పథకాలూ వున్నాయి.

ఈ పథకాలకు రైతుబంధు పథకం ఈరోజు తోడైంది. కనుక ఇది ఆర్థికంగా కొనసాగలేనిదిగా రూపొందుతుంది. ఏమైనా, పైన పేర్కొన్న అన్ని పథకాలకో, లేదా కొన్ని పథకాలకో బదులుగా రైతుబంధు పథకాన్ని ఉపయోగిస్తే మూడు కీలకమైన ప్రయోజనాలు సాధ్యమౌతాయి.

రాష్ట్రసామర్థ్యం, పాలనాయంత్రాంగం అలాగే ఆర్థికవనరులను మిగుల్చుకోగలగటం మొదటి అంశం.

తీవ్ర తప్పిదాలను నివారించి ఉత్పత్తిని, వ్యవసాయ ఆదాయాన్ని విడగొట్టటం రెండవ అంశం.

బదిలీ అయిన మొత్తాదును పెంచటంద్వారా ఆదాయాలు తగినంతగా, వేగంగా పెరగటానికి తోడ్పడటం మూడవ అంశం. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకొని ఈ విధంగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో ఎరువులకు, విద్యుత్తుకు సబ్సిడీని రద్దుచేయటం వలన ప్రభుత్వం ప్రతి వ్యవసాయదారునికి 92,000 రూ॥లను లేదా ప్రతి వ్యవసాయ కార్మికునికి 50,000 రూ॥లను ఒక సం॥లో ఆర్థిక మద్దతునీయగలుగుతుంది".

అరవింద సుబ్రహ్మణ్యం యొక్క ఈ సుదీర్ఘ ప్రకటనకు వివరణ అక్కరలేదు. అది స్పష్టంగానే వుంది. భారత ప్రభుత్వ ఆర్థిక సలహాదారు నోటి నుండి ఈ మాటలు వచ్చాయంటే రాజకీయ అధికార వర్గాలలో ఏం జరగబోతోందో ఎవరైనా ఊహించవచ్చు. రానున్న కాలంలో రైతులకు ఇచ్చే సబ్సిడీలన్నింటినీ తొలగించివేసే ఒక పెద్ద విధానంలో భాగంగా తెలంగాణాలో తదనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన విధానాలే రైతుబంధు, రైతుభరోసాలు. శ్రమచేయవద్దని డబ్బుల ఆశజూపి రైతాంగాన్ని లొంగదీసుకునే విధానమిది. ఈ పథకాలన్నింటి యొక్క అంతిమ లక్ష్యమేమంటే, రైతాంగాన్ని భూములనుండి పరాయీకరించటమే. అలాగే భారత వ్యవసాయరంగాన్ని, సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడికి సేవలందించే మార్కెట్‌శక్తులకనుగుణంగా మలచటానికేననేది స్పష్టం.

"స్వాతంత్ర్యపు మారుపేరు సామ్యవాదమే, సత్యం!
చావులేని ఆ సత్యం జ్వలిస్తుంది అనునిత్యం
సామ్యవాద రథసారథి మార్క్సు చూపెనదె తీరం!
తూర్పుదిక్కు మందారం! ఆర్పరాని అంగారం!"

- శ్రీశ్రీ 'తుది పయనం - తొలి విజయం' నుండి

# వ్యవసాయ కూలీల, గ్రామీణ పేదల జీవన స్థితిగతులు

**భారత** వ్యవసాయ రంగంలోకి హరిత విప్లవం పేరుతో చొరబడిన సామ్రాజ్యవాదులు వ్యవసాయ రంగంలోకి యంత్రాల వినియోగంతో ప్రారంభించి క్రమంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని పెంచి, మార్కెట్లను తమ అధీనంలోకి తెచ్చుకున్న ఫలితంగా ప్రధానంగా పత్తి, మిర్చి రైతాంగం, వ్యవసాయ కూలీలు అనేక ఒడిదుడుకుల మధ్య బయటపడలేని తీవ్ర సంక్షోభపు సుడిగుండంలో కూరుకుపోయారు. మార్కెట్ల మాయాజాలంతో, చీడపీడలతో, ప్రకృతి విపత్తుల మధ్య ఏ పంటను ఎంతవరకు సాగుచేయాలో అర్థం కాని స్థితిలో రైతులు, కౌలురైతులు ఉన్నారు. ఈ ఆటుపోట్ల మధ్య వ్యవసాయకూలీలు పనిదినాలను కోల్పోయి బ్రతుకు తెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. రోజువారీ వ్యవసాయ పనుల కోసం పదుల కిలోమీటర్ల దూరం ఆటోలలో ప్రయాణిస్తున్నారు. ఎన్నో ప్రమాదాలను గురవుతున్నారు జీవితాలనే కోల్పోతున్నారు. వీరి కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి. అయినా రెక్కాడితే గాని డొక్కాడని దుస్థితిలో ఉన్న వీరు - కూలి పనుల కోసం ఎంత దూరమైనా వెళ్ళక తప్పని పరిస్థితుల్లో జీవిస్తున్నారు.

## సామ్రాజ్యవాద విష కౌగిలిలో రైతాంగం

1990 దశకం అర్ధభాగం వరకు పత్తి సాగులో హైబ్రీడ్ విత్తనాలైన H8; $ReH_2$ అనే రకాలనే రైతులు వినియోగించేవారు. రాబోవు పంట కోసం ఇదే విత్తనాన్ని ఈ పంట నుంచే జిన్నింగ్ చేసిన పత్తి నుంచి (మిల్లర్ల ద్వారా) సేకరించి శుద్ధిచేసి విత్తుకునేవారు. దిగుబడి ఎకరానికి 8-10 క్వింటాళ్ళు వచ్చేది. విత్తనాల కోసం ఎకరానికి 25-30 రూ॥ మాత్రమే ఖర్చు అయ్యేది. పెట్టుబడులు కూడా తక్కువగానే ఉండేవి. 1991లో డంకెల్ డ్రాఫ్టుపై సంతకం, నూతన ఆర్థిక విధానాలు అమలు తర్వాత వ్యవసాయ రంగంలోకి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు విత్తనాల, పురుగుమందుల, ఎరువుల వ్యాపారంలోకి పూర్తిగా చొరబడిన ఫలితంగా బిటి పత్తి విత్తనాలనే వినియోగించాలన్న వత్తిడిని పెంచి బలవంతంగా రైతులపై రుద్దారు. బిటి విత్తనం వలన శనగపచ్చ పురుగు రాదని, దిగుబడులు పెరుగుతాయని, పెట్టుబడులు తగ్గుతాయని భ్రమలు కల్పించారు. కొద్దికాలంలోనే ఈ భ్రమలన్నీ తొలగిపోయి బిటి విత్తనం సత్ఫలితాలను ఇవ్వటం లేదని ఆందోళనలు రావటంతో బిటి2 రకాన్ని ఇదే కంపెనీ మరలా మార్కెట్‌లోకి తెచ్చినా పరిస్థితిలో మార్పేమీ లేదు.

మిర్చి సాగులో కూడా ప్రారంభంలో గుంటూరు విత్తనాన్ని అధికంగా సాగుచేసేవారు. రాబోయే పంట కోసం కావాల్సిన విత్తనాలను ఈ పంట నుంచే సేకరించుకునేవారు. 1990 దశకం చివరలో హైబ్రీడ్ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. వీటితో ప్రత్యేకించి నారుమళ్ళను తయారుచేసి మిర్చి నారును రైతులకు విక్రయించేవారు. ఆ తదుపరి అమెరికాకు చెందిన మోన్‌శాంటో, మహికో, జర్మనీకి చెందిన BASF మొ॥ బహుళజాతి కంపెనీ విత్తనాలైన తేజ, ఆర్మూర్, 4884, 416, 456 ఇలా అనేక రకాలైన విత్తనాలతో మార్కెట్‌ను ముంచెత్తాయి. ఈ పంటను రంగుల తయారీ కోసం, విదేశాలకు ఎగుమతుల కోసం ప్రోత్సహిస్తున్నారు. వీటి విత్తనాల ధర కేజీకి 70 వేల రూ॥ నుంచి 81,500 రూ॥ల వరకు ఉంది. ఈ విధంగా మిర్చి సాగును, మార్కెట్లతో సహా పూర్తిగా బహుళజాతి కంపెనీలే శాసిస్తుండటంతో అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ళను తట్టుకొని అధిక దిగుబడి కోసం, అధిక ఎరువులు, పురుగుమందులు వినియోగించాల్సి రావటంతో పెట్టుబడులు పెరిగాయి. ఈ విధంగా ఎకరానికి 2 లక్షల రూ॥లు పెరగటంతో దాదాపు 1 లక్ష రూ॥ల వరకు రైతులు నష్టపోతున్నారు. దీనితో కౌలు రైతులు తిరిగి సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

వరి సాగులో పెట్టుబడులు దీనికి భిన్నంగా ఏమీలేవు. పెట్టుబడి ఎకరానికి కౌలు కాక 43 వేల రూ॥ వరకు ఖర్చు అవుతోంది. పెట్టుబడులు పెరిగి కౌలు రైతులు మరింతగా నష్టాలకు గురవుతున్నారు.

## తరుగుతున్న వ్యవసాయ కూలీల పనిదినాలు

బిటి2 ప్రత్తి విఫలమవటంతో ఈ సం॥ దిగుబడి ఎకరానికి 7 క్వింటాళ్ళ వరకు తగ్గిపోయింది. ఈ తగ్గుదల వలన సగటున ఎకరానికి 23 పనిదినాలను కోల్పోయారు. కృష్ణాజిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు 1,10,000 ఎకరాలలో పత్తిని సాగుచేసారు. ఈ విధంగా చూసినపుడు ఈ జిల్లాలోనే 25 లక్షల 30 వేల పనిదినాలను వ్యవసాయ కూలీలు కోల్పోయారు.

మిర్చికి నల్లతామర వైరస్ సోకటం వలన ఈ సం॥ ఎకరానికి 150 పనిదినాలే లభ్యమవుతున్నాయి. ఈ తెగుళ్ళు లేకపోతే 300 పనిదినాలు లభించేవి. 50 శాతం పని దినాలను ఈ సం॥ వ్యవసాయ కూలీలు కోల్పోయారు. కృష్ణాజిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సం॥ మిర్చి సాగు దాదాపు 29,750 ఎకరాలలో సాగు అయింది. ఈ విధంగా 44 లక్షల 62 వేల 500 పనిదినాలను

వ్యవసాయ కూలీలు కోల్పోయారు. ఈ జిల్లాలో ఈ సం॥ పత్తి, మిర్చి పంటలు తెగుళ్ళ వల్ల దిగుబడులు తగ్గిపోయినందున వ్యవసాయ కూలీలు మొత్తం 69,92,500 పనిదినాలను కోల్పోయారు. ఇప్పటికే వరి పంట కోతలకు యంత్రాలు రావటం వల్ల కూలీలు పనులు కోల్పోయారు.

ఇంతటి విపరీత పరిణామాలకి మూలం – వ్యవసాయ రంగంలో తీవ్రమవుతున్న సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల దోపిడీ ఆధిపత్యమే అని అర్థం అవుతున్నది. రైతాంగ శ్రమను కొల్లగొట్టటమే కాక, వ్యవసాయ భూములను రైతాంగాన్ని, కౌలు రైతులను, గెంటివేసే చర్యలను క్రమంగా అమలు చేస్తూ ఉన్నారు. అందులో భాగమే నరేంద్రమోడీ తెచ్చిన 3 వ్యవసాయ చట్టాలు కూడా!

## రైతులకు – వ్యవసాయ కూలీలకు నడుమ పెరుగుతున్న వైరుధ్యం

పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ముఖ్యంగా మధ్యతరహా, చిన్నకారు రైతులకు వ్యవసాయంలో మదుపు భారం అంతకంతకూ పెరిగిపోతోంది. అవాంతరాలు దాటుకొని చేతికొచ్చిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించని విధానాల ఫలితంగా ఈ రైతులు ప్రత్యేకించి – కౌలుభారం కూడా అదనంగా మోస్తున్న కౌలురైతులు – రుణభారంతో క్రుంగిపోతున్నారు. వ్యవసాయ కూలీలలో చాలామంది కూలీపనితోపాటు, ఎంతో కొంత భూమిని కౌలుకు తీసుకొని చేస్తున్నారు. వీరు మరింతగా నష్టపోతున్నారు.

మరోవైపున అధిక ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు కాంట్రాక్టు పద్ధతిలో కూలీ చెల్లించాల్సి రావటంతోపాటు, సాపేక్షంగా కూలీధర (రూపాయల్లో) పెరగటం – చిన్న, మధ్యతరగతి రైతాంగం 'కష్టంగా' భావిస్తున్నారు. 'భూమి వున్న మాకంటే, కూలీ చేసుకొనేవారి పనే బాగుంది' వంటి వ్యాఖ్యానాలు – రైతులకు, వ్యవసాయ కూలీలకు నడుమ పెరుగుతున్న వైరుధ్యాన్ని సూచిస్తోంది.

వాస్తవానికి తమ వ్యవసాయానికి మదుపు ఖర్చులు (విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు....) పెరిగిపోవటం, పండించిన పంటకు సరైన ధర రాకపోవటమనే అసలు కారణాలవైపు వారి దృష్టి మళ్ళకపోవటమే, ఈ వైరుధ్యం పెరగటానికి కారణం. ఈ మిత్రపూరిత వైరుధ్యాన్ని తగ్గించేందుకు విప్లవశక్తులు కృషిచేయాలి.

ఇదిలావుంటే, పైన అందించిన గణాంకాల ప్రకారం వ్యవసాయ కూలీల పనిదినాలు, రోజువారీ సగటు ఆదాయం తరిగిపోవటాన్ని చూస్తున్నాం. పెరుగుతున్న నిత్యావసర ధరలతో, అనారోగ్యాలు, పిల్లల చదువులు, మొదలైన ఖర్చులకే కాదు, రోజువారీ గడవటానికి కూడా వారు అప్పులు చేయాల్సిన దుస్థితికి నెట్టబడుతున్నారు. పట్నాలకు వలస వెళ్ళి దుర్భరమైన పని పరిస్థితుల నడుమ జీవిస్తున్నారు.

## కొనసాగుతున్న కట్టుబానిస దోపిడీ

ఈ దయనీయ పరిస్థితిని ఆసరాగా చేసుకొని వ్యవసాయ క్షేత్రాల భూ యజమానులు, వారి శ్రమను కొల్లగొడుతున్నారు. కట్టుబానిసలుగా వారిని వినియోగిస్తున్నారు. 2022 ఏప్రిల్ 5న కర్నాటక రాష్ట్రంలోని హస్సాన్‌లో 55 మంది కట్టుబానిసలు ఒక వ్యవసాయ క్షేత్రంలో వున్నట్టుగా అధికారులు కనుగొన్నారు. వీరిలో పదిమంది మహిళలు కూడా వున్నారు. ఒక మధ్య దళారీ ద్వారా వీరిని భూయజమాని పనిలో పెట్టుకున్నాడు.

రోజుకు దాదాపు 12 గంటలు వీరు ఆ వ్యవసాయ క్షేత్రంలో కనీస తిండి కూడా లేకుండా నిర్బంధంగా పనిచేయాలి. పనిలో చేరిన వెంటనే వీరి వద్ద సెల్‌ఫోన్లను యజమాని తీసేసుకున్నాడు. వ్యవసాయ క్షేత్రం చుట్టూ బలమైన కంచె వుండటంతో ఇక వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకపోవటంతోపాటు తప్పించుకుపోయే అవకాశం కూడా లేదు; ఎవరైనా ఆ ప్రయత్నం చేస్తే తీవ్రమైన శిక్షలు విధిస్తారు. ఆ వ్యవసాయ క్షేత్రంలోనే ఏర్పరచిన పాకలలో వీరందరూ వుండాలి. వ్యవసాయంలో ఈ తరహా శ్రమదోపిడీ మనదేశ అర్ధఫ్యూడల్ సమాజ లక్షణాన్ని చాటుతోంది.

వ్యవసాయ కూలీలుగా వున్నవారిలో అత్యధికులు దళిత, బలహీనవర్గాలకు చెందినవారనేది నిర్వివాదం. గ్రామాల్లో ఫ్యూడల్, అగ్రకుల దురహంకారశక్తుల అణచివేత పద్ధతులు, అనేక సందర్భాలలో వీరిపై బహిరంగ దాడులు, హింసారూపాలు తీసుకుంటున్నాయి. కారంచేడు, చుండూరు, నీరుకొండ, పదిరికుప్పం మొదలుకొని లక్ష్మింపేట దాడులన్నీ ఆ కోవలోనివే. గ్రామంలోని బావులు, చెరువులను ఉపయోగించటం, దేవాలయాలలో ప్రవేశంలో ప్రభుత్వ మధ్యాహ్న భోజనంలో విద్యాసంస్థలలో ఈనాటికీ కులవివక్ష, అంటరానితనం అనేకచోట్ల పాటించబడుతోంది.

మనదేశ ఆర్థికవ్యవస్థ ప్రధానంగా అర్థఫ్యూడల్, అర్థవలస స్వభావాన్ని కల్గివుండటంతోపాటు, ఈ కాలమంతటిలో పైపై మార్పులు మినహా, మౌలిక మార్పులు జరగకపోవటమే కులవ్యవస్థ, గ్రామీణ పేదల, వ్యవసాయ కూలీలపై దోపిడీ, అణచివేతలకు ప్రధాన కారణం. దీనికి వ్యతిరేకంగా తమ జీవితాలలో మెరుగుకోసం వ్యవసాయ కూలీలను సమీకరించాలి. కార్మిక రైతాంగ ఐక్య సంఘటనలో దున్నేవానికే భూమి నినాదంతో జనతా ప్రజాస్వామిక విప్లవంవైపు వ్యవసాయ కూలీలతోసహా రైతాంగాన్ని సంఘటితం చేయటం విప్లవ రైతాంగ సంస్థల మీదున్న కర్తవ్యం.

# కామ్రేడ్ అంటే....

- రవి

కామ్రేడ్ అంటే....
శత సహస్ర బాహువులు
మస్తిష్కాలు
కలగలసిన కమ్యూనిస్టుకు
క్లుప్తమైన రూపం కామ్రేడ్ అంటే!

చిక్కటి చీకటి చుట్టముట్టినప్పుడు
చక్కటిదోవను కనలేనప్పుడు
భుజంతట్టి నడిపించేది కామ్రేడ్!

పేగు తెంచిన మాతృమూర్తితో
ప్రేమ పంచిన కన్నతండ్రితో
చెప్పుకోలేని విషయాలు
పంచుకునేది కామ్రేడ్‌తోనే!

మనసులో సుడులు తిరిగిన
దుఃఖం
చెలియలికట్టను దాటినప్పుడు
కనులు తుడిచి ఓదార్చేది కామ్రేడ్!
పీడకుల కంట్లో కారం కామ్రేడ్!
పీడిత ప్రజల కంటిదీపం కామ్రేడ్!
కామ్రేడ్ అంటే....
రక్తంలో రక్తమా? ప్రాణంలో
ప్రాణమా?

కామ్రేడ్ అంటే...
సన్నిహితుడా? సహచరుడా?
అన్నా, తమ్ముడా, అక్కా, చెల్లెలా?

కామ్రేడ్ అంటే....
మానవ సంబంధాల మహోన్నత
సారంతో
మార్క్స్ ఎంగెల్స్ మలచిన
మహనీయ రూపం కామ్రేడ్ అంటే!

# అడవి అంటే....

- గోదావరి

అడవి అంటే అభినవ భావావేశం కాదు
రొమాంటసిజమ్, కేరీరిజమ్ కానే కాదు
అనంత విశ్వంలో ప్రకృతి ఆక్రోశం
అడవి అంటే ప్రకృతితో పోరాటం, కృత్రిమత్వంతో పోరాటం
పోరాటంలో ఐక్యత, ఐక్యత కొరకు పోరాటం
ప్రకృతి చలన సూత్రాల పొందిక

★ ★ ★

అడవి అంటే
కన్నెగంటి హనుమంతు, కొమరం భీము
అల్లూరి రణనినాదం, లక్ష్మణ నాయక్ సాహసం
బిరసా ముండా ఆశయం
కొండరెడ్ల, కోయిదొర్ల సామంతుల సాహసం
జాతాపు, సవరన్నల, గొండోళ్ళ గుండె చప్పుళ్ళు

★ ★ ★

అసలు అడవి అంటే
విప్లవాల ఓనమాల నుండి విముక్తిదాకా
అది శిక్షణాలయం, రక్షణ నిలయం, సంరక్షణ కేంద్రం
బాల్యానికి శిక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ,
వృద్ధాప్యానికి సంరక్షణ
పాఠాలు నేర్పుతున్న వనమది
పోరాట విధాతలకూ, వీరులకూ అనుభవాల నిధి,
గుణపాఠాల గని

మరి అడవి అంటే
తుపానులో చిక్కుకున్న నావలకు ఆశల చిగురు అందిస్తూ
పులులకూ, మేకలకూ తేడాను చూపుతూ
దేశ విప్లవ భవిష్యత్‌ను నిర్దేశించే అడవి
అడవిలో త్యాగాలు వృధా కారాదంటూ
అడవిలో వెన్నెల దేశమంతా కాయాలని
నిరీక్షిస్తున్న నా తల్లి అడవి
అడవి అంటే ఆయుధం
ప్రజాపోరుకు సాధనం
విప్లవాల విలుకానికి అడవి అంటే
ఆచరణ, సిద్ధాంతాల సమ్మేళన సారం
సామాజిక చుక్కాని, ఒక విశ్వవిద్యాలయం
అదొక ప్రయోగశాల, వేగుచుక్క
అడవి అంటే
ఉద్యమాల ఉదయ భాస్కరుడు.

# అమూల్‌తో ఒప్పందం - సహకార పాడిపరిశ్రమపై దాడి

## 2020 డిసెంబర్ 26

**ఆంధ్రప్రదేశ్** పాడిరంగంలోకి గుజరాత్‌కు చెందిన అమూల్‌ను ప్రవేశపెడుతూ రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 2020 డిసెంబర్ 26 నుండి అమూల్ నిర్వహణలో రాష్ట్రంలో పాలసేకరణ ప్రారంభమైంది. దీనికి 'ఏపి-అమూల్ పాలవెల్లువ పథకం'గా పేరు పెట్టారు. ప్రయోగాత్మకంగా మొదట కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలోని 400 గ్రామాల్లో ఈ పథకాన్ని అమలుచేసి క్రమంగా రాష్ట్రవ్యాపితంగా 9,900 గ్రామాలకు విస్తరించనున్నట్లుగా ప్రభుత్వం పేర్కొంది.

ఈ పథకం ద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించటంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందజేస్తామని చెబుతున్నారు. రాష్ట్రంలోని మిగిలిన డెయిరీలకంటే, అమూల్ భాగస్వామ్యంతో సాగించే ఈ పాలసేకరణలో లీటర్‌కు 5 రూ॥ నుండి 7 రూ॥ వరకు పాడి రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందంటున్నారు. అమూల్‌కు వచ్చే లాభాల్లో నుండి ఏటా రెండు విడతల్లో పాడిరైతులకు బోనస్ కూడా చెల్లిస్తారని వూరిస్తున్నారు. ఈ పథకం అమలుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 6551 కోట్ల రూ॥ల ప్రజాధనాన్ని వెచ్చించి ఆటోమేటెడ్ పాలసేకరణ కేంద్రాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు.

జగన్ అధికారంలోకి వచ్చేముందు సాగించిన పాదయాత్ర సందర్భంగా తాను అధికారంలోకి వస్తే ప్రతి పాడిరైతుకు లీటర్‌కు 4 రూ॥ అదనపు ఆదాయం లభించే విధంగా చర్యలు చేపడ్తానని వాగ్దానం చేశాడు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని సహకార డెయిరీ వ్యవస్థను, ఇప్పటికే ప్రాచుర్యంలో వుండి ప్రజలకు చేరువైన విజయ, సంగం, విశాఖ వంటి సహకార సంఘాలను ప్రోత్సహించటానికి బదులు, గుజరాత్ అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వమే ఒప్పందం చేసుకొని 'ఏపి-అమూల్ పాలవెల్లువ పథకాన్ని' ప్రారంభించారు.

### 'అమూల్' నేపథ్యమేమిటి?

గుజరాత్ రాష్ట్రం - ఆనంద్ ప్రాంతంలోని పాల సహకార సంఘంగా ప్రారంభమైనదే అమూల్(ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్). దేశంలో శ్వేత విప్లవాన్ని(పాల ఉత్పత్తిని పెంచటాన్ని) కేంద్రప్రభుత్వం 1970లలో ప్రారంభించి, 1990ల వరకూ మూడు దశలుగా అమలు చేశారు. ఈ కాలంలో పాల ఉత్పత్తి గతంకంటే మూడు రెట్లు పెరిగింది.

దీనిలో భాగంగా డా॥ కురియన్ ఆధ్వర్యంలో గుజరాత్‌లో పాడిపరిశ్రమ సహకారరంగంలో బాగా విస్తరించింది. గుజరాత్ రాష్ట్ర పాడి సమాఖ్యలో భాగంగా ప్రారంభమైన అమూల్, రాష్ట్ర పరిధులు దాటి ఈనాడు 11 రాష్ట్రాలకు పాల ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. పాకిస్థాన్, శ్రీలంక తదితర ఇరుగుపొరుగు దేశాలకు ప్రధాన పాడి ఉత్పత్తుల ఎగుమతిదారుగా అమూల్ ఆవిర్భవించింది.

అమూల్ డెయిరీ పరిశ్రమ దేశంలో వ్యవస్థీకృత పాడిరంగంలో మూడవ వంతును ఆక్రమించి, గుత్తాధిపత్యం కల్గి వుంది. ప్రపంచంలోని అతిపెద్ద 20 పాల పరిశ్రమల జాబితాలో అమూల్ 15వ స్థానంలో వుంది. అమూల్ ఇంకెంత మాత్రమూ పాడిరైతులు సభ్యులుగా కలిగివున్న, సహకారరంగానికి చెందిన యూనియన్‌గా గాక, కార్పొరేట్ పరిశ్రమ తరహాలో లాభార్జన వేటలో వుంది. కరోనా లాక్‌డౌన్ కాలంలో అనేక చిన్నడెయిరీలు మూతబడినప్పటికీ అమూల్ 16 శాతం లాభాలార్జించింది. అదేకాలంలో గుజరాత్‌లో పాడిరైతులు తీవ్రనష్టాల పాలయ్యారనే విషయం గమనంలో వుంచుకోవాలి.

పాడిరంగంలోకి పాలకులు నూరుశాతం విదేశీ పెట్టుబడి ప్రవేశాన్ని ఆమోదించటంతో, బహుళజాతి పాలపరిశ్రమలకు మార్గం మరింత సుగమమైంది. నిల్వ సామర్థ్యం అధికంగా కలిగి వుండి, విస్తృతంగా మార్కెట్ చేయగల పరిజ్ఞానం వీటికుంది. విదేశాలలో గుట్టలుగా పోగులుపడి నిరుపయోగంగా వున్న పాల పొడిని బహుళజాతి సంస్థలు దిగుమతి చేసుకొని పాలను తయారుచేసి మనదేశంలో అమ్మకాలు సాగించి అధిక లాభాలు గడిస్తుండగా, పాడిరంగంపై ఆధారపడిన కోట్లాదిమంది జీవనోపాధి ప్రశ్నార్థకమౌతోంది. అంతర్జాతీయంగా బహుళజాతి పాల ఉత్పత్తి సంస్థల ఈ గుత్తాధిపత్యాన్ని, స్థానిక పరిశ్రమలను ధ్వంసం చేసే చర్యల్ని వ్యతిరేకించిన అమూల్, దేశీయంగా తాను తిరిగి అదే విధానాన్ని అనుసరిస్తోంది.

### రాష్ట్రంలో పాల సహకార సంఘాల పరిస్థితి

వ్యవసాయమే సంక్షోభంలో నుండటంతో గ్రామాల్లో పశువులకు మేత కూడా కరువౌతోంది. గతంలో లాగా పాడిగేదెలు, పాడి చేస్తున్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. పశువుల దాణా ధరలు అధిక మవటం, మారుమూల ప్రాంతాలలో పాలసేకరణ చేయకపోవటం, సహకార సంఘాల పాలకవర్గాలలో వృధా ఖర్చులు, ఆర్థిక నిర్వహణలో

పారదర్శకత లోపించటం, రైతాంగానికి చెల్లింపులలో జాప్యం చేయటం, వినియోగదారులకు తరచూ ధరలు పెంచటం, ప్రైవేటు డెయిరీలతో పోటీనెదర్కొంటూ వుండటం, సహకార యూనియన్‌లలో అధికార రాజకీయ పార్టీల జోక్యం, ప్రభావం, వత్తిళ్ళు.... వెరసి పాల సహకార సంఘాలు ఇబ్బందుల నెదుర్కొంటూ కొనసాగు తున్నాయి. ఈ లోపాలు ఎన్ని వున్నప్పటికీ పాడిరైతులకు – ముఖ్యంగా గ్రామీణ పాడి మహిళలకు – వ్యవసాయం గిట్టుబాటుగాని ఈ రోజుల్లో కూడా, పాడిరంగం ఏదోమేరకు ఆసరాగా నిలుస్తున్న మాట వాస్తవం. ప్రభుత్వాలు చిత్తశుద్ధి ప్రదర్శిస్తే సహకార యూనియన్‌ల కార్యకలాపాలను విస్తరించి, పాలసేకరణను గణనీయంగా పెంచటం సాధ్యమౌతుంది. ఇది గ్రామీణ పాడి రైతులకేగాక, పాల వినియోగదారులకు కూడా ప్రయోజనకరంగా వుంటుంది. కానీ ఈనాటి పాలకులనుండి దీనిని ఆశించటం అత్యాశే అవుతుందని మరోమారు స్పష్టమౌతోంది.

## అమూల్‌కు తోడ్పాటు-సహకార డెయిరీలకు గ్రహపాటు

'ఏపి-అమూల్ పాలవెల్లువ' పథకం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రానున్న కాలంలో మౌలిక వసతుల కల్పనకోసం 6551 కోట్ల రూ॥ ఖర్చు చేయనుందని ప్రకటించారు. అస్తుబిస్తుగా నడుస్తున్న రాష్ట్రంలోని పాల సహకార యూనియన్‌లకు ఈపాటి తోడ్పాటునందిస్తే, అవి వాటి కార్యకలాపాలను విస్తరించటంతో పాటుగా, మెరుగుపరుచుకుంటాయనేది వాస్తవం. అంతేగాదు, ఇప్పటికంటే పాడిరైతులకు ఖచ్చితంగా మెరుగైన సేకరణ ధర నందించటంతోపాటు వినియోగదారులకు హేతుబద్ధమైన ధరలకు పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి తెస్తాయి కూడా! ఈ ప్రయోజనాలు కాదని అమూల్ వంటి సంస్థలను ఆహ్వానించటం వెనుక సహకార వ్యవస్థను దెబ్బతీసే రాజకీయ ఉద్దేశ్యంతోపాటు పాలకుల స్వార్థ ప్రయోజనాలు కూడా మిళితమై వున్నాయి.

## ఇక్కడితో ఆగబోవటంలేదు

పాలు, పాల ఉత్పత్తుల తయారీ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆమోదించటంతో వివిధ సామ్రాజ్యవాద దేశాల బడా పాలపరిశ్రమలు భారతదేశంలోకి వస్తున్నాయి. ఇతర రంగాల కంటే భిన్నంగా డెయిరీ ప్రాసెసింగ్ పరిశ్రమకు పాలసేకరణే పెద్ద సమస్య. ఒకటి, రెండు గేదెలను పెట్టుకొని పాడి చేసుకునే గ్రామీణు లెందరి నుండో పాలను సేకరించాలి. చెడిపోకుండా నిల్వచేయాలి. సహకారం రంగంలోనూ, చిన్న ప్రైవేటు రంగంలోనూ పాల ఉత్పత్తిదారులు దశాబ్దాల తరబడి కృషిచేసి ఇలాంటి నెట్‌వర్క్‌ను (ఏర్పాటును) అమర్చుకున్నారు. విదేశీ కంపెనీలు మనదేశంలో ఇలాంటి 'ఏర్పాటు' చేసుకోవటం చాలా శ్రమ, ఖర్చుతో కూడుకున్నదేకాక నమ్మకం పెంపొందించుకునేందుకు చాలా కాలం వేచివుండటానికి కూడా సిద్ధపడాలి.

అందుకే ఈ రంగంలోకి విదేశీ కంపెనీలు దొంగదోవల్లో ప్రవేశిస్తున్నాయి. ఇప్పటికే చాలా స్థానిక పాడిపరిశ్రమల్లో ఇతర

> 'ఏపి-అమూల్ పాలవెల్లువ' పథకం అమలులో భాగంగా రాష్ట్రప్రభుత్వం రానున్న కాలంలో మౌలిక వసతుల కల్పనకోసం 6551 కోట్ల రూ॥ ఖర్చు చేయనుందని ప్రకటించారు. అస్తుబిస్తుగా నడుస్తున్న రాష్ట్రంలోని పాల సహకార యూనియన్‌లకు ఈపాటి తోడ్పాటు నందిస్తే, అవి వాటి కార్యకలాపాలను విస్తరించటంతోపాటుగా, మెరుగుపరుచు కుంటాయనేది వాస్తవం. అంతేగాదు, ఇప్పటికంటే పాడిరైతులకు ఖచ్చితంగా మెరుగైన సేకరణ ధర నందించటంతోపాటు వినియోగదారులకు హేతుబద్ధమైన ధరలకు పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి తెస్తాయి కూడా!

దేశాల పాడి పరిశ్రమలు వాటాలను కొనుగోలు చేశాయి. అమెరికాలో పెద్దదైన కార్గిల్‌గ్రూపుకు చెందిన కంపెనీ 2011లో స్థానిక తిరుమల డెయిరీలో 20శాతం వాటా కొనుగోలు చేసింది. 2012లో ఫ్రాన్స్‌కు చెందిన పాలకంపెనీ డానోన్ కూడా దీనిలో వాటాలు కొన్నది. ఫ్రెంచ్ కంపెనీ లాక్టాలిస్ గత ఐదేళ్ళలో తిరుమల, అనిక్, ప్రభాత్ డెయిరీలను స్వాధీనం చేసుకున్నది. 2013 నుండి భారత్ సహా వివిధ దేశాల పాడి ఉత్పత్తుల సంస్థలతో 41 ఒప్పందాలను కుదుర్చుకున్నది. ధాన్య వ్యాపార గుత్తసంస్థ కార్గిల్‌కు చెందిన కంపెనీ నెల్లూరు కేంద్రంగా వున్న దొడ్ల డెయిరీలో ఒకటిన్నర కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. బహుళజాతి కంపెనీ ఐటిసి, స్విట్జర్‌ల్యాండుకు చెందిన నెస్లేలు, పాల ఉత్పత్తితో అతిపెద్ద కంపెనీ ఫొంటెర్రా ఈ రంగంలో ఇప్పటికే ప్రవేశించాయి. ఫలితంగా, ఇతర అనేక రంగాలలో వలెనే క్రమంగా యావత్తు పాడిపరిశ్రమను ఈ పరిశ్రమలు తమ చేజిక్కించుకొని పాడిరైతులను, వినియోగదారులను – రెండువైపులా – మరింతగా దోచుకుంటాయి. 'అమూల్' ప్రయాణం కూడా ఆ వైపుగానే సాగుతూండటం ఆశ్చర్యం కాదు.

## పాడిరైతులు సంఘటితంగా నిలవాలి

పాలు ప్రజలకు అందవలసిన ఓ అవసరమైన పోషకాహారం అయినప్పటికీ దీనిని అత్యధిక ప్రజల వద్దకు సరఫరా చేయటం కాని, పాలను ఉత్పత్తి చేసే పాడిరైతులకు గిట్టుబాటు ధర ఇవ్వటం కాని, బడాపరిశ్రమల యజమానులు చేయరు. వారి దృష్టిలో పాలు, పాల ఉత్పత్తులు – కొనుగోలు, అమ్మకం సాగించి, లాభాలు గడించే సరుకులు మాత్రమే.

రాష్ట్రంలో 4 కోట్ల 12 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోందని, దీనిలో సహకార, ప్రైవేటు డెయిరీలు 69 లక్షల లీటర్లను సేకరిస్తుండగా,

2 కోట్ల 19 లక్షల లీటర్ల పాలను చిన్నవ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన పాలను స్థానికంగా వినియోగిస్తున్నారని ప్రభుత్వం గణాంకాలు విడుదల చేసింది. కనుక ఈ మొత్తం మార్కెట్‌లో సింహ భాగాన్ని చేజిక్కించుకునేందుకు ప్రభుత్వ దన్నుతో అమూల్ రంగంలోకి వచ్చిందని తేటతెల్లమౌతోంది. తాత్కాలికంగా వారు చూపే ఆశలు, ప్రలోభాలకు పాడిరైతులు లోనుకాకుండా, సంఘటితంగా నిలవటం ద్వారానే సహకార పాడి సంఘాలను నిలుపుకోవటం సాధ్యమౌతుంది.

# అవిచ్ఛిన్న స్వరం

– జీవన్

వాడికి
తలలంటే భయం
తలల్లోని తలపులంటే భయం
తలపులు శతఘ్నులుగా మారే సందర్భాలంటే
మరీ మరీ భయం

వాడికి
కంఠాలంటే భయం
కంఠాన్ని అలంకరించిన కంఠనాళాలంటే భయం
ఉక్కు తీగలుగా మారిన కంఠనాళాల మేఘగర్జనలంటే
మరింత భయం

వాడికి
నోరున్న మనుషులంటే భయం
నోటిలో నాలుకలుంటే మరీ భయం
అహోరాత్రాలు నిత్యసత్యాలు ప్రవచించే నాలుకలంటే
చలిజ్వరమంత చచ్చేంత భయం

వాడికి
సోక్రటీసుల వజ్రసంభాషణా పటిమ
కాళరాత్రుల కలవరింతల పలకరింతలవుతుంది

సిసిరోల శిలాక్షర ధిక్కార స్వరం
అనుక్షణం వెంటాడి వేధించే
శరపరంపరగా గోచరిస్తుంది

సుబ్బారావు పాణిగ్రాహి కంజిరనాదం
జనం గుండె సవ్వడిగా చీకటి సామ్రాజ్యాన్ని
చుట్టు ముట్టినట్టవుతుంది

వాడికి
ఎన్నిసార్లు చంపినా
చావేలేని ఆదర్శమంటే
గుండె ఆగి పోయేంత భయం
నరికేసినా చిగురులు చిగురులుగా
విస్తరించే వసంతరాగమంటే

వెన్నులో వణుకు పుట్టించే భయం
వెలివేసినా లక్షల అక్షౌహిణులతో
పునరాగమానం చేసే
అరుణ కిరణ ప్రాభాతమంటే
ప్రాణం పోయేంత భయం

# ప్రైవేటీకరణ దిశగా విశాఖ ఉక్కు పరిశ్రమ - కార్మిక, ప్రజాఉద్యమ ఆవశ్యకత

**విశాఖ** అభివృద్ధికి కారణమైన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలకోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న; 68 గ్రామాల ప్రజలకు చెందిన 22 వేల ఎకరాల భూముల త్యాగంతో ఏర్పడిన సంస్థ విశాఖస్టీల్ ప్లాంట్. వేలాది మందికి ఉద్యోగాలు, లక్షల మందికి పరోక్షంగా ఉపాధిని చూపిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ - విశాఖ ఉక్కు పరిశ్రమ. రాష్ట్రంలోని ఆబాలగోపాలం అత్యంత మిలిటెంటుగా పోరాడి 32 మంది ప్రజల రక్తతర్పణతో, సాధించుకున్న ప్రతిష్టాత్మక పరిశ్రమ - విశాఖ ఉక్కు పరిశ్రమ.

నూరుశాతం విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తున్నట్లు "కేంద్ర డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంటు అండ్ పబ్లిక్ అసెట్" కార్యదర్శి తుపాన్‌కాంత్ పాండే ప్రకటించాడు. ఈ వార్త కార్మికులను కదిలించింది. పోరుబాట చేపట్టడానికి కారణమైంది.

## విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ దయా దాక్షిణ్యాలతో ఏర్పడలేదు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో రాష్ట్రం మొత్తం ప్రభంజనమై కదిలింది. విశాఖ ఉక్కు డిమాండ్‌తో 1966 అక్టోబరు 15న విశాఖ కలెక్టరేట్ వద్ద గుంటూరు వాసి అమృతరావు ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. దీనికి మద్దతుగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఉద్యమంలో పాల్గొన్నారు. పోలీసుల లాఠీలు, తూటాలు ఉద్యమాన్ని అణచలేకపోగా, మరింత ప్రేరేపించాయి. పోలీసుల కాల్పుల్లో 32 మంది అమరులైనారు. అనేక నిర్బంధాలను, కేసులను ఎదుర్కొన్నారు. ఈ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర మరువలేనిది. పట్టణాలు, పల్లెలు సహా మొత్తం ప్రజలందరిని కదిలించిన ఉద్యమమిది. ఐతే ముఖ్యమంత్రి ఇచ్చిన బూటకపు హామీతో నవంబరు 3న అమృతరావు దీక్ష విరమించారు. ఆంధ్ర ప్రజల కోరికపై రాష్ట్రంలోని విశాఖలో స్టీల్ ప్లాంటు నిర్మించాలని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి బదులు మైసూరు, మద్రాసు, ఆంధ్రప్రదేశ్‌లకు నాలుగు యూనిట్లుగా పంచాలన్న కేంద్ర వైఖరిని పార్టీ రాష్ట్రకమిటీ వ్యతిరేకించింది. విశాఖలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేస్తామనే ప్రకటన చేయాలని అఖిలపక్ష కమిటీ డిమాండు చేసింది. నవంబరు 1న విశాఖలో జనరల్ సమ్మెకు అఖిలపక్ష కమిటీ పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్, యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీలు పోరాట కేంద్రాలుగా మారాయి. విశాఖ ఉక్కు ఉద్యమంలో నాడు రాష్ట్ర విద్యార్థి సంఘ నాయకులుగా వున్న సింహాద్రి సుబ్బారెడ్డి, కొల్లా రాజమోహన్, ఘంటా వెంకట్రావు తదితరులు చురుకైన పాత్ర నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీనామా చేయాలన్న డిమాండు రాష్ట్రమంతా మారుమ్రోగింది.

రాష్ట్రంలో సాగుతున్న నిర్బంధకాండను నిరసిస్తూ సభలోని 67 మంది ప్రతిపక్ష సభ్యులు రాజీనామాలు చేశారు. పార్లమెంటు సభ్యత్వానికి కామ్రేడ్స్ కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి, లక్ష్మీదాస్ రాజీనామా చేశారు.

## నిర్వాసితుల వెతలు

1966 నుండి ఉద్యమిస్తే 5 సంవత్సరాల తర్వాత ఎన్నికలకు ముందు శ్రీమతి ఇందిరాగాంధీ విశాఖ స్టీల్ ప్లాంటు నిర్మాణానికి చిహ్నంగా పైలాన్ శంకుస్థాపన చేసారు. నిర్వాసిత కుటుంబానికొక ఉద్యోగం ఇస్తామన్నారు. నేటికీ అది నెరవేరలేదు. 16,500 నిర్వాసిత కుటుంబాలలో సుమారు సగం మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. అది కూడా "నిర్వాసితుల సంఘం" ఏర్పడి నిరంతరం పోరాడితేనే వచ్చాయి. కుటుంబానికి 107 గజాల ఇంటి స్థలం కేటాయించారు. కుటుంబ సభ్యులు పెరుగుతున్నా, అందరూ ఆ స్థలంలోనే సర్దుకుపోతున్నారు. భూములు కోల్పోయిన వారికి ఎకరాకి కేవలం 1250 రూ॥ మాత్రమే ఇచ్చారు. పరిహారం పెంపు కోసం నిర్వాసితులు 15 సంవత్సరాలు పోరాటం చేస్తే సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్వయంగా లోక్‌అదాలత్ నిర్వహించి ఎకరాకి 25 వేల చొప్పున చెక్కులు అందించారు.

## అడుగడుగునా పోరాటాలతోనే మనుగడ

ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం సందర్భంగా పనుల కోసం "నిర్వాసిత సంఘం" ఆధ్వర్యంలో అన్ని గ్రామాల ప్రజలను సంఘటిత పరచి, నిర్మాణ పనుల్లో ఉపాధి కోసం, ఉద్యోగాల కోసం పోరాడారు. 1977లో పోతిన సన్యాసిరావు ఎం.ఎల్.ఎ.గా నిర్వాసితులకు సహకారమందించారు. 1985 నాటికి 5 వేలమందికి ఉద్యోగాలొచ్చాయి. కేంద్రం సహకారం అందించకపోయినా 2005లో ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని 3.2 నుండి 6.3 మిలియన్ టన్నులకు బ్యాంకుల ద్వారా రుణాలు సేకరించి విస్తరించారు. అయినా నిర్వాసితులకు పూర్తిగా న్యాయం జరగలేదు. ఆందోళనలు

సాగుతూనే వున్నాయి. 1991 నుండి 2006 వరకు పర్మినెంటు కార్మికుల రిక్రూట్‌మెంట్ జరగలేదు. స్టీల్ మెల్టింగు-2 కోసం పోరాటం, 1994లో బి.ఐ.ఎఫ్.ఆర్ నుండి కాపాడుకోవడం కోసం పోరాటం, ఎయిర్ సెపరేషన్ ప్లాంటును 1000 కోట్లకు అమ్మివేసే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ కార్మికవర్గం ఐక్యంగా పోరాడింది. 2012 నుండి స్వంత గనులు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడుతూనే వున్నారు. ప్లాంటు పరిరక్షణ కోసం గాజువాక బంద్, ప్రజల నుండి సంతకాల సేకరణ, 2000 ఫిబ్రవరిలో ప్లాంటు సమ్మె జరిపారు. ఆఫీసర్లు కూడా సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వం విశాఖ స్టీల్‌పై ఆది నుండి నిర్లక్ష్య వైఖరినే అవలంబించింది. వివిధ బ్యాంకుల నుండి, ఇతర విధాలుగా స్టీల్‌ప్లాంటు సుమారు 4,900 కోట్లు అప్పులు భరించవలసి వచ్చింది. ప్రభుత్వం పూర్తిగా పెట్టుబడి పెట్టకపోవడమే దీనికి కారణం. కేంద్రం తన బాధ్యతను విస్మరించింది.

1999 నాటి నుండే స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించే ఆలోచన మొదలైంది. టాటా, బిర్లా, మిట్టల్ వంటి సంస్థలు సిద్ధపడుతున్నట్లు వార్తలు రావడంతో కార్మికవర్గం పోరుబాట చేపట్టారు. పత్తి శేషయ్య, రొంగలి బైరాగినాయుడు కలెక్టరేట్‌లో "ప్లాంటు పరిరక్షణ" కోసం నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆ దీక్షలు మళ్ళీ నగర ప్రజలను కదిలించాయి. ప్రజల నుండి బ్రహ్మాండమైన సహాయం, సానుభూతి వ్యక్తమయింది.

1999 ఫిబ్రవరి 25న కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మికులు రిలే దీక్షలు చేపట్టారు. కార్మికుల కుటుంబాలు సైతం దీనిలో పాల్గొన్నాయి. మహిళలు, విద్యార్థులు, యువతీయువకుల నుండి స్టీల్ ప్లాంటు సాధనకు నాటి మద్దతు లభించింది. 2000 మార్చి 14న విశాఖ ఉక్కును పరిరక్షించాలని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు వద్ద ధర్నా నిర్వహించాయి. ప్రతిపక్ష ఎం.పి.లు పార్లమెంటులో విశాఖ స్టీల్ సమస్యను ప్రస్తావించారు. మళ్ళీ విస్తరణ కోసం పోరాటం సాగింది. ఇలా కార్మికుల చైతన్యంతో, ఐక్యకార్యాచరణతో పోరాడి ఇప్పటివరకు కాపాడు కుంటూ వస్తున్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నపుడు స్టీల్ పరిశ్రమలో వాటాలు అమ్మడానికి ప్రయత్నించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు సహకరిస్తున్నది.

## స్వంత గనులు లేక పెరుగుతున్న నష్టాలు

కార్మికులు కష్టపడి నాలుగేళ్ళలో వృద్ధి సాధించారు. 2017లో నవరత్న హోదా సాధించారు. ప్రధానంగా ముడిఖనిజాన్ని ఇతరుల నుండి కొనుగోలు చేయడం ద్వారా నష్టాలొస్తున్నాయి. విశాఖ ఉక్కుకు స్వంత గనులు కేటాయించని కేంద్ర ప్రభుత్వమే, నష్టాలకు బాధ్యత వహించాలి. పార్లమెంటు స్థాయీ సంఘం ప్లాంటును సందర్శించి, స్వంత గనులు లేకపోవడమే నష్టాలకు కారణమని గుర్తించింది. ఐనా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. అదే కేంద్ర ప్రభుత్వాలు బహుళజాతి కంపెనీలకు, దళారులకు భూములను, గనులను కట్టబెడుతున్నాయి. గాలి జనార్దనరెడ్డి, మధు కోడా లాంటి మైనింగ్ మాఫియాలకు గనులను కేటాయిస్తున్నాయి. వాళ్ళు యదేచ్ఛగా గనులను తవ్వుకొని విదేశాలకు అమ్ముకొని వేల కోట్లు గడిస్తున్నారు. దేశ సహజవనరులైన ఖనిజసంపదను, ప్రజల సంపదను దోచిపెట్టే అధికారం పాలకులకు లేదు. సకాలంలో ముడిసరుకు (ఐరన్ ఓర్) అందుబాటులో లేక ఉత్పత్తి తగ్గించవలసిన పరిస్థితులకు ప్రభుత్వం కారణం కాదా?! దేశంలో సుమారు 28.52 బిలియన్ టన్నుల ఐరన్ నిల్వలున్నట్లు ఒక అంచనా. కంపెనీకి సాలీనా 10 మిలియన్ టన్నులకు పైగా ఐరన్ ఓర్ అవసర మవుతుంది. 2018 మార్కెట్టు రేటు ప్రకారం నాణ్యత కలిగిన ఐరన్‌ఓర్ టన్ను 4,500 రూ॥కు కొనవలసివస్తున్నది. సాలీనా 10 మిలియన్ టన్నులకు 2,500 కోట్లు అదనంగా వెచ్చించవలసి వస్తున్నది. స్వంత గనులు వుంటే ఈ డబ్బంతా ఆదా అయ్యేది. మరింత విస్తరించడానికి, ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉండేది. ఈ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యమే కారణం.

ఆంధ్రప్రదేశ్ మినరల్ అండ్ మైన్స్ డెవలప్‌మెంటు సంస్థ ద్వారా విశాఖ స్టీలుకు గనులు కేటాయించే విధంగా ఒప్పందం చేసుకోడానికి యాజమాన్యం ముందుకు వచ్చినా, నాటి టిడిపి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. నేడు విశాఖ స్టీలు అభివృద్ధికి ముడిఖనిజం కొరత ప్రధాన కారణంగా వుంది.

## పోస్కోకు అప్పగించే కుట్రను ఎదుర్కొన్న కార్మికులు

దక్షిణ కొరియా దేశానికి చెందిన బహుళజాతి కంపెనీకి 10 శాతం వాటాను అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. ఉక్కు ఉత్పత్తుల మీద కంటే, పరిశ్రమకు చెందిన వేల ఎకరాల భూములపై వీరి కన్ను పడింది. విశాఖ ఉక్కుతో కలిసి 5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జాయింట్ వెంచర్‌గా మినీ ప్లాంటును స్టీలు ప్లాంటు భూముల్లో నిర్మించి ఇస్తామనే పోస్కో ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే, అందుకోసం స్టీలుప్లాంటు భూముల్లోనే మరో నిర్మాణంకోసం 4 వేల ఎకరాలు కేటాయించాలట! వారికి నిజంగా ఆసక్తి వుంటే కడపలో స్టీల్ ప్లాంటు నిర్మించడానికి అనుమతించవచ్చు గదా? లేదా మరెక్కడైనా స్టీల్‌ప్లాంట్ పెట్టుకునే అవకాశం ఇవ్వొచ్చు. పైసా ఖర్చు లేకుండా అప్పనంగా ప్రభుత్వరంగ పరిశ్రమని, రక్తం ధారబోసి సాధించిన కంపెనీని కబ్జాచేయాలనేదే వారి పన్నాగం! గత 10 సంవత్సరాల్లో ఏ బహుళజాతి కంపెనీ స్వంతంగా స్టీల్ ప్లాంటు నిర్మించలేదు. ఉన్నవాటిని కొల్లగొట్టడం సులువుగదా! ఇదే కంపెనీ ఒరిస్సాలో పరిశ్రమ నిర్మిస్తానని ఒప్పందం చేసుకుని, గనులకు అనుమతిపొంది, తర్వాత స్టీల్ ప్లాంటు కట్టడం మానేసి, ఖనిజాన్ని తవ్వుకొని విదేశాలకి ఎగుమతి చేసుకుంది. ఈ అనుభవం వున్న కార్మికవర్గం ఈ ప్రతిపాదనను ప్రతిఘటించింది. ప్రతిఘటన, పోరాటాలు లేకుండా పరిశ్రమల మనుగడ సాధ్యం కాదని అనుభవం రుజువు చేస్తున్నది.

విశాఖ స్టీల్ ప్లాంటు దేశంలోని స్టీల్ పరిశ్రమల కన్నా ఆలస్యంగా నిర్మాణంలోకి రావడం వల్ల ఆధునికమైన యంత్రసామాగ్రిని సమకూర్చుకుని గణనీయమైన ఉత్పత్తి సాధించింది. ప్లాంటు భూములు, మొత్తం ప్లాంటుతో కలిపి ఈనాటి మార్కెట్టు విలువ 2.50 లక్షల

కోట్లు పైగా వుంది. ఇంత విలువైన పరిశ్రమను కారుచౌకగా కొట్టేయడానికి వివిధ బహుళజాతి కంపెనీలు, అంబానీ, ఆదానీ లాంటివారు తమ స్నేహితుడు మోడీ ద్వారా ప్రయత్నం చేస్తున్నారు. ఈ రోజు ప్రపంచవ్యాపితంగా స్టీలు ధరలు పెరుగుతున్నాయి. ఆదాయం పెరిగే దశలో పరిశ్రమకు అమ్మడాన్ని రాష్ట్ర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చింది కేవలం 4 వేల కోట్లే. కానీ పన్నులు, డివిడెండ్ల రూపంలో స్టీల్‌ప్లాంట్ 40 వేల కోట్ల రూ॥ను ప్రభుత్వాలకు చెల్లించింది. విశాఖ స్టీల్ ప్లాంటు ఆంధ్ర రాష్ట్రానికే కాకుండా, దేశానికే గర్వకారణమైన ప్రతిష్టాత్మక పరిశ్రమ. విశాఖ ఉక్కు పరిశ్రమ లేకపోతే గాజువాక ప్రాంతం లేదు; వ్యాపారాలు లేవు; ఉపాధి లేదు; దీన్ని కాపాడుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అవసరం. రాష్ట్రానికి కూడా పన్నుల్లో వాటాలు దక్కుతున్నాయి కదా!

## ప్రపంచీకరణ విధానాల కొనసాగింపే - స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ

భారత దళారీ పాలక వర్గాలు ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకులు నిర్దేశించిన, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలుచేస్తున్న ఫలితంగా ప్రభుత్వరంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వరంగ పరిశ్రమల్లో వాటాలను అమ్మడం చేస్తే, బిజెపి ప్రభుత్వం మరింత బరితెగించి పూర్తిగా అమ్మకానికే పెడుతున్నది. సంఘటిత కార్మికవర్గమున్న ప్రభుత్వరంగ పరిశ్రమలను విదేశీ సంస్థలకు అప్పగించడానికి కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అధికారమార్పిడి జరిగిన తొలినాళ్ళలో ప్రభుత్వరంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని కొనియాడారు. క్రమక్రమంగా వారు తమ నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నారు.

ఈనాడు కేంద్ర పాలకులు ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరిస్తామని, లేదా మూసివేస్తామని బరితెగించి మాట్లాడుతున్నారు. పారిశ్రామిక యజమానుల సంస్థ (ఫిక్కీ) సమావేశంలో మోడీ చెప్పిన మాటలివి: "ప్రభుత్వరంగ పరిశ్రమలు మరణించడానికే పుట్టాయి. కొన్ని బాల్య దశలో మరణిస్తే, మరికొన్ని యవ్వనదశలో మరణిస్తాయి. కానీ మరణం తథ్యం. పరిష్కారం ఒక్కటే - మూసివేయడమా, ప్రైవేటీకరించడమా" ఇంత బాహాటంగా ప్రభుత్వరంగం పట్ల తన అంతరంగాన్ని బయటపెట్టిన నాయకులు చరిత్రలో వుండరేమో! చేసేది స్వదేశీ జపం - కార్యాచరణ సామ్రాజ్యవాదులకు, దళారులకు సేవ చేయడం!

## మోడీ పాలనలో ప్రైవేటీకరణ వేగవంతం

లాభనష్టాలతో సంబంధంలేదు ప్రభుత్వ రంగాన్ని వదిలించుకోవడమే ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకున్నది. అందుకొరకు సంబంధిత సంస్థల యాజమాన్యాలతో కానీ, కార్మికులతో, ఉద్యోగులతో కానీ ఎలాంటి చర్చలూ, సంప్రదింపులు చెయ్యనక్కరలేదని భావిస్తున్నది. 3 వ్యవసాయ చట్టాలపైనా అదే విధానం అనుసరించింది. ఎలాంటి చర్చలూ లేకుండానే, మేధావుల, వ్యవసాయ శాస్త్రవేత్తల అభిప్రాయాలను బేఖాతరు చేసింది.

> కార్మికులు కష్టపడి నాలుగేళ్ళలో వృద్ధి సాధించారు. 2017లో నవరత్న హోదా సాధించారు. ప్రధానంగా ముడిఖనిజాన్ని ఇతరుల నుండి కొనుగోలు చేయడం ద్వారా నష్టాలొస్తున్నాయి. విశాఖ ఉక్కుకు స్వంత గనులు కేటాయించని కేంద్ర ప్రభుత్వమే, నష్టాలకు బాధ్యత వహించాలి. పార్లమెంటు స్థాయీ సంఘం ప్లాంటును సందర్శించి, స్వంత గనులు లేకపోవడమే నష్టాలకు కారణమని గుర్తించింది. ఐనా ఎలాంటి ప్రయోజనం కలగలేదు.

- ప్రభుత్వరంగంలోని లక్షల కోట్లు ఆదాయాన్ని కలిగిన, సమర్థవంతంగా నడుస్తున్న ఎల్ఐసిలోకి విదేశీ సంస్థలను ఆహ్వానిస్తున్నది.
- భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఎయిర్ ఇండియా, కంటెయినర్ కార్పొరేషన్, షిప్పింగ్ కార్పొరేషన్లను పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించ చూస్తున్నది.
- ప్రభుత్వరంగ రక్షణ రంగంలోనూ, బిఇఎంఎల్ లోనూ 26 శాతం వాటాల విక్రయానికి ప్రాథమిక టెండర్లను ఆహ్వానించింది. ఈ సంస్థలో ప్రస్తుతం ప్రభుత్వ వాటా 54 శాతం వుంది. 26 శాతం వాటాలను విక్రయించి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు శక్తులకు అప్పగించనుంది. మినీరత్న హోదా కలిగిన బిఇఎంఎల్ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వుంది.
- రైల్వేలు ఇకపై ప్రైవేటు వారు నడుపుతారు. ఛార్జీలు నిర్ణయించే అధికారం వారిదే. 3 లక్షల మంది రైల్వే ఉద్యోగులను తొలగించనున్నారు.
- రక్షణరంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 74 శాతానికి పెంపు, అంతరిక్ష రంగంలోనూ, బొగ్గు, ఖనిజరంగంలోనూ ప్రైవేటు పెట్టుబడులు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిస్కంల ప్రైవేటీకరణ- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు బడ్జెట్టు సమావేశాల్లో ప్రకటించినవి.
- గత పదేళ్ళ కాలంలో దేశీయ బ్యాంకులు 6,67,345 కోట్లు, విజయ్‌మాల్యా, మెహుల్‌చోక్సీ మొ॥ బడా పారిశ్రామికవేత్తల బకాయిలను రద్దుచేశారు. ఇవే బ్యాంకులు సామాన్యులకు అప్పులివ్వాలంటే సవాలక్ష డాక్యుమెంట్లు, ష్యూరిటీలు అడుగుతాయి. అప్పు సకాలంలో చెల్లించకపోతే వారి ఆస్తులను వేలం వేసి రాబట్టుకుంటాయి.
- ఆదానీకి 8000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు అప్పగిస్తున్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్ట్రిబ్యూషన్) భారం పెరుగుతుంది. విద్యుత్ ఛార్జీలు పెంచుతారు.

- ప్రభుత్వరంగ షిప్పింగ్ కార్పొరేషన్ సంస్థను ప్రైవేటీకరించడానికి పూనుకుంటున్నారు.
- భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌లో వాటాలు విక్రయిస్తారు.
- దేశంలోనే మొదటి నౌకా నిర్మాణ కేంద్రమైన విశాఖలోని హిందుస్థాన్ షిప్ యార్డుని వర్క్ ఆర్డర్లు లేకుండా చేసి నష్టాలలోకి నెట్టారు. ఓడలను నిర్మించడానికి స్టీల్ దగ్గర నుండి, మెషీనరీ, ఇతర భాగాలు విదేశాల నుండి దిగుమతి చేసుకోవాలి. అందువల్ల సహజంగానే ఈ పరిశ్రమ ప్రభుత్వ సబ్సిడీలతోనే నడపాలి. విశాఖ అనగానే మొదట్లో షిప్‌యార్డు, పోర్టు గుర్తుకువచ్చేవి. ప్రైవేటుపరం చెయ్యాలని ప్రభుత్వం ప్రయత్నించినా ఎవరూ ముందుకు రాలేదు. పెట్టుబడిదారులకు తాము పెట్టిన పెట్టుబడికి వెంటనే లాభాలు కదా కావాలి!? దేశ ప్రతిష్ట వారికెందుకు వుంటుంది? చివరికి కార్మికుల సంఖ్యను గణనీయంగా తగ్గించి, రక్షణరంగంలోనున్న నేవల్ బేస్‌లో విలీనం చేశారు.
- ప్రభుత్వరంగంలో లాభాలతో నడుస్తున్న బిహెచ్‌పివి సంస్థను నష్టాలపాల్జేసి అమ్మివేయాలను కున్నారు. దీనిపై కార్మికవర్గం గట్టిగా పోరాడింది. కుటుంబాలతో సహా ఆందోళనల్లో పాల్గొన్నారు. అనేక సంప్రదింపుల తర్వాత మరో ప్రభుత్వ రంగ సంస్థ భెల్ (బిహెచ్ఇఎల్)లో విలీనం చేశారు. కార్మికుల సంఖ్యను నామమాత్రం చేశారు.
- మరో ప్రభుత్వరంగ పరిశ్రమ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ లాభాలతో నడుస్తున్నా, ఇంకా రావలసినంత లాభం రాలేదని ఆదానీకి కట్టబెట్టారు. వారు పరిశ్రమకు తాళంవేసి పరిశ్రమ భూములను అమ్ముకోడానికి సిద్ధపడుతున్నారు. కార్మికులను వీధుల పాల్జేశారు.
- విశాఖ పోర్టు చాలా పురాతనమైన సహజసిద్ధ ఓడరేవు. అలాంటి పోర్టుని నిర్లక్ష్యం చేసి ప్రైవేటు యాజమాన్యంలో వున్న గంగవరం పోర్టుకు ప్రాధాన్యతనిస్తున్నారు. పోర్టుకు విశాఖలో చాలా విలువైన భూములున్నాయి. వాటిపై కార్పోరేట్ల కన్నుపడింది.
- 47 సంవత్సరాలు ప్రభుత్వరంగంలో వున్న కోల్ ఇండియాను మూసివేసి గనులను వేలం వేస్తారట.
- ఎన్‌టిపిసిలో ఇప్పటికే 44 శాతం వాటాలు అమ్మేశారు. మరో 10 శాతం అమ్మకానికి పెట్టారు.
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అమ్మడాన్ని కార్మికులు ప్రతిఘటించారు. ప్రస్తుతానికి వెనక్కి తగ్గినా ప్రమాదం మాత్రం పొంచి వుంది.
- కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించారు. కార్పోరేట్ వర్గాలకి, బహుళజాతి కంపెనీలకు కార్మికుల నుండి ఎలాంటి ప్రతిఘటనా రాకుండా, కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కును కూడా లేకుండా చేయడానికి, మొత్తం కార్మికవర్గాన్ని అసంఘటిత రంగంగా మార్చి, వేతనాలు తగ్గించటానికి ప్రైవేటు యాజమాన్యాలు పూనుకున్నాయి.

## ప్రైవేటైజేషన్ వల్ల కార్మికవర్గానికి జరిగే హాని

ప్రైవేటురంగంలో కార్మికుల హక్కులు హరించబడతాయి. పనిగంటలు పెంచుతారు. పెరిగిన కాలానికి అదనపు వేతనం (ఓటి) ఇవ్వరు. అది మన సామాజిక బాధ్యత అంటారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లో అమలవుతున్న చట్టాలన్నింటిని రద్దుచేసి నాలుగు లేబరు కోడ్లుగా కుదించారు. దేశంలో మొత్తం ప్రభుత్వరంగాన్ని ఎత్తివేసే ఆలోచనతోనే ఈ చట్టసవరణలు చేశారు. ప్రైవేటు దోపిడీకి అడ్డంకిగా భావించి, ఆ చట్టాలను మార్చారు. దీనితో వేతనాలు తగ్గిపోతాయి. సెలవులు పరిమితమౌతాయి. అనారోగ్యంతో సెలవుపెడితే వేతనంలో కోత పెడతారు. ఉద్యోగ భద్రత వుండదు. యాజమాన్యాల దయా దాక్షిణ్యాల మీద బతకాలి. పనిలో భద్రత వుండదు. ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్న మారుతీ సుజుకి, విశాఖలోని ఫార్మా కంపెనీలు, హిందుస్థాన్ పాలీమర్స్‌లాంటివి, దేశంలో ఏ ప్రైవేటు సంస్థలోనైనా కార్మికులకు హక్కులుండవు. ప్రస్తుత ప్రభుత్వరంగ పరిశ్రమల్లోనూ అసంఘటిత కార్మికులే ప్రమాదాలకు గురౌతున్నారు. ప్రైవేటువారికి లాభాలు ముఖ్యం. కార్మికుల ప్రాణాలకు విలువుండదు. వేతనాలు పెంచమని సమ్మెలు, నిరసనలు సహించరు. కార్మికులు అర్థబానిసలుగా మారిపోవాలి. నేడు మోడీ ప్రభుత్వం కోరుకుంటున్న "దేశభక్తి" సూత్రం ఇదే.

మతతత్వ బిజెపి ప్రభుత్వం మధ్యయుగాల నాటి పాలన వైపు దేశాన్ని నడిపిస్తున్నది. పాలక ప్రభువుల పల్లకీ మోసేవారిగానే కార్మికులు, రైతులు, శ్రమజీవులంతా జోహుకుం అంటూ బ్రతకాలి. కాలాన్ని వెనక్కి తిప్పాలనుకుంటున్నారు.

ప్రజల నెత్తిపై బూజుపట్టిన భావజాలాన్ని రుద్దాలనుకునే పాలకులను బలమైన ప్రజా పోరాటంతోనే ఎదుర్కోగలం.

వీరోచితంగా పోరాడుతున్న రైతాంగం, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను, జరగబోయే ప్రమాదాన్ని దేశానికి చాటిచెబుతున్నది. ప్రధానమైన పారిశ్రామికాభివృద్ధికి సహకరించే పరిశ్రమలను అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికవర్గం పోరుబాట చేపట్టింది. స్టీలు ప్లాంటు అమ్మడాన్ని అడ్డుకోడానికి స్టీల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి రాష్ట్రమంతటా సంఘీభావం వస్తున్నది. దేశాభివృద్ధికి కీలకమైన, పునాదిరంగాలైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో శ్రామికవర్గం సంఘటితపడి కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడవలసి వుంటుంది.

# ఉద్యమాలలో పండిన ఉక్కు

- దివికుమార్

**తెలుగు** ప్రజలదీ విశాఖ ఉక్కు
ప్రభుతకు లేదుర అమ్మే హక్కు
కదను తొక్కరా తూరుపు దిక్కు
పోరినప్పుడే  మనకది దక్కు

చెమట చుక్కలే చరచర మండగ
నెత్తుటి ధారలు ఇంధనమవ్వగ
దుక్క ఇనుము బహు చక్కగ మరిగి
కష్టాల కొలిమిలో  కరిగిన ఉక్కు
నిక్కమైన శ్రమ జీవుల హక్కు
ఎవడికి లేదుర అమ్మే హక్కు

ఎవడికి లేదుర అమ్మే హక్కు
శ్రమకు పండిన విశాఖ ఉక్కు

ఇస్కో  అనగనే
పోస్కో  కిస్తిరి
ఘన గనులేమో 'గాలి'కి వదిలిరి
విశాఖ వినతులు
విసిరి  కొడితిరి
సొంత గనులు మాకివ్వకపోతిరి
మీకెక్కడిదిర అమ్మే హక్కు
ప్రజలందరిదిర విశాఖ ఉక్కు!!

పొలాలు దున్నే నాగలి కర్రు
రైతు చేతిలో గొడ్డలి, గొర్రు
పారా, పలుగు, బండి ఇరుసులు
ఉక్కు కార్మికుల కష్ట ఫలమురా
కార్మిక కర్షక పోరు బలిమిరా
శ్రమ హక్కయ్యేర విశాఖ ఉక్కు

శ్రమ హక్కయ్యేర విశాఖ ఉక్కు
ప్రభుతకు లేదుర అమ్మే హక్కు !!

ఎవడత్త సొమ్మురా దానం చేయగ
ప్రజల సంపదను ప్రైవేటోళ్ళకి
కట్టిపెట్టరా దళారి కుట్రలు
దోపిడీ దొంగల ద్రోహ బుద్ధులు
మీకెక్కడిదిర అమ్మే హక్కు
శ్రామికులందరి విశాఖ ఉక్కు!!

కణ కణ ఎర్రని
ఎగసిన సెగలలో
కళ పెళ మరగగ మెరుపుల మంటలో
చిరచిర కరగగ
బరబర పరగగ
దుక్క ఇనుము ఘన ఉక్కుగ మారెను

దుక్క ఇనుము ఘన ఉక్కుగ మారెను
కాకలు తీరిన శ్రమ చేతులలో!!

పోరు బలమురా విశాఖ ఉక్కు
త్యాగా..ల ఫలమురా విశాఖ ఉక్కు
విద్యార్థి యువకుల పిడికిలి ఉక్కు
ఉద్యమాలలో
పండిన ఉక్కు
తెలుగు బిడ్డ సంకల్పమె ఉక్కు
మీకెక్కడిదిర
అమ్మే హక్కు

మీకెక్కడిదిర
అమ్మే హక్కు
ప్రజలందరిదిర
విశాఖ ఉక్కు!!

(అందరూ...)

కదను తొక్కరా తూరుపు దిక్కు
పోరినప్పుడే మనకది దక్కు!!
పోరినప్పుడే మనకది దక్కు!!

# రైతుల హక్కులపై పెప్సీ కంపెనీ దాడి
## 2019 ఏప్రిల్

**ప్రపంచ** వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆవిర్భవించిన తర్వాత ఇండియా సభ్యదేశంగా డబ్ల్యుటిఒకి సంబంధించిన 'టిఆర్ఐపిఎస్' (ట్రిప్స్) అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. దీనివల్ల మనదేశ పాలకులు మరింతగా రాజీపడవలసి వస్తోంది. అలాగే నిరంతరం ముప్పును ఎదుర్కోవాల్సివస్తోంది. దేశ 'సార్వభౌమాధికారమే' తీవ్ర ప్రమాదంలో పడింది.

అమెరికా బహుళజాతి సంస్థ యొక్క అనుబంధ కంపెనీయైన పెప్సికో గుజరాత్‌లోని నలుగురు బక్క రైతులను కోర్టుకీడ్చింది. తాను హక్కులు పొందిన 'లేస్' తయారీకి వుపయోగపడే ప్రత్యేక బంగాళదుంపలను ఈ రైతులు పండిస్తున్నారని, నష్టపరిహారంగా ప్రతి రైతు తనకు 1.05 కోట్ల రూపాయలు చెల్లించాలని 2019 ఏప్రిల్‌లో ఆ కంపెనీ అహ్మదాబాద్‌లోని వాణిజ్య కోర్టులో దావా వేసింది. ఆ రైతులు సదరు వంగడం (ఎఫ్‌సి బంగాళాదుంప) సాగుచేయడానికి వీల్లేదని ఈ కోర్టు ఏకపక్షంగా మధ్యంతర తీర్పునిచ్చింది. ఈతీర్పులో అనేక ఆందోళనకర అంశాలున్నాయి. ఈ తీర్పు మనరైతుల విత్తన సార్వభౌమాధికారానికి, మన ప్రజల ఆహార సార్వభౌమత్వానికి అంతిమంగా మనదేశ సార్వభౌమత్వానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది.

ఇక్కడ వివిధ వంగడాల రక్షణ మరియు రైతుల చట్టం – 2001 (పిపివి అండ్ ఎఫ్ఆర్ చట్టం) అనబడే ఈ చట్టం అమలులో చట్టపరమైన మరియు న్యాయపరమైన అంశాల గురించి ఎదురయ్యే సమస్యకంటే సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు మనదేశం, మన రైతుల, మన ప్రజల సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమే మన ముందున్న ప్రధాన సమస్య.

స్థానిక విత్తన వ్యాపారుల నుండి ఆ బంగాళాదుంప వంగడాన్ని కొని సాగుచేసిన రైతులను, పై చట్టంలోని కొన్ని నిబంధనలను అడ్డం పెట్టుకొని పెప్సికో వేధిస్తోంది.

పెద్ద బహుళజాతి సంస్థలు ముఖ్యంగా అమెరికా బహుళజాతి కంపెనీలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో తమ యిష్టారాజ్యంగా నీతిబాహ్య వ్యాపార పద్ధతులకు పాల్పడుతున్న విషయం బహిరంగ రహస్యమే.

జాన్సన్ & జాన్సన్ కంపెనీ తన అధీన సంస్థల ద్వారా భారతదేశంలో తన వైద్య ఉత్పత్తులను అమ్ముకోవడంలో ఎంతటి నీతిబాహ్య చర్యలకు పాల్పడిందో మనం చూశాం. అలాగే మోన్‌శాంటో కంపెనీ యొక్క అధీన సంస్థ 'మహికో' ఈ దేశంలో చట్టవ్యతిరేకంగా ప్రవేశించి, తన బిటి వంకాయలను అనధికారికంగా పండించి, అమ్ముకున్న వైనం మనందరికీ తెలిసిందే. ఇటీవలనే వాల్‌మార్ట్ కంపెనీ సంబంధిత ప్రభుత్వ అధికారులకు లంచాలు యిచ్చి తన వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించుకోడానికి అనుమతులు పొందడంలాంటి నీతిబాహ్య కుట్రపూరిత చర్యలు బహిర్గతమయ్యాయి. ఈ బహుళజాతి కంపెనీలు తమకున్న భారీ పెట్టుబడిశక్తితో, ఆధిపత్యంతో వీటి బారినపడ్డ దేశాల ప్రజల హక్కులను, సార్వభౌమాధికారాన్ని హరిస్తూ, ఆ దేశాలను సర్వనాశనం చేస్తూ వాటితో ఆడుకుంటున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా రూపొందిన 'ట్రిప్స్' ఒప్పందం వీటికి స్వతంత్ర దేశాల సార్వభౌమాధికారాన్ని నిర్వీర్యపరిచే అవకాశాల నిస్తోంది.

అమెరికా దిగ్గజ అనుబంధ కంపెనీయైన పెప్సికో తన శీతల పానీయాల వ్యాపారంతో బాటు ఆహార పదార్ధాల తయారీ వ్యాపారాన్ని కూడా చేస్తోంది. 'లేస్' చిప్స్ తయారీకి వాడే 'ఎఫ్–సి–5' రకం బంగాళాదుంప వంగడాన్ని 2009లో అది ఈ దేశానికి తెచ్చింది. సహకార వ్యవసాయంపేర 12000 మంది రైతులు ఈ వంగడాన్ని సాగుచేస్తున్నారు. ఈ వంగడం విత్తనాలను రైతులకు సరఫరా చేయడానికి, వారు పండించిన పంటను కొనుగోలు చేయడానికి ప్రత్యేకమైన ఒప్పందాలను రైతులతో ఈ కంపెనీ చేసుకుంది. ఈ వంగడాన్ని, పిపివి & ఎఫ్ఆర్ చట్టంక్రింద పేటెంటు హక్కులను ఈ కంపెనీ రిజిష్టరు చేసుకుంది. 2010లో ఈ వ్యాపారం ద్వారా 2727 కోట్ల రూపాయలను గడించింది. 2015లో కేవలం 'లేస్' చిప్స్ అమ్మడం ద్వారానే మనదేశ మార్కెట్ నుండి 6000 కోట్ల రూపాయలు లాభాలు గడించింది.

తన సహకార వ్యవసాయ ఒప్పందంలో భాగస్వాములు కాని రైతులు కొందరు గుజరాత్‌లో ఈ వంగడాన్ని పండిస్తున్నట్లు పెప్సికో తెలుసుకుంది. పిపివి & ఎఫ్ఆర్ చట్టం క్రింద తన హక్కుల ఉల్లంఘన జరిగిందని, తనకు జరిగిన భారీ నష్టానికి పరిహారం చెల్లించాలని ఆ చిన్న రైతులపై కేసులు పెట్టింది. గుజరాత్‌లోని వాణిజ్య న్యాయస్థానం కనీసం రైతుల వాదనలను కూడా వినకుండా ఏకపక్షంగా తీర్పునిచ్చింది.

ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దక్షిణకొరియా, యూరోపియన్ యూనియన్ దేశాలలోని సన్నకారు రైతులపై 'పెప్సికో' ఇలాంటి కేసులు పెట్టి దెబ్బతీస్తోంది. రైతుల హక్కుల రక్షణకు జరిగే ప్రయత్నాలు

పట్టుచిక్కని వ్యవహారంగా మారిపోయాయి. చివరకు యిప్పుడు రైతుల హక్కులు, సార్వభౌమత్వమే ప్రమాదంలో పడ్డాయి.

ఒక భారతీయ న్యాయస్థానం భారతీయ రైతులకు వ్యతిరేకంగా మొత్తం పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష తీర్పులను ఎలా యిస్తుందనేది అర్థంగాని విషయం. దీన్నిబట్టి భారతీయ న్యాయస్థానాలు, ఈ కేసుల్లో వున్న కీలకమైన పరిస్థితుల జోలికి పోకుండా, వాటిని పట్టించుకోకుండా యాంత్రికంగా చట్టపరిమితుల్లోనే వ్యవహరిస్తున్న తీరు మనకు తెలుస్తోంది.

నీతిబాహ్యమైన విధానాలతో, దుర్బలురైన రైతులను వేధించటంద్వారా పెప్సీ కంపెనీ 'ఏవిధంగా' లాభాలు గడించాలనుకుంటుందో ఈ ఉదంతం తెలియజేస్తోంది. 'కార్పొరేట్ జవాబుదారీతనం' వంటి బడాయి నినాదాలన్నీ ఎంతటి డొల్లవో ఈ ఉదంతం వెల్లడిచేస్తోంది.

ఇంతటి నీచమైన వ్యవహారాలు బయట ప్రపంచానికి తెలిసిన తర్వాత కూడా పెప్సికో తాను యిదంతా సహకార బంగాళాదుంప సాగులో భాగస్వాములుగా వున్న రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసమేనని, చివరి అస్త్రంగా న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డామని వాదిస్తోంది. ఇంతకంటే నయవంచన ఏమైనా వుంటుందా!?

కానీ, ఈ అర్థంలేని కేసును రైతులపై రుద్దినపుడు మనదేశంలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం వుండడం, సోషల్ మీడియాలో పెల్లుబికిన కోపం, దేశవ్యాప్తంగా వచ్చిన ప్రజల నిరసన, వివిధ రైతుసంఘాల నుండి ఎదురైన ప్రతిఘటన, అత్యధిక రాజకీయ పార్టీలు కంపెనీ చర్యను ఖండించడం, ముఖ్యంగా ఈ దేశంలో తనకున్న భారీవ్యాపారం, వ్యాపార ప్రయోజనాలు, భారతీయ మార్కెట్ నుండి భారీ లాభాలు పొందే అవకాశాలతోబాటు భారతదేశంలో ఆ కంపెనీ ఉత్పత్తుల కొనుగోలును బహిష్కరిస్తామనే హెచ్చరికలు – 'పెప్సికో'ను రైతులపై తను పెట్టిన కేసులు ఉపసంహరించుకొని వెనక్కు తగ్గేట్లు చేశాయి.

**అమెరికా బహుళజాతి సంస్థ యొక్క అనుబంధ కంపెనీయైన పెప్సికో గుజరాత్‌లోని నలుగురు బక్క రైతులను కోర్టుకీడ్చింది. తాను హక్కులు పొందిన 'లేస్' తయారీకి వుపయోగపడే ప్రత్యేక బంగాళ దుంపలను ఈ రైతులు పండిస్తున్నారని, నష్టపరిహారంగా ప్రతి రైతు తనకు 1.05 కోట్ల రూపాయలు చెల్లించాలని 2019 ఏప్రిల్‌లో ఆ కంపెనీ అహ్మదామాద్‌లోని వాణిజ్య కోర్టులో దావా వేసింది. ఆ రైతులు సదరు వంగడం (ఎఫ్‌సి బంగాళాదుంప) సాగుచేయడానికి వీల్లేదని ఈ కోర్టు ఏకపక్షంగా మధ్యంతర తీర్పునిచ్చింది.**

అయినా సంబంధిత రైతులకు యిది ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. తిరిగి ఆ కంపెనీ అర్థంపర్థం లేని సాకులతోనో, చట్టపరమైన విషయాలనో ఆధారం చేసుకొని రైతులపై దాడిచేసే అవకాశముంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే విత్తనాల సార్వభౌమాధిపత్యం, ఆహార సార్వభౌమాధిపత్యం, మొత్తంగా మనదేశ సార్వభౌమాధిపత్యంపై ముప్పు ముంచుకొస్తున్నది.

ప్రపంచ వాణిజ్య సంస్థ విసిరిన అసమాన ఒప్పందాల వల నుండి మనదేశం నిర్ణయాత్మకంగా, రాజీలేకుండా బయటపడాల్సి వుంది. అప్పటివరకు ఈ ఒప్పందాల రూపంలో రైతులే కాదు, మనదేశ ప్రజలు, వారి హక్కులు వారి విస్తృత ప్రయోజనాలతోబాటు మన ఆర్థిక స్వాతంత్ర్యం, బహుళజాతి కంపెనీల భారీ పెట్టుబడుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ వాటి ఉచ్చులో మగ్గాల్సి వుంటుంది.

# దోపిడి రాజ్యం

**- విజయ్**

దోపిడి రాజ్యం దళారి రాజ్యం - పోలీసురాజ్యం తుపాకి రాజ్యం ॥ దోపిడి ॥
గాంధీ టోపీ ఖద్దరు బురఖా - న్యాయస్థానం చువ్వల బోనూ
నిర్బంధాలను వెతికే చట్టం - నరకం చూపే జైలు గోడలూ ॥ దోపిడి ॥

ఆకలి అంటే లాఠీ దెబ్బలు - పనులిమ్మంటే బుల్లెట్ల వర్షం
అదేమటంటే జైలు శిక్షలూ - అక్రమమంటే తుపాకి కాల్పులు ॥ దోపిడి ॥

గాలి పీల్చితే నీరు తాగితే - ఆలోచిస్తే నోరు విప్పితే
నిషేధాజ్ఞలూ - నిర్బంధాలూ జైలు గోడలూ దేశం నిండా ॥ దోపిడి ॥

నలభై ఏడున గద్దెనెక్కిరి - ఇన్నియేళ్ళుగ మనల దోచిరి
మారిందేమిటి? తీరిందేమిటి - పోయిందేమిటి! వచ్చిందేమిటి!
ప్రజాస్వామ్యమనె తుపాకి పాలన - స్వాతంత్రమ్మనె దళారిపాలన ॥ దోపిడి ॥

# జన్యుమార్పిడి ఆవాల సాగుకు పాలకుల అనుమతి

## 2022 అక్టోబర్ 31

**జన్యుమార్పిడి** బి.టి. ప్రత్తి విత్తనాలకు అనుమతిని యిచ్చి, వ్యవసాయరంగంలో ఆ విత్తనాలను భారీఎత్తున ప్రవేశపెట్టడంవలన కలిగిన అనర్థాన్ని కళ్ళారా చూశాం. ఆ విత్తనాలు – ఆ కంపెనీలు, ఆ కంపెనీలను సమర్థించే 'శాస్త్రజ్ఞులు' చెప్పినట్టుగా ఏవిధంగానూ పంటను తెగుళ్ళు ఆశించకుండా నిలుపుచేయ లేకపోయాయి, క్రిమినాశక రసాయనాల అవసరాన్ని తగ్గించలేకపోయాయనే విషయాన్ని రైతుల అనుభవం ద్వారా చూశాం. కనీసం పంటలో అధిక దిగుబడి కూడా రాని విషయాన్ని చూశాం. కాకపోతే యీ విత్తనాలవలన, పొరుగు క్షేత్రాలలో వేసిన పంటలు దెబ్బతినటం, పశువులు అనారోగ్యాల పాలయిన వైనాన్ని తెల్సుకొన్నాం. అయినా, ఆ బి.టి. విత్తన కంపెనీల వ్యాపారాన్ని ప్రభుత్వాలు నియంత్రించక పోగా అవి ఆ విత్తనాల ధరలను యిష్టారాజ్యంగా పెంచివేసి దోపిడీ చేసుకోవటాన్ని చూసీ చూడనట్లు వదిలిపెట్టడం చూశాం. ఈ బి.టి. ప్రత్తి విత్తనాలను వాడిన వేలమంది రైతులు, తీవ్రంగా నష్టపోయి, వ్యవసాయంకోసం చేసిన అప్పు తీర్చలేని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడిన విషాద అనుభవాలను మనం చూస్తూనేవున్నాం.

అయినా పాలకులు గానీ, ప్రభుత్వ నియంత్రణా సంస్థలుగానీ యీ విషాద అనుభవాలను గుర్తించ నిరాకరిస్తూ, వ్యవసాయరంగాన్ని, రైతులను విదేశీ జన్యుమార్పిడి విత్తనసంస్థల బారినుండి రక్షించటానికి పూనుకోకపోగా, మరిన్ని పంటలలో బి.టి. విత్తనాలను ప్రవేశపెట్టి రైతాంగాన్నీ, ఆ పంటల వినియోగదారులైన ప్రజలను దోపిడీ చేసుకోవటానికే మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నారు.

ఆహార పంటలలో జన్యుమార్పిడి విత్తనాలను ప్రవేశపెట్టడానికి యూరోపియన్ యూనియన్ దేశాలు, జపాన్‌లు గట్టిగా నిరాకరిస్తున్నాయి. ఇందువలన ప్రజల ఆరోగ్యం, పర్యావరణాలు దెబ్బతింటాయని ఎందరో శాస్త్రజ్ఞులు పదేపదే హెచ్చరికలు చేస్తున్నారు. అయినా మన పాలకులకు యివేవీ పట్టట్లేదు. సామ్రాజ్యవాద బడా విత్తన కంపెనీల ప్రయోజనాలను పెంపొందించటమే తమ కర్తవ్యంగా ఎంచుకొన్నారు. అందుకు మనదేశపు వ్యవసాయరంగాన్ని, రైతులను జన్యుమార్పిడి ఆహారపంటల వినియోగదారులైన దేశప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టడానికి కూడా వెనుకాడటల్లేదు. అందుకు అనుగుణమైన విధానాలనే అమలు జరుపుతున్నారు; రూపొందిస్తున్నారు. ఈ విధానాలలో భాగంగానే, దేశంలోని వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించటం కోసం అన్న సాకుతో 'నీతిఆయోగ్' దేశంలో జన్యుమార్పిడి సాంకేతికతను ప్రవేశపెట్టాలంటూ సిఫార్సు చేసింది.

ఈ సిఫార్సును తక్షణమే అమలుచేస్తూ, జన్యుమార్పిడి ఆవాల విత్తనాల వినియోగానికి కేంద్రపర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతి యిచ్చినట్లు మూడు జాతీయ వ్యవసాయశాస్త్ర సంస్థలైన ఐ.సి.ఎం.ఆర్, ఎ.ఎన్.ఎ.ఎస్.ఎస్, టి.ఎ.ఎస్.ఎస్ సంస్థల అధిపతులు 2022 అక్టోబర్ 31న ప్రకటించారు.

ఇందువలన జన్యుమార్పిడి ఆవాలు 30శాతం ఎక్కువ పంట దిగుబడి యిస్తాయనీ, ప్రస్తుతం దేశం వెచ్చించే రు.1,71,000 కోట్ల వంటనూనె దిగుమతి బిల్లును తగ్గించుకోవచ్చుననీ ప్రభుత్వ మంత్రులూ, వివిధ వ్యవసాయశాస్త్ర సంస్థల అధిపతులూ ప్రచారం చేస్తున్నారు, వాదిస్తున్నారు. ఆరకంగా అన్ని శాస్త్రీయ నిబంధనలను అశాస్త్రీయంగా మార్చి వేస్తూ, జన్యుమార్పిడి సాంకేతికతపై డి.ఎ.సి. యొక్క నియంత్రణను బలహీనపరుస్తూ, సాంకేతిక ఆవిష్కరణపేరిట డి.ఎం.హెచ్-11 రకం జన్యుమార్పిడి ఆవాల విత్తనాల వాణిజ్య సాగుకు అనుమతినిచ్చారు. తాడిచెట్టు ఎందుకెక్కావురా? అంటే దూడ గడ్డికోసం అన్నట్టుగా ఈ జన్యుమార్పిడి ఆవాల వాణిజ్య సాగుకు అనుమతినిచ్చిన పాలకుల – ప్రభుత్వ సంస్థల వాదనలు వున్నాయి. ఈ వాదనలు అసంబద్ధమయినవని దేశంలోని ఎందరో శాస్త్రవేత్తలు మొత్తుకొంటున్నారు. అయినా పాలకులు, ప్రభుత్వ వ్యవసాయశాస్త్ర సంస్థ అధిపతులూ పట్టించుకోనిరాకరిస్తున్నారు.

అందుకు నిజానికి దేశంలో ఖాద్య తైలాలను భారీఎత్తున నేడు దిగుమతి చేసుకోవల్సిన; ఏటా, 1,71,000 కోట్ల బిల్లును చెల్లించాల్సిన దుస్థితికి, పాలక ప్రభుత్వాలు అనుసరించి, అమలుజరిపిన పెట్టుబడిదారీ నయా–ఉదారవాద, ప్రపంచీకరణ విధానాలే కారణం. 1993-94 నాటికి వంటనూనెల ఉత్పత్తితో, దేశం స్వయం పోషకంగా వుంది. నాటికి దేశంలో వంటనూనెలను కేవలం 3% వరకే దిగుమతి చేసుకొంటున్నాం. దేశంలో నయా–ఉదారవాద విధానాల అమలులో భాగంగా, దేశంలోకి వంటనూనెల దిగుమతిపై నియంత్రణ ఎత్తివేయబడింది. దిగుమతి సుంకాలు 300 శాతం దాకా వుండాల్సి వుండగా, ఆ సుంకాన్ని దాదాపు రద్దుచేయటం జరిగింది. ఫలితంగా దేశంలోకి చౌక నూనె దిగుమతులు పెరిగిపోయాయి. ప్రధానంగా పామాయిల్ దిగుమతులు విపరీతంగా పెరిగిపోయాయి, దేశ మార్కెట్లను ముంచెత్తాయి. ఈ దిగుమతి నూనెల పోటీకి తట్టుకోలేక, దేశంలోని వంటనూనె కంపెనీలు నిలదొక్కుకోలేకపోయాయి. పంట దిగుబడి అధికంగా వున్నా, గిట్టుబాటు ధర లేకపోవటంతో, ఖాద్య తైలాల కోసం వేరుశనగ,

నువ్వులు, ఆవాలు పండించే రైతాంగం ఆ పంటలు మానివేసి, యితర పంటలకు మారారు. పలు భారత వంటనూనె ఉత్పత్తి కంపెనీలు దెబ్బతిన్నాయి, దేశీయ వంటనూనె పరిశ్రమ నష్టాల పాలైంది. కొన్ని భారతీయ వంటనూనె కంపెనీలు శ్రీలంకకు తరలివెళ్ళాయి. భారతదేశంలో 2016-17లో ఆవాల పంట గణనీయ స్థాయిలో పండించింది. ఆ సం॥రం వాటి ధరలు క్వింటాలుకు 400 నుండి 600 వరకు పడిపోయాయి. దాంతో ఆవాల పంటను పండించటం గణనీయంగా తగ్గిపోయింది. ఆవాల పంట సాగును పెంపొందించ టానికి అనువైన వాతావరణం, పరిస్థితులు, రైతులకు గిట్టుబాటు ధరలు, సరయిన మార్కెటింగు పరిస్థితులు కల్పించితే, ఆవాల పంట దిగుబడికి సంబంధించిన సమస్యే వుండదు. కానీ ప్రభుత్వం అందుకు పూనుకోకుండా, అందుకవసరమైన మౌలిక పరిస్థితులు కల్పించకుండా, వంటనూనెల దిగుమతినే ప్రోత్సహిస్తూ, వాటిని నియంత్రించక, వంటనూనె రంగంలో తీవ్రమయిన సంక్షోభానికి కారణమయింది. దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దుచేసి, దేశీయ వంటనూనె రంగాన్ని విధ్వంసం చేసింది. వంటనూనెలకు విదేశీ దిగుమతులపైననే ఆధారపడవలసిన పరిస్థితిని సృష్టించింది.

తీరాచూస్తే, ఒకప్పుడు చౌక వంటనూనెగా ప్రవేశించిన పామాయిల్ యిప్పుడు సామాన్యులకు అందుబాటులోలేని అత్యధిక ధరకు మార్కెట్టులో అమ్మబడుతోంది. మనదేశంలో వంటనూనె పరిశ్రమ విధ్వంసం అయ్యాక, విదేశీ కంపెనీలు తమ వంటనూనెకు రేట్లు గణనీయంగా పెంచివేసి, భారతదేశ మార్కెట్టును విపరీతంగా దోచుకొంటున్నాయి.

వాస్తవాలు యీవిధంగా వుంటే, మనదేశంలో ఆవాల పంట దిగుబడి అవసరానికి తగినంతగాలేదనే అబద్ధపు సాకుతో, యిప్పుడు జన్యుమార్పిడి ఆవాల విత్తన వినియోగానికి, వాణిజ్య సాగుకు అనుమతినిచ్చి బడా బహుళజాతి విత్తన కంపెనీలు మరింతగా దోపిడీ చేసుకోవటానికి పూర్తి అవకాశం కల్పించారు.

ఇంతవరకు దేశంలో సాంప్రదాయరకం అయిన డి.ఎం.హెచ్-4 రకం ఆవాలను సాగుచేస్తున్నారు. ఈ రకం ఆవాల విత్తనాలు, యిప్పుడు దేశంలో ప్రవేశపెడుతున్న డి.ఎం.హెచ్.11 రకం జన్యుమార్పిడి విత్తనాల కంటే 14.7 శాతం ఎక్కువ దిగుబడిని యిస్తుంది. పయనీర్, అక్వాంటా కంపెనీలు ఉత్పత్తిచేసిన మరో రెండురకాల విత్తనాలైతే, యీ జన్యుమార్పిడి విత్తనాలకన్నా 30 శాతం అధిక దిగుబడినిస్తాయి. ఈ విషయాన్ని సెంటర్ ఫర్ జనిటిక్ మానిప్యులేషన్ ఆఫ్ క్రాప్ ప్లాంట్స్ అనే సంస్థకు చెందిన ఒక శాస్త్రవేత్త, ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన ఒక సమావేశంలో వెల్లడించారు. అయినా పాలకులు, ప్రభుత్వ వ్యవసాయ శాస్త్రసంస్థల అధిపతులు

**మనదేశంలో ఆవాల పంట దిగుబడి అవసరానికి తగినంతగా లేదనే అబద్ధపు సాకుతో, యిప్పుడు జన్యుమార్పిడి ఆవాల విత్తన వినియోగానికి, వాణిజ్య సాగుకు అనుమతినిచ్చి బడా బహుళజాతి విత్తన కంపెనీలు మరింతగా దోపిడీ చేసుకోవటానికి పూర్తి అవకాశం కల్పించారు.**

మాత్రం తాము అనుమతినిచ్చిన జన్యుమార్పిడి ఆవాల విత్తనాలే అధిక దిగుబడిని యిస్తాయన్నట్లు అబద్ధపు ప్రచారం సాగిస్తున్నారు.

ఇప్పటికే దొంగదారిన జన్యుమార్పిడి వంగ విత్తనాలు - జన్యుమార్పిడి వంగ పంటలు దేశంలోకి ప్రవేశించాయి. ఇప్పుడు అధికారపూర్వంగానే, జన్యుమార్పిడి ఆవాల ఉత్పత్తి దేశంలో జరిగి, జన్యుమార్పిడి వంటనూనెలు మార్కెట్లోకి వస్తాయి. ఇంతాచేసి యివి సామాన్యులకు అందుబాటులో వుండే తక్కువ ధరలకు లభిస్తాయా? అంటే అందుకూ గ్యారంటీ లేదు. కాకపోతే ఈ జన్యుమార్పిడి ఆహార వినియోగం వలన ప్రజలు మరిన్ని అనారోగ్య బాధలకు గురవుతారన్నది మాత్రం తిరుగులేని వాస్తవం. ఈ జన్యుమార్పిడి ఆవాల ద్వారా హానికరమైన రసాయన అవశేషాలు, ప్రజల శరీరాల్లోకి చేరుతాయి. అందువలన రకరకాల ఎలర్జీలు, ఇతర వ్యాధులూ ప్రబలుతాయి.

కాకపోతే ఈ జన్యుమార్పిడి ఆవాల వాణిజ్య పంటలు పండించటానికి విత్తనాలను అమ్ముకొనే బడా విదేశీ విత్తన సంస్థలు సూపర్ లాభాలను గడించుకోగల్గుతాయి. భారత మార్కెట్లను యదేచ్ఛగా దోచుకొంటాయి.

పాలకులూ, ప్రభుత్వ నియంత్రణ సంస్థలూ ప్రజలపట్ల విపరీతమయిన నేరపూరిత నిర్లక్ష్యంతో, బడా విదేశీ సామ్రాజ్యవాద కంపెనీల ప్రయోజనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ, పెంపొందించేందుకే కట్టుబడి వున్నారని చెప్పటానికి, యీ జన్యుమార్పిడి ఆవాల వాణిజ్య పంటలకు యిచ్చిన అనుమతి మరోసారి ధృవపరుస్తోంది.

# జన్యుమార్పిడి వరి దిశగా ప్రయోగాలు

**"కోట్లాదిమందిని** రక్షించగలిగే ధాన్యం" అని బంగారు ధాన్యాన్ని (గోల్డెన్‌రైస్) ప్రస్తుతిస్తున్నారు. ఈ స్తోత్రం ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచింది. పేద దేశాలలోని చిన్న పిల్లలలో వ్యక్తమౌతోన్న 'ఏ' విటమిన్ లోపాన్ని (విఏడి) పరిష్కరిస్తామనే తమ పవిత్ర వాగ్దానాన్ని గోల్డెన్‌రైస్ ఇంకా నెరవేర్చవలసే వుంది. అంతర్జాతీయ వరి పరిశోధనాసంస్థ (ఐఆర్‌ఆర్‌ఐ) యాజమాన్యం మరియు వారి వందిమాగధులు వెనువెంటనే దీనికి నిందను జన్యుమార్పిడి (జిఎమ్) ధాన్యాన్ని వ్యతిరేకించే రైతులపై, సంస్థలపై మోపుతున్నారు. అంతేకాక, ఈ రైతుల, ఈ సంస్థల "కుటిల" వ్యతిరేకత వలన, మానవత్వంతో కూడిన ఉత్తమ ధాన్య ఉత్పత్తి జరగకుండా నిరోధించబడిందని, దీనిద్వారా లబ్ధిపొందవలసిన కోట్లాదిమంది చిన్నపిల్లలకు ఆ ధాన్యం అందకపోయిన కారణంగా వారిలో అంధత్వం తొలగిపోకపోగా, అనేకమంది మరణాల పాలవుతున్నారని వారు పేర్కొంటున్నారు. అయితే అసలు వాస్తవమేమిటి?

## 'బంగారు ధాన్యం' అంటే ఏమిటి?

ఆసియా ఖండంలోని అనేక దేశాలలో వరి ధాన్యం చాలా ప్రముఖమైన పంట. ధాన్యం ఉత్పత్తి అత్యధికంగా ఈనాటికీ రైతుల చేతులలోనే వుంది. వ్యవసాయ కూలీలలో అధికభాగం ఏదో ఒక రూపంలో ధాన్యం ఉత్పత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మెట్టభూములలో పండించే ధాన్యం నుండి, మాగాణి భూములలో పండించే ధాన్యం వరకు ధాన్యంలో విస్తారమైన ఎన్నో రకాలు సాగవుతున్నాయి. భారతదేశం నుండి ఇండోనేషియా వరకు, చైనా నుండి ఫిలిప్పీన్స్ వరకు 40 వేలకు పైగా ధాన్యంలో రకాలను తేలికగా గుర్తించగలం. ప్రపంచ వ్యాపితంగా పండించే ధాన్యంలో 90 శాతం పైగా ఆసియా ఖండంలోనే ఉత్పత్తి చేయబడి, ఇక్కడే వినియోగించబడుతోంది.

పోషకాలతోకూడిన ఆహారంగా ధాన్యం వున్నప్పటికీ, విటమిన్ 'ఏ' లేదా దాని వాహకమైన 'బీటా-కెరటీన్' వంటివి దీనిలో లోపించాయి. ఆ కారణంగానే ధాన్యంతో కూడిన ఆహారంలోని ఈ సూక్ష్మ పోషకాలను భర్తీచేయటానికి కూరగాయలు లేదా మాంసాధారిత ప్రొటీన్లను చేర్చుకొని భోజనం చేయటం జరుగుతుంది. 1999లో డా॥ఇంగ్లో పోట్రిక్యాస్ నాయకత్వంలోని యూరోపియన్ శాస్త్రవేత్తల బృందం ఈ పరిస్థితిని మార్చేందుకు జన్యుమార్పిడి ధాన్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించారు. ఇందుకై డాఫోడిల్ (ఒక తరహా అడవి పుష్పం) మరియు మొక్కజొన్న జన్యువులను, కొన్నిరకాల బాక్టీరియాను ధాన్యంలో చొప్పించటం ద్వారా బీటా కెరొటిన్‌ను ధాన్యంలో సమకూరేట్లు చేయదలిచారు. దీనినే బంగారు ధాన్యం అని పిలుస్తున్నారు. ఈ ధాన్యపు గింజలు - బియ్యం, బంగారు రూపంలో వుండటమే దీనికి ఆ పేరు రావడానికి కారణం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అత్యధికులైన పేద ప్రజానీకం సమతులాహారాన్ని తీసుకోలేని కారణంగా, ధాన్యమే ప్రధాన ఆహారపంటగా వున్న కారణంగా, బంగారు ధాన్యం విటమిన్-ఏ మరియు ఇతర పోషకాల లోపాలను పరిష్కరించగలుగుతుందని వారు వాదిస్తున్నారు.

తర్వాత, సింజెంటా కంపెనీ బంగారు ధాన్యంలో నూతనంగా అభివృద్ధి చేసిన జిఆర్-2 వంగడాన్ని రూపొందించి 'గోల్డెన్ రైస్ హ్యూమానిటేరియన్ బోర్డు'కు విరాళంగా ఇచ్చి, జిఆర్-2 భారీ స్థాయిలో ప్రవేశపెట్టి, ఉత్పత్తి చేయటానికి హామీ ఇవ్వమని కోరింది. ప్రజలందరూ జిఆర్-2 ధాన్యాన్ని ఆహారంగా తీసుకోవటం వలన విటమిన్-ఏ లోపాన్ని నివారించగలమని పేర్కొంది. ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, ఇండియా వంటి దేశాలలో ప్రతిఏటా లక్షమంది చిన్నపిల్లలు అంధత్వంతో బాధపడుతున్నట్లుగా ఒక అంచనా వెల్లడించింది. తర్వాత, 2011 సం॥లో బంగారు ధాన్యం అభివృద్ధి కోసం బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ దాదాపు 10 కోట్ల 30 లక్షల అమెరికా డాలర్లను ఐఆర్‌ఆర్‌ఐకి విరాళంగా అందజేసింది.

1990ల చివరలో జన్యుమార్పిడి ధాన్యం గురించిన మొదటి ప్రకటన వెలువడినప్పటి నుండి, బంగారు ధాన్యం పలు దశలలో అభివృద్ధి జరుగుతూ, ప్రపంచంలో అన్ని వైపుల నుండి ఉత్సుకతతో పాటు విమర్శను కూడా ఎదుర్కొంది. బంగారు ధాన్యానికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రమైంది. బంగారు ధాన్యాన్ని సమర్థిస్తూ మాట్లాడేవారు జీవసాంకేతికత గొప్పదనానికి దీనికి ఒక గొప్ప చిహ్నంగా కీర్తించటంతోపాటు, 'విటమిన్-ఏ' లోపాన్ని అరికట్టే సర్వరోగ నివారిణిలాగా మాట్లాడుతూ, మరోవైపున దీనిని వ్యతిరేకించేవారిని పిల్లలలో అంధత్వం పెరిగిపోవటానికి బాధ్యులుగా పేర్కొంటున్నారు.

జన్యుమార్పిడి పంటల చుట్టూతా వాదోప వాదనలు బలంగా జరగటానికి - బంగారు ధాన్యంలో పోషక విలువలను మరింత పెంపుజేసేందుకు జన్యుమార్పిడి పరిశోధనలకు ద్వారాలు తెరవటం కీలకపాత్ర పోషించింది. ఈ రకంగా అభివృద్ధిచేసిన జన్యుమార్పిడి బంగారు ధాన్యంలో కొన్ని రకాలు ఈ విధంగా వున్నాయి : పైన పేర్కొన్న యూరోపియన్ శాస్త్రవేత్తల బృందమే ఐఆర్‌ఆర్‌ఐలోనే ఇనుము

మరియు జింక్ ధాతువులతో పోషకవిలువలతో బంగారు ధాన్యాన్ని అభివృద్ధిచేశారు. బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ అందజేసిన 59 లక్షల పౌండ్ల నిధులతో క్వీన్స్‌ల్యాండ్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజి పరిశోధన బృందం బీటా కెరోటీన్‌ను పెంపొందించిన జన్యుమార్పిడి చేసిన అరటిపండును 'సూపర్ బనానా' లేక 'గోల్డెన్ బనానా' పేరిట అభివృద్ధి చేశారు. ఓహియో స్టేట్ యూనివర్శిటీ మరియు ఇటాలియన్ ఏజన్సీ ఫర్ న్యూ టెక్నాలజీస్ – రెండు సంస్థలకు చెందిన శాస్త్రవేత్తల బృందం విటమిన్–ఏ, విటమిన్–ఇ కలిగిన నారింజ పసుపువర్ణం కలబోసుకున్న జన్యుమార్పిడి వంశపు బంగారు బంగాళాదుంపను అభివృద్ధి చేశారు. దక్షిణ చైనాలోని గౌన్‌ఝువ్ విశ్వవిద్యాలయంలోని ఓ పరిశోధక బృందం బ్లూబెర్రీలలో సాధారణంగా వుండే రంగు రంగుల యాంటాక్సిడెంట్ సమ్మేళనాలను కలిగివున్న జన్యుమార్పిడి "ఊదారంగు ధాన్యాన్ని" అభివృద్ధిపరిచారు. క్యాన్సర్ నిర్మూలనకు ఇది దోహదకారిగా వుంటుందని పేర్కొన్నారు.

బంగారు ధాన్యం అభివృద్ధిపరచటానికి లక్ష్యంగా ఎంచుకున్న దేశాలలో భారతదేశం ఒకటి.

## భారతదేశం

ప్రారంభం నుండే భారతదేశం బంగారు ధాన్యాన్ని అభివృద్ధి పరచటంలో జోక్యం కలిగి వుంది. భారతదేశానికి చెందిన న్యూఢిల్లీలోని ఇండియన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజి మరియు స్విట్జర్‌ల్యాండ్‌కు చెందిన బెర్న్‌లోని స్విస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా నిధులు సమకూర్చే 'ఇండో–స్విస్ కొలాబరేషన్ ఇన్ బయోటెక్నాలజి' (ఇటిహెచ్ జ్యూరిచ్) సంస్థ నుండి తాను పొందిన మద్దతును డా॥పోట్రీకస్ తనకు తానుగా గుర్తించి పేర్కొన్నాడు. 'ఇండో– స్విస్ కొలాబరేషన్ ఇన్ బయోటెక్నాలజి' వంటి వ్యవస్థీకృత నిర్మాణ చట్రంలోనున్న సంస్థ ద్వారా బంగారు ధాన్యాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టారు. బంగారు ధాన్య ఉత్పత్తిలో భారతదేశం నాయకత్వం తీసుకొని ఇతరదేశాలకు నమూనాగా వుంటుందని ప్రాథమిక దశలో ఊహించారు. 2016 ఫిబ్రవరిలో జరిగిన భారత వ్యవసాయ పరిశోధనాసంస్థ (ఐఏఆర్ఐ) 54వ సమావేశాల సందర్భంగా, నాటి భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ మాట్లాడుతూ ఈ అంశాలను వెల్లడించాడు. విటమిన్–ఏతో సంపద్వంతమైన జన్యుమార్పిడి బంగారు ధాన్యాన్ని, మాంసకృత్తులు అధికంగా వుండే మొక్కజొన్నను, ఐరన్–జింక్ అధికంగా వుండే గోధుమను, మాలిక్యులర్ బ్రీడింగ్ ద్వారా సజ్జలు, పప్పుధాన్యాలను భారతదేశం అభివృద్ధిచేసిందని రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్నాడు. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' (జాతీయ వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమం) పేరుతో దాదాపు 95 వేల అమెరికన్ డాలర్ల (68 లక్షల రూ॥) నిధుల సహాయంతో బీహార్ రాష్ట్రంలోని రాజేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో "బీహార్‌లోని వివిధ వ్యవసాయ పర్యావరణ మండలాలలో బంగారు ధాన్యం అభివృద్ధి" పేరుతో ఒక ప్రాజెక్టుపై పరిశోధన జరుగుతూవుంది. 2017 సం॥లో బంగారు ధాన్యాన్ని అభివృద్ధిపరిచిన మొదటి దేశంగా వున్నప్పటికీ, బంగారు ధాన్యాన్ని ఉత్పత్తి చేయటానికి అవసరమైన జన్యువులు ఉద్దేశించిన దానికి భిన్నమైన ఫలితాలనిస్తున్నాయని భారత పరిశోధకుల బృంద మొకటి పేర్కొంది. అధిక దిగుబడినిస్తున్న, వ్యవసాయ శాస్త్ర విజ్ఞాన పరంగా ఉన్నతమైన మనదేశ ధాన్యరకమైన 'స్వర్ణ'లోకి – బంగారు ధాన్య అభివృద్ధి కోసం జన్యువులను ప్రవేశపెట్టినపుడు అది పేలవంగానూ, కదలికలు లేక స్థిరంగానూ మిగిలిపోతోంది. ఫలితంగా దిగుబడులు బాగా తగ్గిపోయి, వ్యవసాయానికి పనికిరాని విధంగా మారిపోయింది.

## విటమిన్–ఏ లోపాన్ని బంగారు ధాన్యం నివారిస్తుందా?

ఐఆర్ఆర్ఐ డాక్యుమెంట్ల ప్రకారం, క్యారట్లలో వుండే బీటా – కెరోటిన్ కంటే బంగారు ధాన్యంలో 10 శాతం తక్కువగానే కలిగి వుంటుంది. 3 వారాలపాటు నిల్వచేసిన బంగారు ధాన్యంలో మొదట వున్న బీటా–కెరొటిన్ నిల్వలో 60 శాతం మాత్రమే లభించగా, అదే పది వారాలపాటు నిల్వ వుంచిన ధాన్యంలో కేవలం 13 శాతం మాత్రమే లభించింది. ఆస్ట్రేలియాలో 'మదర్స్ ఆర్ డీమిస్టిఫైయింగ్ జెనటిక్ ఇంజనీరింగ్' (ఎమ్ఏడిజిఇ) కూడా ఇదే అంశాన్ని ఎత్తి చూపింది. "నిల్వచేసిన బంగారు ధాన్యంలో విటమిన్–ఏ నిల్వలు ఈ స్థాయిలో తరిగిపోతున్నపుడు, పంట చేతికొచ్చిన 75 రోజుల నిల్వ తర్వాత ఒక వ్యక్తి 31 కిలోగ్రాముల బంగారు ధాన్యాన్ని తినటం, ఒక గుప్పెడు తాజా కొత్తిమీర వంటి కూరాకును తినటంతో సమానమౌతుంద"ని వారు పేర్కొన్నారు. అలాగే "వండిన 4 కిలో గ్రాముల జన్యుమార్పిడి బంగారు ధాన్యంలోనున్న విటమిన్–ఏ మొత్తం, ఒక క్యారట్ కలిగి వుందని" కూడా వారు పేర్కొన్నారు. బహుశా ఈ కారణం వలననే 2000 సం॥లో కోట్లాదిమంది బాలలను విటమిన్–ఏ లోపాన్నుండి రక్షించటానికి బంగారు ధాన్యాన్ని ఏకైక పరిష్కారమార్గంగా ప్రచారం గావించినవారు, ఈనాడు విటమిన్–ఏ లోపాన్ని నివారించటానికున్న "అనేక మార్గాలలో బంగారు ధాన్యం ఒకటి" అని మాత్రమే పేర్కొంటున్నారు. తిరిగి ఇది ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తుంది. విటమిన్–ఏ లోపాన్ని అధిగమించడానికి నిజంగా మనకు బంగారు ధాన్యం అవసరమా? "కాదు" అనేదే గట్టిగా సమాధానం.

మన దేశాలన్నీ, మన జనాభాకు కావలసినంత ఆహారాన్ని సమృద్ధిగా ఉత్పత్తి చేయగల వనరులు కలిగివున్నాయి. అయితే పేదరికం, సామాజిక అసమానతలు కారణంగా ప్రజలు భద్రతతో కూడిన పౌష్టికాహారాన్ని పొందలేకపోతున్నారు. 'విటమిన్–ఏ' లోపాన్ని బంగారు ధాన్యం ఎన్నటికీ పరిష్కరింపజాలదు. ప్రస్తుత పరిస్థితిని మరింత బలోపేతం మాత్రమే చేయగలదు. అంతేగాక మనదేశాల వ్యవసాయ విభాగాన్ని అదుపుజేసే ప్రయోజనాలు కలిగివున్నవారికి లబ్ధిచేకూర్చేటందుకు, సామ్రాజ్యవాద దేశాల ద్రవ్యపెట్టుబడికి తోడ్పడుతుంది. వాస్తవానికి ఈ పరిస్థితి, జబ్బును నయం చేయవలసిన ఔషధమే, జబ్బుకంటే ప్రమాదకరం' అనే విధంగా పరిణమిస్తోంది.

# పోరాట యోధుడు!

- చిత్తలూరి

దేశానికి అన్నం పెట్టే
మట్టిని చెదరగొట్టాలని చూడకు
నిన్నా మట్టిలోనే కప్పెట్టేయగలడు
మట్టిని బువ్వగ మార్చి
మనిషి పొట్ట నింపెటోడు
కుటిల చట్టాల కోరలతో
ఆ మట్టి వస్త్రానికి
చిరుగులు కొట్టాలని చూడొద్దు
కోరల్ని కత్తిరించే బోనులా తెరుచుకోగలడు

ప్రకృతి వైపరీత్యాలతో నిత్యం యుద్ధం చేసెటోడు
పంట పొలాల్ని ఛిద్రం చేసే
కుట్రలతోనూ తలపడగలడు

ఆకలి చీకట్లావరించిన దేశానికి
మెతుకు దీపం ముట్టిచ్చెటోడు
పచ్చదనాన్ని పైకప్పుగావేసి
దేశానికింత నీడ చెట్టయి నిలిచెటోడు
అన్నం పెట్టేవాడి కంట్లో
సున్నం కొట్టాలని చూడకు

పంటకు పట్టిన చీడపీడల్ని
తొలగించినంత సహజంగానే

ఈ దేశానికి పట్టిన తెగులును
తుదముట్టించగలిగిన
నేర్పరి కూడా అతడు

పంట పొలంలోని కలుపు మొక్కల్ని
పెకలించేయటంలో
ధాన్యానికి పట్టిన పురుగుల్ని ఏరేయటంలో
సిద్ధహస్తుడతడు

తన బతుకు పంటను నాశనం చేసే కలుపుమొక్కల్ని
చూస్తూ ఊరుకుంటాడా
తన అస్తిత్వాన్ని కొరుక్కు తినే
కొత్త పురుగులను ఊరికే వదులుతాడా
పదునైన పనిముట్లతో
పంట చేలో వ్యవసాయం చేయటమే కాదు
రోడ్ల మీద యుద్ధం చేయటం కూడా తెలుసతనికి

అతడు సేద్యగాడే కాదు
పాలన అదుపుతప్పినపుడు
తన ఆకుపచ్చని అస్తిత్వం
మంటగలుస్తున్నపుడు
పోరాట యోధుడు కూడా!

---

ఏ తోడేళ్లు మమ్మల్ని కొండమేకల్నిజేసీ వెంటాడుతున్నాయి?
ఏ పెద్దపులులు మమ్మల్ని అడవిజింకల్ని జేసీ
వేటాడుతున్నాయి?
ఏ గండభేరుండాల రెక్కలల్లార్పుకు
మా కాళ్ల కింద నేల కదలబారుతోంది?
పొగబెట్టి పట్టునుండి తేనేటీగల్ని తరిమినట్టు
పుట్టిపెరిగిన నేలమీంచి మమ్మల్ని తరుముతున్నదెవరు?
తరాల పురిటిజ్ఞాపకాలు తలకెత్తుకొని
ఉబికే దుఃఖాన్ని ఉగ్గబట్టుకొనీ
యీ పచ్చనికొండలమీంచి ఎక్కడికని పొమ్మంటారు?
ప్రాణాలు యిక్కడే విడచి నడచే శవాలమై ..
చితిలోంచి లేచే పొగమేఘాలమై దిక్కులపట్టి
ఎక్కడికని ఎగిరిపొమ్మంటారు ?

+++

ఏడ్చి ఏడ్చీ కంటిచెరువులో యింకిపోయాయి నీళ్లు
చిగురాకుల్లా స్వచ్ఛంగా బతికిన వాళ్లం
ఎండుటాకులై రాలి ధూళిధూసర దేహాలతో
కార్పోరేట్ పెనుగాలికి కొట్టుకుపోతున్నాం
వనాల్లో బతికిన వాళ్లం నాగరిక జనాల్లో ఎలా బతగ్గలం..?
బతుకుదారితప్పిన బెదురు జింకలమై
పట్నం పరాయిపంచన ఎలా గడపగలం..?
తలచుకుంటేనే .. భరించలేని గుండెకోత
తప్పదీ బతుకునదిలో ఎదురీత !

అయినా ఎన్నాళ్లిలా ...
మీరు తరిమిగొడుతుంటే మేం బెదిరిపోయేదిక చాలు
ఎవడెవడోవచ్చి ఎవడెవడికో అప్పనంగా కట్టబెట్టేందుకు
అడవి మీ యబ్బసొత్తు కాదు
మా తరాల మూలవాసుల జన్మహక్కు
మేం అడవిబిడ్డలం.. అల్లూరి వారసులం..
తూరుపుదిక్కున ఎగిసే పోరుమంటలం..
మా అస్తిత్వం పేరు అడవి.. మా తెగువ పేరు ఆయుధం..!!

**- సిరికి స్వామినాయుడు**

(మా అస్తిత్వం పేరు అడవి..! నుండి)

# జీరో బడ్జెట్ వ్యవసాయం - మరో మోసకారీ నాటకం

**వ్యవసాయ** జీవావరణ (ఆగ్రోఎకాలజీ) శాస్త్రంలో భూసారాన్ని పెంచటం, దిగుబడులను అధికం చేయటం, మట్టిలోని సారాన్ని, జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరింపచేయటం, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవటం, రైతుల జీవితాలను మెరుగుపరచటం వంటి అంశాలు వుంటాయి. ఇది ప్రపంచమంతా అనేక పద్ధతుల్లో అనుసరించ బడుతోంది. వాటిలో కొన్ని సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, బయోడైనమిక్స్, జీవిక్ కృషి మొదలైనవి భారతదేశంలో అమలు జరుగుతున్నాయి. వీటిని వ్యవసాయంలో ప్రత్యామ్నాయ పద్ధతులు అనవచ్చు. వీటిలో ప్రతిదానికి కొన్ని అనుకూలతలు, కొన్ని అననుకూలతలు వున్నాయి. ఇప్పటికి భారతదేశంలోని భూములలో ఒక శాతం కంటే తక్కువ భూములలోనే ఇవి అమలవుతున్నాయి. ఉత్పత్తిపై వీటి ప్రభావం, ఆర్థికంగా నిలదొక్కుకోగలగటం, దేశంలోని వివిధ వాతావరణ పరిస్థితులకు తట్టుకోగలగటం, మరీ ముఖ్యంగా ఆహారధాన్యాల్లో స్వయం సమృద్ధిని సాధించటం వంటివాటిని సరిగ్గా అంచనా వేయాలంటే భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో పనిచేసే వ్యవసాయ శాస్త్ర సంస్థల తోడ్పాటుతో వీటిని ప్రోత్సహించాల్సి వుంటుంది.

పరిశ్రమలకు ముడిసరుకులందించేదిగా మార్చబడ్డ ప్రస్తుత వ్యవసాయాన్ని వ్యతిరేకిస్తున్న ఈ ప్రత్యామ్నాయాలు, ఆహార స్వయం సమృద్ధిని సాధించాలంటే రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించటంలో, భూసారాన్ని పరిరక్షించటంలో, జన్యుమార్పిడి విత్తనాలను నిషేధించటంలో, విత్తనాలపై రైతుల హక్కును పునరుద్ధరించటంలో, వ్యవసాయంలో బహుళజాతి కంపెనీల పట్టును తొలగించటంలో కేంద్రీకరించాలి. ఈ లక్ష్యాలతో గనుక మనం ముందుకు వెళ్తే త్వరలోనే మనం ఒక పద్ధతి కాదు, వివిధ రకాల వాతావరణాలకు, వివిధ రకాల భూములకు అనుకూలమైన అనేక పద్ధతులకు, స్థానికంగా వున్న జ్ఞానాన్ని, రైతుల అనుభవాలను జోడించి అభివృద్ధి చేయగలుగుతాం.

దీనికొరకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో, ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నవారితో, రైతాంగ ప్రతినిధులతో కూడిన ఒక సమన్వయ సంస్థ అవసరం. అది సంవత్సరాల తరబడి పోగుబడిన అనుభవాన్ని మదింపు చేసి, వ్యవసాయ భూముల్లో అమలుచేయటానికి అవసరమైన సూచనలను, సమాచారాన్ని అందిస్తుంది. ఇది చాలా మంచి పద్ధతి. ఎందుకంటే ప్రత్యామ్నాయ విధానాల్లో ఒక విధానాన్ని అవలంబిస్తున్న వారు మిగిలినవాటిని తిరస్కరిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని లక్ష్యాలకు మాత్రమే వారు పరిమితమౌతున్నారు. దానివలన అనుభవవాద వైఖరులు ఏర్పడి వారి మధ్య విభేదాలకు కారణ మౌతున్నాయి. సుభాష్‌పాలేకర్ సేంద్రియ వ్యవసాయాన్ని ఎందుకూ పనికిరానిదిగా కొట్టిపడేస్తున్నాడు. అదే సమయంలో అతని లక్ష్యాలలో ఆహార స్వయంసమృద్ధి లేదు.

ఇటీవలికాలంలో జీరో బడ్జెట్ వ్యవసాయం (జడ్‌బిఎన్‌ఎఫ్) పతాక శీర్షికలకెక్కింది. వాస్తవానికి ఈ విధానపు సిద్ధాంతకర్త అయిన సుభాష్ పాలేకర్‌కు పద్మశ్రీ బిరుదు వచ్చిన తర్వాత దానిపట్ల దేశంలో ఆసక్తి నెలకొంది. అప్పటినుండే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానిని ప్రోత్సహిస్తోంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో భారత వ్యవసాయం తిరిగి మూలాల్లోకి వెళ్ళబోతోందని, దేశవ్యాప్తంగా రైతాంగం జీరో బడ్జెట్ వ్యవసాయాన్ని చేపట్టాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. ఈ విధమైన చర్యలు రైతాంగపు ఆదాయాన్ని రెట్టింపు చేస్తాయని ఆమె అన్నారు.

ప్రకృతి వ్యవసాయం దాదాపు 10 సంవత్సరాల నుండి చేస్తున్నారు. జపాను శాస్త్రవేత్త ఫుకుఓకా ప్రథమంగా తన కుటుంబపు పొలంలో ఈ సాగు చేయటం ద్వారా పేరు గడించాడు. సుభాష్ పాలేకర్ అమలుచేస్తున్న జీరోబడ్జెట్ విధానానికి నాలుగు చక్రాలున్నాయి. ఒకటి-బీజామృతం-ఆవుపేడ, ఆవు మూత్రంతో కలగలిసి తయారైన పదార్థంతో విత్తనాలకు లేపనం పూయటం. రెండు - జీవామృతం - ఆవుపేడ, ఆవు మూత్రం, బెల్లం, పప్పుధాన్యాల పిండి, నీరు, మట్టి అన్నింటినీ కలిపి మట్టిలో సూక్ష్మజీవులను పెంపొందించటం, మూడు - ఆచ్ఛాదన - భూమిపై వృక్ష వ్యర్థాలను కప్పి వుంచటం, ఇది నీరు ఆవిరికావటాన్ని తగ్గించి కుళ్ళిన ఎరువవు తుంది. నాలుగు - వాఫస-సూక్ష్మజీవులు పెంపొందటానికి అనువైన వాతావరణం ఏర్పరచటంద్వారా భూమిలోకి గాలి చేరే విధంగా చేయటం. చీడపీడలు నుండి పంటను కాపాడుకోవటానికి ఆవు పేడ, ఆవు మూత్రం, పచ్చిమిర్చి వంటి వాటితో కషాయాలు తయారుచేసి చల్లుతారు.

కేంద్రప్రభుత్వం మిగిలిన అన్ని పద్ధతులను కాదని ఈ జీరో బడ్జెట్ వ్యవసాయాన్నే ఎందుకు ఎంచుకుంది? బహుశ సంస్కృత నామధేయాలు, ఆవు మలమూత్రాలు బిజెపి ప్రభుత్వం చేస్తున్న రాజకీయ చర్చలకు అనువుగా వున్నదని కాబోలు. వీటన్నిటినీ పక్కన పెడితే అసలు ఈ జీరో బడ్జెట్ వ్యవసాయం లాభదాయకమైనదేనా?

పాలేకర్ సూచిస్తున్న విధానాలు హరిత విప్లవం రాక పూర్వం రైతులు అనుసరించినవే. కృష్ణాడెల్టాలో 5 ఎకరాల్లో వరి సాగుచేస్తే 15 బస్తాలు దిగుబడి వచ్చేది పూర్వం. కుటుంబానికి దుక్కి దున్నటానికి రెండు ఎద్దులు, పాడికొరకు మూడు గేదెలు వుండేవి. పొలంలోని వరిగడ్డి ఈ జీవాల మేతకు సరిపోయేది. వాటి మలమూత్రాలతో తడిచిన గడ్డిని ఒక మూలవేస్తే పెంటకుప్ప అయి, అదే తర్వాత పొలానికి ఎరువు అయ్యేది. హరిత విప్లవం వచ్చిన తర్వాత అధిక దిగుబడి వంగడాలు వచ్చి దిగుబడి పెరిగినా, గడ్డి తగ్గిపోయింది. ఎందుకనంటే అధిక దిగుబడి వంగడాలు పొట్టివి. తగ్గిపోయిన గడ్డితో పశువులను సాకటం రైతులకు కష్టంగా మారింది. ఫలితంగా సహజ ఎరువు స్థానంలో రసాయనిక ఎరువులు వచ్చాయి.

ఈ చిన్న వివరణ లక్ష్యం హరిత విప్లవం యొక్క దుష్ఫలితాలను తెలియజేయటం మాత్రమే కాదు. జీరో బడ్జెట్ వ్యవసాయం యొక్క వైఫల్యాలను కూడా తెలియచేస్తుంది. మొదటిది – అసలు పెట్టుబడే పెట్టనవసరం లేదనేది వట్టిమాట. జీవ ఎరువుకు కావలసినవాటిని కొనుగోలు చేయటానికి అయ్యేఖర్చు రసాయనిక ఎరువులపై పెట్టే ఖర్చుకన్నా 40% తక్కువ. రెండవది – ఈ విధానం అధిక దిగుబడి మీద అసలు దృష్టి పెట్టదు; వృద్ధిచెందదు. సహజ వ్యవసాయ విధానానికి అనువైన వంగడాలను అభివృద్ధిచేస్తే తప్ప ఆహారధాన్యాల దిగుబడి వృద్ధి చెందదు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో జీరో బడ్జెట్ వ్యవసాయం అమలవుతున్నచోట కోత కొచ్చిన పంట ఆధారంగా సిఇఇడబ్ల్యు (కౌన్సిల్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్) సంస్థ 2016–17 సంవత్సరాల మధ్య ఒక అధ్యయనాన్ని చేపట్టింది. ఉత్పత్తి ఖర్చులు తగ్గాయని, ఉద్యానవన పంటల్లో దిగుబడిలో వృద్ధి వుందని, ఆహార ధాన్యాల్లో మాత్రం దిగుబడి తగ్గిందని ఆ అధ్యయనం తేల్చింది. రైతు సాధికార సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో ఈ వ్యవసాయ పద్ధతి 2015లో మొదలయింది. పరిస్థితిని అంచనా వెయ్యటానికి ఇది చాలా తక్కువకాలం. మరిన్ని సంవత్సరాలు గడిస్తే ఈ విధానంవల్ల భూసారం పెరిగి పంట దిగుబడులు పెరగవచ్చు. కానీ పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహారధాన్యాలు అందించాలంటే జీరోబడ్జెట్ వ్యవసాయ పద్ధతి అందుబాటులోనున్న శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించుకుని దిగుబడిని అధికంచేసే, వాతావరణ పరిస్థితులకు అనుకూలించే విత్తనాలను అభివృద్ధి చేసుకోవలసి వుంది. అయితే, ఇవి ఎంతమాత్రమూ రసాయనక అధిక దిగుబడి వంగడాలు కావు, జన్యుమార్పిడి విత్తనాలు కావు.

ప్రత్నామ్నాయ వ్యవసాయ పద్ధతుల్లో ఎదురయ్యే ఇబ్బందు లన్నింటినీ పట్టుదల, చిత్తశుద్ధి వుంటే ప్రయోగాత్మకంగా అధిగమించవచ్చు. కానీ రైతాంగంలో వున్న అనేక దొంతరల మాటేమిటి? 86 శాతం రైతులు ఒక హెక్టారు కన్నా తక్కువ భూమి కలిగినవారే. పేదరికంతో వారు తరచుగా వ్యవసాయ కూలీలుగా పనిచేస్తారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సంక్షోభాలకు బలవుతున్నారు. ఈ రైతులకు, ఈ ప్రత్నామ్నాయ పద్ధతులేమైనా అందుబాటులో వున్నాయా?

81 దేశాలకు చెందిన 182 రైతుసంస్థల కలయికతో ఏర్పడిన 'లా–వియా–క్యాంపేసినా' చేపట్టిన అధ్యయనం తేల్చిందేమంటే కర్నాటకలో పాలేకర్ జీరోబడ్జెట్ వ్యవసాయాన్ని అనుసరిస్తున్న వారందరూ రెండు నుండి నాలుగు హెక్టార్లు భూమి కలిగిన మధ్యతరగతి రైతులే. ఈ విధానం ద్వారా వచ్చిన ఉత్పత్తికి మార్కెట్ సమస్య ప్రతిబంధకంగా వుందని ఇదే అధ్యయనం చెప్పింది. జీరో బడ్జెట్ వ్యవసాయాన్ని అనుసరిస్తున్నవారు, తిరిగి లాభదాయకంగా వుంటుందని పాత ఉత్పత్తి వ్యయం అధికంగా వుండే సాగుకే మళ్ళుతున్నారన్న అనేక సంఘటనలు మీడియా ద్వారా వెల్లడవుతున్నాయి.

రైతు సాధికార సంస్థ ద్వారా అమలు జరపబడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీరోబడ్జెట్ వ్యవసాయాన్ని పరిశీలించినా ఇదే బోధపడుతుంది. ఈ విధానం ద్వారా మంచి ఫలితాలు రాబట్టినవారి కధనాలు చూస్తే, వారంతా మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతికి చెందిన రైతులు, వ్యవసాయేతర ఆదాయం కలిగిన వాళ్ళు. ఒక రైతు తనకున్న 5 ఎకరాలలో 64 రకాల పండ్ల చెట్లను పెంచాడు. తన కుటుంబం, తన స్నేహితుల కుటుంబాల కోసం. ఇంకా అదనంగా 2 ఎకరాలు కౌలుకి తీసుకుని అందులో వరి సాగుచేస్తున్నాడు. ఈ ప్రత్నామ్నాయ పద్ధతులు చిన్నరైతులు ఉపయోగించుకోలేనంత కాలం వ్యవసాయరంగంలో ఇవి చిన్నచిన్న మార్పులుగానే వుండిపోతాయి.

ఎటువంటి ఆధారం, సమాచారం లేకుండానే ఆహార భద్రత దృష్ట్యా భారత వ్యవసాయరంగానికి జన్యుమార్పిడి పదార్ధాలు అవసరమని నీతిఆయోగ్ తన వ్యవసాయ విధానంలో పేర్కొంది. విశేషమేమంటే అది జీరోబడ్జెట్ వ్యవసాయానికి మద్దతు తెలుపుతోంది. 'ది వైర్' పత్రికలో వచ్చిన కధనం ప్రకారం ఈ ఫిబ్రవరిలో నీతిఆయోగ్ భారత వ్యవసాయ పరిశోధనామండలి (ఐసిఎఆర్)ని, ఎన్ఎఎఆర్ఎం (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజిమెంట్)ని ప్రకృతి వ్యవసాయాన్ని అధ్యయనం చేయమని కోరింది. నివేదిక ఇవ్వటానికి రెండు సంవత్సరాల కాలం కావాలని శాస్త్రజ్ఞులు కోరగా, ఆరు నెలల్లోనే అధ్యయనం పూర్తికావాలని ఒత్తిడి చేసింది. ప్రకృతి వ్యవసాయం యొక్క ఫలితాలను శాస్త్రీయంగా అంచనా వెయ్యటానికి అంత తక్కువ సమయం ఏమాత్రం సరిపోదు. కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ అధ్యయనం ఒక పంట కాలంలో కొనసాగింది. 295 మంది జీరోబడ్జెట్ వ్యవసాయం చేసే రైతులను, 170 మంది మామూలు వ్యవసాయం చేసేవారిని ఈ అధ్యయనంలో ఎంచు కున్నారు. నిరర్ధకమైన ఈ కృషిని పక్కనబెడితే భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసిఎఆర్), ఇంకా వివిధ యూనివర్శిటీలు ఈ పద్ధతులను అర్ధం చేసుకోవటానికి, వివిధ వాతావరణ పరిస్థితులున్న వ్యవసాయిక ప్రాంతాల్లో రైతులకు అవి ఎంతవరకు ఉపయోగ పడతాయనే దానిపై పలు అధ్యయనాలు నిర్వహించాయి. కానీ ఏ ఒక్కటీ కూడా ఇంతవరకు ఏ ఖచ్చితమైన నిర్ధారణకు రాలేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు జీరోబడ్జెట్ విధానం 2015లో ప్రారంభమైంది. రెండేళ్ళలో 1,50,000 ఎకరాల్లో, 1,38,000 మంది రైతులు ఈ విధానానికి మళ్ళారు. మరి రెండేళ్ళలో ఇది 13 జిల్లాల్లో

3015 గ్రామాల్లో 5,04,000 ఎకరాలకు, 5,23,000 మంది రైతులకు విస్తరిస్తుంది. వ్యవసాయ విస్తరణ సేవలను నిర్వీర్యంచేసి రైతుమిత్ర బృందాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటుగా స్వయం సహాయక బృందాలనుండి జీరోబడ్జెట్ పథకానికి సభ్యులను నమోదు చేసుకున్నారు. ఈ పథకంలో చేరినవారిలో ఎంతమంది బయటికి వెళ్ళిపోయారన్న సమాచారం అధికారికంగా అందుబాటులో లేదు. కేంద్రప్రభుత్వ పథకాలైన రాష్ట్రీయ కృషి వికాసయోజన, పరంపరాగత కృషి వికాస యోజనల ద్వారా ఈ కార్యక్రమానికి ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. 2018 నవంబరు నెలాఖరు నాటికి రైతు సాధికార సంస్థ 290 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. 10 సం॥లలో అంటే 2024 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 6 కోట్ల మంది రైతులను ఈ జీరోబడ్జెట్ విధానానికి మళ్ళించి, దానిని సాధారణీకరించటం రైతు సాధికార సంస్థ లక్ష్యం. 17000 కోట్ల రూ॥లు దీనికొరకు ఖర్చవుతుందని అంచనా వేయబడింది.

ఈ ఆర్థిక వనరులను ఎలా సమీకరిస్తారు? జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో తాము సంప్రదింపులు జరుపుతున్నామని, UNEP, FAO, ICRAF, SIFF,CIRAD, BNP పరిబాస్ బ్యాంక్‌లు తమకు సహకరిస్తున్నాయని రైతు సాధికార సంస్థ చెప్పుకుంది. ఆయా సంస్థలు ఏవిధంగా సహకరిస్తున్నాయన్నది స్పష్టం చేయలేదు. వాటికి సంబంధించిన అన్ని అవగాహనా ఒప్పంద పత్రాలనూ తమ వెబ్‌సైట్‌లో వుంచామని పేర్కొంది, కానీ ఆ వెబ్‌సైట్‌లో అవేవీ లేవు.

రైతు సాధికార సంస్థకు ఆర్థిక వనరులు ఎక్కడినుండి వస్తున్నాయి, ఫైనాన్సు చేస్తున్న వారి ఉద్దేశ్యాలేమిటంటూ BNP పరిబాస్ బ్యాంకును, మిలిండా అండ్ బిల్‌గేట్స్ ఫౌండేషన్‌ను పేర్కొంటూ 24 మంది ప్రఖ్యాత పర్యావరణవేత్తలు రైతు సాధికార సంస్థకు ఉత్తరం వ్రాయగా అప్పటికి వాటితో తనకు ఏవిధమైన సంబంధమూ లేదని రైతు సాధికార సంస్థ ఉపాధ్యక్షుడు తోసిపుచ్చాడు. తమ మౌలిక విధానాలను అంగీకరించిన వారి సహకారం తీసుకోవటానికి రైతుసాధికార సంస్థ సిద్ధంగా వుందని పేర్కొన్నాడు. BNP పరిబాస్ బ్యాంకును తమ ఆర్థిక సలహాదారుగా స్వీకరించే క్రమంలో రైతుసాధికారసంస్థ వున్నదని కూడా ఆయన పేర్కొన్నాడు.

ఈ ఆరు మిలాఖత్తులలో కీలకమైనది ఎస్ఐఎఫ్ఎఫ్‌తో జరిగిన ఒప్పందం. ఇది వాతావరణ పరిస్థితులను చక్కబరచటానికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పెట్టుబడులను సమన్వయ పరిచే లక్ష్యంతో ఏర్పడిన సంస్థ. దీనికి UNEP, ICRAF, CRAF, CIRAD, BNP పరిబాస్ బ్యాంకులు ఆర్థిక వనరులను సమకూర్చుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో BNP పరిబాస్ బ్యాంకు బ్రాంచి కూడా వుంది. వీటిలో చివర పేర్కొన్న రెండు కంపెనీలు ఫ్రాన్సు దేశానికి చెందినవి. ఫ్రాన్సు ప్రభుత్వము, ప్రైవేటు సంస్థలు వీటికి ఆర్థిక వనరులందిస్తున్నాయి.

ప్రఖ్యాత పర్యావరణవేత్తలు వెలిబుచ్చు తున్న ఆందోళనలను తోసిరాజంటూ, ప్రపంచ ద్రవ్య సంస్థలతో మిలాఖత్తులో వున్న వాస్తవాలను రైతు సాధికార సంస్థ దాచిపెడుతోంది. ఇక్కడే అనేక భయాలు ఉత్పన్నమౌతున్నాయి. ప్రపంచ పెట్టుబడిశక్తులు తమ ప్రయోజనాలకనుగుణంగా జీరోబడ్జెట్ వ్యవసాయానికి రూపకల్పన చేస్తున్నాయా? అంతర్జాతీయ ఆర్థిక వనరులతో ప్రభుత్వం చేపట్టిన జీరోబడ్జెట్ వ్యవసాయం, వ్యవసాయ బహుళజాతి కంపెనీల కాంట్రాక్టు వ్యవసాయానికి మార్గాన్ని సుగమం చేయనుందా?

> **పరిశ్రమలకు ముడిసరుకులందించేదిగా మార్చబడ్డ ప్రస్తుత వ్యవసాయాన్ని వ్యతిరేకిస్తున్న ఈ ప్రత్యామ్నాయాలు, ఆహార స్వయం సమృద్ధిని సాధించాలంటే రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించటంలో, భూసారాన్ని పరిరక్షించటంలో, జన్యుమార్పిడి విత్తనాలను నిషేధించటంలో, విత్తనాలపై రైతుల హక్కును పునరుద్ధ రించటంలో, వ్యవసాయంలో బహుళజాతి కంపెనీల పట్టును తొలగించటంలో కేంద్రీకరించాలి.**

ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులను ఎప్పుడైనా సరే, అమలుపరచదగినవిగా శాస్త్రీయంగా నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే ప్రోత్సహించాలి. దీనికి బదులుగా కేంద్ర ప్రభుత్వం శాస్త్రీయంగా ఎటువంటి విశ్లేషణలతో కూడిన సమాచారం లేని సుభాష్ పాలేకర్– జీరోబడ్జెట్ వ్యవసాయాన్ని, వ్యవసాయరంగంలో ఎదురవుతున్న ఆటంకాలన్నింటికి ప్రత్యామ్నాయంగా ఒక తారక మంత్రంగా ప్రోత్సహిస్తోంది. విదేశీ బ్యాంకుల నుండి, విదేశీ సంస్థల నుండి భారీగా వచ్చిపడుతున్న నిధులు, అందులో కొన్ని వాతావరణ బాండుల ద్వారా వస్తున్నవి. ఈ కార్యక్రమం వెనుక వున్న అసలు ఉద్దేశ్యాలేమిటనే సందేహాలను కల్గిస్తున్నాయి. ఎందుకంటే, జీరోబడ్జెట్ వ్యవసాయ మౌలిక పద్ధతులు ప్రపంచ పెట్టుబడి ప్రయోజనాలకు భిన్నమైనవి కాబట్టి.

జీరోబడ్జెట్ వ్యవసాయం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని ధనవంతులైన రైతులకు ఊరట కల్గిస్తూ, వారికో ప్రత్యామ్నాయ పద్ధతిని చూపిస్తూ, బిజెపి ప్రభుత్వం వారికోసం ఏదోచేస్తున్నదనే భ్రమలో వారిని వుంచుతోంది. అదే సమయంలో వ్యవసాయరంగంలో తిష్ట వేసుకుని కూర్చున్న సంక్షోభాన్ని పరిష్కరించటంలో తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి ప్రజల దృష్టిని, రైతుల దృష్టిని మళ్ళించటానికే ఈ జీరోబడ్జెట్ వ్యవసాయాన్ని ముందుకు తీసుకువచ్చింది.









# వలస పాట

- ఆదేశ్ రవి

పిల్లజెల్లా ఇంటికాడ ఎట్లవున్రో
నా ముసలితల్లి ఏమిపెట్టి సాదుతుందో

పూటపూటా చేసుకొని బతికెటోల్లం
పూటగడువ ఇంత దూరం ఒచ్చినోల్లం

దేశమేమో గొప్పదాయే
మా బతుకులేమో సిన్నవాయే
మాయదారి రోగమొచ్చి
మా బతుకు మీద మన్నుబోసే
ఏమిబతుకు ఏమిబతుకు చెడ్డబతుకు చెడ్డబతుకు
చెడ్డబతుకు చెడ్డబతుకు చెడ్డబతుకు

పేదరోగం కంటె పెద్ద రోగముందా
అయినవాళ్ళ కంటె పెద్ద అండవుందా
కష్టకాలం ఇంటికాడ ఉంట సారూ
కలిసిమెలిసి కలోగంజో తాగెటోల్లం

పిల్లగాళ్ళు కన్నులల్ల ఇడువకుండా మెదులబట్టే
ఇంటిదాని దుక్కమేమో ఆగకుండా తరుమవట్టే
ఏమిజేతు ఏమిజేతు ఏమిజేతు ఏమిజేతు
ఏమిజేతు ఏమిజేతు ఏమిజేతు

బస్సులొద్దు బండ్లు ఒద్దు అయ్య సారూ
ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ
బస్సులొద్దు బండ్లు ఒద్దు అయ్య సారూ
ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ

ఇంటికాడ పిల్లజెల్లా ఎట్లవున్రో
నా ముసలితల్లి ఏమిపెట్టి సాదుతుందో
ఇంటికాడ పిల్లజెల్లా ఎట్లవున్రో
నా ముసలితల్లి ఏమిపెట్టి సాదుతుందో

ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ
ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ

# కరోనా - పాలకుల విధానాలు - వలస కూలీల వెతలు

**కరోనా** వ్యాధి 2019 సంవత్సరం చివర్లో ప్రారంభమై ప్రపంచాన్ని అంతటినీ చుట్టుముట్టింది.

చైనాలోని ఊహాన్‌లో బయటపడిన ఈ వ్యాధి పుట్టుక గురించి అమెరికా తదితర దేశాలు చైనాను నిందించాయి. కోవిడ్-19గా పిలుస్తున్న ఈ రకపు కరోనా వైరస్ కృత్రిమంగా తయారు కాబడినదా? లేక వైరస్‌లు తమలో తాము మార్పు చెందటం (మ్యుటేషన్) వల్ల ఇలా తయారైనదా? లేక ఒక జీవాయుధంగా తయారు చేయాలనుకొని పొరపాటున బయటకు వచ్చిందా? అనే చర్చ, పరస్పర ఆరోపణలు అమెరికా, చైనాల మధ్య జరుగుతూనే వున్నాయి.

## సామ్రాజ్యవాద పెట్టుబడిదారి వ్యవస్థే ఈ ముప్పులకు కారణం

ప్రపంచ వ్యాపితంగా లక్షలమంది మరణాలకు కారణం అయిన స్వైన్ ఫ్లూ, సార్స్, ఎబోలా, ఎయిడ్స్ వంటి కొత్త రూపం తీసుకొన్న ప్రాణాంతకమైన వ్యాధులు పుట్టాయి. 2011 నుండి 18 వరకూ సుమారు 172 దేశాలలో 1,483 విస్తారమైన అంటువ్యాధులు వచ్చినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. దీనికి ప్రధానంగా కొన్ని కారణాలు ఉన్నాయి.

**1.** శాకాహార, మాంసాహార ఆహార పదార్థాల ఉత్పాదనలను ప్రజలు తాము వినియోగించుకోగా మిగిలినది మార్కెట్‌కు అమ్మే జీవనాధార ఉత్పత్తి విధానం ఒకప్పుడు ప్రధానంగా ఉండేది. పెట్టుబడిదారి విధానం ప్రపంచ ఉత్పత్తి విధానంపై పై చేయి సాధించిన తర్వాత లాభం కోసమే ఆహార పదార్థాలను ఉత్పత్తిచేసే పారిశ్రామిక ఆహార ఉత్పత్తి విధానం అమలులోకి వచ్చింది. దీనిలో భాగమే పారిశ్రామిక మాంస ఉత్పత్తి ప్రక్రియ. ఇప్పుడు ఎక్కువ లాభాలు రావాలంటే మాంసాన్నిచ్చే కోళ్ళు, పందులు తక్కువ కాలంలో పెరిగి, బలవాలి. దీని కోసం ప్రాణుల జీవన క్రియలలో, జన్యు నిర్మాణాలలో ఎన్నో మార్పులు జరిపే బయో ఇంజనీరింగ్, జీవ సాంకేతికతలు అభివృద్ధి అయ్యాయి. జీవ సాంకేతికశాస్త్రాన్ని లాభం కోసం వక్రీకరించిన సామ్రాజ్యవాదం ఈ రకపు ఫారం జంతువుల పెంపకంలో తక్కువ రోగ నిరోధక వ్యవస్థ కలిగి, ఎక్కువ మాంసం కల జీవాలను అభివృద్ధి చేసింది. కోళ్ళు, చేపలు, పందులు ఇలా మామూలుగా గ్రామాలలో ఉండే దేశవాళి జీవులు చాలా ఎక్కువ రోగ నిరోధక వ్యవస్థ కలిగి ఉంటాయని అందరికీ తెలిసిందే. అదే జీవులు ఫారం ఉత్పత్తులుగా మారిన తర్వాత ఎంత సున్నితమైనవిగా ఉంటాయో వీటితో పరిచయం అయినవారందరికీ తెలుసు. స్వైన్ ఫ్లూ అనే ప్రమాదకర వ్యాధి ఇలాంటి జన్యు మార్పిడి జరిగిన పందులుండే ఫారం నుంచే వ్యాప్తి చెందింది. గత వైరస్‌ల పుట్టుక కూడా ఇదే విధంగా సంభవించింది. కనుక, కోవిడ్-19 పుట్టుక, వ్యాప్తికి కూడా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల అధిక లాభాపేక్ష, దోపిడీ విధానాలే కారణం.

**2.** మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడిదారీ వ్యవస్థ అదనపు లాభం కోసం ఇటు కార్మికులను దోపిడీ చేయడమే కాక అటు లాభంకోసం ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతోంది. ఫలితంగా విస్తారమైన జీవ వైవిధ్యం కల సహజారణ్యాలు నరికి వేయబడి, వ్యాపార వనాలు ఏర్పడుతున్నాయి. సహజ అడవులు నాశనం అవుతున్న ఫలితంగా అడవులలో తిరగవలసిన పులులూ, చిరుతలు, తదితర వన్య మృగాలు పట్టణాలలోకి ప్రవేశిస్తున్నాయి. అదే విధంగా ప్రకృతి విధ్వంసం ఫలితంగా ప్రతి జీవి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ తమలో తాము మార్పు (ఉత్పరివర్తనాలు, మ్యుటేషన్) చెందుతున్నాయి. దీనికీ సామ్రజ్యవాద పెట్టుబడిదారి వ్యవస్థే కారణం.

**3.** సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం, ఆక్రమణ. అమెరికా ఖండాన్ని ఆక్రమించుకొనే క్రమంలో స్థానిక ఆదివాసులను చంపి, వారి ప్రాంతాలను ఆక్రమించేందుకు యూరప్‌లో ప్లేగు బాధితులు వాడిన దుప్పట్లను వారి జనావాసాల దగ్గర పడవేసి ప్లేగు వ్యాధిని వ్యాపింప చేసిన చరిత్ర అమెరికాది. భారత దేశంలో సామ్రాజ్యవాద వలస దోపిడీ ఫలితంగానే బొంబాయిలో అంతకుముందులేని ప్లేగు వ్యాధి బయలుదేరి 1896-97లో లక్షలాదిమందిని బలితీసుకొంది. 1917-18లో ప్రబలిన స్పానిష్ ఫ్లూ మన దేశంలో 2 కోట్లమందికి సోకింది. కనుక ఆకలి, కరవు, వలసలు, అంటువ్యాధులు, జీవ, పర్యావరణ విధ్వంసం అన్నీ సామ్రాజ్యవాదం నడిపిస్తున్న ఈ దోపిడీ వ్యవస్థ ఉత్పాదితాలు.

## కోవిడ్ 19తో పోరాటం - అమెరికా అడుగుజాడలలో భారత పాలకులు

చైనాలోని ఊహాన్‌లో మొదటి కరోనా కేసు 2019 డిసెంబరు 31న బయటపడ్డట్టు చైనా ప్రకటించిన నెల రోజులకు అంటే 2020 జనవరి 30న మన దేశంలో మొదటి కేసు నమోదు అయింది. అప్పటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్త అత్యవసర స్థితిని ప్రకటించింది. ఫిబ్రవరి 4వ తేదీనే జాతీయ విపత్తు నివారణ సంస్థ కరోనా గురించి తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. కానీ కేంద్రంలోని బి.జే.పి పాలకులు 2020 ఫిబ్రవరి 24న 'నమస్తే




ట్రంప్' పేరుతో అమెరికా అధ్యక్షుడి ఆహ్వానం కోసం, ప్రపంచవ్యాపిత ప్రచారం కోసం విదేశాల నుంచి వచ్చేవారిని యధేచ్ఛగా రానిచ్చారు. అప్పటికి మనదేశంలో మూడు విమానాశ్రయాలలోనే థర్మల్ స్క్రీనింగ్ జరిపారు. విదేశాల నుంచి ప్రయాణాలు నిషేధించే నాటికి వేలమంది ఎలాంటి సరైన పరీక్షలు, వేరుపరచి ఉంచడాలు (క్వారంటైన్) లేకుండానే దేశంలో యధేచ్ఛగా సంచరించారు. మార్చి 23 వరకూ, అంటే మధ్యప్రదేశ్‌లో బి.జే.పి అధికారం దక్కేందుకు కావల్సిన రాజకీయ సమీకరణాలు పూర్తయ్యే వరకూ దేశం లోపలా, బయట విమాన ప్రయాణాలు జరుగనిచ్చారు.

దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నపుడు ముందు జాగ్రత్తగా పరీక్షలు జరిపే ప్రయోగశాలలు, రక్షణ తొడుగులు, అత్యవసర వైద్య సేవలకు ఏర్పాట్లు, వెంటిలేటర్‌లూ సరిపడినన్ని సమకూర్చుకొని ఉండి ఉండాలి. దేశంలో కరోనాపై పోరాటంలో ముందు పీఠిన నిలబడిన వైద్య, పారిశుద్ధ్య, తదితర సిబ్బందికి కావాల్సిన రక్షణ తొడుగుల (పి.పి.ఇ) ఉత్పత్తికి చర్యలు తీసుకోక పోగా మార్చి 19 వరకూ వాటి తయారికి కావాల్సిన ముడిసరుకులను యధేచ్ఛగా విదేశాలకు ఎగుమతి కానిచ్చారు. రక్షణ తొడుగుల కొరతతో ఎందరో వైద్య సిబ్బంది కరోనా బారినపడి మరణించారు. కొన్ని చోట్ల డాక్టర్లు, నర్సులు సమ్మెలు చేసారు. వెంటిలేటర్‌ల విషయంలో కూడా ఇదే పరిస్థితి. దేశంలో కనీసం 10 లక్షల వెంటిలేటర్‌లు అవసరమౌతాయని అంచనా ఉండగా, ఇటలీ లాంటి అభివృద్ధి చెందిన దేశాలలోనే వెంటిలేటర్‌లకు కొరత ఏర్పడి ముసలివార్ని చనిపోవడానికి వదలివేస్తున్నప్పుడు, మార్చి 19 వరకూ దేశం నుంచి వెంటిలేటర్‌ల ఎగుమతులను కొనసాగనిచ్చారు. చివరకు మార్చి 23 వరకూ అంటే అప్పటికి దేశంలో 471 కరోనా కేసులు నిర్ధారణ జరిగిన తరువాత కూడా దేశీయ రోగ నిర్ధారణ పరీక్షల కిట్‌ల తయారీ ఎలా ఉండాలీ అన్న దానిని నిర్ధారించలేదు, ఆదేశించలేదు. అప్పటికి కరోనా ప్రపంచంలో విలయ తాండవం చేస్తోంది.

నిజానికి భారత పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా ప్రజారోగ్య వ్యవస్థను క్రమబద్ధంగా నిర్వీర్యం చేసారు. వైద్యరంగ కార్పోరేటీకరణ చివరకు ఎక్కడకు చేరిందంటే గొప్ప వైద్య సేవల కేంద్రాలుగా పేరుగాంచిన పెద్ద ఆసుపత్రులన్నీ వాటిని ప్రారంభించిన వారి చేతులలో నుంచి బహుళజాతి సంస్థల చేతుల్లోకి వెళ్ళాయి. బడ్జెట్‌లో రక్షణ రంగానికి 2 లక్షల 82 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం వైద్యరంగానికి 63 వేల కోట్ల రూపాయిలే కేటాయించింది. ఈ విధంగా యుద్ధం ప్రారంభించటానికి ముందే ఓటమి నిశ్చయం అయినట్లు కరోనా దేశంలో ప్రవేశిస్తున్న సమయంలో మార్చి 24 నాటికి, అంటే లాక్‌డౌన్ ప్రకటించే నాటికి ప్రభుత్వాల పరిస్థితి ఇలా ఉంది.

## లాక్‌డౌన్ ప్రకటన – వలసకూలీల దురవస్థలు

వీటన్నిటినీ సరిచేసుకోకుండానే, కరోనా గురించి ప్రజలను విజ్ఞానవంతం,భాగస్వాములను చేసుకొనే ప్రయత్నం చేయకుండానే ఏకపక్షంగా ప్రధాని మోడీ మార్చి 24న కేవలం నాలుగుగంటల వ్యవధి నిచ్చి దేశంలో లాక్‌డౌన్ విధించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ మహా భారత యుద్ధం 18 రోజులు జరిగింది. మనమూ 18 రోజులలో కరోనాపై విజయం సాధిస్తామని చెప్పారు. అమెరికాలో ట్రంపు కూడా 'కరోనా అమెరికాను ఏమీ చేయదని, ఎండా కాలం రాగానే పోతుందని' చెప్పాడు. ఫలితంగా కరోనా మరణాల విషాదంలో అమెరికా నిజంగా అగ్రస్థానంలోనే వుంది. చైనా, తైవాన్, దక్షిణ కొరియా, జర్మని, ఇతర తూర్పు యూరప్ దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలను అందుకొని విస్తృత పరీక్షలు, రోగ గుర్తింపు, నిర్ధారణ, వేరుపరచడం, వైద్యం అందించడం వంటి వాటిని లాక్‌డౌన్‌లకు జోడించి క్రమబద్ధంగా కరోనా వ్యాప్తిని కట్టడి చేశాయి.

భారతదేశం కేవలం లాక్‌డౌన్‌లను ప్రకటించి, పొడిగిస్తూ వచ్చింది కానీ కరోనాను సమర్ధవంతంగా గుర్తించి, నిరోధించే చర్యలు చేపట్టలేదు. పైగా కరోనాకి మతానికి ముడిపెట్టి మత దురహంకారం రెచ్చగొట్టారు. సామాన్య ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ లాక్‌డౌన్‌లు దేశంలో కోట్లాది మంది కష్టజీవులు, వారి భార్యా, బిడ్డలతో సహా కాలినడకన, సైకిళ్ళపైనా, చివరకు సముద్రంలో బోట్లు వేసుకొని తమతమ స్వంత ఊళ్ళకు వెళ్ళాల్సిన దుస్థితిలో పడ్డారు. సుప్రీంకోర్టు సైతం నడచి వెళ్ళే వారిని ఆపలేనని చెప్పింది. ఇదంతా సోషల్ మీడియా కట్టుకథ అని ప్రభుత్వం అబద్ధాలు చెప్పింది. మొట్టమొదట సూరత్ వలస కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఎందుకంటే సూరత్‌లో 1896 నాటి ప్లేగువ్యాధి వారికి గుర్తే వుంది. భయాందోళనలకు గురైవారు తమ ఊర్లకు వెళతామని కదిలితే లాక్‌డౌన్ ఉల్లంఘన పేరుతో వారిని ప్రభుత్వం అణచివేసింది.

దేశవ్యాపితంగా కార్మికుల, కూలీల జీవనోపాధిపై తీవ్రమైన వేటు పడింది. పనీలేక, వేతనంలేక, కనీసం అప్పు ఇచ్చే దిక్కులేక, అక్కడే పస్తులతో చావటం కంటే తమ స్వంత వూరు చేరుకుందామని సంకల్పించుకున్నారు. దేశవ్యాపితంగా అన్ని మూలల నుండీ కోట్లాదిమంది శ్రామికులు, వేలాది కిలోమీటర్ల దూరం కాలినడకన బయలుదేరారు. శ్రామికులను ఆపి, తగిన భరోసా కల్పించని పాలకులు, వారి మానాన వారిని వదలివేశారు.

కరోనా విలయాన్ని మించిన విషాదాన్ని దేశం ఈ కాలంలో చూసింది. ఎండకు నడవలేక రోడ్లపైనే కుప్పకూలిపోయారెందరో.

రైలుపట్టాల వెంట నడుస్తూ రైళ్ళు మీదుగా వెళ్ళి కన్నుమూశారెందరో. నెత్తురోడుతున్న పాదాలతో అనంత యాత్రను సాగించారు.

ప్రసారమాధ్యమాల ద్వారా, ప్రధానంగా సామాజిక మాధ్యమాల ద్వారా శ్రామికుల ఈ నడక ప్రవాహాన్ని దేశ ప్రజానీకం ఆశ్చర్యంగా, ఆవేదనతో చూశారు. మానవతావాదులు, ప్రజాసంఘాలు, ఉదారవాదులు ఎందరో ముందుకు వచ్చి కుల, మతాలకు అతీతంగా కాలినడకన సాగుతున్నవారికి అనేక ప్రదేశాల్లో విడిది ఏర్పాటు చేశారు. ఆహారం, మంచినీరు, చిన్నపిల్లలకు పాలు, బ్రెడ్, పండ్లు, చెప్పులు,.... ఇలా తమకు తోచిన రీతిలో సహాయ సహకారా లందజేసి ఎందరో ప్రాణాలు కోల్పోకుండా నిలపగలిగారు. కవులు, కళాకారులు తమ రచనల ద్వారా ఈ దుస్థితికి అద్దంపట్టారు. 'దున్నపోతుపై వాన కురిసిన' చందాన నింపాదిగా కదలిన ప్రభుత్వాలు మొక్కుబడి చర్యలు చేపట్టాయి. హఠాత్తుగా సామాన్య ప్రజల, శ్రామికుల సమస్త జీవన కార్యకలాపాలను స్థంభింపచేసిన పాలకులు, వారిపట్ల ఎంతటి బాధ్యతారాహిత్యంతో వుంటారో, ఎంతటి నిరంకుశంగా వ్యవహరిస్తారో ఈ సందర్భంగా స్పష్టంగా మరోమారు వెల్లడైంది.

## ఆత్మనిర్భర భారత అభియాన్ - పాలకుల దోపిడీ ఎజెండా స్వరూపం

కరోనా దేశంలో కనపడగానే ప్రైవేటు కార్పోరేట్‌రంగం, దేశం తీవ్ర ఆర్థికమాంద్యంలోకి పోతుందని, కంపెనీలు తీవ్రంగా నష్ట పోయాయని ప్రకటించడం ప్రారంభించారు. ఇంతకాలం దేశ సంపదలను, శ్రమశక్తులను కొల్లగొట్టి అపర కుబేరులైన వారంతా తమ "నష్టాలకు" ప్రభుత్వం బాధ్యత వహించాలన్నట్లు వ్యవహరిస్తే ఈ ఏప్రియల్ నెలలోనే నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా వంటివారు 50 మంది ఎగ్గొట్టిన అప్పులు 68 వేల 600 కోట్ల రూపాయిలను బ్యాంకులు రద్దు చేసాయి. దేశంలో అసలు నష్టపోయిన రైతాంగం, రోజువారి శ్రమజీవులూ, చిన్న చిన్న పరిశ్రమల వారు, దుకాణదారులు, వీరికి ఈ ఆత్మ నిర్భర ప్యాకేజిలో దక్కింది నామమాత్రమే. ఇలాంటి ఆకర్షణీయ ప్రకటనల మాటున కేంద్రం రక్షణ, అంతరిక్షం, తదితర కీలక రంగాలనన్నిటినీ విదేశీ, స్వదేశీ బడా ప్రైవేటు కంపెనీలకు అప్పగించే చర్యలు తీసుకొంది. ప్రైవేట్ దళారి దోపిడీ శక్తులకు దేశ భద్రతను, సంపదలను కట్టబెట్టటానికి ప్రభుత్వం ఈ కరోనాను వాడుకొంది. మరోవైపున పెట్రోలు, డీజిలుపై ఎక్సైజు సుంకాన్ని మార్చి 4న లీటరుకి 3 రూ చొప్పున, మరల మే 5న ప్రతి లీటరు పెట్రోలుపై 10 రూ, ప్రతి లీటరు డీజిలుపై 13 రూ పెంచి తద్వారా రెండు లక్షల కోట్లు ప్రజల నుంచి తిరిగి వసూలు చేసింది.

అక్కడితో ఆగక కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల జీతాలలో కోత విధించాయి, కార్మిక చట్టాలకు సవరణలు ప్రకటించి 12 గంటల పని దినాలను నిర్ణయించాయి. అదీ చికాగో కార్మికులు 8 గంటల పనిదినం కోసం పోరాడిన మే నెలలో. బ్యాంకు ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నా బ్యాంకుల విలీన ప్రక్రియను కొనసాగించారు.

**ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవాలను నిర్వహించి నిలబెట్టుకొన్న దేశాలలో కరోనా నియంత్రణలో ఉంది. అమెరికా కార్పొరేటు వైద్య విధానాలకు భిన్నంగా ప్రజారోగ్యంలో క్యూబా గొప్ప ఫలితాలు సాధించి చూపింది. అక్కడ ప్రతి వెయ్యి మంది ప్రజలకు పదిమంది డాక్టర్లు ఉంటే మన దేశంలో 14 వేలమందికి ఒక డాక్టర్ ఉన్నారు. ఆ దేశం కరోనాను నియంత్రించడమేగాక ఇతర కరోనా వంటి అంటురోగబాధిత దేశాలకి వైద్య బృందాలను పంపింది.**

ఇంతేగాక కరోనా కోరలు సాచిన ఈ కాలంలోనే విదేశీ, వారి దళారి స్వదేశీ బడా కంపెనీలకు వ్యవసాయరంగాన్ని అప్పనంగా అప్పగించేందుకు పూనుకొన్నారు. దీనికోసం అనేక చర్యలను ఆర్డినెన్సు రూపంలో తదనంతరం, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అత్యంత అప్రజాస్వామికంగా, చట్టాలుగా తీసుకురావటం మనకు తెలిసిందే.

అలాగే విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ పంపిణీపై రాష్ట్రాల హక్కును తొలగించి ధరలు పెంచే చర్యలను చేపట్టారు. దేశ విద్యారంగంలో డిజిటలైజేషన్ పేరుతో ల్యాపుటాపు, స్మార్ట్ ఫోను ఉంటేగానీ చదువుకోలేని స్థితి కల్పించారు. ఈ విధంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలు అన్నిటిలో దోపిడీకి పెద్దపీట వేసే విధానాలను వేగంగా ముందుకు తెచ్చారు.

ప్రజలపై వివిధ రూపాలలో నిఘాను పెంచారు. రెచ్చకొట్టే ప్రచారాలు అదుపు చేయడం పేరుతో ప్రభుత్వం ప్రజల గోప్యతా హక్కును పరిమితం చేశారు. వాస్తవానికి ఇవన్నీ అనధికారంగా ప్రభుత్వాలు రోజూ చేస్తున్నవే, అధికారక చర్యలుగా మారాయి. కరోనా సమయంలో కూడా పాలక పార్టీల నాయకులు ఏ చిన్న కార్యక్రమం జరిపినా ప్రజాసమీకరణలు ఆపలేదు కానీ ప్రజాశక్తులు చిన్ననిరసన కార్యక్రమం తలపెట్టినా కరోనా పేరుతో అడ్డుకున్నారు.

దేశంలో కరోనా అడుగుపెట్టటంతోనే మన దేశంలోని వర్గ, సామాజిక వ్యత్యాసాలు కూడా అడుగడుగునా తేటతెల్లమయ్యాయి. విదేశాల నుంచి విమానాలలో వచ్చేవారు కరోనాను వెంటపెట్టుకొని వస్తే సాదరంగా ఆహ్వానించిన ప్రభుత్వమే లాక్‌డౌన్ పేరుతో కోట్లాదిమంది శ్రమజీవులు దేశంలో వేల కిలోమీటర్లు నెత్తురోడుతూ, దారిపొడువునా ప్రాణాలు విడుస్తుంటే నిర్దాక్షిణ్యంగా ఉండగలిగింది. ముంబయి ధారవి లాంటి మురికివాడలలో భౌతికదూరం పాటించమని చెప్పడం, రెండు రోజులకు ఒకసారి కుళాయిలు వచ్చేచోట గంట గంటకూ చేతులు కడుక్కోమని చెప్పడం, అసలు ఇళ్ళే లేని వారికి ఇంట్లో ఉండండి క్షేమంగా ఉండండి అని చెప్పడం వారి పాలిట

క్రూరమైన పరిహాసం మాత్రమే అవుతుంది. ఎందుకంటే కరోనా కంటే ప్రమాదకరమైన ఆకలి వారిని వెంటాడుతోంది.

## ప్రజల భాగస్వామ్యంతో కరోనాపై పోరాటం

సామ్రాజ్యవాద పెట్టుబడిదారి విధానం స్థానిక భూస్వామ్య, దళారీల భాగస్వామ్యంతో ప్రజలకు గౌరవప్రదమైన వైద్య విధానాన్ని అమలు చేయదు. వైద్యం, విద్య ప్రైవేటీకరించబడటంతో ప్రజల పట్ల నిబద్ధతను ఈ విద్యావిధానం అందించటం లేదు. దోపిడీకి వంతపాడే ప్రభుత్వాలు ప్రజారోగ్యం ప్రజల హక్కు అని గుర్తించవు. వాటికి రోగం ఒక సరుకు. ప్రజలు మార్కెట్‌లోకి వచ్చి డబ్బులిచ్చి వైద్యాన్ని కొనుక్కోవాలి. కరోనాకి వైద్యాన్ని ప్రభుత్వాలు క్రమంగా ప్రైవేటు వైద్యశాలలకు అప్పగించాయి. ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవాలను నిర్వహించి నిలబెట్టుకొన్న దేశాలలో కరోనా నియంత్రణలో ఉంది. అమెరికా కార్పొరేటు వైద్య విధానాలకు భిన్నంగా ప్రజారోగ్యంలో క్యూబా గొప్ప ఫలితాలు సాధించి చూపింది. అక్కడ ప్రతి వెయ్యిమంది ప్రజలకు పదిమంది డాక్టర్లు ఉంటే మనదేశంలో 14 వేలమందికి ఒక డాక్టర్ ఉన్నారు. ఆ దేశం కరోనాను నియంత్రించడమేగాక ఇతర కరోనా వంటి అంటురోగ బాధిత దేశాలకి వైద్య బృందాలను పంపింది. పెట్టుబడిదారీ విధానం ప్రజల ఆరోగ్య, ప్రాణాలను, ప్రకృతి సమతూకాన్ని కాపాడదు. కనుక నూతన సమాజ స్థాపనకు పోరాడటమే మౌలిక పరిష్కారం అని గుర్తించాలి. ఈ క్రమంలో పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థకోసం, సరైన ప్రజారోగ్యాన్ని ఒక న్యాయమైన హక్కుగా గుర్తించాలని ఉద్యమించాలి. కరోనా సాకుతో ప్రజల హక్కులపై, సాధించుకొన్న సౌకర్యాలపై పాలకులు సాగించిన అన్నిరకాల దాడులను తిప్పికొట్టాలి.

# ఎంతకాలం ఈ విషాదం?!

- దేవి

ఆడ బిడ్డల ఘోష వినరండి....
స్త్రీలపై ఈ హింసలాపగ కదలి రారండి

1. గద్దరెక్కల చప్పుడదిగో - పులుల గాండ్రింపులవిగో
కోయిలమ్మల ఆర్తనాదం - లేడికూనల హాహాకారం

మానవత్వం మచ్చుకైనా - కానరాని రాక్షసత్వం
ఊరకుక్కల తీరులెక్కన - మదము నిండిన మనిషి రూపం
పాలు మరవని పాపలను సైతం....
అయ్యో! కుళ్ల బొడిచే నెత్తుటీ కథనం....

2. రోజుకొక్క తీరులెక్క - దేశమంతా నాల్గుదిక్కుల
బడులు గుడులు పంట పొలములు -
రైలు బండ్లు రోడ్లు బస్సులు
ఎక్కడా స్త్రీ జాతికింత - రక్షణిచ్చే జాగ లేదే
మదోన్మాదం మెదడు నిండా - నింపుకున్న పశులమందలు
ఘడియకొక్క ఆడబిడ్డను కాటువేసే కాలనాగులు
పట్టపగలే.....
పట్టపగలే చుట్టుముట్టి - పిట్ట తీరుగ మట్టుపెడితే
అడిగెనాథుడెవ్వడూ లేడా.... ఆడబతుకిల బుగ్గిపాలేనా....

3. ఈ మనీషా... ఆ నిర్భయ... ఆసీఫా... ఆయేషా..
జ్యోతిసింగ్ ప్రత్యూష దిశలు - ఎందరెందరో పసిడి మొగ్గలు
ఎవ్వారూ...
ఎవ్వారీ ముద్దుబిడ్డలు... అయ్యో ఎందుకిట్లా బూడిదైనారు...
నెత్తురూ ముద్దయ్యే నొకరు - కాలినా కట్టయ్యే నొకరు
ఎంత నెత్తురు ఏరులైన - ఎవని దాహం తీరదాయే
భోరు భోరుగ....
భోరు భోరుగ గుండె పగలగ - పొగిలి ఏడ్చిరి తల్లిదండ్రులు
ఈ కంటనీరూ తుడిచెదెవ్వారు... ఆ కర్కశత్వం ఆగెదెన్నాడు...

4. కులం మతము మద్యపానం - మత్తులల్లో ప్రజల ముంచి
విషపుసంస్కృతి పాదు చేసి - పశుల వాంఛలు పెంపుచేసి
గద్దెనేలే... పెద్దలంతా నేరగాళ్లను పెంచేటోళ్లే
వేదభూమీ కర్మభూమని - మాయమాటలు మనకు చెప్పి
ఏ అఘాయిత్యం జరగలేదని - బుకాయించే దొంగ నేతలు
పోలీసుల పహారాలో - అర్ధరాత్రుల అంత్యక్రియలు
బూడిదే మిగిలించినారా.... ఈ భరతభూమిని ...
వల్లకాడుగ మార్చివేశారా...

5. ఎంతకాలం ఈ విషాదం - కంటనీరు ఇంకెదెన్నాడు
కన్న తల్లుల కడుపు మంటలు - కూల్చితీరును ఈ వ్యవస్థను
అక్కలారా అన్నలారా - మానవత గల మనుజులారా
రేపటీ మన పాపలాకై.. హింసలేనీ రోజు కొరకై
రగిలి రగిలి రాజుకుందాము.. ఈ హింసలాపగ పోరు చేద్దాము

# దేశాన్ని మతతత్వ రొంపిలోకి లాగే సిఎఎ, ఎన్ఆర్సి

**దేశ** ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభంతో కునారిల్లుతోంది. అధికారంలో వున్నవారు ఈ సంక్షోభాలను తక్కువ చేసి చూపించడమో, అసలు నిరాకరించటమో చేస్తారు. కానీ ప్రజలు వాస్తవంగా వున్న ఈ సంక్షోభ ఫలితాలనుండి తప్పించుకోలేరు. ప్రజలు వీటిని సహిస్తూ మౌనంగా కూడా వుండలేరు. తప్పక పోరాట బాట పడతారు. ఈ నేపథ్యంలో బిజెపి ప్రభుత్వానికి వాస్తవిక సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించాల్సిన తప్పనిసరి అవసరం ఏర్పడింది.

బాబ్రీమసీదు – రామజన్మభూమి వివాదంపై తీర్పు ముస్లిం వర్గాలలో తమకు అన్యాయం జరిగిందనే అభిప్రాయం కల్పించింది. కానీ సాధారణ ముస్లిం ప్రజలు పరిపక్వతతో ఆలోచించి, బిజెపి ఆడుతున్న విభజించి పాలించే ఆటలో తాము పావులుగా మారడానికి నిరాకరించారు. అందువల్ల ఈ తీర్పు హింసాత్మక ఆందోళనలకు గానీ, మత అల్లర్లకు గానీ దారితీయలేదు. ప్రజలు తమ జీవన సమస్యలపై పోరాటాల బాటపడ్తున్న సందర్భంలో బిజెపి ప్రభుత్వం ఈ సిఎఎ (సిటిజన్‌షిప్ ఎమెండ్‌మెంట్ యాక్ట్)ని ముందుకు తెచ్చింది.

బిజెపి ప్రభుత్వం దాని మతతత్వ ఎజెండాలో భాగంగా కూడా ఈ సిఎఎని తెచ్చింది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలుగా గుర్తింపబడి వివక్షను ఎదుర్కొని భారతదేశానికి వలసవచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులు మరియు పార్శీలకు త్వరితగతిన సిఎఎ పౌరసత్వం యిస్తుంది. స్పష్టంగా చెప్పాలంటే వలస వచ్చేందుకు, పౌరసత్వం యిచ్చేందుకు ముస్లిములను మినహాయించారు. భారతదేశాన్ని బిజెపి హిందూ రాజ్యంగా చూస్తోంది. హిందువులకు మాత్రమే భారతదేశంలో ఆశ్రయం కల్పించాలనుకుంటున్నది. ఈ ఆలోచనా విధానం భారతదేశం యొక్క భావన మరియు స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం. భారత రాజ్యాంగం భారతదేశాన్ని సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక మరియు సార్వభౌమరాజ్యంగా ప్రకటించింది. అది ఈ దేశవాసులందరికీ ఎలాంటి వివక్షత లేకుండా సమానత్వాన్ని, సమాన హక్కులను యిస్తానని పేర్కొంది. కాని భారత పాలకవర్గాలలోని అన్ని ముఠాలు, ఈ నియమాలను అమలుచేసిన దానికంటే ఎక్కువగా ఉల్లంఘించడమే జరిగింది. కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో వున్న బిజెపి భారతదేశ చట్టాలు, విధానాలలోకి తన హిందూరాష్ట్ర భావనలను చొప్పించడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది.

తను ఎంపిక చేసుకున్న కొన్ని దేశాల నుండి హిందువులను ఆకర్షించడానికి బిజెపి ప్రభుత్వం సిఎఎ ద్వారా ప్రయత్నిస్తోంది. ఈవిధంగా మత వివక్ష పేర ఇతర దేశాల నుండి ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రజలను ఆహ్వానించడంవల్ల ఆ దేశాలలో మత సామరస్యానికి భంగం కలుగుతుంది. అంతేగాదు; భారతదేశానికి ఏ దేశాల నుండి వలస వస్తున్నారో ఆ దేశాలకు, భారతదేశానికి మధ్య అనవసర వివాదాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకుంటాయి. అలాగే వలస వచ్చి భారతదేశ పౌరసత్వం కావాలనుకునే ఒక వర్గాన్ని (హిందూ) సృష్టిస్తుంది. ఆ ప్రజలు మిగిలిన భారత పౌరులతో సమాన హోదా పొందలేక వివక్షకు గురవుతారు. ఈ వలస వచ్చిన ప్రజలు తమకున్న మత అస్థిత్వం వల్ల వారి స్వంత దేశంలో వివక్షకు గురయ్యారని భారత పాలకులను ఒప్పించాల్సి వుంటుంది. వాళ్ళు పౌరసత్వం పొందినప్పటికీ భారత పాలకుల దయాదాక్షిణ్యాలపైనే బతకవలసి వుంటుంది. ఈ వలసదారుల వల్ల భారతదేశంలోని పరిమితవనరులపై, జీవనోపాధులపై మరింత ఒత్తిడి పెరుగుతుంది. ఈ పరిస్థితుల వల్ల స్థానిక ప్రజలు శరణార్థులను మనసారా ఆహ్వానించలేరు. పైగా వైరి వాతావరణం కూడా కొనసాగే అవకాశముంది.

అస్సాం, మణిపూర్, త్రిపురలాంటి ఈశాన్య రాష్ట్రాలు పూర్తిగా గిరిజన రాష్ట్రాలు. ఇప్పటికే యిక్కడ పెద్దసంఖ్యలో ఇతర దేశాల నుండి, పశ్చిమబెంగాల్, బీహార్‌లాంటి యితర రాష్ట్రాల నుండి వలస వచ్చిన ప్రజలున్నారు. 1972లో జరిగిన యుద్ధాలు, యుద్ధ వాతావరణాలవల్ల ఈ రాష్ట్రాలలోకి వలసవాదులు ప్రవాహంలా వచ్చారు. ఈ రాష్ట్రాల ప్రజలు వారికున్న పరిమిత వనరులను, భూములను, యితర జీవనోపాధులను వలస ప్రజలతో పంచుకోవాల్సి వస్తుందని, తత్ఫలితంగా తమ బ్రతుకులు దుర్భరమవుతాయని అసంతృప్తితో వున్నారు. అంతేకాదు; మహాప్రవాహంలా జొరబడ్తున్న ఈ వలస ప్రజల వల్ల మొత్తం జనాభాలో తమ ప్రాతినిధ్యం తగ్గిపోతుందనీ, అది తమ జాతీయ గుర్తింపుకే ప్రమాదం కల్పిస్తుందనే ఆక్రోశంలో వున్నారు. దీనివల్లనే అస్సాంలో వలసలను నిరోధించాలనీ, తమ వనరులకు, సాంస్కృతిక అస్థిత్వానికి రక్షణ కల్పించాలని ఆ రాష్ట్ర విద్యార్థులు, యువత పెద్దఎత్తున చేసిన ఉద్యమాలను మనం చూశాం.

పై సమస్యలకు అదనంగా ఈ ప్రాంతంలోని వివిధ జాతులు వివిధ స్థాయిల్లో పరిణామం చెంది వున్నాయి. ఈ రాష్ట్రాలమధ్య బయట నుండి వచ్చే జనాభా, సరిహద్దులు మరియు యితర సమస్యలు యింకా పరిష్కరింపబడాల్సి వుంది. కానీ భారత

పాలకవర్గాలు ఆ జాతుల సమస్యను పరిష్కరింపకపోగా ఈశాన్య రాష్ట్రాలను తమలో విలీనం చేసుకోవాలనీ, తమ స్వంత వర్గ ప్రయోజనాలను కాపాడుకోవాలనే ఆతురతలో మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టాయి. భారత రాజ్యాంగం 371 ఆర్టికల్ మేరకు ఈశాన్య రాష్ట్రాలు కొన్ని ప్రత్యేక హక్కులను అనుభవిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలలో బయట వ్యక్తులు ప్రయాణించడానికి అంతర్గత పరిమితులు వున్నాయి. మరికొన్ని రాష్ట్రాలలో (నాగాలాండ్) భారతదేశంలో రాజకీయంగా విలీనమయ్యే అంశంపై దశాబ్దాలుగా భారత ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 2019 ఆగస్టు 5న బిజెపి ప్రభుత్వం జమ్ముకాశ్మీర్‌కున్న ప్రత్యేకహోదాను రద్దుచేస్తూ చట్టం తెచ్చిన విధానం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల్లో భారత పాలకులపట్ల తీవ్ర అపనమ్మకం కలుగ జేసింది. భారత ప్రభుత్వం ముందుగా అస్సాంలో ఎన్ఆర్‌సిని అమలుచేయడం, ఆ తర్వాత సిఎఎను తీసుకురావడం వారికి పెద్ద దెబ్బగా పరిణమించాయి. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు బిజెపి మార్కు హిందూత్వ రాష్ట్రంకోసం జరుగుతున్న ప్రయత్నాలను; పాలకవర్గాల ప్రయోజనాలకు, ఆసక్తులకనుగుణంగా దేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు రాజకీయ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్న తీరును కూడా గమనిస్తున్నారు.

ఎన్ఆర్‌సి (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్)ని దేశవ్యాప్తంగా అమలుచేస్తానని బిజెపి ప్రకటించింది. ఈ ఎన్ఆర్‌సి కష్టాలు అస్సాం ప్రజలకు బాగా తెలుసు. అస్సాం భూమి పుత్రులు, అస్సాంలో తరతరాలుగా నివసిస్తున్న ప్రజలు, ముఖ్యంగా వీరిలోని శ్రామిక ప్రజలు, కష్టించే నిరుపేదలు తమ పౌరసత్వంకోసం కాళ్ళావేళ్ళా పడాల్సి వచ్చింది. వీరు తమ పౌరసత్వానికి అర్హతలు నిరూపించు కోవడానికి ప్రభుత్వం నిర్దేశించిన ధృవపత్రాల కొరకు కార్యాలయాల గడపగడప తొక్కాల్సి వచ్చింది. చివరకు 19 లక్షలమంది పౌరసత్వానికి అనర్హులుగా గుర్తింపబడ్డారు. మొత్తం ప్రక్రియ అంతా అన్యాయంగా, అనధికారికంగా సాగింది. ప్రజలు మానసిక క్షోభకు, అవమానాలకు గురయ్యారు. విదేశీయులను, చట్టవ్యతిరేక వలసదారులను గుర్తించాల్సిన తన బాధ్యతను ప్రభుత్వం ప్రజలనెత్తిన రుద్దింది. ప్రజలు తమ పౌరసత్వాన్ని రుజువుచేసుకోవాలనీ, రుజువు చేసుకోవడంలో విఫలమైన వారు శిక్ష అనుభ వించడానికి సిద్ధంగా వుండాలని నిర్దేశించింది. అస్సాం ప్రజల ఈ అనుభవాలు దేశంలోని మిగిలిన ప్రాంత ప్రజలకు ఒక హెచ్చరిక. ఎన్ఆర్‌సి అమలుచేస్తే దేశవ్యాప్తంగా ప్రజలు తమకోసం వేధింపులను దాచివుంచిందని అస్సాం అనుభవం తెలియజేస్తుంది. అందువల్లనే ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ఎన్ఆర్‌సిని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ ఒకే గొంతుకతో తమ నిరసనను తెలియజేశారు. ఇది న్యాయమైనది, సరైనది.

సిఎఎ మరియు ఎన్ఆర్‌సిల వ్యతిరేక నిరసనోద్యమాలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి.

1. ఈ నిరసనల్లో విద్యార్థులు, యువత, మహిళలు చోదకపాత్రను పోషించారు. వీరే ఆందోళన చేస్తున్న మొత్తం ప్రజల పక్షాన శక్తివంతంగా, స్పష్టంగా తమ వ్యతిరేకతను ప్రకటించారు. సహజంగా యువతకుండే క్రియాశీలత, మిలిటెన్సీ, వాస్తవికత, ధిక్కారం లాంటి సహజ లక్షణాలు ఈ నిరసనోద్యమాలలో ప్రధానంగా కన్పించాయి.

2. పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంటులో చట్టంచేసే సందర్భంలో దీనిపై ప్రజల నుండి పెద్దగా వ్యతిరేకత, నిరసనలు రావనీ, ఒకవేళ వచ్చినా సునాయాసంగా దాన్ని అదుపుచేయగలమని బిజెపి, కేంద్ర ప్రభుత్వం భ్రమల్లో వున్నాయి. కానీ చిన్న మంటలా మొదలైన ఈ నిరసన, అతితక్కువ సమయంలోనే కార్చిచ్చుగా మారింది. ఏ ఒక్క రాష్ట్రాన్నీ మినహా యించకుండా దేశవ్యాప్తంగా యిది చుట్టు ముట్టింది. అనేక ప్రాంతాల్లో సంఘటితమైన ప్రజాఆందోళనలు వెల్లువెత్తాయి. లక్షలమంది జనం ఈ ఆందోళనల్లో భాగస్వాములయ్యారు.

3. బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళనకారులపై పోలీసులను ఉసిగొల్పాయి. అనేకచోట్ల పోలీసులు విచక్షణా రహితంగా తమ పరిధులు దాటి పనిచేశారు. అత్యుత్సాహంతో, విపరీతమైన క్రూరత్వంతో ఆందోళనకారులపై విరుచుకుపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ప్రజలపట్ల అత్యంత హీనమైన నేరపూరితమైన చర్యలు చేపట్టింది. ఆ రాష్ట్రాన్ని అతంటి దుశ్చర్యలకు ప్రయోగక్షేత్రంగా మార్చింది. జామియా ఇస్లామియా ముస్లిం యూనివర్సిటీ (జెఐఎంయు), అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ (ఎఎమ్‌యు) ప్రాంగణాల్లోకి ప్రవేశించి దాడులు చేసిన విధానం, విద్యార్థులకు వ్యతిరేకంగా చేపట్టిన చర్యలు పోలీసుల క్రూరత్వానికి ఒక నమూనాగా నిలిచాయి. జెఐఎంయు ప్రాంగణంలోకి పోలీసులు దూసుకువెళ్ళి మొరటుగా వ్యవహరించారు. అక్కడ లైబ్రరీలో ప్రశాంతంగా చదువుకుంటున్న విద్యార్థులపై ఆడ, మగ అనే తేడా లేకుండా విచక్షణారహితంగా లాఠీఛార్జీ చేశారు. పుస్తకాలను చిందరవందర చేశారు. ఫర్నిచరును ధ్వంసం చేశారు. పారిపోతున్న వాళ్ళను కూడా ఉపేక్షించలేదు. తమకు ఈ నిరసనలతో సంబంధం లేదని ఆ విద్యార్థులు చేసిన ఆక్రందనలను కూడా పోలీసులు పెడ చెవినపెట్టి టాయిలెట్లలో దాక్కున్న వాళ్ళను కూడా లాక్కొచ్చి కొట్టారు. దాదాపు ఎఎంయులో కూడా ఇలాగే జరిగింది.

ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే పోలీసు కాల్పుల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది నిరసనకారులపై అక్రమ కేసులు పెట్టారు. ఒక్క కాన్పూరు నగరంలోనే పోలీసులు 21,500 మంది ప్రజలపై కేసులు పెట్టారు. ఆలీఘర్‌లో సిఎఎ మరియు ఎన్ఆర్‌సిలను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేశారనే 'నేరం' మోపుతూ ఎఎంయు విద్యార్థులపై కేసులు దాఖలు చేశారు. ప్రదర్శనకారులపై నేరం మోపేందుకుగాను, పోలీసులే స్వయంగా విద్యార్థుల వాహనాలను, ఇతర ఆస్తులను ధ్వంసంచేస్తూ కన్పించిన సంఘటనలున్నాయి.

4. అస్సాం, మణిపూర్, త్రిపురలాంటి ఈశాన్య రాష్ట్రాలను పోలీసులు యుద్ధభూమిగా మార్చారు. ఈ యుద్ధక్షేత్రంలో ఒకవైపు విద్యార్థులు, యువత, మహిళలు ముందు పీఠిలో వుండి సిఎఎ మరియు ఎన్ఆర్‌సిలకు వ్యతిరేకంగా నిరసన తెలియచేస్తూ నిలబడి వుండగా, రెండోవైపు లాఠీలు, భాష్పవాయువు, తుపాకులను

ప్రయోగిస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్న పోలీసులు వున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు, బెంగుళూరు నగరాల్లో జరిగిన భారీ ప్రజాందోళనలు – పోలీసుదాడులను, కాల్పులను చవిచూశాయి. కోల్‌కతా, పాట్నా, చెన్నై, తిరువనంతపురం, ముంబయి, జైపూర్ తదితర అనేక నగరాల్లో లక్షలాదిమంది ప్రజలు వీధుల్లో కొచ్చి సిఎఎ మరియు ఎన్ఆర్‌సిలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

5. బిజెపి ఊహలకందనివిధంగా సిఎఎ మరియు ఎన్ఆర్‌సి వ్యతిరేక నిరసనలు భారీ ప్రజాందోళనలుగా మారడమేకాకుండా బిజెపి ఆకాంక్షలకు భిన్నంగా మారాయి. ఈ ఉద్యమం వివిధ విశ్వాసాలుగల ప్రజలను విడదీయడానికి బదులుగా అందరినీ కలిపింది. భారతదేశాన్ని విభజించడానికి, భారత ప్రజలను మత ప్రాతిపదికపై విభజించడానికి, ముస్లింలకు వ్యతిరేకంగా వివక్షతను పాటించడానికి ఉద్దేశించిన సాధనాలుగా ప్రజలందరూ ఈ సిఎఎ మరియు ఎన్ఆర్‌సిలను పేర్కొనడాన్ని మనం చూస్తున్నాం. సిఎఎ మరియు ఎన్ఆర్‌సి లను ఉపసంహరించుకోవాలని డిమాండుచేస్తూ సాగిన నిరసన ఉద్యమంలో విద్యార్థులు, యువత, మహిళలు, దళితులు, గిరిజనులు, ఇతర శ్రామిక ప్రజలు, ప్రజాస్వామిక, వామపక్ష శక్తులు ఐక్యతతో పాల్గొన్నారు. మేధావులు, శాస్త్రజ్ఞులు, కళాకారులు వేలాదిగా వీధుల్లోకి వచ్చి ఈ ఉద్యమానికి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. భారతీయ ప్రజానీకాన్ని విభజించి, అందులోని ముస్లిములను ఏకాకులను చేసి దాడిచేయాలనే బిజెపి కుటిల పన్నాగానికి అది ఊహించని ఎదురుదెబ్బ.

మూకుమ్మడి ప్రజానిరసనలను, ఆందోళనలను ఎదుర్కొన్న ప్రధానమంత్రి మోడీ, హోంమంత్రి అమిత్‌షాలు ప్రజలను పక్కదోవ పట్టించడానికి రెండునాల్కల ధోరణి అవలంబించారు. 'సిఎఎ దేశవ్యాప్తంగా చట్ట వ్యతిరేక వలసలను అరికట్టడానికి మాత్రమే. అందువల్ల ఎవరూ దీనిని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని మోడీ, అమిత్‌షాలు ప్రకటనలు చేశారు. కాని వారు వలస దారులను అనుమతించడంలో, వారికి పౌరసత్వం మంజూరు చేయడంలో ముస్లింలపట్లనే ఎందుకు వివక్ష చూపుతున్నారు? హిందూమతాన్ని ఎందుకు ప్రాతిపదికగా తీసుకుంటున్నారనే దానికి జవాబు చెప్పరు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి వచ్చిన వలసవాదులు కేవలం హిందువులైతే చాలు, వారికి పౌరసత్వం లభిస్తుంది. అదే ఇక్కడేపుట్టి యిక్కడే తరతరాలుగా నివసిస్తున్న ప్రజలు తమ పౌరసత్వ నిరూపణ కోసం వేధింపులకు గురయ్యే,

ప్రస్తుత ఉద్యమంలో ప్రజలు పాలకవర్గాల 'విభజించు పాలించు', 'అసలు సమస్యను పక్కదారిపట్టించే' విధానాలపట్ల చాలా జాగరూకతతో, స్పష్టతతో వున్నారు. ఇది ఆహ్వానించదగ్గ ఉద్యమ లక్షణం. సిఎఎ మరియు ఎన్ఆర్‌సి ముస్లిములకు మాత్రమే వ్యతిరేకంగా చూడడాన్ని ప్రజలు ఆమోదించడంలేదు. ప్రజలను మతపరంగా సమీకృతం చేస్తూ భారతదేశాన్ని, భారత ప్రజలను విభజించే బిజెపి ప్రభుత్వ ప్రమాదకర ప్రయత్నాలను ప్రజలు తోసిపుచ్చుతున్నారు.

అవమానాల పాలయ్యే ప్రక్రియను ఎదుర్కోవాల్సిన అవసరమేమిటి అనే ప్రశ్నకు వీరు జవాబు చెప్పరు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదనపు వివరాలతో కూడిన జాతీయ జనాభా రిజిష్టరు గురించి కూడా మాట్లాడుతోంది.

భారత పాలకవర్గాలు వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి ఒకదాని తర్వాత ఒక వివాదాస్పద అంశాలను తెరమీదికి తెస్తున్నారు. ఈ అంశాల ముసుగులో వారు తమ ప్రజా వ్యతిరేక, జాతి వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలను ప్రజల నుండి పెద్దగా ప్రతిఘటన లేకుండా అమలుచేసే పద్ధతులను అవలంబిస్తున్నారు. ప్రస్తుత ఉద్యమంలో ప్రజలు పాలకవర్గాల 'విభజించు పాలించు', 'అసలు సమస్యను పక్కదారిపట్టించే' విధానాల పట్ల చాలా జాగరూకతతో, స్పష్టతతో వున్నారు. ఇది ఆహ్వానించదగ్గ ఉద్యమ లక్షణం. సిఎఎ మరియు ఎన్ఆర్‌సి ముస్లిములకు మాత్రమే వ్యతిరేకంగా చూడడాన్ని ప్రజలు ఆమోదించడంలేదు. ప్రజలను మతపరంగా సమీకృతం చేస్తూ భారతదేశాన్ని, భారత ప్రజలను విభజించే బిజెపి ప్రభుత్వ ప్రమాదకర ప్రయత్నాలను ప్రజలు తోసిపుచ్చుతున్నారు. భారతదేశాన్ని మతతత్త్వ రొంపిలోకి లాగడానికి నిర్దేశించుకున్న విధానాలకు దేశవ్యాప్తంగా వివిధ మత విశ్వాసాల ప్రజలు ఐక్యంగా కదిలి ఉద్యమించిన తీరే ధీటైన జవాబు. భారత ప్రజల భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చే సానుకూల పరిణామం.

"ఓహో ఓ విద్యార్థీ
ఓహోహో ఓ మేధావీ
పొట్టకూడు మీకియ్యక
చట్టుబండలాయె చదువు
మేటవేసిపోయె మెదడు
భ్రష్టుపట్టిపోయె బ్రతుకు

మెదడైనా ఒడలైనా
శ్రమచేస్తేనే సంపద
కలవారల కొమ్ము కాసి
పడుచుకునే వృత్తిరోసి
కర్షక కార్మిక జన సం
ఘాతంతో కలియండి"

– శ్రీశ్రీ 'మరోప్రస్థానం' నుండి

# మత మైనారిటీలపై, దళితులపై, మహిళలపై హిందూమతతత్వ శక్తుల ఫాశిస్టు తరహా దాడులు

**కేంద్రంలో** బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, అల్పసంఖ్యాక మతస్థుల పైన, ప్రత్యేకించి ముస్లిముల పైన, దళితుల పైన, మహిళల పైన దాడులను, దౌర్జన్యాలను తీవ్రం చేసింది. కేంద్రంలో అధికారంలోనున్న దన్నుతోను, ముఖ్యంగా బిజెపిపాలిత రాష్ట్రాలలోనూ ఈ ఘోరాలకు అంతులేకుండా పోతోంది. రాజ్యయంత్రాంగపు అండదండలతో సంఘపరివార్ శక్తులు చట్టభీతి లేకుండా 'పవిత్ర యుద్ధాల్ని' సాగిస్తూ, సమాజంలో హింసను ప్రేరేపిస్తున్నాయి. ధర్మసంసద్ పేరున హిమాచల్‌ప్రదేశ్‌లో, హరిద్వార్ నగరంలో హిందూ సంస్థల కార్యకర్తలతో నిర్వహించిన సదస్సులో ముస్లిములను అంతం చేయాలని, హిందువులంతా సాయుధం కావాలని విద్వేషాలను రేపే ప్రసంగాలు చేశారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి శాసనసభ సభ్యుడిగా వున్న కులదీప్ సెంగాల్ తన వద్దకు ఉద్యోగం కోసం వచ్చిన ఉన్నావోకు చెందిన యువతిపై సామూహిక అత్యాచారం గావించాడు. దీనిపై ఆ యువతి ఇచ్చిన ఫిర్యాదును కూడా పోలీసులు తీసుకోలేదు. దీనిని నిరసిస్తూ ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఆమె ఆత్మహత్యా యత్నం చేయటంతో విషయం వెలుగులోకి వచ్చి పోలీసులు ఫిర్యాదును తీసుకున్నారు. అయితే తర్వాత నుండి ఆ యువతి కుటుంబ సభ్యులను వెంటాడి, వేధించారు. బంధువులను పలు సాకులతో అరెస్టు చేశారు. ఆ యువతి తండ్రిని పోలీసు స్టేషన్‌లోనే హత్య గావించారు. ప్రజాందోళన వత్తిడితో తప్పనిసరి పరిస్థితుల్లో దీనిపై ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించింది. తర్వాత కూడా మహమ్మద్ యూసఫ్ అనే కీలకమైన ప్రత్యక్ష సాక్షిని మట్టుపెట్టారు. 'రోడ్డు ప్రమాదం' రూపంలో బాధితురాలని, ఆమె కుటుంబ సభ్యులతో సహా, ఆమె తరపున వాదించే న్యాయవాదిని కూడా గాయపరిచారు. ఈ 'ప్రమాదం'లో మరో కీలకసాక్షి అయిన బాధితురాలి అత్త మరణించారు.

ఈ విధంగా చట్టభీతి లేకుండా రాజ్యవ్యవస్థ దన్నుతో హిందూ మతోన్మాద శక్తుల అత్యాచారాలు, అకృత్యాలు నిత్యకృత్యమయ్యాయి.

టి-20 ప్రపంచ కప్పు పోటీలో ఓటమికి 'షమీ' అనే ఆటగాడిని బాధ్యుడిని చేస్తూ హిందూ ఉన్మాద శక్తులు విద్వేష వ్యాఖ్యానాలు చేశారు. దీనిని ఖండిస్తూ ఆటగానికి మద్దతుగా నిలిచిన టీమ్ కెప్టెన్ విరాట్ కోహ్లీ కుమార్తె అయిన పసిబిడ్డపై సైతం నీచమైన వ్యాఖ్యలు చేస్తూ ఉన్మాదులు విద్వేషాన్ని వెళ్ళగక్కారు.

మన రాష్ట్రంలో కర్నూలు జిల్లా ఆత్మకూరులో ముస్లిం మైనారిటీలు మసీదు నిర్మించుకుంటుంటే, నియోజకవర్గ బిజెపి నేత ఆధ్వర్యంలో అల్లరిమూకలు దాడులకు పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్ లఖింపూర్‌ఖేరి తరహాలో స్థానిక బిజెపి నాయకుడొకరు ప్రజలపైకి వాహనం నడిపి పలువురిని గాయపరిచాడు.

అలాగే జాతీయోద్యమ కాలం నుండీ మత సామరస్యానికి ప్రతీకగా వున్న గుంటూరులోని జిన్నా టవర్ పేరు మార్చాలని, లేకుంటే కూల్చివేస్తామని రాష్ట్ర బిజెపి నేతలే మాట్లాడి విద్వేషాలు రేపుతున్నారు.

మధ్యప్రదేశ్ రాష్ట్రం - ఖార్గే వద్ద రామనవమి ఊరేగింపుపై, ఢిల్లీ-జహంగీర్‌పూర్ హనుమాన్ శోభా యాత్రపై దాడులు జరిగాయనే పేరుతో హిందూ మతతత్వ పాలకులు, ముస్లిములపై క్రూరమైన రాజ్యహింసకు, దాడులకు తెగబడ్డారు. ఒక పథకం ప్రకారం అల్పసంఖ్యాల ఇళ్ళను, షాపులను బుల్‌డోజర్లతో కూల్చివేసి, వారిలో ఒక భయోత్పాతాన్ని పెంచుతున్నారు. ముస్లిముల వ్యాపారాలను, వారి ఉత్పత్తులను బహిష్కరించమని పిలుపునిస్తున్నారు. ముస్లిముల జీవనాధారాలను ధ్వంసం చేయటం ద్వారా వారిపై ప్రతీకారానికి నగ్నంగా బయటకొచ్చారు.

అదే విధంగా మతపరంగా అల్పసంఖ్యాకులైన క్రిస్టియనులను లక్ష్యంగా చేసుకొని వారిపై హింస, దాడుల ఘటనలు కూడా గత కొంత కాలంగా పెరిగాయి.

హర్యానా రాష్ట్రంలో ఓ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో క్రిస్టమస్ వేడుకలు జరుగుతున్న సమయంలో హిందూ మతతత్వ ఫాసిస్టు మూకలు, ఆ కార్యక్రమాన్ని భగ్నం చేయటంతోపాటు 'జై శ్రీరామ్' నినాదాలతో ఆ ప్రాంతంలోని అలంకరణ నంతటినీ ధ్వంసం చేశారు.

అంబాలాలోని హోలీ డీమర్ చర్చిలోని ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఫాసిస్టు గూండాలు ధ్వంసం చేశారు. దక్షిణ అస్సాములోనూ భజరంగ్‌దళ్ కార్యకర్తలు కోవిడ్-19 పేర చర్చికి తాళాలు వేయించారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం తూర్పునున్న జోన్‌పూర్ జిల్లాలో క్రిస్టియన్లకు వ్యతిరేకంగా విద్వేషం, హింస, దాడులు అధికంగా జరిగాయి. ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహించే వారణాసికి 50 కి.మీ. దూరంలోని జోన్‌పూర్ నుండి ఈ ఘటనలు క్రమంగా అజాంఘర్, ప్రతాప్‌ఘర్, గోరఖ్‌పూర్, ఆగ్రా, కాన్పూర్, వారణాసి వరకు విస్తరించాయి.

హిందూమతతత్వ శక్తులు, పాలక రాజకీయ నేతలతో కలగలిసిన పోలీసు అధికారులు - క్రిస్టియన్ల ప్రార్థనా కార్యక్రమాలను ఆటంక

పరచటం, వారిని వేధింపులకు గురిచేయటం జరుగుతోంది. పాస్టర్లపై దాడులకు పాల్పడటమే గాకుండా, చర్చిలను, ఆయా యాజమాన్యాల ఆస్తులు, వాహనాలను ధ్వంసం చేయటం జరుగుతోంది. దర్యాప్తు పేరిట ఎందరో క్రిస్టియన్ ఫాదర్లను, పాస్టర్లను నిర్బంధించటమో అరెస్టు చేయటమో జరుగుతోంది.

**అగ్రకుల అహంకారంతో నిమ్నకులాలుగా చూడబడుతున్న వారిపై దాడులు, వివక్ష, దళిత, బలహీన వర్గాలపై అఘాయిత్యాలు, మహిళలపై అత్యాచారాలు దేశవ్యాపితంగా నిత్యవార్తలుగా మారిపోయాయి.**

సామాజిక సమానత్వం కావాలని, కుల వివక్షతలపై ఉద్యమించిన పెరియార్ జన్మించిన తమిళనాడు రాష్ట్రంలో ఐఏఎస్‌లకు ముస్సోరిలో శిక్షణనిచ్చే అధికారి ఒకరు ఆ రాష్ట్రంలోని స్కూలు విద్యార్థులు తమ కులాలను తెలిపే విధంగా ముంజేతికి బ్యాండ్లు ధరించాలని ఆదేశించారు.

మధ్యప్రదేశ్‌లోని శివపూర్‌లో ఒక పంచాయితీ భవనానికి సమీపంలో ఇద్దరు దళిత పిల్లలు బహిరంగ మలవిసర్జన చేశారనే కారణంతో యాదవులైన ఇద్దరు అన్నదమ్ములు వారిని కొట్టి హత్య గావించారు. బిజెపి-మోడీ ప్రభుత్వ పాలనలో కులతత్వ ఉన్మాదం పరాకాష్టకు చేరిందనటానికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

రాజకీయ పలుకుబడి గలిగిన నేరస్తులు, పోలీసు ఉన్నతాధికారులను లోబర్చుకుని కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారు. వాస్తవానికి బాధితుల తల్లిదండ్రులు రెండు సం॥ల క్రితం తమకు సమీపంలో గుడిశ వేసుకొని నివసించటాన్నే ఈ ఉన్మాదులు సహించలేకపోయారు. వారిపై కక్ష పెంచుకున్నారు. ఇద్దరు దళిత పిల్లలను చావమోదిన దృశ్యాలు, వీడియోలలో స్పష్టంగా సాక్ష్యాలుగా ఉన్నప్పటికీ నేరస్తులు యధేచ్ఛగా తప్పుకోగల్గుతున్నారు.

అత్యంత దారుణమైన దళిత బాలల హత్య వెనుక అసలు కారణం బహిరంగ మలవిసర్జన అంశం కానే కాదు; అగ్ర కులతత్వమే ప్రధాన కారణం.

'ఆజాదీ కా అమృత మహోత్సవ్'ను ప్రభుత్వం 'ఘనంగా' నిర్వహిస్తున్న సందర్భంలోనే దళిత విద్యార్థి ఇంద్రకుమార్ మేఘ్వాల్ అగ్రకుల దురహంకార దురాగతాలకు బలయ్యాడు. 9 ఏళ్ళ దళిత విద్యార్థి ఇంద్రకుమార్ దాహం తీర్చుకోవటానికి తాను చదువుకునే విద్యాసంస్థలోనే వున్న కుండలోని నీళ్ళు తీసుకొని తాగినందుకుగాను అగ్రకులోన్మాదం తలకెక్కిన ఉపాధ్యాయుని చేతిలో తీవ్ర హింసకు గురై ఆగస్టు 15న మరణించాడు. రాజస్థాన్ రాష్ట్రం జిలోర్ అసెంబ్లీ పరిధిలోని సూరానా గ్రామంలో జరిగిందీ ఘటన.

అమృత మహోత్సవాల కాలంలోనే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం - లఖింపూర్ ఖేరీ ప్రాంతంలో ఇద్దరు దళిత అక్కాచెల్లెళ్ళపై అత్యాచారం చేసి, హత్యచేసి వారి మృతదేహాలను చెట్టుకు వేలాడదీశారు.

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో నిరుపేద దళిత యువతిపై అదే గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారీ సంపన్న కుటుంబాలకు చెందిన నలుగురు యువకులు క్రూరంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసులు, అధికారులు పట్టించుకోలేదు; పది రోజులు మృత్యువుతో పోరాడి ఆమె మరణించింది. సామాజిక మాధ్యమంలో ఈ ఘటన విస్తృత ప్రచారం గావటంతో అధికార యంత్రాంగం మేల్కొని మొక్కుబడి చర్యలు చేపట్టింది. చివరకు మరణించిన మనీషా మృతదేహాన్ని కుటుంబీకులకు కూడా అందించకుండా, శాంతిభద్రతల సాకు జూపి అర్ధరాత్రి సమయంలో పోలీసులే దహనం చేశారు.

ఈ ఘటనపై ఆందోళనలు సాగుతున్నపుడే బలరాంపూర్‌లో 22 సం॥ల యువతిపై సామూహిక అత్యాచారం జరపటంతో ఆమె మృతి చెందింది. అదే యుపిలోనే బదోహి జిల్లాలో బహిర్భూమికి వెళ్ళిన 14 సం॥ల బాలిక తల ఛిద్రమై శవంగా మారిపోయింది.

ఉత్తరాఖండ్ రాష్ట్రం హృషీకేశ్ దగ్గర ఓ రిసార్టులో పనిచేసే 19 సం॥ల అంకిత భండారీని ఆ రాష్ట్ర మాజీ మంత్రి కొడుకు అత్యాచారం జరిపి, ఓ కొండ శిఖరం నుండి పడదోసి హత్యగావించాడు.

ఇంతేగాక స్త్రీలను లైంగిక బానిసలుగా వేలం వేస్తున్న ఘటనలు వెలుగుజూస్తున్నాయి. రాజస్థాన్ రాష్ట్రం - ఛిత్వారీ జిల్లాతో పాటు మొత్తం ఆరు జిల్లాల్లో వారి ఇంటి ఆడపిల్లలను అప్పులు తీర్చటానికి అమ్ముకుంటున్న ఘటనలు జరుగుతున్నాయి. అమ్మాయిలను వేలంలో అధిక మొత్తం చెల్లించిన వారికి అప్పగిస్తున్నారు. సంతలో పశువుల మాదిరి ఆడబిడ్డలను కొనుగోలు చేసి వారిని వివిధ నగరాలలోని వ్యభిచార కూపాలకు తరలిస్తున్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో విడివిడిగా జరుగుతున్న ఘటనలుగా కనిపిస్తున్నప్పటికీ, దోపిడీ సంస్కృతి విష భావజాల కారణంగానే ఇవి జరుగుతున్నాయి. స్త్రీని దాసిగా, బానిసగా భోగవిలాస వస్తువుగా పరిగణించే వినాశకర సామ్రాజ్యవాద సంస్కృతి కలగలిసిన నేటి అర్ధవలస - అర్ధఫ్యూడల్ విష సంస్కృతి ఫలితమే దళితులపై, మహిళలపై దుర్మార్గాలన్నీ.

ముఖ్యంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూమతతత్వ శక్తులు ఫ్యూడల్ భావజాలం, ఆచరణను, మూఢవిశ్వాసాలను పనిగట్టుకొని పెంచిపోషిస్తున్నాయి. అభివృద్ధి

**ముఖ్యంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ మతతత్వ శక్తులు ఫ్యూడల్ భావజాలం, ఆచరణను, మూఢవిశ్వాసాలను పనిగట్టుకొని పెంచిపోషిస్తున్నాయి. అభివృద్ధి నిరోధక భావజాలం బలంగా వేళ్ళూనుకుంటూ దళితులపై, మహిళలపై, మైనారిటీ మతస్తులపై అఘాయిత్యాలు చట్టభీతి లేకుండా పెరిగిపోతున్నాయి.**

నిరోధక భావజాలం బలంగా వేళ్ళూనుకుంటూ దళితులపై, మహిళలపై, మైనారిటీ మతస్తులపై అఘాయిత్యాలు, ఫాశిస్టు తరహా దాడులు చట్టభీతి లేకుండా పెరిగిపోతున్నాయి.

ఈ ఘటనలు జరిగి, ప్రజలలో ఈ ఘటనలను నిరసిస్తూ ఆందోళనలు తీవ్రమైతే, వారి ఆగ్రహాన్ని తాత్కాలికంగా చల్లబరచటానికి నేరస్థులపై కేసులు నమోదు చేయటం, బాధితులను నష్టపరిహారం పేరుతో నోరుమూయించటం జరుగుతూ వస్తోంది. ఈనాటి దోపిడీ వర్గ సమాజంలో అధికారాన్ని చేజిక్కించుకున్న పాలకవర్గ పార్టీలేవీ ప్రజలపై సాగుతున్న ఈ హింస, అకృత్యాల బారి నుండి వారిని కాపాడటానికి సిద్ధంగా లేవని ఈ ఘటనలన్నీ మనకు తెలియ జేస్తున్నాయి.

గుజరాత్ మతతత్వదాడుల సందర్భంగా 2002లో బిల్కిస్‌బానో అనే ముస్లిమ్ మహిళలపై సామూహిక అత్యాచారం జరిపి, 3 సం॥ల ఆమె కూతురితోసహా ఆమె కుటుంబ సభ్యులనేకమందిని ఆమె కళ్ళఎదుటే హతమార్చిన హిందూమతతత్వ గూండాలను సత్ప్రవర్తన కలవారిగా నిర్ణయించి, ఆగస్టు 15న వారందరినీ జైలు నుండి విడుదల చేయటానికి మించిన ఉదాహరణ ఇంకేంకావాలి?

లోక్‌సభలో ఆధిక్యతను ఆసరాగా చేసుకొని, తన మతతత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళేందుకు బిజెపి పాలకులు ప్రయత్నిస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరసత్వ జాబితా, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు మొదలగు చట్టపరమైన చర్యల ద్వారా యూనిఫామ్ సివిల్‌కోడ్ వంటి ప్రతిపాదనల ద్వారా మత మైనారిటీలను ప్రత్యేకించి ముస్లిములను తొక్కిపెట్టే చర్యలు చేపడుతున్నారు. పోలీసు, రాజ్యాధికార యంత్రాంగపు అండదండలతో ముస్లిము ప్రజానీకంపై వివిధ రూపాల్లో దాడులు చేస్తూ వారి ఆర్థిక మూలాలు దెబ్బ తీస్తున్నారు. మరోవైపున ఆర్‌ఎస్‌ఎస్, తదితర హిందూ మతతత్వ సంఘ్ పరివార్ శక్తుల ద్వారా ఉన్మాదపూరితమైన, ముస్లిములపై తీవ్ర వ్యతిరేకమైన చారిత్రక వక్రీకరణ ప్రసంగాలు, ప్రకటనలు, బాహాటంగా చేస్తూ, వారిపై విద్వేషాన్ని రెచ్చగొడ్తూ, దాడులకు పురిగొల్పుతున్నారు. దాడులకు పాల్పడినవారికి రాజ్య యంత్రాంగం, అన్ని విధాల అండదండలనందిస్తోంది. దీనినంతా కేవలం ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందేందుకు చేపట్టే చర్యలకు మాత్రమే పరిమితం చేయరాదు; సామ్రాజ్యవాద దోపిడీని తీవ్రం జేసేందుకు కావలసిన విధంగా భూమికను సిద్ధం చేయటాన్ని గమనించాలి.

మరోవైపున తాము అనుసరిస్తున్న దోపిడీ రాజకీయార్థిక విధానాల ఫలితంగా ప్రజా జీవితం సంక్షోభంలో కూరుకుపోతోంది. దీని నుండి బయటపడేందుకు ప్రజాసమూహాలు పాలక విధానాలపై సంఘటితంగానో, అప్రయత్నంగానో తిరగబడుతున్న పరిస్థితి పెరుగుతోంది. కావున ప్రజల్లోని ఈ అసంతృప్తి, ఆగ్రహాలు తమ దోపిడీ పునాదులపైకి ఎక్కుబెట్టబడకుండా కుల, మత ఉన్మాదాలను రెచ్చగొట్టటం ద్వారా ప్రజలలో విద్వేషాలు నింపి వారి మధ్య తగవులు పెంచి, తమ మీద నుండి దృష్టిని మళ్ళించే కుట్రపూరిత ఎత్తుగడలో భాగంగా కూడా ఈ ఫాసిస్టు తరహా చర్యలను అర్థం చేసుకోవాలి. పాలకుల ఈ ఎత్తుగడలను తిప్పికొడుతూ దళితులు, మహిళలు, అల్పసంఖ్యాక మతస్థులు, యావన్మంది పీడిత ప్రజానీకం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని నేటి పరిస్థితి డిమాండ్ చేస్తోంది.

# ఆ చల్లని సముద్ర గర్భం

**- దాశరథి**

ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో ॥ఆ చల్లని॥
భూగోళం పుట్టుకకోసం-రాలిన సురగోళాలెన్నో
ఈ మానవ రూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో...ఆ...ఆ...ఆ ॥ఈ॥
ఒక రాజుని గెలిపించుటలో-ఒరిగిన నరకంఠాలెన్నో
కులమతాల సుడిగుండాలకు-బలి కాని పవిత్రులెందరో ॥ఆ చల్లని॥
మానవ కళ్యాణం కోసం-పణమొడ్డిన రక్తం ఎంతో
రణరక్కసి కరాళనృత్యం-రాల్చిన పసి ప్రాణాలెన్నో...ఆ...ఆఆ ॥రణ॥
కడుపుకోతతో అల్లాడిన-కన్నులలో విషాదమెంతో
ఉన్మాదుల అకృత్యాలకు-దగ్ధమైన బ్రతుకులు ఎన్నో ॥ఆ చల్లని॥
అన్నార్తులు అనాధులుండని-ఆ నవయుగమదెంత దూరం
కరువంటూ కాటకమంటూ
కనిపించని కాలాలెపుడో...ఆ...ఆ...ఆ...ఆ ॥కరువ॥
పసిపాపల నిదుర కనులలో-మురిసిన భవితవ్యం ఎంతో
గాయపడిన కవి గుండెలలో-రాయబడని కావ్యాలెన్నో ॥ఆ చల్లని॥

# నాలుగు లేబర్ కోడ్‌లు - కార్మిక హక్కుల అణచివేత

## 2019 - 20

**ప్రపంచంలో** అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని మన దేశాన్ని గూర్చి గొప్పగా చెబుతూ వుంటారు. ప్రజాస్వామ్యమంటే ప్రజల కోసమే పాలన సాగవలసి వుంటుంది. అయితే దేశంలో అత్యధికులుగా వుండి, దేశంలో సంపదల సృష్టికి మూలమైన కార్మికుల పట్ల, శ్రామిక ప్రజానీకం పట్ల మనదేశ 'ప్రజాస్వామ్య' వ్యవస్థను నడుపుతున్న పాలకులు, పాలకవర్గాలు మాత్రం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏమాత్రం ప్రాధాన్యత లేనివారిగా వారిని విస్మరిస్తున్నారు.

ప్రత్యేకించి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో, మన దేశ పాలకులు, పాలకవర్గాలు, కార్మికులను రెండవ తరగతి పౌరులుగా పరిగణిస్తూ, కార్మికవర్గం పట్ల పూర్తి నిర్లక్ష్యం వహించే విధానాల అమలును వేగవంతం చేశారు. కార్మికులు తమ దుర్భర జీవన పరిస్థితుల గురించి ఎన్ని విజ్ఞప్తులు చేసినా, వానికి చెవొగ్గే దానికి సైతం పాలకులు సిద్ధం కావడంలేదు. పైగా, కార్మికుల స్థితిగతులను మెరుగుపరిచే బదులుగా రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా వారికి సంక్రమించిన హక్కులు, సౌకర్యాలను సైతం పాలకులు, పాలక వర్గాలు కాలరాచివేస్తున్నారు. అయితే, ఆశ్చర్యకరంగా కార్మికవర్గంపై ఎక్కుపెట్టిన ఈ దాడులనే పాలకులు 'కార్మిక సంస్కరణలు' పేరుతో పిలుస్తూ మరింత దూకుడుగా ఎలాంటి భీతీ లేకుండా కొనసాగిస్తున్నారు.

వాస్తవానికి మనదేశంలోని మొత్తం శ్రామిక వర్గంలో కేవలం 7 శాతంగా వున్న సంఘటిత రంగంలోని కార్మికులకు మాత్రమే రాజ్యాంగం ప్రకారం హక్కులు, సౌకర్యాలు గానీ, చట్టపరమైన ఉద్యోగభద్రతగానీ కల్పించబడుతుందని చెబుతున్నారు. కాగా వ్యవసాయరంగంతో సహా మిగిలిన 93 శాతంగా వున్న అసంఘటిత, అనియత రంగాల్లో వున్న కార్మిక, శ్రామిక జన సమూహానికి ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, సౌకర్యాల కల్పనలనే వాటిని చట్టబద్ధంగానే నిరాకరిస్తున్నారు.

అనియత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న ఈ 93 శాతం కార్మికులు, శ్రామికులందరికీకూడా చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రతలను కల్పించటానికి బదులుగా, మన దేశపాలకులు, పాలక వర్గాలు – సంఘటితరంగంలో పనిచేస్తున్న ఆ కొద్దిపాటి సంఖ్యలోనున్న ఉద్యోగులు, కార్మికులకు ఏదో మేరకు అందుబాటులోనున్న చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలను సైతం ఎగవేసేందుకు దూకుడుగా ముందుకు సాగుతున్నారు.

ఈ కార్మిక వ్యతిరేక విధానాలన్నీ, సంస్కరణలన్నీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క పనిముట్లు అయిన ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల ఆదేశాలకనుగుణంగానే జరుగుతున్నాయనే దానిలో దాపరికమేమీ లేదు.

మనదేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలను యుపిఏ పాలకులు ప్రారంభించి, కార్మిక చట్టాలను విడతలవారీగా సవరించే పేరున శ్రామిక వ్యతిరేక 'కార్మిక సంస్కరణ'లను అమలు చేస్తూ వచ్చారు. కాగా, వారి స్థానంలో అధికారానికి వచ్చిన ఎన్‌డిఏ పాలకులు ఆ నయా ఉదారవాద ఆర్థిక విధానాలనే, ఆ కార్మిక సంస్కరణలనే మరింత దూకుడుగా, మొరటుగా అమలుచేస్తున్నారు. ఆర్థికాభివృద్ధిని సాధించే పేరిట, ఎక్కువెక్కువగా ఉద్యోగావకాశాలు కల్పించే పేరిట కార్మికుల న్యాయమైన ఆకాంక్షలను, మెరుగైన జీవితం గురించిన వారి కోర్కెలను, మెరుగైన పని పరిస్థితులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మనదేశంలో అమలులోవున్న 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు నూతన కార్మిక చట్టాలుగా ఎన్‌డిఏ పాలకులు కుదించారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఝార్ఖండ్, మహారాష్ట్రలలో కార్మికుల చట్టబద్ధ హక్కులన్నింటినీ పూర్తిగా కాలరాచివేసే విధంగా చట్టాలను సవరణలు చేశారు.

2018 ఏప్రిల్‌లో ప్రపంచబ్యాంకు విడుదల చేసిన ఓ పుస్తకంలో ఇలా పేర్కొంది : పెట్టుబడిదారుల కోర్కెలు, వెసులుబాటుల కనుగుణంగా కార్మికులు పనిచేయటానికి ప్రస్తుతం ఉనికిలో వున్న కార్మిక చట్టాలు అవరోధంగా వున్నాయి కనుక, ఆ చట్టాలన్నింటినీ రద్దుచేయవలసిందిగా, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచబ్యాంకు సలహా యిచ్చింది. ప్రస్తుత నూతన సాంకేతికత, పరిజ్ఞానపు ఫలాలన్నీ పెట్టుబడిదారులకు పూర్తిగా కార్యరూపం దాల్చాలంటే ప్రస్తుత కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నమాట. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు భారతదేశాన్ని ఈ అంశంలో నమూనాగా తీసుకోవాలని, 'సంస్కరణ'లను అమలుచేయడంలో మనదేశ అనుభవాలను ఉపయోగించుకోవాలని ప్రపంచబ్యాంకు వారికి సలహా ఇస్తోంది. శాశ్వత లేదా స్థిర మరియు రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో 'నియమిత కాల ఉద్యోగాల' (ఎఫ్‌టిఇ) విధానాలను అమలు చేయాలని కూడా ప్రపంచబ్యాంకు సిఫార్సు చేస్తోంది. అలాగే, సామాజిక భద్రతా విధానాలు, కార్యక్రమాల స్థానంలో సామాజిక బీమా కార్యక్రమాలను అమలు చేయాల్సిందిగా ప్రపంచ బ్యాంకు సలహా ఇస్తోంది. ఇంకా, వివిధ దేశాల ప్రభుత్వాలు ఇప్పటికి ఇంకా అమలు చేస్తున్న కనీస వేతనాన్ని నిర్ణయించి

దేశంలో కార్మికులకు కనీసంగానైనా తోడ్పడే చట్టబద్ధ హక్కులు, రక్షణలనన్నింటినీ బడా పెట్టుబడిదారీవర్గ యాజమాన్య ప్రయోజనాలకోసం బాహాటంగా ఎత్తివేసేందుకు, కార్మికులను వారి ప్రయోజనాలను బలిపెట్టి యాజమాన్యాలు సౌకర్యవంతంగా, సులభంగా తమ వ్యాపారాన్ని కొనసాగించుకొనే వాతావరణాన్ని కల్పించటానికి, మనదేశాన్ని విదేశీ పెట్టుబడికి మరింత ఆకర్షణీయ ప్రాంతంగా మలిచే ఏకైక ఉద్దేశంతోనే మనదేశ పాలకులు, పాలకవర్గాలు ఈ రూపంలో ముందు కొచ్చారనేది స్పష్టం.

నిర్ధారించే విధానాల స్థానంలో సార్వత్రిక కనీస వేతన వ్యవస్థను – యుబిఐ (సార్వత్రిక మూల ఆదాయం)ను అమలు చేయాలని కూడా ప్రపంచబ్యాంకు సిఫార్సు చేస్తోంది. వీటన్నింటినీ సామాజిక భద్రతా పథకాలకు కాక, సామాజిక బీమా పథకాలకు అనుసంధానం చేయాలని చెప్తోంది.

మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను క్రోడీకరించి 4 కార్మిక చట్టాలుగా రూపొందించింది. అవి 1. పారిశ్రామిక సంబంధాల కార్మిక చట్టం, 2. వృత్తిపరమైన భద్రతా చట్టం, 3. వేతన చట్టం, 4. సామాజిక భద్రతా చట్టం.

ట్రేడ్ యూనియన్ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం మరియు స్థిరమైన ఆదేశాల చట్టం అనే మూడింటి కలయికతో రూపొందించిన పారిశ్రామిక సంబంధాల చట్టం, కార్మికులు సంఘటితమవడానికి, యాజమాన్యంతో సంయుక్తంగా బేరసారా లాడేందుకు, సమ్మె కట్టడానికి, యాజమాన్యాల కక్ష సాధింపుల నుండి తమను తాము రక్షించుకునేందుకు, తమతమ రాజకీయ, ట్రేడ్ యూనియన్‌ల పట్ల విశ్వాసాల్ని కలిగి వుండేందుకు వుండే కనీసపాటి అవకాశాలను లేకుండా చేస్తోంది. కార్మిక యూనియన్ల ఏర్పాటు ప్రక్రియను మరింత సంక్లిష్టం చేయడంతోపాటు, ఏ కారణంతోనైనా సమ్మె నిర్వహించటాన్ని దాదాపు అసాధ్యం చేసే విధంగా ఈ చట్టం రూపొందించబడింది. 'సమ్మె' అనే మాటెత్తటమే తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన శిక్షలకు గురిచేయబడతారన్నమాట!

కార్మికుల వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల గురించి రూపొందించిన వృత్తిపరమైన భద్రతాచట్టం, యాజమాన్యపు విధులను ప్రత్యేకించి పేర్కొంది. ఉద్యోగులు లేదా కార్మికులు తమ పనిప్రదేశాలలో ప్రమాదకర పరిస్థితుల నెదుర్కోకుండా హామీ ఇవ్వటంతోపాటు నిర్దిష్ట కాల పరిమితుల్లో వైద్య పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని, అలాగే సాధ్యమైనంత వరకు కార్మికుల, ఉద్యోగుల ఆరోగ్యాలకు నష్టం కలిగించని క్షేమకరమైన, హేతుబద్ధమైన, ఆచరణయోగ్యమైన పని పరిస్థితులను, వాతావరణాన్ని కల్పించాలని ఈ చట్టం పేర్కొంది. భద్రతా కమిటీలను ఏర్పాటు చేయవలసిందిగా ఈ చట్టం కంపెనీ యాజమాన్యాలను నిర్దేశించింది. దేశీయ స్థాయిలో వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య అంశాలపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందజేయటానికి వీలుగా ఓ సలహా సంస్థను ఏర్పరచాలని, పని ప్రదేశాల్లో ఈ అంశాలన్నీ అమలయ్యేలా 'ఫెసిలిటేటర్లు' (ఇన్‌స్పెక్టర్లు కాదు) చూడాలని పేర్కొంది. పని ప్రదేశాల్లో ప్రమాదాల బారిన పడిన కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారాన్ని గురించి కానీ, తగిన జాగ్రత్తలు తీసుకొనని యజమానులకు విధించాల్సిన దండనల గురించి కానీ నిర్దిష్టంగా పేర్కొనలేదు. నిర్ణీత కాలాల్లో కార్మికులకు నిర్వహించే వైద్య పరీక్షల ద్వారా రూపొందించే వైద్య నివేదికలను ఉపయోగించి కార్మికులకు హాని తలపెడతారు. కార్మికులకు లేదా ఉద్యోగులకు సంభవించే అనారోగ్యం లేదా అస్వస్థతకు పని ప్రదేశాల్లో పరిస్థితులు, లేదా విపత్తులే కారణమని అంగీకరించకుండా, వైద్యపరంగా అసమర్థత ప్రాతిపదికన ఆయా కార్మికులు లేదా ఉద్యోగులను విధుల నుండి తప్పించటమే జరుగుతుంది. యాజమాన్యమే బాధ్యత వహించి ఆ కార్మికులకు వేతనంతో కూడిన శలవు మంజూరుచేసి విశ్రాంతినిచ్చి, తగిన వైద్యసౌకర్యమందజేసి స్వస్థత చేకూర్చేందుకు తోడ్పడకుండా, అధిక ఉత్పాదకతను సాధించాలనే, కంపెనీ ఖర్చులు తగ్గించాలనే విధానాలను అమలుచేస్తున్న యజమానులు ఆటోమేటిక్‌గా వారిని ఉద్యోగాల నుండి తప్పించటమే చేస్తున్నారు. పని ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాల్లో మరణించిన లేదా అంగవికలురైన కార్మికులు నిర్లక్ష్యం చేయబడు తున్నారు. భోపాల్ గ్యాస్ ప్రమాదంలో సంభవించిన విధంగా భద్రతా నియంత్రణలను పాటించకపోవడం, కార్మికుల ప్రాణాలపట్ల నిర్లక్ష్యం మొదలైన కారణాల ప్రాతిపదికన నిర్దిష్ట నష్టపరిహారాన్ని కార్మికులకు చెల్లించకుండా పట్టనితనంతో వ్యవహరిస్తున్నారు. పరిశ్రమలలో 'వర్క్ కమిటీలు' ఇప్పటికే ఏవిధంగా నిష్ఫలం చేయబడ్డాయో, దిగజారుతున్న పరిస్థితులను, కార్మికులపై పెరుగుతున్న పనిభారాలను ఉపశమింప జేయటంలో ఎందుకూ కొరగాకుండా ఎలా మిగిలాయో మనకు తెలుసు. త్రైపాక్షిక వేదికలైన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ వంటి వాటికి సమయంలేని కారణంగా ప్రధానమంత్రి హాజరు కావడం లేదంటూ వారి చట్టాల ప్రకారం మొక్కుబడిగా అయినా హాజరు కాకుండా ఎగవేయడాన్ని మనం చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వము, పారిశ్రామిక యాజమాన్యాలు ఈ చట్టాలలో పొందుపరిచిన అంశాలను కార్మికులకు సానుకూలంగా అమలు చేస్తాయని, ఈ అనుభవాల వెలుగులో ఎవరైనా ఎలా ఊహించగలుగుతారు? ఫ్యాక్టరీ తనిఖీ అధికారులను నిష్ప్రయోజకులుగా మార్చివేసి, సంబంధిత చట్టాలను, వాటి అమలును పర్యవేక్షించి, నియంత్రించటాన్ని విఫలం చేసిన తర్వాత, 'ఫెసిలిటేటర్స్' అనబడేవారు యజమానులను ఈ భద్రతా ప్రమాణాలకు తలొగ్గే విధంగా చేయగలుగుతారని ఎవరైనా ఊహించగలుగుతారా? చట్టాలు అనేకం వున్నా వాటి అమలు అనేదే ఇక్కడ సమస్య. ప్రతిరోజూ దేశంలోని అనేక పనిప్రదేశాల్లో యాజమాన్యాలు తమ కంపెనీ ఖర్చులు తగ్గించుకునేందుకు భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం వలన, యాజమాన్యాల నేరపూరిత నిర్లక్ష్యం వలన వందలాదిమంది కార్మికులు దుర్మరణాల

పాలవుతున్నారు. దీనిని కట్టడి చేయటానికి, యాజమాన్యాల ప్రమాదాల రూపంలో సాగించే ఈ హత్యలను అరికట్టటానికి ఈ చట్టాలు ఏమీ మాట్లాడటం లేదు.

వేతనాల చట్టం, దేశవ్యాపితంగా ఏకీకృత వేతనం గురించి చెబుతోంది. 1957లో భారత కార్మిక సదస్సు చేసిన సిఫార్సులపై ఆధారపడి కనీస వేతనాల సూత్రాన్ని నిర్ధారిస్తారా లేదా బి.ఎం.ఎస్ సూచించిన విధంగా ఒక కుటుంబ కనీస వేతనాన్ని ముగ్గురి నుండి ఆరుగురిగా పెంచి, లెక్కగడతారా అనేది తెలియరాలేదు. లింగభేదంతో సంబంధం లేకుండా, లేదా కాంట్రాక్టు, క్యాజువల్, కంటింజెంట్, అవుట్ సోర్సింగ్ వంటి వానితో సంబంధం లేకుండా సమానపనికి సమాన వేతన మివ్వాలనే దానికి దీనిలో చోటులేదు.

సామాజిక భద్రతాచట్టం, నామమాత్రంగానైనా కార్మికులకు సామాజిక భద్రత కల్పించే బాధ్యత నుండి ప్రభుత్వాన్ని తప్పించి బీమా విభాగంలోకి ప్రత్యేకించి సూపర్ లాభాపేక్షతో వున్న ప్రైవేటు బీమా కంపెనీల కప్పగించింది. మనదేశంలో శ్రామిక ప్రజానీకంలో అత్యధిక సంఖ్యాకులుగా వున్న అసంఘటిత, అనియతరంగాలలోని కార్మికులకు సామాజిక భద్రతా పథకాల పేరున వివిధ రకాల బీమా పథకాలను ప్రకటించి, ప్రారంభించారు. కార్మికులు తమ కొద్దిపాటి వేతనాలనుండే ప్రీమియం పేరుతో ఈ పథకాలకు చెల్లించాలి. ఈ విధంగా కార్మికుల నుండి పోగుపడిన పెద్ద మొత్తాలతో నిధులను నిర్వహించే కేంద్ర ప్రభుత్వం జూద తరహాలోని షేర్ మార్కెట్‌లో ఈ నిధులను పెట్టుబడిగా పెడుతోంది. మరోవైపున రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్ నిధులన్నింటినీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్సు వంటి వాటినన్నింటినీ, ఈ చట్టం ద్వారా కేంద్రీకృతం చేసి, వాటిని కేంద్ర ప్రభుత్వ నిర్వహణ బాధ్యత కప్పగించింది. సంబంధిత సామాజిక సంక్షేమ బీమాల కోసం కార్మికులతోపాటు పరిశ్రమ యజమానులు లేదా ప్రభుత్వాలు తమ భాగపు విరాళాన్ని ఖచ్చితంగా చెల్లించాలనే షరతును ఈ చట్టం ఎత్తివేసింది. పశ్చిమ దేశాలలో కార్మికుడు పని కోల్పోతే, యాజమాన్యాలు అతనికి నష్టపరిహారం చెల్లిస్తాయి. ప్రస్తుతం కేంద్రం రూపొందించిన ఈ చట్టంలో అలాంటి ఏర్పాటుకు చోటేలేదు.

సామాజిక బాధ్యత, సంక్షేమం మొదలైన వానిని ఎత్తివేస్తూ వాని స్థానంలో 'సామాజిక బీమా' సూత్రాన్ని తెచ్చిపెడుతూ ప్రపంచబ్యాంకు ఆదేశించిన యుబిఐ సూత్రాని కనుగుణంగా ఈ చట్టాలు రూపొందించబడ్డాయి.

మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌ల సారాన్ని పరిశీలిస్తే కార్మికుల పనిపరిస్థితులను, జీవన స్థితిగతులను మెరుగుచేసే ఇసుమంత ఆశకూడా కనిపించటం లేదు.

దేశంలో కార్మికులకు కనీసంగానైనా తోడ్పడే చట్టబద్ధ హక్కులు, రక్షణలనన్నింటినీ బడా పెట్టుబడిదారీవర్గ యాజమాన్య ప్రయోజనాల కోసం బాహాటంగా ఎత్తివేసేందుకు, కార్మికులను వారి ప్రయోజనాలను బలిపెట్టి యాజమాన్యాలు సౌకర్యవంతంగా, సులభంగా తమ వ్యాపారాన్ని కొనసాగించుకొనే వాతావరణాన్ని కల్పించటానికి, మనదేశాన్ని విదేశీ పెట్టుబడికి మరింత ఆకర్షణీయ ప్రాంతంగా మలిచే ఏకైక ఉద్దేశంతోనే మనదేశ పాలకులు, పాలకవర్గాలు ఈ రూపంలో ముందు కొచ్చారనేది స్పష్టం.

ప్రపంచాన్ని సాకుతున్న
ఓ రైతా! ఓ కూలీ!!
గతకాలపు పోరాటపు
వారసులవ మీరేనోయ్

నీ కష్టం నీ బిడ్డల
ఆకలి తీర్చాలంటే
నీ దేశపు సంపదలవి
నీకే దక్కాలంటే

నీ బిడ్డలకైనా ఈ
అప్పుల తిప్పలు తప్పి
సమాజాన గౌరవంగా
బతుకులు సాగాలంటే

నీ నెత్తిన ఎగురుతున్న
గద్దల తరమాలంటే

నీ లాంటోళ్లందరితో
సంఘం కట్టాలంతే

చీకట్లో మగ్గుతున్న
నీ దేశం రేపైనా
ఎర్రెర్రని సూర్యుడిచ్చు
వెలుగులు పొందాలంటే

నీ జనాన్ని నిద్రలేపి
నిజాన్ని బోధించాలోయ్
సంఘంగా సంగ్రామపు
వెలుగులు సాధించాలోయ్

సంఘంగా మన శక్తికి
ఎదురులేదు జగతిలోన
సంగ్రామం సాగిస్తే
తిరుగులేని జయము నీదే

- ప్రసన్న

**రేపటి వెలుగుల కోసం నుండి...**

# అమృతానందాలు

- పినాకిని

ఎగరేయండి! ఎగరేయండి!
ఇంటింటిపై జెండా ఎగరేయండి!
ఎగరేయండి! ఎగరేయండి!

దేశమంటే మట్టికాదోయ్!
దేశమంటే మనుషులోయ్!
ఈ రెండు లైన్లు జెండా దిమ్మ
నుదిటిపై కొత్తగా రాయించండి.

★★★

వందేళ్ల సంబురాలదాకా బతకనిస్తారో లేదో
ఇంటింటా ప్రతిజ్ఞ చేసి రక్షించుకుంటామని
వందల జెండాలు ఎగరేయండి!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ముందు
ఉక్కు సంకల్ప జెండా ఎగరేయండి!
నవరత్నాలను కాపాడుకుంటామని
9 అడుగుల పోరాటజెండాలెగరేయండి!

అమ్ముడుపోని ధాన్యపు రాశుల ముందు
రైతు తలపాగా జెండాగా ఎగరేయండి.
ఆ నిరసన జెండాలో....
నవధాన్యాలూ మూటగట్టి ఎగరేయండి.
మరో వందేళ్లు విత్తనాల్ని కాపాడుకుంటామని,
ఎగరేయండి! ఎగరేయండి! జెండా ఎగరేయండి!

★★★

మర్చిపోకండి మిత్రమా! మర్చిపోకండి
బలవన్మరణానికి బలైన లక్షల రైతులను
మనసునిండా స్మరిస్తూ రెండు నిమిషాలు
మౌనం పాటించడం మర్చిపోకండి.

ఎగరేయండి జెండా ఎగరేయండి
మూతబడ్డ ప్రతి స్వదేశీ ఫ్యాక్టరీ
పొగగొట్టాలను వెతికి తెచ్చి
పేరుపేరునా సంతాపజెండా ఎగరేయండి.

ఉపాధి కోల్పోయిన కార్మికులంతా
ఒక నిమిషం నిశ్శబ్దంగా.....
ఎగిరే జెండా ముందు నిలబడండి చాలు
బహుళజాతి బూట్ల చప్పుడు వినిపిస్తుంది.

ఎగరేయండి! ఎగరేయండి!
ఇప్పుడే ఎగరేయండి!
రేపటిరోజున.... ఏ దేశంలోనైనా
ఎగరవేయడానికి జెండా దిమ్మలు
ఇళ్ళూ వాకిళ్ళు స్కూళ్ళు సినిమాహాళ్లు
శిథిలాలుగా మారచ్చు ఉక్రెయిన్‌లా....
సామ్రాజ్యవాదుల యుద్ధాల బీభత్సాన్ని
తలుచుకుని మీ పిల్లలతో ఎగరేయించండి.
ఎగరేయండి! జెండా ఎగరేయండి!

నూరేళ్ల జెండా పండుగ నాటికి
ఎగరేయడానికి మీ చేతిలో తాడూ
మీటరు జెండాగుడ్డనూ కొనలేకపోవచ్చు
ఇప్పుడే ఎగరేయండి! ఎగరేయండి!

పది అడుగులు ఎత్తులో ఎగిరే జెండాను
డాలరు ఎనభైకి దిగిన రూపాయి సంకేతంగా
ఎనిమిదడుగులు అవనతం చేయండి!
అపుడు మీకేమనిస్తుంది?
నాకైతే తల తెగి నేలపై పడ్డట్టనిపిస్తుంది.

జెండా అంటే....
మూడడుగుల గుడ్డముక్కకాదని
తరతరాల ఆత్మగౌరవమనిపిస్తుంది.
దేశమంటే..... మట్టికాదని
దేశమంటే..... మనుషులనీ తెలుస్తుంది.

# 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్'
# 75 సం॥ల 'స్వాహో'తంత్రం
## 2022 ఆగస్టు 15

**ఏడు** దశాబ్దాలపైగా స్వతంత్ర పాలనలో దేశం ఎంతో పురోగమించిందని దోపిడీ పాలకులు వంచనాత్మకంగా ప్రకటిస్తూ, 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' పేరిట 2021 ఆగస్టు 15 నుండి ప్రారంభించి సం॥ర కాలంపాటు కోట్లాది రూ॥ల ఖర్చుతో దేశ వ్యాపితంగా ఉత్సవాలు నిర్వహించారు. కానీ దశాబ్దాలు గడుస్తోన్నా దిగజారుతున్న జీవన ప్రమాణాలతో సుఖశాంతుల జాడేలేని జీవితాలతో శ్రామిక ప్రజానీకం అలమటిస్తున్నారు.

తరాల నుండీ రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా తరగని పేదరికం తమనెందుకు వెంటాడుతోందని వారు వేదన చెందుతున్నారు. తినమరిగిన కొందరు బడాబాబులు సంపదలు పోగేసుకుని తమ కళ్ళెదుటే కోట్లకు పడగలెత్తటం చూసి 'స్వాతంత్ర్యం అంటే ఇదేనా' అని విస్తుబోతున్నారు. కాయకష్టం చేసినా కుటుంబాలు గడవటం లేదెందుకని, పండించిన పంటకు ప్రతిఫలమెందుకు రావటంలేదని, ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేవెందుకని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రశ్నించిన గొంతుకలను అణచివేయటాన్ని; దళితులు, మహిళలు, పేదలపె నిత్యకృత్యమైన అకృత్యాలను వారు నిరసిస్తున్నారు. ప్రజలనుద్ధరిస్తామంటూ ఇంతకాలం గద్దెనెక్కి పాలిస్తున్నవారే, తమ ఈ దుస్థితికి బాధ్యులని వారు నినదిస్తున్నారు. దేశ ఆహార, వస్తూత్పత్తిలో కీలకమైన వ్యవసాయ, పారిశ్రామికరంగాలలో 'విధ్వంసక అభివృద్ధి'కి పాలకుల లొంగుబాటు విధానాలు కారణం కాదా, అని వారు నిలదీస్తున్నారు. దేశ బౌద్ధిక, మేధో నిర్మాణంలో ముఖ్యమైన విద్య, వైద్యరంగాలను దేశ, ప్రజల ప్రయోజనాల కనుగుణంగా రూపొందించకపోవటమే, నిరుద్యోగం, ఉపాధిలేమి భయానకంగా పెరిగిపోవడమే స్వతంత్ర పాలనలో సాధించిన అభివృద్ధికి, ప్రగతికి, భారత్ ప్రకాశించటానికి చిహ్నమా? అని వారు ప్రశ్నిస్తున్నారు.

## వ్యవసాయం, గ్రామీణ జీవనం విధ్వంసం

పాలకులెందరు మారినా వ్యవసాయం చేసే రైతులు నానాటికీ రుణభారంలో మునిగిపోతున్నారు. ఏటా లక్షలాదిమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కౌలురైతుల కష్టాలకు అంతులేదు. బలవన్మరణాలలో అధికశాతం కౌలురైతులే! కల్తీ – నకిలీ – నాసిరకం విత్తనాల నిరోధానికి చర్యలు లేవు. ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలపై అదుపులేదు. చీడపీడలకు కొదవలేదు. అతివృష్టి – అనావృష్టికి పరిష్కారమార్గాలు లేవు. నీటిపారుదల ప్రాజెక్టులేవీ ముందుకు సాగవు. చేతికొచ్చిన పంటకు మార్కెట్ వసతి లేదు; గిట్టుబాటుధర లేదు. రైతుల ఆదాయం రెండు రెట్లు పెంచకపోగా, వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేసే రైతు వ్యతిరేక చట్టాలను రుద్దుతున్నారు.

వ్యవసాయాన్ని పనిగట్టుకొని గిట్టుబాటు కానిదిగా మలిచారు. ఆర్థిక మీటలతో రైతులను భూముల నుండి దూరం చేస్తున్నారు. కార్పొరేటు, కంపెనీ వ్యవసాయానికి గేట్లు తెరిచారు. ప్రాజెక్టులు, సెజ్జులు, పోర్టులు, పార్కుల నిర్మాణం పేర లక్షలాది ఎకరాల పంట భూములను బడా పారిశ్రామికవర్గాలకు కట్టబెట్టారు. భూములపై ప్రధానంగా ఆధారపడిన వ్యవసాయ కూలీల జీవనోపాధిని హరించి వేశారు. చేతివృత్తులను సర్వనాశనం చేశారు. ప్రతిష్టాత్మకమైన చేనేతను కోలుకోలేని దెబ్బతీశారు. గ్రామీణ పేదల ఉపాధి అవకాశాలను తుడిచి పెట్టటంతో, పొట్ట చేత పట్టుకొని పేదల వలసలు ప్రవాహంలా సాగుతున్నాయి.

గ్రామీణ జీవన విధ్వంసానికి ముందస్తుగా నాడు పైరుపచ్చ విప్లవం పేరుతో రసాయన ఎరువులు, అధిక దిగుబడి వంగడాల మార్కెట్‌ను ప్రోత్సహించారు. వ్యవసాయ వాణిజ్య కంపెనీలు మస్తుగా లాభాలు దండుకున్నాయి. నేడు రెండో పైరుపచ్చ విప్లవం పేరుతో వ్యవసాయరంగాన్ని సర్వనాశనం చేయబూనుకున్నారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైన జన్యుమార్పిడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. ఒకవైపున జన్యుమార్పిడి విత్తన వ్యాపార కంపెనీలకు దాసోహమంటూనే ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బిఎన్ఎఫ్ – జీరోబడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) పేరుతో నాటకా లాడుతూ ప్రజలను వంచిస్తున్నారు. రైతుబంధు, రైతుభరోసా, కిసాన్ సమ్మాన్ వంటి పథకాలతో వ్యవసాయ ఖర్చుతో ఏమాత్రం పొంతనలేని చిన్నమొత్తాలను రైతులకు ఆశజూపి మోసగిస్తున్నారు. మరోవైపున గిర్వాజరులోని భూకామందులకు ఈ రూపంలో పెద్ద మొత్తంలో అప్పనంగా ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారు.

రైతులకు ఏదో మేరకు అందుబాటులో వున్న ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లను ప్రైవేటుపరం చేస్తున్నారు. ఈ–నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్)లను ఏర్పాటు చేస్తున్నారు. రైతులను సామ్రాజ్యవాద కంపెనీల, దళారీల దయాదాక్షిణ్యాలకు నిర్దాక్షిణ్యంగా వదిలివేస్తున్నారు. విపత్తుల కారణంగా నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించి ఆదుకోగపోగా, బడా కార్పొరేటు బీమా సంస్థలకు 'ఫసల్ బీమా యోజన' పేర ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారు.

గ్రామీణ ప్రాంతంలో కీలకమైన విప్లవ భూసంస్కరణల అమలుకు పాలకులే అడ్డంకిగా వున్నారు. చిన్న భూకమతాల సంఖ్య పెరుగు

తున్నప్పటికీ పేద, మధ్యతరగతి రైతుల వద్ద నున్న మొత్తం సాగు భూమి కేవలం 20-30 శాతం మాత్రమే. కాగా బడా భూస్వాములు, పారిశ్రామిక యాజమాన్యాలు, వివిధ మత, ధార్మిక సంస్థలు, సంపన్నవర్గాల వద్ద కేంద్రీకరింపబడిన సాగుభూమి ఈనాటికీ 70-80 శాతంగా వుంది. గ్రామాల్లో ఈనాటికీ కులవివక్ష, అంటరానితనం, అగ్రకుల దురహంకారదాడులు, దళితులపై హంతక దాడులు రోజువారీ వార్తలుగా వున్నాయి. పీడితుల్లోకెల్లా అధమాధమంగా జీవనం సాగించే ఆదివాసులను - రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాచి - అభివృద్ధి ముసుగులో అడవితల్లి ఒడి నుండి విసిరివేస్తున్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడటమేగాక, వారిని క్రూరంగా హత్యగావించటమనేది నేడు ఆనవాయితీగా మారింది.

దేశంలో సారవంతమైన భూములను, తరగని జీవనదులను, అశేష శ్రామిక ప్రజలను అనుసంధానిస్తే, అనూహ్య వ్యవసాయ ఉత్పత్తి సాధ్యమౌతుంది. ప్రజానుకూల మేధావులెందరు దీని గురించి నెత్తీనోరూ బాదుకున్నా, పాలకులంతా ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం వహించటాన్ని ఏమని వ్యాఖ్యానించాలి? దేశంలో దశాబ్దాల స్వాతంత్ర మనబడే దాని తర్వాత కూడా అనేక ప్రాంతాలను నిత్య కరవు పీడిత ప్రాంతాలుగా వుంచాలనే సామ్రాజ్యవాదుల కుట్రలో భాగం కాదా ఇది?! కరవు పీడిత ప్రాంతాల నుండి కారుచౌక వలస కూలీలు తరలి రావటం - బడా పారిశ్రామిక వర్గాలకు అవసరం. 'ప్రాంతాల అభివృద్ధి' - 'వెనుకబాటు' పేరుతో ప్రజల మధ్య నీటి వివాదాలు, విద్వేషాలు చెలరేగుతూ వుండటం - దోపిడీ పాలకుల అవసరం!

## పారిశ్రామికరంగం - కార్మికుల నికృష్ట దోపిడీ

బిజెపి ఆధ్వర్యంలో కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న ఎన్‌డిఏ పాలకులు ప్రజావ్యతిరేక విధానాలను దూకుడుగా అమలుచేస్తున్నారు. వివిధ రాష్ట్రాలలో అధికారంలో కొనసాగుతున్న పాలకులు - కొందరు పైకి వ్యతిరేకతను వ్యక్తం చేసినప్పటికీ - కేంద్ర ప్రభుత్వ విధానాలకే అంతిమంగా వంతపాడుతున్నారు.

కేంద్ర పాలకుల పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి విధింపు వంటి విధానాలన్నీ సామ్రాజ్యవాద, బడా కార్పొరేటువర్గాలకే తోడ్పడ్డాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమదారులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. కరోనా దెబ్బతో వారు మరింత కోలుకోలేని స్థితికి నెట్టబడ్డారు. చిల్లర వర్తకంలోకి వందశాతం విదేశీ పెట్టుబడికి కేంద్ర పాలకులు ఆమోదం తెల్పటం - చిన్న వ్యాపారులు, చిన్న పారిశ్రామికవర్గాలపై పిడుగుపాటే. సామ్రాజ్యవాద బహుళజాతి, బడా కంపెనీలకు మనదేశ మార్కెట్లను దాసోహం చేసే ఈ చర్యలను, విదేశీ పెట్టుబడికి మన దేశ ఆర్థికవ్యవస్థను ధారాదత్తం చేసే విధానాలను - స్వాతంత్ర్య ప్రతిఫలంగా స్వాగతించాలా?!

వలస కాలంనాటి 'రాజద్రోహ' చట్టాన్ని బ్రిటిష్ పాలకులే తమ దేశంలో రద్దుచేసినా, మనదేశ పాలకులకు ఈనాటికీ అది "కాలం చెల్లలేదు." అసమ్మతి గొంతు నులమడానికి విచ్చలవిడిగా ఈ చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. అయితే శతాబ్దాలుగా కార్మికవర్గం పోరాటాలు సాగించి సాధించుకున్న కార్మిక చట్టాలు మాత్రం కాలం చెల్లిపోయాయంటూ వాటిని రద్దు చేసి, నాలుగు లేబర్‌కోడ్‌లుగా రూపొందించి, కొద్దో గొప్పో కార్మికులకుండే ఆపాటి చట్టబద్ధమైన ఆసరాను కూడా లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల పాలకులు కరోనా కాలంలో కార్మికులకు రోజుకు 12 గంటల పనిని చట్టబద్ధం చేశారు. ఇక క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు ఎలాంటి హక్కులూ లేకుండా బానిస చాకిరి చేస్తున్నారు. అనునిత్యం పని ప్రదేశాలలో 'ప్రమాదాల' బారినపడి కార్మికు లెందరో ప్రాణాలు కోల్పోతున్నారు. 2011 నాటికే దేశవ్యాపితంగా 33 కోట్లమంది వలస కూలీలుగా వున్నారని జాతీయ శాంపుల్ సర్వే ప్రకటించగా, కరోనా కష్టకాలంలో వారందరినీ రోడ్లపాల్జేసిన ఈ పాలకులనేమనాలి? 'ఆత్మ నిర్భర భారత్ అభియాన్' పేరిట దేశ స్వావలంబన కోసమంటూ ప్రకటించిన 21 లక్షల కోట్ల రూ॥ల మాయా ప్యాకేజీలో వాస్తవమెంత? ప్రజలకు చేరినదెంత?

బడా పారిశ్రామికవేత్తల వేల కోట్ల పన్ను బకాయిలను రద్దు చేస్తున్నారు. వారు ఎగ్గొట్టిన లక్షల కోట్ల బ్యాంకు అప్పులను పారు బాకీలుగా ప్రకటించి మాఫీ చేస్తున్నారు. కరోనా కాలంలో రక్తాలు చిందిస్తూ కాలినడక సాగించిన వలస కూలీలకు కనీస రవాణా సదుపాయం కల్పించలేకపోయిన పాలకులు, ఈ కాలంలోనే విజయ్ మాల్యా, నీరవ్‌మోదీ వంటి బడాచోర్‌లు ఎగ్గొట్టి వెళ్ళిన 68 వేల కోట్ల బ్యాంకు అప్పులను రద్దు చేయగల్గటం - ఈ పాలకుల దోపిడీ వర్గస్వభావాన్ని సుస్పష్టం చేయటంలేదా? ప్రపంచస్థాయి మొదటి పదిమంది కుబేరులలో స్థానం సంపాదించుకొని ఫోర్బ్స్ పతాకంపైకి అంబానీ, అదానీలు ఎగబాకటమేనా - రానున్న నాలుగేండ్లలో మన దేశాన్ని 5 లక్షల కోట్ల డాలర్ల విలువైన ఆర్థికవ్యవస్థగా మార్చటమంటే?!

## బడా కార్పొరేట్ల వాణిజ్య సరుకులుగా విద్య, వైద్యం

'దేశ భవిష్యత్తు తరగతి గదులలో రూపొందించబడుతుందన్న' సత్యానికి కార్యాచరణ రూపం ఇవ్వటానికి మనదేశ పాలకులు సిద్ధంగా లేరు. దేశంలో సగం జనాభా ఈనాటికీ విద్యకు దూరంగానే వున్నారు. విద్యను అందరికీ అందించాల్సిన బాధ్యత నుండి పాలకులు తప్పుకున్నారు. డబ్బున్నవాడు కొనుక్కోగలిగే అంగడి సరుకుగా విద్యను మార్చివేశారు. పోనీ చదువుకున్నవారి పరిస్థితి అయినా సవ్యంగా వుందా అంటే అదీ లేదు. చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరుగుతోంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో 2 వేల ఫారెస్టు గార్డుల ఖాళీల భర్తీకి 2 లక్షల మంది విద్యావంతులు దరఖాస్తు చేసుకోవడం - వీరిలో అధికసంఖ్యలో పిహెచ్‌డిలు, పిజిలు వుండటం - నిరుద్యోగ తీవ్రతకు అద్దం పడుతోంది.

1986లో రాజీవ్‌గాంధీ ప్రధానిగా వున్న కాలంలో 21వ శతాబ్ది అవసరాలకోసమంటూ - అప్పటివరకూ అమల్లో వున్న విధానాన్ని తిట్టిపోసి - నూతన విద్యా విధానాన్ని ముందుకు తెచ్చారు. 35 సం॥రాల తర్వాత 21వ శతాబ్దిలో పురోగమించటం కోసమని దాని స్థానంలో కేంద్ర పాలకులు మరో 'జాతీయ విద్యావిధానాన్ని' ఇటీవలే అమల్లోకి తెచ్చారు. పైకి ఎన్ని గంభీర ప్రకటనలు చేసినా, మనదేశ, ప్రజల అవసరాలతో నిమిత్తం లేని చదువులే ఇవన్నీ.

విద్యార్థులలో శాస్త్రీయ, లౌకిక, హేతువాద భావాలను ఈ చదువులు పెంపొందించేవి కావు. పైగా, కాలం చెల్లిన అంధవిశ్వాసాలను, మూఢభావాలను విద్యార్థుల మెదళ్ళలోకి దట్టించడానికి కేంద్ర పాలకులు ఈ జాతీయ విద్యావిధానంలో పలు మార్పులు చేశారు. వేదాలకు సంబంధించిన అంశాలతో డా॥ వేదబాల సంపాదకత్వం వహించిన 'భారతీయ విద్యాసార్' అనే పుస్తకాన్ని ఏకంగా సృజనశీలమైన వృత్తి, సాంకేతిక కళాశాలల్లోనే బోధించనున్నారు. సామ్రాజ్యవాద, కార్పొరేటు కంపెనీల గుమాస్తా అవసరాలను తీర్చటానికి అవసరమైన సాంకేతిక పనివారి సరఫరా సాధనంగా ఈ నూతన విద్యా విధానాన్ని రూపొందించారు. దేశంపట్ల, ప్రజలపట్ల బాధ్యతను పెంపొందించాల్సిన విద్యావిధానం స్థానంలో స్వార్థం, సంకుచితత్వాలను, మత మౌఢ్యాలను కేంద్రంగా చేయటాన్ని, లాభార్జన ధ్యేయంగా విద్యా వ్యవస్థను వ్యాపారీకరించటాన్ని అణుమాత్రం సామాజిక స్పృహ కలవారెవరైనా హర్షించగలరా?!

దేశ ప్రజల ఆరోగ్య బాధ్యతను పాలకులేనాడో గాలికొదిలేశారు. దేశంలోని అత్యధిక జనాభా – ప్రత్యేకించి పేదలు, దళితులు, ఆదివాసులు పౌష్టికాహారం, రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యసౌకర్యాల లేమితో అనారోగ్యాలపాలై ప్రతి నిత్యం వేలాదిగా మరణిస్తున్నా ఈ పాలకులకేమీ పట్టలేదు. ప్రజలకు ఏదోమేరకు అందుబాటులో వుండే ప్రభుత్వ వైద్యాన్ని కునారిల్లచేశారు. ఇదే అదనుగా కార్పొరేటు ఆసుపత్రుల అడ్డగోలు దోపిడీకి గేట్లు తెరిచారు. కరోనా కష్టకాలంలో ప్రభుత్వ ఆరోగ్యవ్యవస్థ కుదేలై వుండటం యొక్క దుష్ఫలితాలు మరింత నగ్నంగా వెల్లడయ్యాయి. ఆరోగ్యశ్రీలు, 'ఆయుష్మాన్‌భవ'ల వంటి ప్రభుత్వ పథకాలన్నీ కార్పొరేటు ఆసుపత్రుల పాలిట కల్పతరువులయ్యాయి. ప్రైవేటు కార్పొరేటు ఆసుపత్రులకు ప్రతిఏటా చెల్లించే వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తే శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వాసుపత్రులనే సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుకోవచ్చనే వాస్తవం పాలకులకు తెలియనిది కాదు. ప్రభుత్వ వైద్యాన్ని ఈ స్థాయికి దిగజార్చినవారే, దేశ ప్రజలందరి ఆరోగ్య సమాచారాన్నంతా డిజిటలీ కరించబోతున్నామని ఆర్భాటంగా ఎర్రకోటపై నుండి ప్రకటన చేయటం ఎవరిని ఉద్ధరించటానికి?! కరోనా విపత్తు కాలంలో కూడా అతి చిన్న దేశమైన క్యూబా, తన దేశ ప్రజలకు వైద్య అవసరాలను తీర్చటంతోపాటు, అనేక ప్రపంచ దేశాలకు తన వైద్య బృందాలను పంపించి ప్రశంసలందుకోవటాన్ని అందరం చూశాం. మన రాష్ట్రంలో ఒక జిల్లా అంత విస్తీర్ణంలేని దేశం ఇంతటి ఘనతను ఎలా సాధించిందనే అంశాన్ని పాలకులు ఉద్దేశ్యపూర్వకంగానే విస్మరిస్తున్నారు.

ఇప్పటికే దేశంలో వైద్య విద్యను సంపన్నుల బిడ్డలకే ప్రధానంగా అందే విధంగా చేసిన, అవినీతిలో పీకల లోతు కూరుకుపోయిన కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎమ్‌సిఐ)ను రద్దుచేసి, నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎమ్‌సి)ను ఏర్పాటుచేశారు. ఇందులో రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని, వైద్య విద్య నిపుణుల, మేధావుల ప్రాతినిధ్యాన్ని మరింతగా కుదించివేశారు. వైద్యవిద్యను డబ్బున్నవారికి ఇంకా విచ్చలవిడిగా అమ్ముకునేందుకు విస్తృత అవకాశాలను కల్పించారు. సేవా దృక్పథంతోనూ, సామాజిక స్పృహతోనూ వైద్య విద్యపట్ల ఆసక్తితోగాక, వైద్య విద్యనభ్యసిస్తే

> **పాలకుల దోపిడీ, దుర్మార్గాలకు వ్యతిరేకంగా సాగించే పోరాటాలన్నింటిని వ్యవస్థను సమూలంగా మార్చుకునే దిశగా ఎక్కుపెట్టాలి. 'దున్నేవానికే భూమి' నినాదంగా వ్యవసాయక విప్లవం ఇరుసుగా విప్లవ భూసంస్కరణలను అమలుచేసుకోవాలి. కార్మికవర్గ నాయకత్వాన కార్మిక–రైతాంగ ఐక్యత ప్రధాన శక్తిగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసుకోవాలి. ఈ విప్లవం మాత్రమే భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాదుల దోపిడీ పీడనల కాడి నుండి దేశ ప్రజానీకాన్ని విముక్తి చేయగల్గుతుంది. ఇదే భారత ప్రజల ముందున్న తక్షణ, ఏకైక పరిష్కారమార్గం.**

సమాజంలో లాభసాటి వ్యాపారం చేసుకోవచ్చుననే లక్ష్యంతో దీనిలో ప్రవేశించేవారి సంఖ్య పెరిగిపోవటానికి, ఈ పాలకుల బాధ్యత లేదా?! ఫైవ్‌స్టార్ హోటల్స్‌ను తలపించే, వందల కోట్ల ఖర్చుతో నిర్మించే కార్పొరేటు ఆసుపత్రులు ఎవరికి అందుబాటులో ఉంటాయో వీరికి తెలియనిది కాదు. కరోనా విపత్తుతో సమాజం ఒక సంక్షుభిత పరిస్థితినెదుర్కొంటున్న సందర్భంలోనూ, లక్షల రూపాయలు దండుకుంటున్న కార్పొరేటు ఆసుపత్రుల లాభాపేక్ష ఈ పాలకులకు తెలియనిదా?! కరోనా పట్ల శాస్త్రీయ అవగాహనను పెంపొందించి, తగిన రక్షణ చర్యల పట్ల విద్యావంతం చేయకుండా కార్పొరేటు మీడియా ప్రజలలో తీవ్ర భయాందోళనలను పెంపొందించటం యాదృచ్ఛికంగా జరిగిందా?!

విటమిన్ టాబ్లెట్స్, వేపరైజర్స్ మొదలుకొని ఆక్సీమీటర్స్, శానిటైజర్స్, మాస్కులు, గ్లౌజులు, పిపిఇ కిట్లు, హ్యాండ్‌వాష్‌ల వరకు; బ్లడ్ టెస్టులు మొదలుకొని, ఎక్స్‌రేలు, సి.టి, ఎమ్ఆర్ఐ స్కాన్‌ల వరకు కొద్ది నెలలల్లోనే దేశవ్యాపితంగా వేల కోట్ల రూ॥ల వ్యాపారం జరగటం, ఆయా కార్పొరేట్లు, డయాగ్నొస్టిక్స్, తయారీ కంపెనీలు కరోనా కాలంలోనూ లాభాలను మస్తుగా దండుకోవటం, మన కళ్ళముందున్న వాస్తవమేగా?! ముందుచూపుతో ప్రజల రోగ నిరోధక వ్యవస్థను పెంపొందించే చర్యలు చేపట్టలేని, ప్రాథమిక వైద్య కేంద్రాలతోసహా ప్రభుత్వ వైద్య వ్యవస్థను సర్వనాశనం చేసిన ఈ పాలకులే, కరోనా వంటి మహమ్మారిల పాలిట ప్రజలను బలిపశువులను చేశారనటం అవాస్తవమౌతుందా?!

## స్వతంత్ర పాలకులా?! దళారీ పాలకులా?!

గత పాలకుల అడుగుజాడలలోనే సామ్రాజ్యవాదుల, దోపిడీ వర్గాల ప్రయోజనాలకు కొమ్ముకాయటంలో బిజెపి పాలకులు మరింత వేగంగా ముందుకు సాగుతున్నారు. హిందూ మతతత్వవాదాన్ని కాంగ్రెస్ పాలకులు నాజూకుగా అమలుచేస్తే, ఎన్‌డిఏ పాలకులు మొరటుగా అమలుచేస్తున్నారు. తేడా అంతే. హిందూరాజ్యం,

అఖండ భారతం అనే మతతత్వ ధోరణిని విస్తరిస్తూ, ఫాశిస్టుతరహా పాలనను బిజెపి పాలకులు సాగిస్తున్నారు.

బాబ్రీ మసీదును కూల్చిన స్థలంలోనే రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు అహేతుకంగా తీర్పునిచ్చిన 9 నెలలలోనే, ప్రధాని మోడీ ఆధ్వర్యంలో హిందూత్వశక్తులు శంకుస్థాపన చేయటం దేనికి సంకేతం? ప్రజలందరినీ ఇళ్ళకే పరిమితం చేసిన కరోనా కాలంలో పాలకులు చేపట్టిన ఈ చర్య, మత విద్వేషాలను ప్రజలలో స్థిరపరిచేందుకు కాదా?! జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్‌సి), పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ)ల పేరుతో మత మైనారిటీలను – ముఖ్యంగా ముస్లింలను తీవ్ర అభద్రతలోకి నెట్టివేయటాన్ని లౌకిక, ప్రజాస్వామ్య చర్యలందామా?! రాజ్యాంగంలో రాసుకున్న లౌకిక, గణతంత్ర, సార్వభౌమాధికార, సామ్యవాద పదాలను భ్రష్టు పట్టించి, రాజ్యాంగాన్ని నెత్తిన బెట్టుకున్నట్లుగా భ్రమింపజేయటం ప్రజలను వంచించటం కాదా?! కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని అంగీకరించే రాజ్యాంగంలోని 370, 35'ఏ' అధికరణాల్ని రద్దుచేసి కాశ్మీరును ముక్కలు చేయటం జాతీయ ప్రజాస్వామిక హక్కులను కాలరాయటం కాదా?! ప్రజాస్వామిక ఆకాంక్షలను చిదిమివేయటం కాదా?!

కరోనా బాధితుల చికిత్సలో హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రల అవసరముందని, వాటిని తమకు సరిపడా సరఫరా చేయకపోతే భారతదేశం మెడలు వంచి రప్పించుకుంటామని కండకావరంతో ట్రంపు చేసిన హెచ్చరిక అందరూ గమనించినదే! దీనిపై నోరు మెదపలేని, కనీసపాటి ఖండన ప్రకటన చేయలేని దళారీ పాలకుల సార్వభౌమత్వాన్ని ఏమని వర్ణించగలం?! ఫ్రాన్స్ నుండి కొనుగోలు చేసిన రఫేల్ యుద్ధ విమానాలు భారత రక్షణ బలగంలో ప్రవేశించటాన్నే గొప్ప విజయంగా ప్రచారం చేస్తూ వేడుకలు జరుపుకునే వీరి దేశభక్తిని ఏమని కీర్తించగలం?! చైనాతో సరిహద్దు ఘర్షణల నేపథ్యంలో చైనా వస్తువులను బహిష్కరించాలని ప్రబోధించి పాలక రాజకీయ నాయకులు తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. చైనాకు చెందిన కొన్ని 'యాప్'లను నిషేధించటంతోపాటు కేంద్ర పాలకులు పూనుకొని జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టారు. పిఎమ్‌కేర్‌కు చైనా కంపెనీల నుండి పాలకులు నిధులు తీసుకుంటారు; టిక్‌టాక్ వంటి చైనా యాప్‌లను ముఖేష్ అంబానీ 500 కోట్ల డాలర్లకు కొనుగోలు చేయటానికి మార్గం వేస్తారు; ఐపిఎల్ ప్రాయోజిత హక్కులను చైనాకు చెందిన బడా ఫండింగ్ కంపెనీకి బిసిసిఐ అప్పగించటాన్ని ఆమోదిస్తారు. ఇవన్నీ దేశభక్తికి సంకేతాలుగానే భావించాలట! సామాన్యులు చైనా వస్తువులను, చైనా యాప్‌లను వినియోగించటం మాత్రం దేశ ద్రోహంగా తెగనాడటం, ఈ నాయకుల నయవంచనకు తార్కాణం కాదా?!

ప్రతిష్ఠాత్మకమైన భారత రైల్వే వ్యవస్థను దెబ్బతీశారు. రైల్వేస్టేషన్ల నిర్వహణ, టిక్కెట్ల బుకింగ్, సిగ్నలింగ్ వంటి సాంకేతిక అంశాలు, పారిశుద్ధ్యం, క్యాటరింగ్ వంటి వాటన్నింటినీ కార్పొరేట్ల పరంచేసిన పాలకులు – ఇపుడు కొన్ని రైల్వేమార్గాలను, స్టేషన్లను, కార్పొరేటు గుత్తసంస్థలకు ఏకంగా కట్టబెట్టారు. ఎయిర్ ఇండియాను అమ్మివేశారు. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తున్నారు. బిఎస్ఎన్ఎల్‌ను మూతవేయటంలో భాగంగా వీఆర్ఎస్ అమలుచేస్తున్నారు. బొగ్గు, బాక్సైట్, అల్యూమినియంలను, విలువైన లోహాలను ప్రైవేటు, కార్పొరేటు పరం చేస్తున్నారు. ఇస్రోలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని చొరబెట్టారు. పబ్లిక్‌రంగ సంస్థల అమ్మకానికి జాతీయ నగదీకరణ పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ రక్షణరంగంలో ఇప్పటికే విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిన పాలకులు, విదేశీ పెట్టుబడి వాటాను 49 నుండి 74 శాతానికి పెంచుతూ తమ 'దేశభక్తి'ని ఘనంగా చాటుకున్నారని అనుకోవాలా?! దశాబ్దాలుగా శ్రామిక ప్రజల కష్టార్జితమైన ప్రభుత్వ, ప్రభుత్వరంగ పరిశ్రమలను టోకుగా అమ్మివేస్తున్న వీరిని ప్రజా ప్రయోజనాలు పరమావధిగా గల స్వతంత్ర పాలకులు అనగలుగుతామా?! మనదేశానికి ఇరాన్ నుండి పైపులైను ద్వారా చౌకధరకు చమురు సరఫరా జరపాలనే నిర్ణయాన్ని, అమెరికా సామ్రాజ్యవాదుల ఆదేశాలకు లోబడి వెనక్కు తీసుకున్న వీరిని సర్వసత్తాక పాలకులందామా?!

హక్కుల అణచివేత అత్యవసర పరిస్థితి కాలాన్ని మించి సాగుతోంది. పాలకుల విధానాలను విమర్శించటమే రాజద్రోహ మౌతోంది. దభోల్కర్, పన్సారే, గౌరీలంకేష్, కల్బుర్గి మొదలుకొని అనేకమంది లౌకిక, ప్రజాస్వామికవాదులను, మేధావులను మతతత్వ శక్తులు హతమారుస్తున్నాయి. రొమిల్లా థాపర్ వంటి ఎందరో మేధావులను వేధింపులకు గురిచేస్తున్నారు. పాలక రాజకీయ నాయకుల అండతో విశ్వవిద్యాలయాలపై గూండా తండాలు ఖాకీ బలగాలతో కలిసి బరితెగించి స్వైరవిహారం చేస్తుంటే ఉన్నతాధికార యంత్రాంగం, న్యాయస్థానాలు నోరు మెదపకున్నాయి.

## నూతన ప్రజాస్వామిక విప్లవం నేటి కర్తవ్యం

శ్రామిక ప్రజానీకం తమ దుర్భర జీవితాచరణ ద్వారా పాలకులు ప్రవచిస్తున్న స్వాతంత్ర్యపు బూటకత్వాన్ని అమృత్ మహోత్సవాలు తమవి కాదనే వాస్తవాన్ని గ్రహిస్తున్నారు. వారు తమ నిత్యజీవన సమస్యలపై సంఘటితంగానో, అసంఘటితంగానో ఉద్యమిస్తున్నారు. ప్రజలు సంధిస్తున్న ఏ ఒక్క ప్రశ్నకూ నిజాయితీగా సమాధానం చెప్పగల స్థితిలో పాలకులు లేరు. ప్రజలను వంచించటం ద్వారా మాత్రమే వారు పాలన సాగించగలుగుతున్నారు. ప్రజల మధ్య ఐక్యత తమకు ప్రమాదం కనుక వారి మధ్య కుల, మత, ప్రాంత, భాషా విద్వేషాలను నిత్యం రగిలిస్తూ తమ పబ్బం గడుపు కుంటున్నారు. ప్రజలను అనేక బూటకపు పథకాల భ్రమలలో ముంచెత్తుతున్నారు. మద్యపానం, మత్తుమందుల వాడకాన్ని పెంచి పోషిస్తూ అనేకమంది యువతీ యువకులను వ్యసనపరులుగా, అశక్తులుగా మారుస్తున్నారు. శక్తివంతమైన ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్య, అశ్లీల సంస్కృతితో ప్రజానీకాన్ని పెడమార్గం పట్టిస్తున్నారు. అదే సమయంలో తమ సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తినవారిపై నిర్బంధం, క్రూరచట్టాలు, కాల్పులు, దారుణ అణచివేతలతో తమ పాలన నెట్టుకొస్తున్నారు.

కనుక, ఈ దోపిడీ రాజ్యాంగ చట్ట పరిధిలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావటం అసాధ్యమని, గత 75 సం॥లుగా సాగిన పాలన అనుభవం

రుజువు చేస్తోంది. అందుకే పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఫ్యూడల్ అణచివేతలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదుల దోపిడీ ఆధిపత్యాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కావాలి. భూమిపై శ్రమించేవారికి ఆ భూమిపై హక్కు కలిగినప్పుడే ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి పెరుగుతుంది; నిజమైన పారిశ్రామికాభివృద్ధి సాధ్యమౌతుంది. దేశంలోని సంపదలపై, వనరులపై సామ్రాజ్యవాదుల పట్టు, ఆధిపత్యం తొలిగితేనే దేశ సంపద, వనరులు దేశ ప్రజలకు దక్కుతాయి. అందుకే పాలకుల దోపిడీ, దుర్మార్గాలకు వ్యతిరేకంగా సాగించే పోరాటాలన్నింటిని వ్యవస్థను సమూలంగా మార్చుకునే దిశగా ఎక్కుపెట్టాలి. 'దున్నేవానికే భూమి' నినాదంగా వ్యవసాయక విప్లవం ఇరుసుగా విప్లవ భూసంస్కరణలను అమలుచేసుకోవాలి. కార్మికవర్గ నాయకత్వాన కార్మిక-రైతాంగ ఐక్యత ప్రధాన శక్తిగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసుకోవాలి. ఈ విప్లవం మాత్రమే భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాదుల దోపిడీ పీడనల కాడి నుండి దేశ ప్రజానీకాన్ని విముక్తి చేయగల్గుతుంది. ఇదే భారత ప్రజల ముందున్న తక్షణ, ఏకైక పరిష్కారమార్గం.



# ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాదులే యుద్ధ నేరస్తులు

## 2022 ఫిబ్రవరి

**ముగింపు** సూచనలేమీ కనబడకుండానే ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధం రెండో సంవత్సరంలో ప్రవేశించింది. రష్యాకు పశ్చిమ దేశాల నడుమ ఉక్రెయిన్‌ను పావులాగా ఉపయోగించు కుంటూ ఆధిపత్యశక్తులు రుద్దిన యుద్ధం ఇది.

ఈ యుద్ధం అత్యంత భారీస్థాయిలో వినాశనానికి, మానవ జీవన సంక్షోభానికి దోవతీసింది. పొరుగు దేశాలకు వలసపోతున్న శరణార్థుల సంఖ్య 36 లక్షలు దాటింది. 60 లక్షలమంది ఉక్రెయిన్ ప్రజలు విస్థాపనకు గురై ఉక్రెయిన్‌లోనే ప్రమాదకరమైన పరిస్థితులలో అభద్రతతో, శిబిరాలలో తలదాచుకుంటున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలు భారీస్థాయిలో ప్రజల ప్రాణ హననానికి, ఉక్రెయిన్‌లో ఆస్తుల విధ్వంసానికి బాధ్యత వహించాలి. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతోంది. ఫలితంగా ఇంధనం, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి ఈ పరిస్థితిని అదుపుచేయటంలో పూర్తిగా నిరుపయోగమైనదిగా మరోసారి రుజువు చేసుకుంది.

ప్రాణాలు కోల్పోతున్న మానవుల సంఖ్య పెరుగుతూ వుండటంతో పాటు, యుద్ధం పొడిగింపబడుతూ వున్న ఈ స్థితిలో కూడా యుద్ధం వాస్తవిక రూపం దాల్చాలని రెచ్చగొడ్తూ వచ్చిన అమెరికా దాని మిత్ర దేశాలు పునరాలోచన చేసి, చర్చల క్రమం ద్వారా యుద్ధానికి ముగింపు పలికే ప్రయత్నాలను ఏమాత్రం చేయటంలేదు. పైగా, దీనికి భిన్నంగా వారు తమ చర్యల ద్వారా యుద్ధ మంటలలో ఆజ్యం పోసి ఎగదోస్తున్నారు. యూరోపియన్ యూనియన్ దేశాలు, అమెరికా నాయకత్వంలో అమెరికా మిత్రకూటమిలోని నాటో దేశాలు రష్యాపై తీవ్రమైన, అధికమైన ఆంక్షలను విధిస్తున్నాయి. 'SWIFT' వ్యవస్థ నుండి అత్యంత గుర్తింపు పొందిన రష్యా బ్యాంకులను తొలగించి, రష్యన్ సెంట్రల్ బ్యాంకుతో లావాదేవీలను స్తంభింప చేశాయి. తమ దేశాలకు రష్యా విమానాలపై వారు నిషేధం విధించారు. రష్యా–జర్మనీల నడుమ భారీ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు అయిన నార్డ్‌స్ట్రీమ్ పైప్‌లైన్–2 రద్దయిపోయినట్లేనని అమెరికా ప్రకటించింది. యూరోపియన్ యూనియన్ గ్యాస్, ఆయిల్, బొగ్గు, తదితరాలకోసం రష్యాపై ఆధారపడటాన్ని తీవ్రస్థాయిలో తగ్గించి, ఆయుధ సామర్థ్యాలను పెంచుకోవాలని నిర్ణయించింది. ఉక్రెయిన్‌కు ఆర్థికంగా సహాయమందించాలని, అలాగే సైనిక సామాగ్రి అందజేయాలని ఆ దేశాలు నిర్ణయించుకున్నాయి. రష్యాను ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ఒంటరి చేయాలని సంకల్పం తీసుకున్నాయి. ఈ ఒంటరి చేసే చర్యలు క్రీడలతో ప్రారంభమై కళలు, సంగీతం వరకు విస్తరించాయి. మ్యూనిచ్ ఫిల్ ఆర్మోనిక్ తన ప్రధాన నిర్వాహకుడిని తొలగించింది. న్యూయార్క్‌కు చెందిన మెట్రో పొలిటన్ ఒపెరా లెట్ ఏ సొప్రానో, అన్నా నెటాబ్‌కో, ఈలాంటి చర్యలు చేపట్టాయి. వారు యుద్ధాన్ని విమర్శించకపోవటమే దీనికి కారణం. ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ క్లబ్ చెల్సియా తన యజమాని అయిన రష్యన్ బిలియనీర్ అబ్రాచో మ్యూనిచ్‌తో సంబంధాలను తెగదెంపులు చేసుకోవలసి వచ్చింది. లండన్, మాడ్రిడ్‌లలో బోల్‌స్టర్ బ్యాలే ప్రదర్శనలను అదేవిధంగా రద్దుచేశారు.

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ చైనా దేశ నాయకులను వ్యక్తిగతంగా సంప్రదిస్తూ రష్యాకు మద్దతునీయరాదని హెచ్చరికలు చేస్తున్నాడు. ఆయనే స్వయంగా మనదేశ ప్రధానితో సంప్రదింపులు చేస్తూ, ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న అణచివేత యుద్ధాన్ని ఖండించాలని, పశ్చిమదేశాల, అమెరికా పక్షం వహించాలని వత్తిడి తీసుకువస్తున్నాడు. ఆయన పనుపున విదేశీ నాయకుల బృందం, మంత్రులు ఇతర అధికారులు న్యూఢిల్లీకి వస్తున్నారు. వారి వ్యాఖ్యానాలు, పత్రికా ప్రకటనలలో రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు తిరిగి వెనక్కు తీసుకోలేని స్థితికి చేరుకున్నాయని స్పష్టంగా సూచిస్తూ తమకు రష్యాకు నడుమ భారతదేశం తమ పక్షం వహించాలని పేర్కొంటున్నాయి. రష్యా చమురును కొనుగోలు చేయవద్దని అమెరికా మనదేశంపై వత్తిడి తెస్తోంది. జి–20 సమూహం నుండి రష్యాను బయటకు పంపేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అమెరికా అధ్యక్షుడు బైడెన్ రష్యన్ అధ్యక్షుడు పుతిన్‌ను 'యుద్ధ నేరస్థుడని' 'కసాయి' అని సంబోధిస్తూ వ్యక్తిగతంగా అవమానపరుస్తూ మాట్లాడుతున్నాడు. అమెరికా దాని మిత్రదేశాలు 'యుద్ధాన్ని ఆపాలి' అనే నినాదంతో రష్యాపై వత్తిడి తేవాలని నిర్ణయించుకున్నాయి. అయితే అమెరికా దాని మిత్రదేశాల ఈ చర్యలన్నీ, ప్రయత్నాలన్నీ రష్యా దాడిని ఆపటానికి తోడ్పడకపోగా, ఏది ఏమైనా యుద్ధాన్ని కొనసాగించేవిధంగా పుతిన్‌ను మరింత రెచ్చగొట్టే విధంగా వున్నాయి. ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధం సందర్భంలో వలె, రష్యా రసాయన, అణ్వాయుధాలను ప్రయోగించబోతున్నదని అమెరికా ఆరోపిస్తున్నది. ఈ విధమైన ఆధారరహితమైన సమాచార వ్యాప్తి ఎత్తుగడలతో, పశ్చిమ దేశాల ప్రచార మాధ్యమాలు దీనికి రాజకీయ అబద్ధాలను జోడిస్తున్నాయి. ఉద్రిక్తతలను తగ్గించి యుద్ధానికి ముగింపు పలికేబదులు ఈ యుద్ధాన్ని మరింత రెచ్చగొట్టే విధంగా అమెరికా వ్యవహరిస్తోంది. తద్వారా అది తన వాస్తవికమైన సామ్రాజ్యవాద

ఆధిపత్య ప్రయోజనాలు, ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలకే కట్టుబడి వ్యవహరిస్తోందని స్పష్టమౌతోంది.

ఈ యుద్ధం గురించి అమెరికా దాని మిత్రదేశాల, పశ్చిమ దేశాల మరియు రష్యా యొక్క వైఖరులు, చర్యలు ఏమైనప్పటికీ, వారి ప్రకటనలు, ఆరోపణలు ఏవైనప్పటికీ, ఆర్థిక, రాజకీయ, సైనిక ఆధిపత్యాల కోసం ఆధిపత్య దేశాల పోటీలో భాగంగా సాగుతున్న యుద్ధమనేది స్పష్టమౌతోంది. అమూల్యమైన భారీ ప్రాణనష్టం జరుగుతోన్న ఈ యుద్ధాన్ని ఎవరూ సమర్థింపజాలరు.

ఈ సందర్భంలో అభూతకల్పనొకదానికి ప్రచారం కల్పిస్తున్నారు. అదేమంటే, 1945 సం॥ నుండి అమెరికా ఆధిపత్యంలో శాంతియుత ప్రపంచ స్థితి నెలకొని వుందని, పెట్టుబడిదారీ దేశాల నడుమ లాభాల కోసం ఇతరులతో పోటీపడే ప్రవృత్తి కారణంగా ఏర్పడే యుద్ధతరహా పరిణామాలను కూడా నియంత్రించగలగటం సాధ్యమైందని ఆ ప్రచార సారాంశం. యూరోప్‌లో స్థాపించబడిన సంస్థలు (ఉమ్మడి మార్కెట్, యూరోపియన్ యూనియన్, 'నాటో', యూరో మొదలైనవి) రెండు ప్రపంచ యుద్ధాలకు జన్మనిచ్చిన యూరప్‌ను కట్టడి చేయటానికి తోడ్పడిందని ప్రచారం చేస్తున్నారు. వాస్తవమేమంటే, 'తీవ్రమైన' యుద్ధాలే (దేశాల మధ్య, దేశం లోపల) 1945 తర్వాత ఎన్నో సాగాయి. కొరియా, వియత్నాం యుద్ధాలతో ప్రారంభిస్తే యుగోస్లేవియా యుద్ధాలు, సెర్బియాపై నాటో బాంబు దాడులు, ఇరాక్‌పై రెండు యుద్ధాలు, యెమన్, లిబియా, సిరియాలలో యుద్ధాలే దీనికి నిదర్శనం.

అమెరికా ఆధిపత్యంలో నిర్మాణమైన ప్రపంచ పరిస్థితి, అంతర్జాతీయ ప్రజా ఆకాంక్షలపై ఆధారపడినది కాదు. అది సంపూర్ణంగా అమెరికా వ్యూహాత్మక, వాణిజ్య ప్రయోజనాలకోసం, ఆధిపత్యం, ప్రపంచంపై పెత్తనమనే తన లక్ష్యాలతోనే సాగింది.

రెండో ప్రపంచయుద్ధం తర్వాత పెట్టుబడిదారీ ప్రపంచంలో నూతన ఆధిపత్య రాజ్యంగా వున్న అమెరికా, ప్రపంచ ఆర్థికవ్యవస్థలోని వ్యూహాత్మక కేంద్రాలను అదుపు చేసేదిగా పరిణమించింది. సైనికశక్తి దన్నుతోనున్న అమెరికా పెట్టుబడి, అంతకు మునుపు తాము చొరబటానికి వీలులేని మార్కెట్లలోకి చొచ్చుకుపోవటం ప్రారంభించింది. 20వ శతాబ్ది మధ్యభాగానికి అమెరికా ప్రపంచంలో తన శక్తిని చాటింది. ఇది – సిఐఏ ద్వారా ప్రాచుర్యం పొందిన నాయకులను హతమార్చటం, నాయకులను మట్టుబెట్టటం వంటి వాటితో కోట్లాదిమంది అభివృద్ధివైపు ఆశగా చూసేవారి జీవితాలను తుడిచిపెట్టేసింది. 'కమ్యూనిజం వ్యతిరేక పోరాటం, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం, ఇప్పుడు టెర్రరిజం వ్యతిరేక పోరాటం' వంటి నినాదాల మాటున అమెరికా తన మారణ కాండలను, హత్యలను, సైనిక తిరుగుబాట్లను సమర్థించుకుంటోంది.

అమెరికా సాగించిన సైనిక తిరుగుబాట్లు; నిఖార్సైన సోషలిస్టులను, ప్రజాస్వామికవాదులను హత్యగావించటంతోపాటు 1953లో ఇరాన్ ప్రధాని మొహమ్మద్ మొసాద్‌ను కూలద్రోయటం, 1954లో గ్యాటిమలా అధ్యక్షుడు జాకబ్ అర్బెంజ్‌ను పదవీచ్యుతుడ్ని చేయటం, 1961లో కాంగో ప్రధాని పాట్రిస్ లుముంబాను అధికారం నుండి

> నాటో విస్తరణపై పూర్తిగా నిషేధం విధించాలని, యూరప్ నుండి అమెరికా అణ్వాయుధాలను తొలగించాలని, అమెరికా బలగాలు నాటో దేశాల పరిధికి మాత్రమే పరిమితమవ్వాలని, 1997 నాటి ముందున్న ప్రాంతాలకే పరిమితమవ్వాలనే డిమాండ్లను పుతిన్ బలంగా ముందుపెట్టాడు. ఈ డిమాండ్లన్నింటిని అమెరికా తోసిపుచ్చింది. ఈ పరిణామాలు ఉద్రిక్తతలను మరింతగా పెంచి ప్రస్తుత యుద్ధానికి దారితీసి భారీస్థాయి మానవ హననం సాగుతోంది.

తొలగించి ఆపై హత్యగావించడం, 1963లో ఇరాక్ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్ ఖాసిమ్‌ను కూలదోయటం, 1965లో ఇండోనేషియా అధ్యక్షుడు సుకర్నోను, బ్రెజిల్ అధ్యక్షుడు జావో గౌలర్ట్‌లను తొలగించటం, 1971లో బొలీవియా అధ్యక్షుడు జువాన్‌జోస్ టోర్న్‌స్‌ను పదదోయటం, 1973లో చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండీని కూలదొయ్యటం, 1965లో వామపక్షవాద నాయకులైన మొరాకోకు చెందిన బెన్ బార్కాను, 1967లో బొలీవియాలో చె గువేరాను, 1987లో బుర్కినాఫాసో అధ్యక్షుడిని హతమార్చటం వంటి జాబితాకు అంతులేదు. 20వ శతాబ్దం చివరినాటికి గ్రెనడా, హయతిలలోని సోషలిస్టు ప్రభుత్వాలను అమెరికా కూలదోయటం, ఇరాక్‌ను దురాక్రమించటంతోపాటు ఆ దేశ అధ్యక్షుడు సద్దామ్ హుస్సేన్‌ను క్రూరంగా హత్య గావించటం, లిబియాను ధ్వంసం చేయటం వంటి కొన్ని చర్యలు అమెరికా ప్రపంచంలో తన శక్తిని ఎలా చాటుతోందో తెలియచేస్తున్నాయి. 'ప్రభుత్వ మార్పు' వంటి రాజకీయ పదకోశాన్ని ఇతరదేశాలలో తమ జోక్యం, దురాక్రమణలను సమర్థించుకోవటానికి సృష్టించుకున్నారు.

మరోవైపున స్టాలిన్ మరణం తర్వాత రష్యా పేరుకు సోషలిస్టు దేశంలాగా వ్యవహరిస్తోంది. రష్యా నాయకత్వం శాంతియుత సహజీవనం వంటి విధానాలతో పెట్టుబడిదారీ పంధాను స్వీకరించి, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలకు తిరోగమించింది. ప్రపంచాధిపత్యం కోసం అమెరికాతో తలపడే అగ్రరాజ్యంగా అవతరించింది. సోషల్ సామ్రాజ్యవాద దేశంగా అది తన స్వీయ ప్రభావిత ప్రాంతాలను ఏర్పరచుకుంది. భారతదేశం దాని కక్ష్యలోకి ఆకర్షితురాలైంది. (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాతో దానికున్న శత్రుత్వం కారణంగా) ఆవిధంగా ప్రపంచాధిపత్యం కోసం రష్యా వ్యూహాత్మక సైనిక ఒప్పందాలలో భాగమైంది. మనదేశం ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోవటం ప్రారంభించింది. భారత రష్యా సైనిక ఒప్పందపు దన్నుతో 1970లో బంగ్లాదేశ్ విముక్తి పేరుతో

భారత సైన్యం పాకిస్తాన్‌లో ప్రవేశించింది. తూర్పు పాకిస్తాన్‌లోని తిరుగుబాటుదారులకు మద్దతుగా నిల్చింది. దాని కొనసాగింపుగా మనదేశం సిక్కింని కబళించింది.

1977–78లో రష్యా, ఆఫ్ఘనిస్థాన్‌ను ఆక్రమించింది. 10 సం॥ల తర్వాత 1989 జూన్‌లో వెనక్కు మళ్ళింది. ఆఫ్ఘనిస్థాన్ నుండి తొలగిన కొద్ది నెలల కాలానికే సోవియట్ కూటమిలోని సోషలిస్టు దేశాలు కూలిపోవటం ప్రారంభమైంది. దీనితో ఆచరణాత్మకంగా ప్రచ్ఛన్న యుద్ధం అనేదానికి ముగింపు జరిగింది. 1991 డిసెంబర్ 8న యుఎస్ఎస్ఆర్‌గా ఇంకెంతమాత్రమూ కొనసాగదని ప్రకటించారు. కామన్‌వెల్త్ స్వతంత్ర రాజ్యాలు (సిఐఎస్) కూడా ప్రకటించబడింది. కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్ (సిఎస్‌టిఓ)ను రష్యా ఏర్పరిచింది. యుక్రెయిన్ సిఐఎస్‌లో సంస్థాపక సభ్యదేశం కాగా సిఎస్‌టిఓలో మాత్రం చేరలేదు. 1997లో రష్యా జిటి పారిశ్రామిక ఆర్థికాన్ని చేపట్టింది.

2000 సం॥లో పుతిన్ రష్యా అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. పదవి చేపట్టిన తొలినాళ్ళలో పశ్చిమ దేశాలతో రష్యా ఒప్పందాలు చాలా సహృద్భావంతో వుండేవి. సెప్టెంబర్ 11 'టెర్రరిస్టు దాడుల' తదనంతరం అమెరికా ఇచ్చిన 'టెర్రరిజంపై పోరు' పిలుపుకు పుతిన్ మద్దతు తెలిపాడు. 2001లో అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ పుతిన్‌ను 'ముక్కుసూటైన, నమ్మదగినవాని'గా కితాబిచ్చాడు.

ఏమైనా 1999లో సెర్బియాపై నాటో బాంబుదాడులు చేయటంతో పుతిన్ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సైనిక జోక్యం, ఇరాక్ – లిబియాలలో అధికారాన్ని మార్చుచేసేందుకు ప్రతీఘాతుక విప్లవాలు లేవదీయటం, 2002లో ఖండాంతర క్షిపణుల వ్యతిరేక ఒప్పందం (ఏబిఎమ్‌టి) నుండి అమెరికా ఏకపక్షంగా వైదొలగటం, దీనితోపాటే పోలెండ్, రుమేనియాలలో రక్షణ క్షిపణుల మోహరింపులతో దాడికి గురయ్యే భద్రతాపరమైన అంశాలు పెరుగుతున్నాయని రష్యా తీవ్రంగా అభిప్రాయపడింది. పైగా నాటో పరిధిని తూర్పు దిశగా ఇకపై విస్తరించబోమని గోర్బచేవ్‌కు నాటి అమెరికా విదేశాంగ శాఖామంత్రి జేమ్స్ బెకర్ 1989లో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా 1999 ప్రారంభం నాటికి నాటో పలు విడతల్లో 14 నూతన సభ్యదేశాలను చేర్చుకుంది. 2008లో జరిగిన నాటో సదస్సులో అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఉక్రెయిన్, జార్జియాలకు సూత్రప్రాయంగా ద్వారాలు తెరుస్తున్నట్లుగా ప్రకటన చేయటం, నాటో తన ఇష్టానుసారం తూర్పు దిశగా రష్యాకు రక్షణ సమస్యలను కలిగించేవిధంగా విస్తరించ నుందని స్పష్టంగా తెలియచేస్తోంది. 2020లో నాటో విస్తృతికి అవకాశమున్న భాగస్వామిగా ఉక్రెయిన్‌ను ప్రకటించారు. నల్ల సముద్రంలో బ్రిటిష్, అమెరికా యుద్ధనౌకల సంచారం పెరగటం ప్రారంభమైంది. 2019లో బ్రిటన్ ఉక్రెయిన్‌తో నల్లసముద్ర తీరంలో, అజోల్ సముద్రతీరంలో నౌకాశ్రయ నిర్మాణంల కోసం సహకార ఒప్పందం చేసుకుంది. ఈ చర్యలను శక్తివంతమైన హెచ్చరికలుగా పుతిన్ తీసుకున్నాడు.

ఈ పరిణామాలన్నింటితో – నాటో విస్తరణపై పూర్తిగా నిషేధం విధించాలని, యూరప్ నుండి అమెరికా అణ్వాయుధాలను తొలగించాలని, అమెరికా బలగాలు నాటో దేశాల పరిధికి మాత్రమే పరిమితమవ్వాలని, 1997 నాటి ముందున్న ప్రాంతాలకే పరిమిత మవ్వాలనే డిమాండ్లను పుతిన్ బలంగా ముందుపెట్టాడు. ఈ డిమాండ్ల న్నింటిని అమెరికా తోసిపుచ్చింది. ఈ పరిణామాలు ఉద్రిక్తతలను మరింతగా పెంచి ప్రస్తుత యుద్ధానికి దారితీసి భారీస్థాయి మానవ హననం సాగుతోంది.

కారణాలేవైనప్పటికీ ఈ యుద్ధం సమర్థనీయం కాదు. ప్రజల ప్రాణాలతో యుద్ధక్రీడలాడే హక్కు ఎవరికీ లేదు. ప్రజాస్వామ్యం వర్సెస్ నియంతృత్వం కానీ, నాజీకరణాన్ని రద్దుచేయాలనే నినాదం కానీ ఈ యుద్ధానికి సమర్థనగా నిలవబోవు. అమాయక ఉక్రెయిన్ ప్రజలు ఈ యుద్ధంలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ యుద్ధం మరో ప్రపంచ యుద్ధానికి దారితీయరాదు.

**ఉక్రెయిన్‌లో అమెరికా, 'నాటో'లు తమ జోక్యాన్ని ఆపాలి.**

**రష్యా తక్షణం యుద్ధాన్ని ఆపాలి.**

**జెలెన్‌స్కీ తక్షణం శాంతి చర్చలకు వెళ్ళాలి.**






# తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురణలు

31-13-26/1, ఐ.ఎం. రావురోడ్, మొగల్‌రాజపురం, విజయవాడ - 10.

1. తాకట్టులో భారతదేశం (ఐదవ ముద్రణ)
2. తరిమెల నాగిరెడ్డి గురించి ఇంటర్వ్యూలు - జ్ఞాపకాలు
3. మన లెనిన్
4. తాకట్టులో భారతదేశం - నేడు - నాడు
5. Re-reading Das Capital in the Twenty First Century
6. చైనా సాంస్కృతిక విప్లవం (ప్రముఖుల వ్యాసాలు)

ప్రతులకు : మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# మైత్రి బుక్‌హౌస్

అభ్యుదయ, విప్లవ సాహిత్య కేంద్రం

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# ది చోడవరం కో-ఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్, గోవాడ

## (గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు ప్రధాన వాటాదారు)

### 2020-21 క్రషింగ్ సీజన్ ఫలితములు :

| | | | |
|---|---|---|---|
| 1. | చెరుకు గానుగాడినది | : | 3,67,001.944 మెట్రిక్ టన్నులు |
| 2. | పంచదార ఉత్పత్తి | : | 3,18,101 క్వింటాల్లు |
| 3. | రికవరీ | : | 8.65% |
| 4. | కో-జనరేషన్ ప్లాంట్ ద్వారా కరెంటు ఎగుమతి | : | 91,08,800 యూనిట్లు |

### 2021-22 క్రషింగ్ సీజన్ ఫలితములు :

| | | | |
|---|---|---|---|
| 1. | చెరుకు గానుగాడినది | : | 2,91,690.581 మెట్రిక్ టన్నులు |
| 2. | పంచదార ఉత్పత్తి | : | 2,69,484.00 క్వింటాల్లు |
| 3. | రికవరీ | : | 9.30% |
| 4. | కో-జనరేషన్ ప్లాంట్ ద్వారా కరెంటు ఎగుమతి | : | 53,27,400 యూనిట్లు |

### 2022-23 క్రషింగ్ సీజన్ ఫలితములు : (తేది. 17-03-2023 నాటికి)

| | | | |
|---|---|---|---|
| 1. | చెరుకు గానుగాడినది | : | 2,12,420.000 మెట్రిక్ టన్నులు |
| 2. | పంచదార ఉత్పత్తి | : | 1,78,218.00 క్వింటాల్లు |

### ఫ్యాక్టరీ పరిపాలన విభాగము

| | | | |
|---|---|---|---|
| 1. | షేర్ ధనము | : | 2516.62 లక్షలు |
| 2. | మొత్తం మెంబర్లు | : | 21,842 |
| 3. | కార్మికులు మరియు సిబ్బంది | : | 405 |
| 4. | కాంట్రాక్ట్ లేబర్ | : | 417 |
| 5. | అగ్రికల్చరల్ లేబర్‌కు పరోక్ష నేతలు | : | 50,000 మంది |

6. రైతు సోదరులకు సంక్షేమ సేవలు :

(ఎ). చెరుకు రవాణా రాయితీ రూ. 50 టన్ను ఒక్కింటికి; (బి). మెంబర్ డెత్ ఫండ్ రూ. 25,000 నుండి 30,000లకు పెంచడమైనది; (సి). మెంబర్‌నకు యాక్సిడెంట్ వలన చనిపోయినచో 2,00,000 చెల్లించుట జరుగుతున్నది; (డి). ఫ్యాక్టరీకి చెరుకు రవాణా చేయునపుడు గాయపడిన పశువునకు నష్టపరిహారము 4,000కు పెంచి మరణించిన పశువునకు 10,000లకు పెంచి చెల్లించుట జరుగుతున్నది; (ఇ). మెంబర్లు / కార్మికుల పిల్లలకు విద్య ప్రోత్సాహకం చెల్లించుట జరుగుచున్నది; (ఎఫ్). సుమారు 30 కోట్లు వడ్డీని ఫ్యాక్టరీ భరించి మెంబర్లకు కావల్సిన విత్తనం, ఎరువులు, బోర్లు, బిందుసేద్యం, వడ్డీలేని ఋణ ప్రాతిపదికన అందించటం జరుగుతున్నది; (జి). అన్ని కాటాలలో చెరుకు లోడింగ్ ర్యాంపులు ఏర్పాటు చేయబడినవి; (హెచ్). ఫ్యాక్టరీ ఏరియాలో ఉత్తమ రైతులను ఎంపిక చేసి ప్రశంసా పత్రము మరియు నగదు చెల్లించుట జరుగుతున్నది; (ఐ). తక్కువ వ్యవధిలో పక్వానికి వచ్చు నూతన వంగడాల చెరుకు మొక్కలు సభ్య రైతులకు సబ్సిడీపై సప్లయ్ చేయుట జరుగుచున్నది.

**రాష్ట్రములో వున్న అన్ని సహకార చక్కెర కర్మాగారాల కంటే ది చోడవరం కో-ఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్, గోవాడ అత్యధిక చెరుకు ధర రూ.2755/- టన్ను ఒక్కింటికి చెరుకు సప్లయ్ మెంబర్లకు 2021-22 నిర్ణయించడమైనది.**

**చెరకు సప్లయ్ మెంబర్లు మరియు కార్మిక / సిబ్బంది యొక్క సంక్షేమ ధ్యేయం.**

**చెరుకు రైతులు ఇంట సిరుల పంట ఫ్యాక్టరీ కలల పంట**

| | | |
|---|---|---|
| **వి. వెంకటరావు** | **రవి పట్టన్‌శెట్టి** | **వి. సన్యాసినాయుడు** |
| డైరెక్టర్ ఆఫ్ షుగర్ & కేన్ కమీషనర్ | జిల్లా కలెక్టర్ / పర్సన్ ఇన్‌ఛార్జ్ | మేనేజింగ్ డైరెక్టర్ |





'మా ప్రజాతీర్పు' కళారూపకం ప్రదర్శనలో ఓ సన్నివేశం



విశాఖలో ఆదివాసీ సదస్సు సందర్భంగా ప్రదర్శన

# భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం



Rythu Coolie Sangham (A.P.) Vaarshika Sanchika - 2022

రూ. 50/-